సోమవారం 10-4-2023


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 205



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



రింకూ 6,6,6,6,6

కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను గెలిపించిన రింకూ సింగ్ - 12లో



ఈ మార్పులపై ఓ లుక్కేయండి!

ఆదాయపు పన్నుపై కొత్తగా వచ్చిన మార్పులను వివరిస్తూ కథనం - 13లో

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



గహ్లోత్‌పై పైలట్ తిరుగుబాటు

రాజస్తాన్‌లో బీజేపీ హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని సచిన్ పైలట్ నిరశన దీక్ష చేపట్టనున్నారు.

వివరాలు 6లో ▸



ప్రాంతీయ భాషల్లోనూ నిర్వహించాలి

సీఆర్‌పీఎఫ్ రిక్రూట్‌మెంట్‌లో కంప్యూటర్ టెస్ట్‌ను ప్రాంతీయ భాషల్లోనూ చేపట్టాలని తమిళనాడు సీఎం స్టాలిన్ కేంద్రాన్ని కోరారు.

వివరాలు 6లో ▸



అయోధ్యలో శివసైనికుల సందడి

మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎం ఫడ్నవీస్‌లతోపాటు 3 వేల మంది శివసైనికుల రాకతో అయోధ్య సందడిగా మారింది.

వివరాలు 6లో ▸



శరవేగంగా కనుమరుగు!

హిమాలయాల్లో హిమానీ నదులు అత్యంత వేగంగా కరిగిపోతున్నాయని పర్యావరణ వేత్తలు, సైంటిస్టులు గుర్తించారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

16 నుంచి భద్రాద్రిలో నూతన ఆర్జిత సేవలు



తెలంగాణలోని భద్రాచలం శ్రీ సీతారాముల ఆలయంలో ఈ నెల 16 నుంచి నూతన ఆర్జిత సేవలు ప్రారంభించనున్నారు. వీటి వివరాలను గతంలో వెల్లడించిన ఆలయ అధికారులు.. భక్తులు అభ్యంతరాలు, సలహాలు, సూచనలు అందజేయాలని కోరారు.

వివరాలు 10 ▸

రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో పొగలు



చెన్నై నుంచి నిజాముద్దీన్ వెళ్తున్న రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో బీ–5 బోగీ చక్రాల వద్ద పొగలు వచ్చాయి. ఈ ఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి రైల్వేస్టేషన్‌లో జరిగింది. బ్రేక్ బైండింగ్ తో ఈ సమస్య తలెత్తినట్లు అధికారులు గుర్తించారు.

వివరాలు 2 ▸

సింహాద్రిలో విద్యుదుత్పత్తికి అంతరాయం



అనకాపల్లి జిల్లా పరవాడలో సింహాద్రి ఎన్టీపీసీలో సాంకేతిక లోపంతో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. 500 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగింది. సాంకేతిక నిపుణులు మరమ్మతులు చేపడుతున్నారు.

వివరాలు 10 ▸

ఇంటింటా సందడి

పండుగ వాతావరణంలో 'జగనన్నే మా భవిష్యత్తు'

- ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు, కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు కలసికట్టుగా కార్యక్రమం
- ఊరూరా, అడుగడుగునా జనం బ్రహ్మరథం
- చిరునవ్వుతో స్వాగతిస్తున్న అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు
- నాలుగేళ్లలో ఎంతో లబ్ధి చేకూరిందని ప్రజల హర్షం
- ఇలా మేలు చేసే నాయకుడిని ఎలా వదులుకుంటామని ప్రశ్నల వర్షం
- ఎవరేం చెప్పినా నమ్మబోమని ఇంటింటా ప్రతిన
- తప్పకుండా మళ్లీ జగనన్నే సీఎం కావాలని ఆకాంక్ష
- మూడో రోజూ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన
- రెండు రోజుల్లోనే 82960 82960 నంబర్‌కు 15 లక్షలకు పైగా మిస్డ్ కాల్స్



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్టిక్కర్‌కు హారతులిస్తున్న మహిళలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం పండుగ వాతావరణంలో కొనసాగుతోంది. ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు, సమన్వయకర్తలు, కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు కలసికట్టుగా ఇంటింటికీ వెళ్తున్నారు. జగనన్న ప్రతినిధులుగా వచ్చిన వీరందరినీ.. తమ ఇంటికి బంధువులొచ్చినంత సంబరంగా ప్రజలు చిరునవ్వుతో ఆహ్వానిస్తున్నారు. తమ ఇళ్ల వద్దకు ఎప్పుడొస్తారా అని ఎదురు చూస్తున్నారు. కొన్ని ఊళ్లలో మేళతాళాలతో ఎదురేగి ఘన స్వాగతం పలుకుతూ బ్రహ్మరథం పడుతున్నారు. 'ఎమ్మెల్యే వద్దకు ప్రజలు వెళ్లడం మామూలే.. అందుకు విరుద్ధంగా ప్రజల వద్దకే ఎమ్మెల్యే రావడం అంటే అది కేవలం ఒక్క జగనన్న వల్లే సాధ్యమైంది' అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగేళ్లలో ఏ మేరకు లబ్ధి కలిగిందో ప్రజలే ఆనందంగా నేతలకు వివరిస్తుండటం ఊరూరా ప్రత్యక్షంగా కనిపిస్తోంది. సీఎం వైఎస్ జగన్ పలు విధాలా తమను ఆదుకుంటున్నారని, ఇలా ఆదుకుంటుండటం కొంత మంది పెత్తందారులకు గిట్టడం లేదని అక్కచెల్లెమ్మలు నేతల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత మంచి పనులు చేస్తుంటే సంతోషించాల్సింది పోయి దుష్ప్రచారం చేయడం దుర్మార్గం అని, వారంతా బాగు పడరని

మిగతా 2వ పేజీలో ▶





తమిళనాడు మదుమలైలోని తెప్పకాడు ఏనుగుల శిబిరాన్ని సందర్శించిన మోదీ కాసేపు వాటితో సరదాగా గడిపారు. ఇటీవల ఆస్కార్ అవార్డు పొందిన ఎలిఫెంట్ విస్పరర్స్ సినిమాలో ప్రధాన పాత్రలు పోషించిన మావటి దంపతులు బొమ్మన్, బెళ్లిలను ప్రధాని సన్మానించారు.

దేశంలో పులులు 3,167

గణాంకాలు విడుదల చేసిన మోదీ

పర్యావరణానికి, ఆర్థిక వ్యవస్థకి మధ్య వైరుధ్యాలని భారత్ విశ్వసించదని, ఆ రెండూ ఒకదానితో మరొకటి కలిసి ముందుకు వెళ్లడానికి ప్రాధాన్యతనిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పెద్ద పులుల సంరక్షణ కోసం ఉద్దేశించిన టైగర్ ప్రాజెక్టు 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని కర్ణాటక స్టేట్ ఓపెన్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు.

6లో

పులులను ఎలా లెక్కిస్తారంటే!

పల్నాడు జిల్లా అమరావతిలో పోలీసులతో టీడీపీ శ్రేణుల వాగ్వాదం



చర్చకు కాదు.. రచ్చకు

కయ్యానికి కాలుదువ్విన టీడీపీ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి

- టీడీపీ ఆరోపణలపై చర్చకు సిద్ధపడ్డ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే
- చెప్పిన మాట ప్రకారం అమరేశ్వరాలయానికి రాక
- కానీ, చర్చకు కాకుండా తన అనుచరులతో కొమ్మాలపాటి కవ్వింపు చర్యలు
- ఘర్షణ నివారణకు అతన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- దీంతో చెలరేగిన టీడీపీ మూకలు.. బస్సుపై దాడి
- పోలీసుల నిలువరించడంతో సద్దుమణిగిన వివాదం

అమరావతి: ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా తరచూ అధికార పక్షంపై కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న టీడీపీ నేతలు తాజాగా పల్నాడు జిల్లా అమరావతిలోనూ కయ్యానికి కాలుదువ్వారు. అక్కడి టీడీపీ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ గత కొంతకాలంగా ప్రస్తుత పెదకూరపాడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే నంబూరి శంకరరావుపై ఆరోపణలు చేస్తూ వస్తున్నారు. వీటిపై చర్చకు తాను సిద్ధమని ప్రకటించి అమరేశ్వరస్వామి ఆలయానికి ఆయన చేరుకున్నారు. కానీ, కొమ్మాలపాటి చర్చకు కాకుండా తన బలగంతో రచ్చచేయడానికే అన్నట్లు అక్కడికి బయల్దేరారు. దీంతో పోలీసులు అప్రమత్తమై కొమ్మాలపాటిని అదుపులోకి తీసుకున్నారు. టీడీపీ మూకలు రెచ్చిపోయి బస్సుపై దాడిచేశారు. పోలీసులు వెంటనే ఇరు పార్టీల వారిని వెనక్కి పంపడంతో

మిగతా 3వ పేజీలో ▶

ఈ–వ్యర్థాల సేకరణ కేంద్రాలు

- ప్రభుత్వ కార్యాలయాల్లోని ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణకు ఏర్పాట్లు
- రాష్ట్ర వ్యాప్తంగా కేంద్రాల ఏర్పాటు.. పర్యావరణహితానికి కీలక నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఈ కేంద్రాల నిర్వహణకు టెండర్ల ఆహ్వానం



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకుపోతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను (ఈ–వేస్ట్‌ను) పర్యావరణహితంగా తొలగించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. పాలనలో పారదర్శకత కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని సేవలను ఆన్‌లైన్ విధానంలో అందిస్తుండడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ–వేస్ట్ భారీగా పెరిగిపోతుండటాన్ని సర్కారు గుర్తించింది. ఏటా ప్రభుత్వ కార్యాలయాల నుంచి వెయ్యి టన్నుల ఈ–వేస్ట్ ఉత్పత్తి అవుతున్నట్లు ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. కంప్యూటర్లు, ట్యాబులు, మొబైల్ ఫోన్లు, రూటర్లు, స్విచ్‌లు, వైర్లు వంటి వాటి కాలపరిమితి తీరిపోయి పనిచేయనివాటిని సేకరించి రీసైక్లింగ్, డిస్పోజబుల్ చేసేవిధంగా ఒక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఈ వేస్ట్ సేకరణకు నోడల్ ఏజెన్సీగా ఏపీ టెక్నాలజీస్ సర్వీసెస్ (ఏపీటీఎస్)ని నియమించింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల మేరకు ఈ–వ్యర్థాలను రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఈ–వ్యర్థాలను సేకరించి వాటిని తీసుకెళ్లి రీసైక్లింగ్, రీ–ఫర్‌బిషింగ్, డిస్పోజబుల్ చేసే బాధ్యతల్ని అప్పగించేందుకు ఏపీటీఎస్ టెండర్లు పిలిచింది. ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, కార్యాలయాలు, సంస్థల నుంచి ఈ–వేస్ట్ సేకరించే విధంగా కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల్లో 40 శాతం

మిగతా 3వ పేజీలో ▶



పెరగనున్న ఉష్ణోగ్రతలు

రాష్ట్రంలో సోమవారం నుంచి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. వచ్చే ఐదు రోజులు రెండు నుంచి నాలుగు డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరుగుతాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో.. ఆదివారమే అనేక ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నంలో 41.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు.

- వివరాలు 3లో

విన్ రైజర్స్

ఐపీఎల్ టోర్నీలో హైదరాబాద్ తొలి విజయం

పంజాబ్ కింగ్స్‌పై 8 వికెట్లతో గెలుపు

- వివరాలు 12లో



పొదుపు మహిళల 'అర్బన్ మార్కెట్లు'

స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకునేలా స్టాళ్లు

శ్రీకాకుళం, విశాఖలో 'మెప్మా' పైలెట్ ప్రాజెక్టు విజయవంతం.. రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో ఏర్పాటుకు సన్నద్ధం

సాక్షి, అమరావతి: పట్టణ మహిళల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తూ స్వయం సహాయక సంఘాల మహిళలు స్వయంగా తయారు చేసే ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 'అర్బన్ మార్కెట్ల'ను ఏర్పాటు చేయనుంది. పైలెట్ ప్రాజెక్టుగా శ్రీకాకుళం, విశాఖలో నెలకొల్పిన అర్బన్ మార్కెట్లు విజయవంతం కావడంతో రాష్ట్రంలోని 123 కార్పొరేషన్లు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ఈ నెలలోనే వీటిని ఏర్పాటు చేయాలని మెప్మా నిర్ణయించింది. మెప్మా రెండేళ్ల క్రితం 7 నగరాల్లో ఏర్పాటు చేసిన

మిగతా 3వ పేజీలో ▶



గత నెలలో విశాఖపట్నంలో నిర్వహించిన అర్బన్ మార్కెట్‌లోని స్టాళ్లు

వేల మందికి స్వయం ఉపాధి



వైఎస్సార్ చేయూత, ఆసరాతోపాటు సున్నావడ్డీ రుణాలతో లబ్ధి పొందిన పొదుపు సంఘాల మహిళలకు స్వయం ఉపాధి కోసం అర్బన్ మార్కెట్లు చక్కటి వేదిక. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహించడం మెప్మా లక్ష్యం. పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులు నాణ్యతతో ఉన్నాయి. రానున్న రోజుల్లో మరింత మందికి మెప్మా ఆధ్వర్యంలో ఉపాధి కల్పిస్తాం.

\- విజయలక్ష్మి, మెప్మా ఎండీ



అమెరికా వీసా మరింత ప్రియం

మే 30 నుంచి వీసా ఫీజుల పెంపు

సాక్షి, అమరావతి: అమెరికా వీసా మరింత ప్రియం కానుంది. నాన్ ఇమిగ్రెంట్ వీసా (ఎన్ఐవీ) ఫీజులను అమెరికా ప్రభుత్వం పెంచింది. పెంచిన ఫీజులు మే 30వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. దీంతో పర్యాటక/వ్యాపార, విద్యార్థి వీసాలతో పాటు తాత్కాలిక ఉద్యోగాల ప్రాతిపదికన అమెరికా వెళ్లేవారి వీసాల ఫీజు పెరగనుంది. ఈమేరకు యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ ఆదివారం ఒక ప్రకటన జారీచేసింది. ఆ ప్రకటన ప్రకారం.. పర్యాటక/వ్యాపార అవసరాల మీద అమెరికా వెళ్లేవారి వీసా (బి1/బి2 కేటగిరీలు), విద్యార్థుల వీసా వంటి ఇతర నాన్ ఇమిగ్రెంట్

మిగతా 2వ పేజీలో ▶

'పూలే జయంతిని ఘనంగా నిర్వహించాలి'

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఏప్రిల్ 11న (మంగళవారం) 'మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం పేర్కొంది. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యేలకు, సమన్వయకర్తలకు కార్యక్రమ వివరాలు తెలియజేసింది. నియోజకవర్గ కేంద్రాల్లో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాల వద్ద ఘనంగా నివాళులు అర్పించి, సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించింది.

'వందేభారత్' హౌస్‌ఫుల్

తిరుపతి నుంచి హైదరాబాద్ బయలుదేరిన వందేభారత్ తొలి రైలు



వందేభారత్ రైలులో ప్రయాణికులు

తిరుపతి అర్బన్: తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్ రైలు ఆదివారం నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. తిరుపతిలో ఆదివారం మధ్యాహ్నం 3.10 గంటలకు బయలుదేరింది. ఈ రైలులో టీసీలుగా నలుగురు మహిళలు నియమితులయ్యారు. పి.అనిత (సీటీఐ), ఎంఎస్ సెల్వీ (టీటీఐ), బి.భారతి (టీటీఐ), రమణమ్మ (టీటీఐ) విధులు నిర్వర్తిస్తున్నారు. రైలును పరిశీలించేందుకు గుంతకల్లు రైల్వే డీఆర్ఎం వెంకటరమణారెడ్డి తిరుపతి రైల్వేస్టేషన్‌కు విచ్చేశారు. ఆయన వెంట సీనియర్ కమర్షియల్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్, స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, స్టేషన్ మేనేజర్ చిన్నరెడ్డెప్ప, రైల్వే ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ ఉన్నారు. మొదటి రోజే రైలులోని 520 టికెట్లు భర్తీ అయ్యాయని అధికారులు తెలిపారు. తొలిరోజు రూ.9.50 లక్షల ఆదాయం సమకూరిందన్నారు. మరో రెండు రోజులకు కూడా టికెట్లు బుక్ అయినట్టు తెలిపారు.

వందే భారత్ రైలులో సీఎస్ ప్రయాణం



తిరుపతి అర్బన్: వందే భారత్ రైలులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి ప్రయాణించారు. రెండు రోజుల జిల్లా పర్యటన నిమిత్తం తిరుపతి వచ్చిన ఆయన ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుపతి రైల్వేస్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ శనివారం సికింద్రాబాద్‌లో వందే భారత్ ట్రైన్ ప్రారంభించడం శుభపరిణామమని తెలిపారు. యాత్రికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం సీఎస్ జవహర్‌రెడ్డి తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి వందే భారత్ రైలులో గుంటూరుకు వెళ్లారు. అక్కడ నుంచి విజయవాడకు వెళ్లనున్నారు. ఆయనకు టీటీడీ ఈవో ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, టీటీడీ జేఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మయ్య, నగరపాలక కమిషనర్ హరిత, స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ వీడ్కోలు పలికారు.

రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో పొగలు

- కావలి స్టేషన్‌లో రైలును నిలిపేసి తనిఖీలు
- బ్రేక్ బైండింగ్ అనే సాంకేతిక సమస్యగా గుర్తింపు

బిట్రగుంట: చెన్నై నుంచి నిజాముద్దీన్ వెళ్తున్న రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో బీ–5 బోగీ చక్రాల వద్ద పొగలు రావడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురైన ఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి రైల్వేస్టేషన్‌లో ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే వర్గాలు, ప్రయాణికుల కథనం మేరకు.. రాజధాని ఎక్స్‌ప్రెస్ కావలి స్టేషన్ సమీపంలోకి వచ్చేసరికి బీ–5 బోగీ వద్ద పొగలు వస్తున్నట్లు ప్రయాణికులు, రైలు సిబ్బంది గుర్తించారు. వెంటనే రైలును కావలి స్టేషన్‌లో నిలిపేసి తనిఖీలు నిర్వహించగా బ్రేక్ బైండింగ్ అనే సాంకేతిక సమస్య కారణంగా చక్రాలు పట్టేసి పొగలు వస్తున్నట్లు గుర్తించారు. వెంటనే మరమ్మతులు పూర్తి చేసి రైలు పరుగుకు పచ్చజెండా ఊపారు. కాగా రైలులో పొగలు రావడంతో ప్రయాణికులు కొంతసేపు గందరగోళానికి, ఆందోళనకు గురయ్యారు. బ్రేక్ బైండింగ్ అనేది సాధారణ సమస్యేనని ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైల్వే సిబ్బంది సర్ది చెప్పారు.

రూ.1.07 కోట్ల అక్రమ బంగారం స్వాధీనం

సాక్షి, అమరావతి: విదేశాల నుంచి అక్రమంగా దిగుమతి చేసిన బంగారాన్ని తరలిస్తోన్న ఓ వ్యక్తిని కాకినాడ కస్టమ్స్ విభాగం అధికారులు ఆదివారం అరెస్ట్ చేసి రూ.1.07 కోట్ల విలువైన 1,784.5 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. బంగారం స్మగ్లింగ్‌పై సమాచారం అందడంతో కాకినాడ కస్టమ్స్ అధికారులు చెన్నై–కోల్‌కత హైవేపై ఏలూరు సమీపంలోని కలపర్రు టోల్‌ప్లాజా వద్ద శనివారం తనిఖీలు నిర్వహించారు. చెన్నై నుంచి తణుకు వస్తున్న ఓ బస్సును తనిఖీలు చేయగా ఓ వ్యక్తి వద్ద 1,784.5 గ్రాముల బంగారాన్ని గుర్తించారు. అది అక్రమ బంగారం కాదని నమ్మించేందుకుగాను ఆ బంగారంపై ఉన్న విదేశీ ముద్రలను చెరిపేసేందుకు యత్నించినట్లు అధికారులు గుర్తించారు. ఆ వ్యక్తిని అరెస్టు చేసి విశాఖ కోర్టులో ఆదివారం హాజరుపరచగా..కోర్టు అతడికి రిమాండ్ విధించింది.

ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆకట్టుకుంటున్న కళాకారిణుల నృత్యాలు

తిరుపతి కల్చరల్: ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు ఆదివారం తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో ప్రారంభమయ్యాయి. శ్రీశ్రీ కళావేదిక, చేజర్ల ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు వరల్డ్ రికార్డు సాధనే లక్ష్యంగా మంగళవారం ఉదయం 8 గంటల వరకు 48 గంటలపాటు కొనసాగనున్నాయి. తొలి రోజు దేశవ్యాప్తంగా విచ్చేసిన 1,450 మంది కళాకారులు వేదికపై తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. 700 మంది కవితా గానాలు చేయగా, 420 మంది నృత్య ప్రదర్శనలు చేసి అబ్బుర పరిచారు.

అమెరికా వీసా మరింత ప్రియం

▶ మొదటి పేజీ తరువాయి

వీసాల ఫీజును 160 అమెరికన్ డాలర్ల నుంచి 185 అమెరికన్ డాలర్లకు పెంచారు. తాత్కాలిక ఉద్యోగాల మీద అమెరికా వెళ్లేవారికి ఉద్దేశించిన పిటిషన్ బేస్డ్ నాన్ ఇమిగ్రెంట్ (హెచ్, ఐ, ఒ, పి, క్యూ, ఆర్ కేటగిరీలు) వీసాల ఫీజును 190 అమెరికన్ డాలర్ల నుంచి 205 అమెరికన్ డాలర్లకు పెంచారు. ఇక ట్రీటీ ట్రేడర్, ట్రీటీ ఇన్వెస్టర్, ట్రీటీ అప్లికెంట్స్‌కు ఉద్దేశించిన నాన్ ఇమిగ్రెంట్ (ఇ కేటగిరి) వీసా ఫీజును 205 అమెరికన్ డాలర్ల నుంచి ఏకంగా 315 అమెరికన్ డాలర్లకు పెంచారు. అమెరికా వీసా ఇంటర్వ్యూల కోసం గత ఏడాది అక్టోబరు 1వ తేదీ తరువాత చెల్లించిన ఫీజులు 365 రోజుల వరకు వర్తిస్తాయి. గత ఏడాది అక్టోబరు 1వ తేదీ కంటే ముందు చెల్లించిన వీసా ఇంటర్వ్యూల ఫీజులు ఈ ఏడాది సెప్టెంబరు 30వ తేదీ వరకే వర్తిస్తాయి. కాబట్టి ఆ వీసా దరఖాస్తుదారులు తమ వీసా ఇంటర్వ్యూను ముందుకు జరుపుకోవాలని, లేదా సెప్టెంబరు 30వ తేదీలోగా వీసా ఉపసంహరణకు దరఖాస్తు దాఖలు చేయాలని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ సూచించింది.



చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గం వేపగుంట హరిజనవాడలో సంక్షేమ బుక్‌లెట్‌ను లబ్ధిదారుకు అందజేస్తున్న మంత్రి ఆర్కే రోజా



గుంటూరు గుజ్జనగుండ్లలో లబ్ధిపొందిన పథకాలు గురించి వృద్ధురాలికి వివరిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



విజయనగరం జిల్లా అలుగోలులో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



ఎన్టీఆర్ జిల్లా విజయవాడ 37వ డివిజన్‌లో ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం 13వ వార్డులో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం బెలగాంలో ఇంటికి సీఎం జగన్ ఫొటో స్టిక్కర్‌ను అతికిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు

నిమిషానికి 175

ఇంటర్నెట్‌ను ముంచెత్తుతున్న కొత్త వెబ్‌సైట్లు

- ప్రపంచవ్యాప్తంగా 1.13 బిలియన్ల వెబ్‌సైట్లు
- 50 బిలియన్ల వెబ్‌పేజీలు ఉన్నట్లు అంచనా
- యాక్టివ్‌గా ఉన్న సైట్లు 18 శాతం మాత్రమే



సాక్షి, అమరావతి: ఇంటర్నెట్ ప్రపంచంలో కోట్లాది వెబ్‌సైట్లు సమాచార సామ్రాజ్యాన్ని ఏలుతున్నాయి. లావాదేవీలకు వారధిగా నిలుస్తూ కీలక పాత్ర పోషిస్తున్నాయి. నిమిషానికి 175 కొత్త వెబ్‌సైట్లు పుట్టుకొస్తున్నాయి. రోజూ 2.52 లక్షల కొత్త వెబ్‌సైట్లను సృష్టిస్తున్నారు. 1991లో ఒక్క వెబ్‌సైట్‌తో ప్రారంభమైన ఇంటర్నెట్ ఈ రోజు బిలియన్ల సంఖ్యకు చేరుకోవడం విశేషం. ప్రస్తుతం ఇంటర్నెట్‌లో సుమారు 1.13 బిలియన్ల వెబ్‌సైట్లు ఉన్నట్లు ఇంగ్లాండ్‌కు చెందిన ఇంటర్నెట్ సంస్థ నెట్‌క్రాఫ్ తాజా నివేదికలో వెల్లడించింది. అధికంగా ఆంగ్లంలోనే వెబ్‌సైట్లను రూపొందిస్తున్నారు. డటం గమనార్హం. ఒక వెబ్‌సైట్‌లో అనేక వెబ్ పేజీల సమాచారం ఉంటుంది. 50 బిలియన్ల వెబ్‌పేజీల సమాచారం నెట్‌లో నిక్షిప్తమైంది. టిల్ బర్గ్ వర్సిటీ (నెదర్లాండ్స్) పరిశోధన ప్రకారం ఇండెక్డ్ వెబ్ ఏకంగా 4.98 బిలియన్ల పేజీలను కలిగి ఉంది.

18 శాతం మాత్రమే యాక్టివ్..

ఇంటర్నెట్‌లోని కోట్లాది వెబ్‌సైట్‌లలో కేవలం 18 శాతం మాత్రమే యాక్టివ్‌గా ఉన్నట్టు నెట్‌క్రాఫ్ట్ పేర్కొంది. ప్రస్తుతం 20.29 కోట్ల వెబ్‌సైట్లు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. యాక్టివ్ వెబ్‌సైట్ల కంటే పని చేయనివి ఐదు రెట్లు ఎక్కువగా ఉం

రెండు బిలియన్ల మంది షాపింగ్

దాదాపు 71 శాతం వ్యాపారాలను వెబ్‌సైట్లపై ఆధారపడి నిర్వహిస్తున్నారు. ఇందులో 28 శాతం ఆన్‌లైన్ వ్యాపారం నడుస్తోంది. 43 శాతం మంది చిన్న వ్యాపారులు తమ వెబ్‌సైట్‌లను మరింత మెరుగ్గా నిర్వహించేందుకు పెట్టుబడి పెట్టాలని భావిస్తున్నారు. 2 బిలియన్ల మందికిపైగా వివిధ వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నారు. ఈ–కామర్స్ విక్రయాలు 4.2 ట్రిలియన్ల డాలర్లకుపైగా చేరుకుంటున్నాయి.

వివిధ భాషల్లో వెబ్‌సైట్ల శాతం

ఆంగ్లం	52.3	పర్షియన్	3.5
రష్యన్	7.5	ఫ్రెంచ్	2.6
టర్కిష్	3.8	జర్మన్	2.1
స్పానిష్	3.8	జపనీస్	1.9

వెబ్‌సైట్లో ఇలా..

■ ప్రపంచ వెబ్ ట్రాఫిక్‌లో 93 శాతం గూగుల్ నుంచే వస్తోంది. గూగుల్‌లో అత్యధికంగా సగటున 22 నిమిషాల పాటు బ్రౌజింగ్ సమయాన్ని వెచ్చిస్తున్నారు. ఇది యూట్యూబ్‌లో 9 నిమిషాలుగా ఉంది. ■ ఒక రోజులో 3 బిలియన్ల కంటే ఎక్కువగా గూగుల్ శోధనలు జరుగుతున్నాయి. ■ ఒక్క రోజులో 70,000కు పైగా వెబ్‌సైట్‌లు హ్యాక్‌కి గురవుతున్నాయి. ■ ఒక రోజులో దాదాపు 120 బిలియన్ ఈ–మెయిల్స్ పంపుతున్నారు. ■ ప్రతిరోజూ 4 బిలియన్ గిగాబైట్ల కంటే ఎక్కువ ఇంటర్నెట్ ట్రాఫిక్ నమోదవుతోంది. ■ 63 మిలియన్ వెబ్‌సైట్‌లు కంటెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లను ఉపయోగిస్తున్నాయి. ■ ప్రపంచవ్యాప్తంగా ఉన్న అగ్ర వెబ్‌సైట్‌లలో 76.17 శాతం మొబైల్‌కు అనుకూలమైనవి కాగా 23.83 శాతం వెబ్‌సైట్‌లు మొబైల్‌లో ఓపెన్ కావు.

ప్రధాన దేశాల్లో వెబ్‌సైట్ల సంఖ్య కోట్లలో

దేశం	వెబ్‌సైట్ల సంఖ్య
అమెరికా	13.33
చైనా	1.79
జర్మనీ	1.28
కెనడా	1.19
భారత్	0.57
జపాన్	0.52
ఫ్రాన్స్	0.42
యూకే	0.27
నెదర్లాండ్స్	0.20
ఇజ్రాయిల్	0.20
రష్యా	0.12

టాప్ 10 వెబ్‌సైట్ల సందర్శనలు ప్రతినెలా బిలియన్లలో

గూగుల్	97
యూట్యూబ్	80.05
ఫేస్‌బుక్	12.5
ట్విట్టర్	7.20
వికీపీడియా	6.72
రెడ్డిట్	4.78
ఇన్‌స్ట్రాగామ్	4.58
లెక్టార్నో	3.76
యాహూ	3.33
అమెజాన్	2.93

ఇంటింటా సందడి

▶ మొదటి పేజీ తరువాయి

ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు, ఎల్లోమీడియా ఎన్ని అబద్ధాలు చెప్పినా.. వాటిని నమ్మే ప్రసక్తే లేదని.. తిరిగి జగనన్ననే మళ్లీ సీఎంగా గెలిపించుకుంటామని ప్రతినబూనుతున్నారు. 'వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, రైతుల బాగు కోసం సీఎం జగన్ తీసుకున్నన్ని చర్యలు దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఏ సీఎం కూడా తీసుకోలేదు. ఈ నాలుగేళ్లలో చేపట్టిన సంస్కరణలు ఆషామాషీ కాదు. వీటి ఫలితాలు ఎంతటి సంచలనాలు సృష్టిస్తాయో ముందు ముందు తెలుస్తుంది. 85–87 శాతం కుటుంబాలకు లబ్ధి చేకూర్చడమంటే మాటలా! అందువల్లే ఇంత ధైర్యంగా ఇంటింటికి ఆయన ప్రతినిధులుగా ఎమ్మెల్యేలను పంపిస్తున్నారు' అని తిరుపతికి చెందిన వెంకటయ్య వ్యాఖ్యానించారు. 'సీఎం జగనే లేకపోయుంటే మా పరిస్థితి ఎంత దయనీయంగా ఉండేదో ఊహించలేం' అని అనంతపురానికి చెందిన శ్రీదేవి, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన రాణి పేర్కొంది. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను వివరిద్దామనుకున్న నేతల కంటే ప్రజలే ముందుగా స్పందిస్తూ గత చంద్రబాబు పాలనను తూర్పారబడుతున్నారు. తామంతా జగన్ వెంటేనని, ఆరు నూరైనా తిరిగి వైఎస్ జగనే సీఎం అవ్వడం ఖాయం అని స్పష్టం చేస్తున్నారు.

అన్ని వర్గాలకూ న్యాయం చేశారు

'జగనన్నే మా భవిష్యత్తు' మూడో రోజు కార్యక్రమం ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఉదయం నుంచే ప్రారంభమైంది. అన్ని వర్గాల ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. టీడీపీ సర్కార్‌కూ ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాలను వివరిస్తూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు కరపత్రాన్ని చదివి వినిపించినప్పుడు.. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుని తమతో పాటు అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశారనే మాట ప్రతి ఇంటా వినిపించింది. చెప్పింది చెప్పినట్లు చేస్తున్నందు వల్లే 'జగనన్నే మా భవిష్యత్' అని స్పష్టం చేశారు. సీఎం వైఎస్ జగన్ గత 46 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలతో తమకు అండదండగా నిలిచారని అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు సంతోషం వ్యక్తం చేశారు. ఈసారి మళ్లీ సీఎం జగన్‌కే తమ మద్దతు అని చెబుతున్నారు.

స్వచ్ఛందంగా అభిప్రాయం

ప్రజా సర్వేలో భాగంగా ప్రజా మద్దతు పుస్తకంలో స్లిప్పులలోని ఐదు ప్రశ్నలను గృహ సారథులు వినిపించినప్పుడు.. వైఎస్ జగన్ ప్రభుత్వంతోనే తమకు న్యాయం జరిగిందని, మళ్లీ సీఎంగా వైఎస్ జగనే కావాలంటూ ప్రజలు సమాధానం చెబుతున్నారు. వాటిని నమోదు చేయించి, రసీదు తీసుకుంటున్నారు. ఆ తర్వాత గృహ సారథులు అడగక ముందే.. వైఎస్ జగన్ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తున్నారు. ఆ వెంటనే.. ప్రభుత్వానికి మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ సీఎం వైఎస్ జగన్ సందేశంతో ఐవీఆర్ఎస్ కాల్ రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గృహ సారథుల వద్ద నుంచి వైఎస్ జగన్ ఫొటో ఉన్న స్టిక్కర్లను తీసుకుని, ఇంటి తలుపునకు, మొబైల్ ఫోన్‌కు అతికించి.. 'జగనన్నే మా భవిష్యత్' అంటూ నినదించారు. ఇలా ఊరూరా రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని వర్గాల నుంచి స్వచ్ఛందంగా మద్దతు వ్యక్తం అవుతోంది.

15 లక్షలకు పైగా మిస్డ్ కాల్స్

రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం ఈ నెల 7వ తేదీ ప్రారంభమైంది. సచివాలయానికి ముగ్గురు చొప్పున నియమించిన కన్వీనర్లు, ప్రతి 50 నుంచి వంద ఇళ్లకు ఇద్దరు చొప్పున నియమించిన గృహ సారథులతో కూడిన ఏడు లక్షల మంది సైన్యం ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, వలంటీర్లతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో వారికి ప్రత్యేకమైన కిట్ బ్యాగ్‌లు అందజేశారు. 14 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమం ద్వారా 15,004 సచివాలయాల పరిధిలో 1.60 కోట్ల కుటుంబాలలోని ఐదు కోట్ల మంది ప్రజలను కలుసుకోనున్నారు. ఇదిలా ఉండగా 'మెగా పీపుల్స్ సర్వే'కు ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా మద్దతు పుస్తకంలో 21 లక్షలకు పైగా కుటుంబాలు పాల్గొన్నాయి. తొలి రెండు రోజుల్లోనే 82960–82960 నంబర్‌కు 15 లక్షలకు పైగా మిస్డ్ కాల్స్ వచ్చాయి.

జగనన్నే మా దేవుడు



కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న తన భర్త జయచంద్రకు జగనన్న మెరుగైన వైద్యం చేయించడంతో పాటు రూ.10 వేలు పెన్షన్ అందిస్తూ తన పసుపు కుంకుమలను కాపాడారని తిరుపతిలోని జైభీమ్ కాలనీకి చెందిన లక్ష్మి ఆనందం వ్యక్తం చేసింది. తన భర్త ప్రాణాలతో ఉన్నాడంటే అది జగనన్న పుణ్యమేనన్నారు. తమ లాంటి ఎంతో మందిని ఎన్నో విధాలా ఆదుకుంటున్నందున 'జగనన్నే మా దేవుడు' అంటూ సీఎం జగన్ ఫొటోకు భర్తతో కలిసి దండం పెట్టుకుంది. మళ్లీ జగనన్ననే గెలిపించుకుంటామన్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు' మూడో రోజు కార్యక్రమంలో భాగంగా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి వీరి ఇంటికి వచ్చి వెళ్లిన అనంతరం గతంలో ఎమ్మెల్యే ద్వారా సీఎం అందించిన సాయాన్ని వారు ఇలా గుర్తు చేసుకున్నారు.

– తిరుపతి మంగళం

పోలవరం ముంపుపై నేడు కీలక సమావేశం

- కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ అధ్యక్షతన భేటీ
- హాజరుకానున్న నాలుగు రాష్ట్రాల ప్రతినిధులు
- ఈ భేటీ ఆధారంగా కేంద్రమంత్రి షెకావత్‌కు నివేదిక
- ఈ నెలాఖరులోగా నాలుగు రాష్ట్రాల సీఎంలతో సమావేశం నిర్వహించే అవకాశం

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ (వెనుక జలాలు) ప్రభావం వల్ల ముంపుపై మూడు రాష్ట్రాల అనుమానాలను నివృత్తి చేయడమే లక్ష్యంగా కేంద్రం మరోసారి కీలక సమావేశం నిర్వహిస్తోంది. ఢిల్లీలో సోమవారం మధ్యాహ్నం మూడుగంటలకు కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యాలయంలో ఆ శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల జలవనరుల శాఖల ముఖ్యకార్యదర్శులు, ఈఎన్‌సీలు పాల్గొంటారు. ఈ భేటీలో వెల్లడయ్యే అంశాల ఆధారంగా కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు పంకజ్‌కుమార్ నివేదిక ఇవ్వనున్నారు. ఆ నివేదిక ఆధారంగా ఈ నెలాఖరులోగా నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావం వల్ల తమ రాష్ట్రాల్లో ముంపు సమస్య ఉత్పన్నమవుతోందంటూ తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ రాష్ట్రాలు దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్సెల్పీ)లపై గతేడాది సెప్టెంబరు 6న సుప్రీంకోర్టు విచారించింది. తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఏపీ జలవనరుల శాఖల ఉన్నతాధికారులతో సమావేశమై ముంపు ప్రభావిత రాష్ట్రాల అనుమానాలను నివృత్తి చేయాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. అవసరమైతే ఆ నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించి.. సమస్యలు పరిష్కరించి, నివేదిక ఇవ్వాలని నిర్దేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్, కేంద్ర అటవీ పర్యావరణ శాఖ కార్యదర్శి రామేశ్వర్‌గుప్తా నాలుగు రాష్ట్రాల సీఎస్‌లు, జలవనరుల శాఖల ఉన్నతాధికారులతో రెండుసార్లు సమావేశం నిర్వహించారు. ఇదే అంశంపై సీడబ్ల్యూసీ చైర్మన్ నేతృత్వంలో నాలుగు రాష్ట్రాల ఈఎన్‌సీలు, పీపీఏ సీఈవో సభ్యులుగా ఏర్పాటైన సాంకేతిక కమిటీ కూడా రెండుసార్లు సమావేశమైంది. ఈ నెల 3వ తేదీన నిర్వహించిన సాంకేతిక కమిటీ మూడో సమావేశంలో వెల్లడైన అంశాలను కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్‌కు సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా వివరించారు. ఆ అంశాల ఆధారంగా నాలుగు రాష్ట్రాల జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో సోమవారం ఈ సమావేశం జరుగుతుందని అధికారవర్గాలు వెల్లడించాయి.

రైతు భరోసా కేంద్రాలు.. అద్భుతం

- రైతు సంక్షేమానికి ఎంతో ఉపయుక్తం
- రాజస్థాన్ రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ ఎండీ జస్వంత్‌సింగ్
- అధికారులతో కలిసి ఆర్బీకేల సందర్శన



దుర్గసముద్రంలో ఆర్బీకేను సందర్శిస్తున్న జస్వంత్‌సింగ్, అధికారులు

తిరుపతి రూరల్: క్షేత్రస్థాయిలోనే రైతు సమస్యలకు ఉత్తమ పరిష్కార కేంద్రంగా ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) అద్భుతమని రాజస్థాన్ రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) జస్వంత్‌సింగ్ కొనియాడారు. ఆయన ఆదివారం రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన అగ్రికల్చర్ అధికారులు, శాస్త్రవేత్తలతో కలిసి తిరుపతి జిల్లా తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంలోని ఆర్బీకేని సందర్శించారు. వ్యవసాయ శాఖాధికారులు, రైతులతో మాట్లాడారు. ఆర్బీకేలో రైతుల సంక్షేమం, అధిక దిగుబడి కోసం చేపడుతున్న చర్యలు, అందిస్తున్న నాణ్యమైన క్రిమిసంహారిక మందులు, రైతులకు సీజన్ల వారీగా అందిస్తున్న సేవలను తిరుపతి జిల్లా వ్యవసాయ శాఖాధికారి ప్రసాద్‌రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆర్బీకేలో కియోస్క్ పనితీరు, వివిధ అవసరాలకు రైతులు కియోస్క్‌ను ఉపయోగించుకుంటున్న విధానాన్ని వారు ఆసక్తిగా పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్బీకేలను ఏర్పాటు చేసిన తర్వాత వ్యవసాయ, పశుసంవర్ధకశాఖల అధికారులు రోజూ అందుబాటులో ఉంటున్నారని, విలువైన సలహాలు, సూచనలు ఇవ్వడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించామని రైతులు తెలిపారు. అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండీ జస్వంత్‌సింగ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఆర్బీకే వంటి పథకాలపై దేశవ్యాప్తంగా చర్చజరుగుతోందని చెప్పారు. అందులో భాగంగానే వ్యవసాయాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో వాటిని పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. నిజంగానే ఆర్బీకేలు రైతులకు అద్భుతంగా సేవలు అందిస్తున్నాయని కితాబిచ్చారు. ఈ విషయమై తమ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి సంగన మమత, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఆయేషా, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

జాతీయ సర్వే దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీలు

సాక్షి, అమరావతి: జాతీయ సర్వే దినోత్సవం సందర్భంగా ఈ నెల 8, 9 తేదీల్లో రాష్ట్రంలోని సర్వే ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు సర్వే ఉద్యోగుల సంఘం తెలిపింది. 1967 నుంచి ఏప్రిల్ 10న సర్వే శాఖ దేశ వ్యాప్తంగా జాతీయ సర్వే దినోత్సవాన్ని నిర్వహిస్తుందని సంఘం అధ్యక్షుడు చిరంజీవిరావు, సలహాదారు రౌతు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. బ్రిటిష్ సర్వేయర్ కర్నాల్ విలియం లాంబ్టన్ అధునాతన సర్వే పరికరాలు అందుబాటులో లేని సమయంలో 200 ఏళ్లకు ముందు దేశంలో ఎన్నో వ్యయ ప్రయాసలకు పడి సర్వేను ప్రారంభించారన్నారు. 1802 ఏప్రిల్ 10న చెన్నైలోని సెంట్ థామస్ మౌంట్ జీటీఎస్ మొదటి బేస్ లైన్‌ను అక్షాంశం, రేఖాంశాలతో కచ్చితంగా నిర్ధారించారని తెలిపారు. ఆ తర్వాత మరో బ్రిటీష్ సర్వేయర్ మౌంట్ ఎవరెస్ట్ సర్వే ప్రక్రియను కొనసాగించారని తెలిపారు. సర్వే విజయవంతమైన రోజు ఏప్రిల్ 10 కనుక అప్పటి నుంచి జాతీయ సర్వే దినోత్సవాన్ని ఏపీలోనూ జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

చంద్రబాబు ఇచ్చే ఇఫ్తార్ విందును బహిష్కరించండి

వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ ఖాదర్ బాషా పిలుపు

సాక్షి, అమరావతి: ఈ నెల 11న మంగళగిరిలో చంద్రబాబు ఇస్తోన్న ఇఫ్తార్ విందును బహిష్కరించాలని ముస్లింలకు రాష్ట్ర వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ వి.ఖాదర్ బాషా ఆదివారం పిలుపునిచ్చారు. ఐదేళ్ల పదవీ కాలంలో చంద్రబాబు ఏనాడూ ముస్లింలను పట్టించుకోకపోగా, వారిపై దేశద్రోహం కేసులు పెట్టి వేధించాడని గుర్తు చేశారు. ఒక్క ముస్లింను కూడా మంత్రివర్గంలోకి తీసుకోడానికి బాబుకు మనసొప్పలేదని, ఎన్నికలు సమీపిస్తోన్న చివరి ఆరు నెలలకు ఫరూక్‌ను మంత్రిని చేశానని చూపించి మోసం చేశాడన్నారు. గడిచిన ఎన్నికల్లో ముస్లింలు చంద్రబాబుకు గుణపాఠం నేర్పారన్నారు. ముస్లింల పట్ల నిజమైన ప్రేమాభిమానాలు చూపుతోన్న సీఎం జగన్‌కు ముస్లిం సమాజం అండగా ఉందన్నారు.

'జగనన్న కాలనీ - మోదీ అన్న ఇల్లు' అని పేరు పెట్టాలి

బీజేపీ ఏపీ అధ్యక్షుడు సోము వీర్రాజు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ ద్వారా మంజూరు అయిన ఇళ్లకు 'జగనన్న కాలనీ - మోదీ అన్న ఇల్లు' అని పేరు పెట్టాలని బీజేపీ ఏపీ అధ్యక్షుడు సోము వీర్రాజు డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ ఏపీ శాఖ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురితో సోము వీర్రాజు భేటీ అయ్యారు. అనంతరం వీర్రాజు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణంపై సమీక్ష నిర్వహించాలని కేంద్ర మంత్రిని కోరినట్టు తెలిపారు. ఏపీకి ఎక్కువ ఇళ్లు కేటాయించినా నిర్మాణం నత్తనడకన సాగుతోందన్నారు. సోమవారం కేంద్ర జలశక్తి మంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రుల్ని కలిసి పోలవరం, సర్పంచులకు నిధులు కేటాయింపులపై చర్చిస్తామని వీర్రాజు తెలిపారు.

చంద్రబాబు, లోకేశ్‌లవి అబద్ధాల ప్రచార యాత్రలు

924వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు



దీక్షల్లో పాల్గొన్న నేతలు

తాడికొండ: నాలుగేళ్ల పక్క రాష్ట్రంలో తలదాచుకుని ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికారం కోసం బాబు ఆయన కుమారుడు లోకేశ్‌లు రాష్ట్రంలో అబద్ధాల ప్రచారం కోసం యాత్రలు చేస్తుండటం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 924వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ 14 ఏళ్లు సీఎంగా చేసిన బాబు తన హయాంలో పేదవాడికి జానెడు జాగా ఇచ్చిన దాఖలాల్లేవని, అసెంబ్లీలో కనీసం ప్రతిపక్ష పాత్ర పోషించకుండా పక్క రాష్ట్రానికి పారిపోయి దాక్కున్నారని మండిపడ్డారు. తన స్వార్థం కోసం ఎంతటి నీచానికైనా దిగజారతాడనే నానుడి ఉన్న చంద్రబాబు పేదలు ఆర్థికంగా బలపడితే తమ పార్టీకి, తన సామాజికవర్గ ఆధిపత్యానికి ఇబ్బందులు తప్పవని గ్రహించి పేదలకు సంక్షేమం అందకుండా తప్పుడు కేసులతో అడ్డుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబు వద్ద ప్యాకేజీలు తీసుకుని ఆత్మగౌరవం తాకట్టు పెడుతున్న దళిత దళారులు ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తుండటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నేతలు నూతక్కి జోషి, పల్లె బాబు, పులి దాసు, ఈపూరి ఆదాం పాల్గొన్నారు.

ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాలు

▶ మొదటి పేజీ తరువాయి

లెడ్ ఉంటుంది. మొత్తం 75 శాతం భార లోహాలను కలిగి ఉండటంతో ఇవి పర్యావరణానికి పెనుముప్పుగా పరిణమించాయి. టెండర్ కమ్ ఆక్షన్ విధానంలో బిడ్డర్‌ను ఎంపిక చేయనున్నామని, అత్యధిక ధర కోట్‌చేసిన సంస్థకు ఈ బాధ్యతను అప్పగిస్తామని ఏపీటీఎస్ ఉన్నతాధికారులు వెల్లడించారు.



అమిత వేగంతో దూసుకెళ్తూ.. అడుగుకో నక్షత్రాన్ని పుట్టిస్తూ..

అంతరిక్షంలో నక్షత్రాలన్నీ సమూహాలు (గెలాక్సీలు)గా.. అక్కడో గుంపు, ఇక్కడో గుంపు అన్నట్టుగా ఉంటాయి. కానీ శాస్త్రవేత్తలకు ఒకచోట మాత్రం ఏదో గీత గీసినట్టుగా నక్షత్రాల వరుస కనిపించింది. అదేదో పదులు, వందల్లో కాదు.. లక్షల నక్షత్రాలు అలా లైన్ కట్టాయి. అదేమిటా అని చూస్తే నోరెళ్లబెట్టే సంగతి బయటపడిందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఆ వివరాలేమిటో తెలుసుకుందామా..


\- సాక్షి సెంట్రల్ డెస్క్

నక్షత్రాల లైన్ ఏమిటని చూసి..

సాధారణంగా ప్రతి నక్షత్ర సమూహం (గెలాక్సీ) మధ్యలో పెద్ద బ్లాక్‌హోల్ ఉంటుంది. దాని చుట్టూ రానే నక్షత్రాలు పరిభ్రమిస్తూ ఉంటాయి. నక్షత్రాలు కూడా గుంపుగా ఉంటాయి. కానీ ఇటీవల హబుల్ స్పేస్ టెలిస్కోప్ తీసిన చిత్రాల్లో.. నక్షత్రాలు ఒక గీతలా వరుసగా ఉండటం, అదీ ఓ చిన్న గెలాక్సీ దగ్గర మొదలై కోట్ల కిలోమీటర్ల పొడవునా కనిపించడంతో శాస్త్రవేత్తలు ఆశ్చర్యపోయారు. చిత్రాల్లో అదేదో 'పొరపాటు (ఎర్రర్)' కావొచ్చని తొలుత భావించారు. కానీ యేల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ పీటర్ వాన్ డొక్కుమ్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం దీనిపై పరిశోధన చేసి.. ఆ నక్షత్రాల వరుస ముందు ఓ ప్రకాశవంతమైన వస్తువును గుర్తించింది. క్షుణ్నంగా పరిశీలించి అది కృష్ణబిలం అని తేల్చింది.

గెలాక్సీ నుంచి తప్పించుకుని..

ఓ పెద్ద కృష్ణబిలం తన గెలాక్సీ నుంచి తప్పించుకుని, అమిత వేగంతో ప్రయాణిస్తూ.. దారిలో ఈ నక్షత్రాల పుట్టుకకు కారణమవుతోందని శాస్త్రవేత్తలు తేల్చారు. రెండు, మూడు గెలాక్సీలు ఢీకొన్న క్రమంలో.. ఒక గెలాక్సీ నుంచి విసిరేసినట్టుగా ఈ కృష్ణబిలం బయటికి వచ్చి ఉంటుందని అంచనా వేశారు. దాని పరిమాణం మన సూర్యుడి కంటే రెండు కోట్ల రెట్లు పెద్దగా ఉందని.. అది గంటకు సుమారు 58 లక్షల కిలోమీటర్ల అమిత వేగంతో ప్రయాణిస్తోందని గుర్తించారు.



నక్షత్రాలు ఎలా ఏర్పడుతున్నాయి?

విశ్వం ఏర్పడే క్రమంలో గెలాక్సీలతోపాటు వాటి మధ్యలో అక్కడక్కడా విడిగా వాయువులు, ఇతర ఖగోళ పదార్థాలు ఉండిపోయాయని శాస్త్రవేత్త పీటర్ వాన్ చెప్పారు. ఈ కృష్ణబిలం ప్రయాణిస్తున్న క్రమంలో దాని ఆకర్షణ శక్తి వల్ల వాయువులు, ఖగోళ పదార్థాలు ఒక్కచోటికి చేరుతున్నాయని తెలిపారు. ఇదే సమయంలో కృష్ణబిలం వెనుక ఏర్పడే అతిశీతల పరిస్థితితో.. అవి సంకోచించి నక్షత్రాలు జన్మిస్తున్నాయని వివరించారు. విశ్వంలో ఇలాంటి దానిని గుర్తించడం ఇదే మొదటి సారని తెలిపారు. దీని గుట్టు తేల్చేందుకు త్వరలో ప్రఖ్యాత జేమ్స్‌వెబ్ టెలిస్కోప్‌తో పరిశీలించనున్నామని వెల్లడించారు.

ఏమిటీ కృష్ణ బిలం?

అతిపెద్ద నక్షత్రాలు వేలకోట్ల ఏళ్లపాటు మండిపోయి, ఇంధనం ఖాళీ అయ్యాక.. వాటిలోని పదార్థమంతా కుచించుకుపోయి 'కృష్ణబిలం'గా మారుతాయి. వీటి గురుత్వాకర్షణ శక్తి చాలా తీవ్రంగా ఉండి.. సమీపంలోకి వచ్చే అన్నింటినీ తమలోకి లాగేసుకుంటాయి. కాంతి కూడా వాటి నుంచి తప్పించుకోలేకపోవడంతో.. నేరుగా కనబడవు. అందుకే కృష్ణబిలం (బ్లాక్‌హోల్స్) అని పిలుస్తారు.

మంగళగిరిలో 'ఐపీజీ' బాధితులు 700 మందికిపైనే!

రెట్టింపు ఆదాయం పేరుతో రూ.కోట్ల దోపిడీ

సైబర్ క్రైమ్ విభాగాన్ని, పోలీసుల్ని ఆశ్రయించిన బాధితులు

మంగళగిరి: సైబర్ మోసగాళ్ల ఐపీజీ రెంట్ యాప్ ఉచ్చులో మంగళగిరికి చెందిన 700 మందికిపైగా చిక్కి విలవిల్లాడుతున్నారు. పెట్టుబడికి వారం రోజుల్లో రెట్టింపు ఆదాయం వస్తుందని ఆశ చూపడంతో వీరు కోట్లాది రూపాయలు పెట్టుబడి పెట్టి మోసపోయారు. వీరు సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేయడంతోపాటు రెండురోజుల కిందట పట్టణ పోలీసులను ఆశ్రయించారు. ప్రారంభంలో ఒకరిద్దరుగా ఉన్నప్పుడు పెట్టిన పెట్టుబడికి రెట్టింపు డబ్బులు తిరిగి ఇచ్చిన యాప్ నిర్వాహకులు తరువాత క్రమంగా చెల్లింపులు నిలిపేశారు. నిదానంగా ముఖం చాటేసిన నిర్వాహకులు ఫోన్ లిఫ్ట్ చేయకపోగా యాప్‌లోను సమాధానం చెప్పకపోవడం, ఐపీజీ రెంట్ కామ్ యాప్‌ను సైతం మూసేయడంతో పెట్టుబడిదారులు మోసపోయామని గ్రహించారు. తొలుత కిషోర్‌కు అతడి స్నేహితుడు ఐపీజీ యాప్ లింక్ పంపారు. తన స్నేహితులు చాలామంది ఆ యాప్‌లో పెట్టుబడి పెట్టారని, మంచి ఆదాయం వస్తుందని అతడు చెప్పడంతో కిషోర్ ఆ యాప్‌లో నమోదు చేసుకున్నారు. మొదట రూ.800 పెట్టుబడి పెట్టగా వారానికి రూ.1,600 ఆదాయం వచ్చింది. రెండుమూడుసార్లు పెట్టుబడికి రెట్టింపు ఆదాయం రావడంతో కిషోర్ తన స్నేహితులకు యాప్ లింక్ పంపి రెట్టింపు ఆదాయం గురించి చెప్పారు. కిషోర్ స్నేహితులు, బంధువులతోపాటు చైన్‌లింక్‌గా మారి ఒక్క మంగళగిరిలోనే 700 మందికిపైగా ఈ యాప్‌లో నమోదు చేసుకున్నారు. రూ.800, రూ.1,200 నుంచి రూ.లక్ష, రూ.2 లక్షలు, రూ.5 లక్షలు.. ఇలా శక్తిమేర పెట్టుబడులు పెట్టారు. మార్చి నెలాఖరు కావడంతో యాప్ ఆఫర్ ప్రకటించిందని చెప్పి రూ.30 వేలు పెట్టుబడి పెట్టినవారికి అదనంగా ఆదాయంతోపాటు వారం రోజులకు వడ్డీ రూ.27 వేలు కలిపి రూ.80 వేలు వస్తాయని ఆశచూపారు. దీంతో పలువురు ఎక్కువ సొమ్ము యాప్‌లో పెట్టుబడి పెట్టారు. బాధితుల్లో అత్యధికంగా మహిళలున్నారు. వారం రోజుల తర్వాత మోసగాళ్లు యాప్‌ను మూసేయడంతో కిషోర్ ఆన్‌లైన్‌లో సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశారు. మరికొందరు బాధితులతో కలిసి ఈ నెల 7వ తేదీన పట్టణ పోలీసులను ఆశ్రయించారు. బాధితులు తమకు ఫిర్యాదు చేసినట్లు పట్టణ సీఐ బి.అంకమ్మరావు చెప్పారు. సైబర్ క్రైమ్ కావడంతో దర్యాప్తు చేయాల్సిందిగా సైబర్ క్రైమ్‌కు అప్పగించామని తెలిపారు.

ఉద్యోగాల పేరుతో యువతకు ఎర

- పోలీసులకు తెలుగు, సంస్కృత అకాడమీ ఫిర్యాదు
- విశ్వసించవద్దని అభ్యర్థులకు వినతి

సాక్షి, అమరావతి: రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ అకడమిక్ సర్వీసెస్‌లో 78 ఉద్యోగాలు.. అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్‌లో 156 ఉద్యోగాలు.. ఇదీ ఇటీవల వాట్సాప్‌లో వైరల్ అవుతున్న ప్రకటనలు. ఏకంగా ఓ వెబ్‌సైట్ రూపొందించి మరీ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. తెలుగు, సంస్కృత అకాడమీలో ఉద్యోగాల కల్పన పేరిట యువతను మోసగించేందుకు ఓ ముఠా వేసిన ఎత్తుగడ ఇది. సామాజిక మాధ్యమాల్లో ఓ నకిలీ వెబ్‌సైట్ (https://teluguacademy.org.recruitment), ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ వైరల్ అవుతున్న విషయాన్ని గుర్తించిన అకాడమీ వెంటనే అప్రమత్తమైంది. తాము ఉద్యోగాల భర్తీకి ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వలేదని అకాడమీ డైరెక్టర్ వి.రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సదరు నకిలీ నోటిఫికేషన్‌ను ఎవరూ విశ్వసించవద్దని కోరారు. ఆ వెబ్‌సైట్‌కు దరఖాస్తు చేయడంగానీ ఫీజుల రూపంలో నగదు చెల్లించడంగానీ చెయ్యొద్దని కూడా ఆయన తెలిపారు. తమ అకాడమీకి ఇప్పటివరకు ఎటువంటి వెబ్‌సైట్ లేదని స్పష్టంచేశారు. యువతకు ఏమైనా సందేహాలుంటే రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ ప్రాజెక్టు డైరెక్టర్ పి. ఆంజనేయులు (ఫోన్ నంబర్: 9849616999)ను సంప్రదించాలని సూచించారు. ఇక రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ పేరుతో ఉద్యోగాల భర్తీకి నకిలీ నోటిఫికేషన్ ఇవ్వడంపై రామకృష్ణ విజయవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఖర్చు తక్కువ.. దండిగా దిగుబడి

- కమ్యూనిటీ సహజ సేద్యంతో సత్ఫలితాలు
- ఎరువులు, పురుగు మందులకు బదులు ఘన, ద్రవ జీవామృతం వినియోగం
- తొమ్మిది పంటల సాగు వ్యయంపై 'ఐడీఎస్‌ఏపీ' నివేదిక

సాక్షి, అమరావతి: కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ విధానంలో బృందాలుగా ఏర్పడి సహజ సేద్యం అనుసరించడం వల్ల పంటల దిగుబడితో పాటు అధిక ఆదాయం లభిస్తోందని ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ ఆంధ్రప్రదేశ్ (ఐడీఎస్‌ఏపీ) నివేదిక వెల్లడించింది. 2021 – 22 ఖరీఫ్‌లో ఈ విధానంలో సాగు చేసిన తొమ్మిది పంటలను ఐడీఎస్‌ఏపీ పరిశీలించింది. సహజ సేద్యంలో ఎరువులు, పురుగు మందులకు బదులు ఘన, ద్రవ జీవామృతం వినియోగం వల్ల తక్కువ వ్యయం అవుతున్నట్లు తెలిపింది. నీటి వినియోగం, వ్యవసాయ రుణాల అవసరం కూడా తగ్గినట్లు గుర్తించింది. నివేదికలో ముఖ్యాంశాలు ఇవీ..

- వరి, వేరుశనగ, పత్తి, మినుము, మొక్కజొన్న, కందులు, మిర్చి, రాగి, టమాటా పంటలపై అధ్యయనం నిర్వహించారు.
- సహజ సేద్యం రైతులు సగటున రూ.71,964 చొప్పున పంట రుణాలు తీసుకోగా రసాయన ఆధారిత సేద్యం చేస్తున్నవారు రూ.1,03,136 మేర రుణాలు తీసుకుంటున్నారు.
- విత్తనాలు, ఎద్దులతో వ్యవసాయం, మానవ శ్రమ, యంత్ర శ్రమ, పనిముట్లు, నీటి పారుదల, సాగు ఉత్పాదకాలు లాంటి వాటిని పరిగణనలోకి తీసుకుంటే సహజ సేద్యం ఖర్చు తక్కువగా ఉంది.

ఏ విధానంలో మొత్తం ఎంత ఖర్చు? (హెక్టార్‌కు రూపాయల్లో)

పంట	సహజ సేద్యం	రసాయన సేద్యం
వరి	54,173	65,659
వేరుశనగ	50,933	55,113
పత్తి	53,957	73,770
మినుము	39,942	43,159
మొక్కజొన్న	63,451	72,191
కందులు	31,490	28,382
మిర్చి	99,240	1,23,301
రాగులు	43,746	44,341
టమాటా	71,805	1,00,892

పొదుపు మహిళల 'అర్బన్ మార్కెట్లు'

▶ మొదటి పేజీ తరువాయి

'జగనన్న మహిళా మార్టులు' విజయవంతం కావడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్తగా అర్బన్ మార్కెట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సిటీ మిషన్ మేనేజర్లకు(సీఎంఎం) మెప్మా ఎండీ ఆదేశాలు జారీ చేశారు. దుకాణాల ఏర్పాటుకయ్యే ఖర్చును మెప్మా చెల్లించనుంది. వీటిల్లో పొదుపు మహిళలు తయారు చేసిన వివిధ ఉత్పత్తులను విక్రయించుకునేలా ఏర్పాట్లు చేస్తారు. వైఎస్సార్ చేయూత, ఆసరాతోపాటు సున్నావడ్డీ రుణాలు తీసుకున్న పొదుపు సంఘాల మహిళలకు స్వయం ఉపాధి కల్పించేలా అర్బన్ మార్కెట్లను అందుబాటులోకి తెస్తున్నారు.



గతనెలలో విశాఖపట్నంలో నిర్వహించిన అర్బన్ మార్కెట్‌లోని స్టాల్

విశాఖ, విజయవాడలో స్థలాల ఎంపిక

పట్టణ స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు వివిధ రకాల ఉత్పత్తులను స్వయంగా తయారు చేస్తున్నారు. వీటి మార్కెటింగ్ కోసం రిసోర్స్ పర్సన్స్ వద్ద వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయా పట్టణాలు, నగరాల్లో అనువైన ప్రదేశాలు, మున్సిపల్ భవనాలు, ఖాళీ స్థలాల్లో అర్బన్ మార్కెట్లను ఏర్పాటు చేయనున్నారు. మహిళలు తమ ఇళ్లల్లో తయారు చేసిన పచ్చళ్లు, ఆహారోత్పత్తులు, వస్త్రాలు, ఎంబ్రాయిడరీ వర్క్, హ్యాండీ క్రాఫ్ట్స్, బుట్టలు, జ్యూట్ బ్యాగులు, గృహాలంకరణ వస్తువులు, ఫ్యాన్సీ, వన్‌గ్రామ్ గోల్డ్ లాంటివి వీటిల్లో విక్రయించనున్నారు. ఇప్పటికే విశాఖలో 4 ప్రదేశాలను, విజయవాడలో రెండు ప్రాంతాలను ఇందుకు ఎంపిక చేశారు. మిగిలిన మున్సిపాలిటీల్లో ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. ఒక్కో పట్టణంలో 200 నుంచి 1,000 మంది వరకు దుకాణాల ఏర్పాటుకు ఆసక్తి చూపినట్టు మెప్మా ఎండీ విజయలక్ష్మి 'సాక్షి'కి తెలిపారు. ఇది మరింత పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. వీరందరికీ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ద్వారా వ్యాపార నిర్వహణ, నాణ్యత ప్రమాణాలపై శిక్షణ ఇస్తారు. పట్టణం స్థాయి, సభ్యుల సంఖ్యను బట్టి 20 – 40 స్టాళ్లను ఏర్పాటు చేస్తారు. ప్రతినెలా రెండు రోజులు తప్పనిసరిగా ఉండేలా పండగలు, ఎగ్జిబిషన్లు వంటి ప్రత్యేక దినాల్లో అదనపు రోజులు కొనసాగించనున్నారు. సభ్యులు అధికంగా ఉంటే రొటేషన్ పద్ధతిలో స్టాళ్లలో అవకాశం కల్పించనున్నారు.

అద్భుతమైన అవకాశం



ఇంట్లో మసాలాలు, కారప్పొడులు లాంటి 26 రకాల పొడులు తయారు చేస్తుంటా. గతంలో తెలిసినవారికి, బంధువులకు మాత్రమే విక్రయించగా రూ.2 వేలు కూడా వచ్చేవి కాదు. ఇటీవల విశాఖలో అర్బన్ మార్కెట్‌లో రెండు రోజులు స్టాల్ నిర్వహించగా రూ.17 వేల మేర వ్యాపారం జరిగింది. కొత్త వినియోగదారులు పరిచయం కావడంతో ఆన్‌లైన్‌లో కూడా ఆర్డర్లు వస్తున్నాయి. అర్బన్ మార్కెట్ ద్వారా అనూహ్యంగా వ్యాపారం పుంజుకోవడం చాలా ఆనందంగా ఉంది.

\- జె.సత్యరాజ్యలక్ష్మి, విశాఖపట్నం ఎంటర్‌ప్రెన్యూర్

చర్చకు కాదు.. రచ్చకు

▶ మొదటి పేజీ తరువాయి

పరిస్థితి సద్దుమణిగింది. ఘటన పూర్వాపరాలు..

తనపై టీడీపీ నేతలు ఇటీవల కొన్నిరోజులుగా చేస్తున్న ఆరోపణలు, అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధమని, ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలని ఆదివారం అమరావతి అమరేశ్వరస్వామి సన్నిధిలో ప్రమాణానికి సిద్ధమని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సవాల్ విసిరారు. ఇందుకు టీడీపీ నేతలు, కొమ్మాలపాటి శ్రీధర్ స్పందించి తాము కూడా సిద్ధమని ప్రకటించారు. దీంతో వారం రోజులుగా పెదకూరపాడు నియోజకవర్గంలో ఈ విషయం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో.. సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో ఇరుపార్టీల నాయకులకు నోటీసులు జారీచేసి ముఖ్య నేతలపై నిఘా పెట్టారు. అయితే, శనివారం అర్ధరాత్రి వరకు వారంతా ఎక్కడ ఉన్నారో తెలీక పోలీసులు విస్తృతంగా సోదాలు చేశారు. అమరావతితోపాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో 144 సెక్షన్ విధించి అమరావతికి నాలుగు వైపులా చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. అలాగే, ఆదివారం ఉదయం చుట్టుపక్కల గ్రామాల నుంచి అమరావతికి వచ్చే ఇరుపార్టీల నేతలను, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఉ.9.35కు ఎమ్మెల్యే శంకరరావు అమరేశ్వరస్వామి దేవస్థానం గాలిగోపురం వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో స్థానిక ముస్లిం కాలనీ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వైపు దాడులకు తెగబడేందుకు అన్నట్లుగా పెద్దఎత్తున తన మందీమార్బలంతో కొమ్మాలపాటి శ్రీధర్ బయల్దేరారు. దీనిని పోలీసులు పసిగట్టి వారిని అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య తోపులాట జరిగింది. అనంతరం.. కొమ్మాలపాటిని పోలీసులు అదుపులోకి తీసుకుని



ఆలయం వద్దకు వస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

అమరావతి పోలీస్‌స్టేషన్ వైపు తరలిస్తుండగా టీడీపీ మూకలు రెచ్చిపోయాయి. ఒక్కసారిగా అక్కడున్న బస్సుపై వారు దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో బస్సు అద్దం ధ్వంసమైంది. దీంతో కొమ్మాలపాటిని క్రోసూరు వైపునకు మళ్లించారు. ఇదే సమయంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అమరేశ్వరస్వామి దేవస్థానం వద్ద నుంచి గాంధీబొమ్మ వైపు వస్తుండగా పోలీసులు వారినీ అడ్డుకున్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు మద్దతుగా నినాదాలు చేస్తూ కొమ్మాలపాటి శ్రీధర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. డీఎస్పీ ఆదినారాయణ సంయమనంతో వారిని నిలువరించడంతో పరిస్థితులు అదుపులోకి వచ్చాయి.




కొమ్మాలపాటి శ్రీధర్‌ను అరెస్టుచేస్తున్న పోలీసులు

పెరగనున్న ఉష్ణోగ్రతలు

- రెండు నుంచి నాలుగు డిగ్రీల మేర పెరిగే అవకాశం
- ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల 40 డిగ్రీలకు పైగా నమోదు

సాక్షి, అమరావతి/గోనెగండ్ల: రాష్ట్రంలో సోమవారం నుంచి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. వచ్చే ఐదు రోజులు రెండు నుంచి నాలుగు డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరుగుతాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో.. ఆదివారమే అనేక ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నంలో 41.9 డిగ్రీలు, చింతూరులో 41.5, కూనవరంలో 40.1, తూర్పుగోదావరి జిల్లా గోకవరంలో 41.9, కోరుకొండలో 40.3, రాజమండ్రిలో 40.6, రాజానగరంలో 40.7, ఏలూరు జిల్లా భీమడోలులో 41.6, ద్వారకా తిరుమలలో 41.2, కాకినాడ జిల్లా శంఖవరంలో 40.3, అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి, ముమ్మిడివరంలో 41.8, నంద్యాల జిల్లా కొత్తపల్లెలో 40, పగిడ్యాలలో 40.5, పల్నాడు జిల్లా నకరికల్లులో 40, పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంలో 41.2, ప్రకాశం జిల్లా కొనకనమిట్లలో 41.2, జరుగుమిల్లిలో 40.6, శ్రీకాకుళం జిల్లా బూర్జలో 40, కోటబొమ్మాళిలో 40.4, లక్ష్మీనరసుపేటలో 40.2, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కొండాపురంలో 41.3, వరికుంటపాడులో 41, విజయనగరం జిల్లా కొత్తవలసలో 40.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. చాలాచోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదవడంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు.



ఎండ వేడిమికి పగిలిన కొండరాయి

ఎండవేడికి పగిలిన కొండరాయి

మరోవైపు.. అధిక ఉష్ణోగ్రతతో కర్నూలు జిల్లా గోనెగండ్లలోని నరసప్ప దేవాలయం దగ్గర ఉన్న పెద్ద కొండరాయి రెండుగా చీలిపోయింది. ఆదివారం మధ్యాహ్నం రెండుగంటల సమయంలో పెద్ద శబ్దం రావడంతో గ్రామస్తులు ఒక్కసారిగా వచ్చి పరిశీలించారు. కొండరాయి పగిలిన దగ్గర నుంచి పొగలు రావడం, రాయి చిన్నచిన్న ముక్కలుగా పడిపోతుండటాన్ని గమనించారు. ఎండ ఎక్కువగా ఉండటంతో కొండరాయి పగిలిందని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది చెప్పారు.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో ఆదివారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు(డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	42.2	25.8
రాజమహేంద్రవరం	41.0	26.5
కర్నూలు	39.0	25.1
నంద్యాల	38.2	21.6
ఏలూరు	38.0	27.0
విజయవాడ	38.0	24.0
తిరుపతి	38.0	22.0
మార్కాపురం	38.0	22.0
విశాఖపట్నం	37.2	24.2
కడప	36.6	23.0
కాకినాడ	36.3	24.6
విజయనగరం	35.0	26.0
శ్రీకాకుళం	35.0	25.0
నెల్లూరు	34.9	26.5
మచిలీపట్నం	34.0	25.0
తెలంగాణలో..		
ఆదిలాబాద్	37.8	21.2
హైదరాబాద్	35.7	22.9
రామగుండం	34.0	22.0



స్నేహితులు కావాలని కోరుకోవడం వేగంగానే జరుగుతుంది,
కానీ స్నేహం అనేది నెమ్మదిగా పక్వానికొచ్చే ఫలం లాంటిది.
– అరిస్టాటిల్

సాక్షి

సోమవారం, ఏప్రిల్, 10

ఒకనాటి వేసవి

రాత్రి మిగిలిన అన్నంలో నీళ్లు పోసి ఉంచేవారు. తెల్లారి పచ్చిమిర్చి అందుకునేవారు. దాన్ని మధ్యకు చీల్చి, ఉప్పుగల్లు దూర్చి, నాష్టాలో ఒక ముద్ద అది... పంటి కింద ఇది. బాగుండేది. నీటిసొద జాస్తి. దూరం దూరం పోయి, చాలని తాడుకు కొత్తది ముడివేసి, అడుగు నుంచి లాగి, బిందె భుజాన మోసి... అయితేనేం? నేస్తులతో కలసి కబుర్లాడుకుంటూ నడుస్తుంటే బాగుండేది. తొణికే నీళ్లు వీపున చరుస్తూ ఉన్నా బాగుండేది.

కలిగిన వాళ్లు కొత్త తాటాకుల పందిరి వేసేవారు. కుదిరినవారు కొబ్బరాకులతో నీడ పరిచేవారు. కింద నిలబడితే ఆ చలువదనం బాగుండేది. ఐసుబండి ఆపితే ఆ జిల్లుదనమూ బాగుండేది. కోసి చూపించమని అడక్కుండా పుచ్చకాయ కొనేదే లేదు. త్రికోణాకార ముక్కను అప్పటికప్పుడు తినకుండా వదిలిందీ లేదు. ముంతమామిళ్లవి పలు రంగులు. వాటి మరకలు బట్టలు మీద పడితే వీపు మీద అమ్మ జాజ్ డ్రమ్ కొట్టేది. పచ్చి తాటాకుల పొట్లాల్లో ముంజలు తెచ్చేవారు. ఆపి బేరం చేస్తే ఒకో పొట్లాన్ని కొడవలితో కోసి విడిపించేవారు. ముదురు ముంజకాయ కొబ్బరికి అటుఇటుగా ఉండేది. లేతది నోట అమృతం చిమ్మేది. తాటికాయలతో చేసిన బండికి టోల్‌గేట్ అడిగే దమ్ము ఎవరికీ లేదు. తెల్లరంగు స్ట్రాంగ్ పిప్పరమెంట్ దవడన పెట్టుకుంటే అదే పెట్రోలుగా పరుగు తీసేది.

చింత చిగురొచ్చేది. బంగారం రేటుతో తూగేది. మునగచెట్లు విరగ గాసేవి. వేపచెట్టు బ్రాండు ఏ.సి ప్రతి రచ్చబండ దగ్గర కూల్ టెంపరేచర్ మెయిన్‌టెయిన్ చేసేది. వీధిన తిరగలేని అవ్వ వేరుశనక్కాయలను అక్కడే అమ్మేది. రూపాయి చేజిక్కించుకుని మ్యాట్నీకి దౌడు తీస్తే ఉబ్బరింత. బాగుండేది. కరెంటు పోయి తలుపులు తీస్తే జొరబడే చల్లగాలి. బాగుండేది.

కడప నుంచి కర్బూజ పండ్లు వస్తాయి. చక్కెర జల్లి కాసేపు వదిలి తింటే జీరాను తలపిస్తాయి. నిమ్మకాయల రేటు గజనిమ్మకాయల సైజుకు వెళుతుంది. సుగంధ వేర్లు... హలో మేమున్నాం అంటాయి. ఆరెంజి సోడా ఆగిఆగి తాగమని షోకులు పోతుంది. చలివేంద్రాల దగ్గరుండే పొడవు కాడల గరిటెలు ఆ తర్వాత ఏమవుతాయో ఏమో! పాత గొడుగులకు మర్యాద దక్కి డ్యూటీ ఎక్కుతాయి. వాసానికి దూర్చిన విసనకర్ర దగ్గరి స్నేహితుడిలా పలకరిస్తుంది. పిచ్చుకల హడావిడి మీటింగుల మధ్య మధ్యాహ్నపు కునుకు అమోఘంగా ఉంటుంది. సాయంత్రం నాలుగు లోటాలు కుమ్మరించుకుంటే అదే స్వర్గం. డాబా మీద నీళ్లు జల్లితే రాత్రికి చుక్కలు చల్లగా పలకరిస్తాయి. నిద్రకు ఇంటిల్లిపాది మేడెక్కితే పరుపులున్నవారు శ్రీమంతులు. టేబుల్ ఫ్యాను తిప్పగలిగేవారు కుబేరులు. తల దగ్గర నీళ్ల చెంబుకు బోర్లించిన గ్లాసే మూతవుతుంది. మేను వాల్చాక స్తంభించకుండా గాలి వీస్తే పరమ పరవశం.

ఆవకాయ సెంటిమెంట్. అర ఎకరం అమ్మైనా లంక మిరపకాయలు, గానుగ నూనె, ఆవాలు, మెంతులు, పచ్చడి మామిడి కాయలు వెల జరిగేవి. ముహూర్తం చూసి మరీ అమ్మమ్మ పని మొదలెట్టేది. కొడుకు నడుం మీద చేతులతో సాయానికి సిద్ధమయ్యేవాడు. కోడలు చూపుతో చెప్తే చేత్తో అందుకునేది. పిల్లలు కిలకిలారావాలు చేసేవారు. ఎర్రగా కలిపిన తొలిముద్ద పెట్టడానికి ప్రతి చిన్నారికి ఇంట పెద్ద తలకాయ ఉండేది.

చుట్టాలొచ్చేవారు. పిల్లల్ని తెచ్చేవారు. ఆటల్లో ఉత్తుత్తి విందు ఒండి బాదం ఆకుల్లో బలవంతాన తినిపించేవారు. ఏటికి చాటుగా వెళ్లినవారు జేబుల్లో ఇసుకతో దొరికిపోయేవారు. ఆడపిల్లలు తీరిగ్గా గోరింటాకు పెట్టుకుని పడుకుంటే తెల్లారేసరికి అరచేతుల్లో చంద్రుళ్లు ఉదయించేవారు. పైతరగతికి వెళ్లే ముందొచ్చే వేసవికై పిల్లలు ఎదురు చూసేవారు. తీక్షణ ఆనందాల ఎండలకై ఆరాటపడేవారు.

ఇప్పటిలా కాక రోషమున్న మల్లెలు వేసవిలోనే గుబాళించేవి. సీజను ముగియక ముందే స్త్రీలను జడల్లో వీలైనన్ని తురుముకోమనేవి. కనకాంబరాలతో కలిపి అల్లితే వాటిదొక అందం. మరువంతో, దవనంతో జత చేస్తే మరో చందం. మాలలు కట్టడానికి అమ్మలక్కలంతా కూడి ఇకఇకలు పకపకలు పోతుంటే చూడటం బాగుండేది. ప్రతి ఇంటి గోడ మీద అమ్మాయి పూలజడ ఫోటో కళకళలాడేది.

తీపి మామిడిపండ్లు ఈ దేశవాసుల కోసమే కాసేవి. దిల్ పసంద్ ఎంతో పసందుగా ఉండేది. బంగినపల్లి ప్రతి ఇంటా కనీసం చేరేది. రసాలు మాత్రమే పిండుకు తాగేవారు కొందరు. ఇమాం పసంద్‌కై పట్టుబట్టే వారు ఇంకొందరు. నీలాలు ఆఖరున వచ్చేవి. తోతాపురికి ఉప్పూకారాలే గతి. బిగ్ బాస్కెట్ లేని కాలంలో కారు మాట్లాడుకుని చలో చిత్తూరనేవారు. నూజివీడుకు పదమనేవారు. మధుర ఫలాల బుట్టలు ప్రాప్తమున్నవారికి దక్కేవి.

యుగాలుగా వేసవి ఇలాగే ఉంది. ప్రియజనుల కోసం ఇలా పునరావృతం అవుతూనే ఉంది. మనిషే ఈ రుతువుల సౌందర్యానికి ఎడంగా జరుగుతున్నాడు. వేసవి చెప్పే తీర్పు– విరామం ప్రకటించుకోమని, ఆటవిడుపుపై దృష్టి పెట్టమని, అయినవారి సాంగత్యాన్ని ఆస్వాదించమని! ఇవాళ మనిషి వెళ్లడానికి ఊరు లేనివాడు. పిల్లలతో వెళ్లడానికి బంధువులు, బంధాలు నిలబెట్టుకోని వాడు. అన్నీ ఉన్నా ఎందుచేతనో మనసు ఇరుకు చేసుకుంటున్నాడు. ఇంటి సభ్యులు తప్ప బయటి మనిషి వచ్చి ఒకపూట చేయి కడగని నిరుపేదవుతున్నాడు.

సూర్యనారాయణమూర్తి వేసవిలో తన దగ్గర ఉన్నది ఏదీ దాచుకోకుండా ధారాళంగా భూమి మీద ప్రసరింపజేసి ఆ వెంటనే మొలకలెత్తే వర్షానికి కారకుడవుతాడు. ఈ వేసవిలో మనం కూడా మనలో దాగి ఉన్న, ఎక్కడో అణిచివేయబడి ఉన్న, మరుపున పడి ఉన్న అనుబంధాల్ని ఏదో మేరకు వెలికి తీసి, ఒకనాటి వేసవిని, ఒకనాటి ఆనందాల్ని పొందలేమా?

ప్రయత్నిద్దామా? బాగుంటుంది.

గ్రహం అనుగ్రహం
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.చవితి ఉ.8.14 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** అనూరాధ ప.1.20 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** సా.6.44 నుండి 8.17 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.24 నుండి 1.15 వరకు తదుపరి ప.2.53 నుండి 3.43 వరకు, **అమృతఘడియలు:** రా.3.56 నుండి 5.27 వరకు; **సూర్యోదయం:** 5.51; **సూర్యాస్తమయం:** 6.10; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు; **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు

మనమెందుకు ఇలా ఉన్నాం!

కామెంట్



కరణ్ థాపర్

బ్రిటన్ మారిపోయింది! నిగ్గర్స్, బ్లాక్స్, బ్రౌన్ స్కిన్డ్ పీపుల్... ఇలాంటి జాత్యహంకార దూషణలేవీ పనిగట్టుకుని ఇప్పుడు అక్కడ లేవు. అక్కడి తెల్లవాళ్లు... తమలా 'తెల్లగా' లేని వాళ్లను సైతం తమ తలపై ఇష్టంగా మోస్తున్నారు. ఓట్లేసి మరీ కిరీటధారులను చేస్తున్నారు. దేశ నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తున్నారు. అక్కడి నాన్– వైట్స్‌లో ఒకరు ఇప్పుడు 'ప్రధాని'! మరొకరు 'ఫస్ట్ మినిస్టర్'! ఇంకొకరు మేయర్! సామ్రాజ్య విస్తరణ కాంక్షతో ఒకప్పుడు లోకాన్ని ఏలిన ఈ అగ్రరాజ్యం... ''మమ్మేలు గణనాథా... మాలోని చెడులను మాయింపగా...'' అన్నట్లుగా శ్వేత జాతేతరుల పాలనకు మొగ్గు చూపుతోంది. వలసలన్న వివక్ష చూపక విశ్వమానవ భావనకు తలవొగ్గుతోంది. మరి మనం ఎందుకు భిన్నంగా ఉంటున్నాం? తోటి పౌరులను – వారి పూర్వీకులు శతాబ్దాల క్రితమే ఇక్కడ జన్మించి ఉన్నవారైనప్పటికీ, సాటి భారతీయుల్లా హిందువులలో కలిసిపోయి జీవిస్తూ ఉన్నప్పటికీ – వారిని ఎందుకు వేరుగా చూస్తున్నాం? బ్రిటిషర్‌లను జాత్యంహంకారులు అని కదా మనం తరచూ అంటుంటాం. ఇప్పుడు చెప్పండి, మనకు ఏ విశేషణం సరైనది? మనల్ని మనం ఏమని పిలుచుకోవాలి?

ఒకవేళ అది గానీ నిజంగా జరిగి ఉండకపోతే, అది జరుగుతుందని నమ్మడానికే కష్టంగా ఉండేది. అదొకవేళ కల్పితం అయివున్నా ఆ కల్పన కూడా అతీంద్రియ భావనలా అనిపించేది. అయినప్పటికీ అది జరిగింది! నన్ను నిరుత్తరుడిగా మిగిల్చింది. నేడు బ్రిటన్‌లో అత్యంత ప్రాముఖ్యం కలిగి ఉండే మూడు అత్యున్నత స్థానాలలో భారత్ లేదా పాకిస్తాన్ సంతతి వారు ఉన్నారు మరి! ఐదేళ్ల క్రితమైతే ఇలా జరగడం అన్నది ఊహకు సైతం అసాధ్యమైన సంగతే. గత వేసవిలో రిషీ సునాక్ కన్జర్వేటివ్ పార్టీ నాయకత్వం కోసం పోటీ పడి లిజ్ ట్రస్ చేతిలో ఓడిపోయినప్పుడైతే... ఇక తమ జీవితకాలంలో ఎప్పటికైనా గోధుమ రంగు చర్మం కలిగివున్న ఒక వ్యక్తిని బ్రిటన్‌కు ప్రధాన మంత్రిగా చూస్తామని ఎవరూ అనుకుని ఉండరు.

అందరూ ఎన్నికైనవాళ్లే!

కానీ అక్టోబర్‌లో భారతీయ సంతతికి చెందిన హిందూ మతస్థుడు రిషీ సునాక్ బ్రిటన్ ప్రధాని అయ్యారు. గతవారం స్కాట్లాండ్ ఫస్ట్ మినిస్టర్ (ప్రధాని)గా పాకిస్తానీ ముస్లిం హమ్జా యూసఫ్ బాధ్యతలు చేపట్టారు. పాకిస్తానీ మూలాలున్న మరొక ముస్లిం సాదిఖ్ ఖాన్ 2016 నుంచీ లండన్ మేయరుగా కొనసాగుతున్నారు. ఆయన ఇప్పుడు తన రెండవ టర్మ్‌లో కొనసాగుతున్నారు. ఈ ముగ్గురూ ఎన్నికైన వారే తప్ప నియామకంతో వచ్చి దర్జాగా పీఠంపై కూర్చున్నవారు కాదు. వీళ్లను ఎన్నుకున్న ఓటర్లలో అత్యధికులు శ్వేత జాతీయులే. 2021 జనాభా లెక్కల ప్రకారం బ్రిటన్ జనాభాలో భారతీయ సంతతికి చెందిన వారు కేవలం 2.86 శాతం. పాకిస్తానీ మూలాలు ఉన్న ప్రజలైతే ఇంకా తక్కువగా 1.8 శాతం మాత్రమే.

ఇది నాకు 1976 డిసెంబరు నాటి కేంబ్రిడ్జి యూనియన్ చర్చను గుర్తుకు తెస్తోంది. పదవి నుంచి నిష్క్రమిస్తున్న ఆంగ్లో–పోలిష్ సంతతి యూనియన్ ప్రెసిడెంటు పీటర్ ఫుడకోవ్‌స్కీ నుంచి కొత్త అధ్యక్షుడిగా నేను బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భం అది. అధ్యక్ష పదవి చర్చకు సంబంధించిన తీర్మానంలో ఆ వెళ్లిపోతున్న పీటర్ మాట్లాడుతూ... ''ఈ యూనియన్ శ్వేత జాతీయులు కాని వారి చేతుల్లోకి వెళుతోంది'' అని తమాషాకు అన్నారు. ఆయన తమాషా యాభై ఏళ్ల తర్వాత నిజమైంది.

మన ప్రవర్తన విరుద్ధం

బ్రిటన్ చిరకాలం వర్ధిల్లాలి. ఎంత అద్భుత మైన దేశం! మరొకటి కూడా జోడించి చెబుతాను. మిగతా ప్రపంచ దేశాలకు బ్రిటన్ ఒక దీపస్తంభం. ముఖ్యంగా మనకు! వలస వచ్చిన హిందువులు, ముస్లింలలో రెండవ తరం, మూడవ తరం వారిని కూడా బ్రిటన్ తన ప్రభుత్వంలో కీలక స్థానాలకు చేర్చి కూర్చోబెట్టింది. గొప్ప సంగతేమంటే దీనికి స్థానికులెవరూ అభ్యంతరం చెప్పడం లేదు. అరచి గీపెట్టడం లేదు. ప్రజా నిరసనలు లేవు.



లండన్ మేయర్ సాదిక్ ఖాన్, యూకే ప్రధాని రిషీ సునాక్, స్కాట్లాండ్ ఫస్ట్ మినిస్టర్ హమ్జా యూసఫ్

మన దగ్గర చూడండి. అందుకు పూర్తిగా విరుద్ధం. మనం మన తోటి ముస్లిం పౌరులను – వారి పూర్వీకులు శతాబ్దాల క్రితమే ఇక్కడ జన్మించి ఉన్నవారైనప్పటికీ, సాటి భారతీయుల్లా హిందువులలో కలిసిపోయి జీవిస్తూ ఉన్నప్పటికీ – 'పాకిస్తాన్ వెళ్లిపోండి...' అని వారికి ఎప్పుడూ చెబుతూ ఉంటాం. మన రాజకీయ నాయకులు వారిని బహిరంగంగా దూషిస్తుంటారు. వారి ఇళ్లను పోలీసులు చట్టబద్ధం కాని పద్ధతుల్లో కూలగొడుతుంటారు. శ్రీరామనవమి సందర్భంగా మనం వారి దుకాణాలను బలవంతంగా మూత వేయిస్తాం. వారిపై 'లవ్ జిహాద్' నిందను వేస్తాం. కొన్నిసార్లు వారి గుర్తింపును కూడా తిరస్కరిస్తాం. వారిని హైందవ ముస్లింలుగా వ్యవహరిస్తాం. చెదపురుగులు అని కూడా అంటాం.

బ్రిటిషర్‌లను జాత్యహంకారులు అని కదా మనం తరచూ అంటుంటాం... ఇప్పుడు చెప్పండి, మనకు ఏ విశేషణం సరైనది? మనల్ని మనం ఏమని పిలుచుకోవాలి? సమాధానం చెప్పండి అని నేను మిమ్మల్ని బలవంతం చేయడం లేదు. అలా అడిగితే అది మిమ్మల్ని రెచ్చగొట్టినట్లు అవుతుంది, లేదంటే జవాబు కోసం మొండిపట్టు పట్టినట్లుగా ఉంటుంది. కానీ ఈ ప్రశ్నను నేను కచ్చితంగా లేవ నెత్తుతాను. ఎందుకంటే, మనం మన తోటి పౌరులతో ఎలా ప్రవర్తిస్తున్నాం అనే దాని గురించి ఈ ప్రశ్న మిమ్మల్ని ఆలోచింపజేస్తుంది అని నా ఆశ. అంతేకాదు, వారిపై మన ప్రవర్తన ఎలాంటి ప్రభావం చూపుతుంది అనే ఆలోచన కూడా రావాలి. కానీ మనలో చాలా మందికి ఈ ప్రభావం అన్నది అసలు ఆలోచించే విషయమే కాదు. కించపరచడం చాలా తేలిక. ఆ పనిని మనం అనాలోచితంగా చేసేస్తుంటాం. అది మనకు ఏ విధంగానూ అసౌకర్యాన్ని కలిగించదు. కానీ ఆ గాయాన్ని భరించడం, గాయంతో జీవించడం అవతలి వాళ్లకు దుర్భరం అవుతుంది. ఇంకా దారుణం ఏమిటంటే... ఇది తప్ప వేరే ఇల్లు లేదని, ఈ ఇంటి నుంచి తప్పించుకునే వీలు కూడా లేదని నీకు తెలుస్తూ ఉండటం!

బ్రిటన్ మారిపోయింది

నేను చదువుకున్న బ్రిటన్ కూడా నిస్సందేహంగా ఇందుకు భిన్నమైనదేం కాదు. గోధుమ రంగు చర్మం ఉన్న వారికి అక్కడ నాన్–వైట్స్ అని, నల్ల జాతీయులు అని, నిగ్గర్స్ అని పిలిచేవారు. తెల్లవాళ్లలో కూడా స్థాయిని బట్టి, యాసను బట్టి హెచ్చుతగ్గుల విభజనకు గురయినవాళ్లు ఉన్నారు. నిన్నెలా చూస్తారన్నది నువ్వెలా మాట్లాడుతున్నావన్న దాన్ని బట్టే అక్కడ ఉంటుంది. కానీ ఈ యాభై ఏళ్లలో బ్రిటన్ మారిపోయింది. పాత దేశం కను మరుగైపోయింది. బాహ్యంగా పూర్వపు అవశేషాలు ఉంటే ఉండొచ్చు. కానీ గుండె లోతుల్లో అయితే బ్రిటన్ పునర్నిర్మాణం జరిగిపోయింది.

ఇదే సవాలును మనం ఇప్పుడు భారత్‌లో ఎదుర్కొంటున్నాం. మన లోపలి అసురులను దాటుకుని మనం పైకి రాగలమా? ఆ అసురులను మనం జయించగలమా? చాలా గణనీయమైన విస్తృతిలో బ్రిటన్ దీనిని సాధించింది. మరి మనం సాధించగలమా? ఈ ప్రశ్నకు సమాధానం తెలిసే నాటికి నేను ఉండకపోవచ్చు. మార్పునకు ఒకటో, రెండో జీవితకాలాలు పట్టొచ్చు. ఇప్పటికైతే నేను మనుషుల మధ్య వినిపిస్తున్న ప్రేమరాహిత్య మౌన రాగాన్ని మాత్రమే వినగలుగుతున్నాను.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



మెప్పించడం వద్దు



ప్రామాణికత, సమగ్రత జీవితంలో నిలబెట్టుకోవాల్సిన విలువలు! మీ విశ్వాసాలు, లక్ష్యాలకు కట్టుబడి ఉండండి. ఇతరులను మెప్పించడానికి మీ విలక్షణత విషయంలో రాజీపడకండి.

– హరీశ్ మరీవాలా, ఆంత్రప్రెన్యూర్

మట్టితో, మూలాలతో...



మన గ్రామ చర్చిలో గుడ్ ఫ్రైడే భోజనం మట్టి పాత్రలో వడ్డించినప్పుడే, కేరళ ఎందుకు పర్యావరణ హిత రాష్ట్రం అయిందో అర్థమవుతుంది. ఇంకా అదనపు సంతోషం, నా పన్నెండో తరగతి క్లాస్‌మేట్ ఆ భోజనం వడ్డించాడు. అందుకే ఈస్టర్ వరకు ఉండిపోయాను.

– జేమ్స్ జోసెఫ్, రచయిత

ఏదో రకంగా...



పాకిస్తానీ పాలక ఉన్నత వర్గం 'ఐఎంఎఫ్' మీద ఆధారపడకుండా ఇప్పుడు చైనా, రష్యా నుంచి సొమ్ములు పొందడానికి ప్రయత్నిస్తోంది. ఈ వర్గం, ఆ వర్గంతో పనిలేదు: దేశ ప్రయోజనాలు, విదేశాంగ విధానంతో పనిలేదు. వాళ్లు పట్టించుకునేదల్లా కేవలం లండన్, దుబాయి ప్రాజెక్టుల కోసం కొన్ని డాలర్లు మాత్రమే!

– సాజిద్ ఎస్. తరార్, వ్యాపారవేత్త

సుఖాంతం కాదు



విముక్తి చెందినట్టుగా భావించేవారి కథ చారిత్రకంగా, భౌగోళికంగా ఎప్పుడూ సుఖాంతంగా ముగియలేదు. ఈ 'విముక్తి చెందిన' ప్రవర్తన చాలా ప్రాంతాల్లో, సంస్కృతుల్లో ఉండింది. ఆఖరికి ప్రాచీన, మధ్యయుగ భారత దేశంలో కూడా. కానీ తుది ఫలితం ఏమిటంటే, 'విముక్తి చెందని' సమూహాల దురాక్రమణకు గురికావడం!

– జోసెఫ్ టి. నూనీ, రచయిత

నవ్వే సంతోషం



నేను ఎక్కడికి వెళ్లినా, నేను కలిసే ఆ ఇంకో మనిషి నాలాంటివాడే కావాలనుకుంటాను. మన మందరం సంతోషంగా జీవించాలని కోరుకుంటాం. మనమందరం నవ్వులకు స్పందిస్తాం, కాబట్టి నేను ఎక్కడికి వెళ్లినా నవ్వు తాను. మనం ఒకే భాష మాట్లాడక పోయినా, మన స్నేహాన్ని నవ్వుద్వారా వ్యక్తపరుచు కోవచ్చు.

– దలై లామా, బౌద్ధ గురువు

చారిత్రక వాస్తవం



ఒకవేళ ఆఫ్రికాను చైనా తన వలసరాజ్యంగా మార్చుకుని వుంటే, ఈరోజు మనం చైనీస్ మాట్లాడేవాళ్లం, మన పిల్లలకు చైనీస్ పేర్లు పెట్టేవాళ్లం, చైనీస్ దేవతలను పూజించేవాళ్లం, చైనీస్ తరహా రాజకీయాలను ఆచరించే వాళ్లం. కాబట్టి, ఈరోజు నువ్వు ఇంగ్లిష్, ఫ్రెంచ్ మాట్లాడుతున్నావంటే అది నీ దోషం కాదు, అది చారిత్రక హింసకు సంబంధించిన విషయం.

– అడేమోలా, పాన్–ఆఫ్రికనిస్ట్

ఫలితం తక్కువ



చాలామంది మధ్యతరగతి జనం తాము ఎక్కువ పన్ను చెల్లిస్తామనీ, బదులుగా వచ్చేది పెద్దగా ఉండదనీ ఫిర్యాదు చేస్తుంటారు. అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా భారత మధ్యతరగతి జీవులు పన్నులు చెల్లిస్తారు. కానీ సామాజిక భద్రత, సౌకర్యాలు మాత్రం మూడో ప్రపంచ స్థాయిలో ఉంటాయి. కేవలం 3–4 శాతం మాత్రమే ప్రత్యక్ష పన్ను చెల్లిస్తారు. సహజంగానే వాళ్ల మీద అధిక బరువు ఉంటుంది.

– కిరణ్ కుమార్ ఎస్., విశ్లేషకుడు

ఇన్‌బాక్స్

జైహింద్ నినాద సృష్టికర్త

'జైహింద్' అనే పదం దేశభక్తిని చాటుకునే ఓ మహత్తర నినాదం. భారత దేశానికి జయం కలుగుగాక! అని దీనర్థం. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఈ పదాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చింది నేతాజీ సుభాష్ చంద్రబోస్ కాగా, దీని సృష్టికర్త మాత్రం ఆబిద్ హసన్ సఫ్రానీ. ఈయన 1911 ఏప్రిల్ 11న హైదరాబాద్‌లో జన్మించారు.

అసలు పేరు జైనుల్ ఆబిదీన్ హసన్. చిన్నతనంలోనే శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. చదువు ఆగిపోయింది. తరువాత ఇంజనీరింగ్ విద్య కోసం జర్మనీ వెళ్లారు. అక్కడే నేతాజీ బోస్‌ను కలుసుకున్నారు. ఇంజనీరింగ్ చదువును మధ్యలోనే విడిచిపెట్టి బోస్‌కి వ్యక్తిగత కార్యదర్శిగా, జర్మన్ భాష అనువాదకుడిగా చేరారు. బోస్ పునర్వ్యవస్థీకరించిన 'ఇండియన్ నేషనల్ ఆర్మీ'లో ఆబిద్ 'మేజర్'గా పని చేశారు.



ఆబిద్ హసన్ సఫ్రానీ

జర్మనీ బ్రిటన్‌తో యుద్ధం చేస్తున్న సమయంలో ఇండియన్ నేషనల్ ఆర్మీలో భిన్న వర్గాలకు చెందిన ప్రజలు ఉండేవారు. అందులో కొంత మంది 'నమస్కార్' అనీ, మరికొంతమంది 'రామ్ రామ్' అనీ, 'అస్సలాము అలైకుం' అంటూ రకరకాలుగా అభివాదం చేసుకునేవారు. సెక్యులర్ భావాలు కలిగిన బోస్‌కు ఇన్ని రకాల అభివాదాలు ఉండటం సబబుగా అనిపించలేదు. అందరికీ ఆమోదయోగ్యమైన ఓ అభివాద నినాదాన్ని రూపొందించాలని ఆయన తన సన్నిహితులకు చెప్పారు. ఆబిద్ హసన్ ముందుగా 'హలో' అని ప్రతిపాదించారు. కాని బోస్‌కు అది నచ్చలేదు. తరువాత 'జై హిందుస్తాన్', 'జై హింద్' అని ప్రతిపాదించారు ఆబిద్. 'జై హింద్'కే బోసు జై కొట్టారు. ఈ నినాదం బోస్‌కు ఎంతగానో నచ్చింది. వెంటనే ఆయన దాన్ని ఆమోదించి, ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. 1984 ఏప్రిల్ 5న ఆబిద్ హసన్ సఫ్రానీ హైదరాబాద్‌లో కన్ను మూశారు.

– యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్
(ఏప్రిల్ 11న ఆబిద్ హసన్ సఫ్రానీ జయంతి)

విమర్శ హుందాగా ఉండాలి!

అభిప్రాయం



ఉల్లి బాల రంగయ్య

సూరత్ కోర్టు తీర్పుతో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని కోల్పోయారు. ఆయన రాజకీయ భవిష్యత్తు గురించి కలలుగనే వారికీ, ఆయనను ముందు పెట్టి ప్రధాని నరేంద్ర మోదీని ఢీకొనాలని ముందుకు సాగే వాళ్లకూ, బీజేపీని అధికారం నుండి దించి అంతర్జాతీయ కుట్రలను ఈ దేశంలో అమలు చేయాలని తలపోసే విదేశీ శక్తులకూ ఈ పరిణామం ఇబ్బంది కలిగించేదే.

ఇక 'దొంగలందరికీ మోదీ ఇంటి పేరు ఎందుకు ఉంటుంది?' అంటూ రాహుల్ గాంధీ 2019 ఏప్రిల్ 13వ తేదీ కర్ణాటక ఎన్నికల సభలో మాట్లాడిన మాటలు రాజకీయపరమైనవే కానీ ఒక సామాజిక వర్గం వారిని అవమానించడానికి అన్నవి కాదనీ, ఇలాంటి చిన్న తప్పిదానికి ఆయనపై అనర్హత వేటు వేయడం నరేంద్ర మోదీ నిరంకుశత్వానికి, అహంకారానికి, కక్ష సాధింపు చర్యకు నిదర్శనమనీ మోదీ వ్యతిరేక మీడియా, ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని తెలుగు పత్రికలూ, చానళ్లూ మిక్కిలి వాపోవడం విచిత్రంగా ఉంది. ప్రధానిని దూషించడానికి ఆయన ఇంటి పేరుతో ఉండే మనుషులందరినీ దూషించడం, ఎద్దేవా చేయడం అహంకారానికి, క్రోధత్వానికి, సంస్కారహీనతకు పరాకాష్ఠ. తప్పు చేసింది, తప్పించుకు తిరుగుతున్నది నీరవ్ మోదీ, లలిత మోదీలు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోమని అడిగే హక్కు ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్‌కు ఉంది. ఈ విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం ఉంటే ప్రశ్నించే హక్కు కూడా ఉంది. పైగా ఈ ఇద్దరు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే ఆర్థిక నేరాలు చేశారనేది వాస్తవం కాదా? కానీ ఒక సామాజిక వర్గాన్ని పూర్తిగా అవమానించే విధంగా మాట్లాడడం శిక్షార్హమే.

ఏది ఏమైనప్పటికీ రాహుల్ గాంధీ హుందాగా తాను చేసిన పొరపాటును సరిదిద్దుకొని ఉంటే ఆయనకు ఈ దేశంలో పరపతి పెరిగేదని కాంగ్రెస్ పార్టీ హితైషులే తమ ఆంతరంగిక మిత్రులతో అంటున్నారు. రాహుల్ గాంధీ స్వాతంత్ర్య యోధుడు వీర



సావర్కర్ పై నోరు పారేసుకోవడం, దీనిపై మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, శివసేన నాయకుడు ఉద్ధవ్ థాకరే ఘాటుగా స్పందించడం, ఇక ఎప్పుడూ వీర సావర్కర్ పై నోరు జారనని రాహుల్ గాంధీ చెప్పడం వంటి విషయాలు ఆయనను భావి ప్రధానిగా ఊహించుకునే వారందరినీ నిరాశ, నిస్పృహలకు గురిచేశాయి.

ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 8 ప్రకారం రాహుల్ తన పార్లమెంట్ సభ్యత్వాన్ని కోల్పోయారు. నిజానికి ఇప్పటికే కొందరు ఈ సెక్షన్ వల్ల పదవులు కోల్పోయిన ఉదాహరణలున్నాయి. 9 సార్లు పార్లమెంట్‌కి ఎన్నికైన రషీద్ మహమ్మద్ 2013లో తన శాసన సభ్యత్వాన్ని కోల్పోయారు. బీజేపీ ఎమ్మెల్యేలు విక్రమ్ సింగ్ షైనీ, సురేష్ హల్వాంకర్, ఆశారాణీలు జైలు శిక్షలు పడి శాసనసభ్యత్వం కోల్పోయారు. ఇక లాలూప్రసాద్ యాదవ్ దాణా కుంభకోణంలో, జయలలిత అక్రమ ఆస్తుల కేసుల్లో శాసనసభ్యత్వం కోల్పోయారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వమూ ఇలాగే రద్దయింది. దీనిపై రాద్ధాంతం చేసే మోదీ వ్యతిరేకులకు భవిష్యత్తులో భంగపాటు తప్పదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.


ఇక సూరత్ కోర్టులో అప్పీలు చేసుకోవడానికి తన మందీ మార్బలంతో రాహుల్ గాంధీ వెళ్లడం వెనుక ఎలాంటి ప్రజాస్వామ్య స్ఫూర్తి ఉంది? న్యాయస్థానంపై తన ప్రభావాన్ని చూపడానికేనా? మన్మోహన్ సింగ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌నే విలేకరుల ముందు చించిపడేసిన కాంగ్రెస్ రాజకుమారుడి నుండి న్యాయస్థానంపై గౌరవాన్ని ఆశించడం అవివేకం అవుతుంది. ఒకవేళ ఈ కేసు నుండి రాహుల్ గాంధీ బయటపడినా... 'భారతదేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. ప్రపంచ దేశాలు ఈ విషయం గురించి ఆలోచన చేయాలి' అని కేంబ్రిడ్జిలో రాహుల్ మాట్లాడిన మాటలూ, దేశ భక్తుడైన వీర్ సావర్కర్‌పై చేసిన విమర్శలూ రాహుల్ రాజకీయ భవిష్యత్తుకు నష్టం కలిగించేవే. అనర్హత వేటును సాకుగా చూపి, ప్రజాదరణ పొందాలని ప్రయత్నించే రాహుల్ గాంధీకి ఈ దేశ ప్రజలు ఎలాంటి సహాయ సహకారాలు అందిస్తారో భవిష్యత్తు నిర్ణయిస్తుంది.

వ్యాసకర్త రాజకీయ, సామాజిక విశ్లేషకులు

మనసారా నమ్మాలి!

ఒకరోజు కైలాసంలో పార్వతీపరమేశ్వరులు మాట్లాడుకుంటున్నారు. మాటల మధ్యలో పార్వతి 'నాథా! గంగలో స్నానమాచరిస్తే మోక్షం లభిస్తుందని చెప్పారు కదా... మరి గంగలో స్నానం చేసిన ప్రతి ఒక్కరూ మోక్షం పొందితే మోక్షం భరించలేదుగా... ఎందుకో అందరూ మోక్షం పొందడం లేదనిపిస్తోంది' అంది. అప్పుడు శివుడు 'నీకొచ్చిన సందేహం సముచితమే. కారణాన్ని నువ్వే తెలుసుకోవచ్చు, నాతో రా' అన్నాడు.

ఇద్దరూ వృద్ధరూపాలను ధరించి గంగ ఒడ్డుకు చేరుకున్నారు. 'నేనిప్పుడు గంగలో పడిపోయినట్టు నటిస్తాను. నువ్వెవరినైనా నన్ను కాపాడమని పిలవాలి. కానీ ఇప్పటివరకూ ఒక్క పాపమూ చెయ్యని వారిని మాత్రమే వచ్చి కాపాడమని చెప్పాలి' అన్నాడు శివుడు. శివుడు గంగలో పడిపోయాడు. వెంటనే పార్వతీ దేవి అక్కడున్న వారిని సాయం కోసం పిలిచింది. ఆమె పిలుపుతో పలువురు పరుగుపరుగున వచ్చారు. అయితే ఏ పాపం చెయ్యనివారే తన భర్తను రక్షించాలని ఆమె అనడంతో వారందరూ వెనక్కు తగ్గారు. ఇంతలో ఎవరూ ఊహించని రీతిలో ఎక్కడి నుంచో ఒక యువకుడు పరుగున వచ్చి గంగలో దూకి శివుడిని కాపాడి ఒడ్డుకు చేర్చాడు. వృద్ధురాలి రూపంలో ఉన్న పార్వతి ఆ అబ్బాయిని చూసి... 'నువ్వే పాపమూ చెయ్యలేదా' అని ప్రశ్నించింది అమాయకంగా. అప్పుడతను 'నాకేదీ తెలీదమ్మా... గంగలో స్నానం చేస్తే పాపాలు తొలగిపోతాయని విన్నాను. అటువంటప్పుడు గంగలో దిగడంతోనే నా పాపాలన్నీ పటాపంచలవుతాయి కదా... ఆ నమ్మకంతోనే గంగలో దూకి మీ ఆయనను ఒడ్డుకు తీసుకురాగలిగా' నన్నాడు. అంతట వృద్ధరూపంలో ఉన్న శివుడు... 'గంగలో స్నానం చేసే వారందరూ నమ్మకంతో స్నానం చేయడంలేదు. అందువల్లే ఎవరికీ మోక్షం సిద్ధించడం లేదు. మనసారా నమ్మిన వారి ప్రార్థనలు మాత్రమే ఫలిస్తాయి. ఆ నమ్మకం విజయానికి చేరువగా తీసుకుపోతుంది' అని వివరించాడు పార్వతికి.



– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

తిరుమలలో కొనసాగుతున్న రద్దీ



ఆలయం వెలుపల భక్తుల రద్దీ

తిరుమల: తిరుమలలో వరుస సెలవుల నేపథ్యంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూలైన్ ఆళ్వార్ ట్యాంక్ వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 85,450 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 43,862 మంది తలనీలాలు ఇచ్చారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.21 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఏజెన్సీలో 600 ఆలయాల నిర్మాణం

- శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి



మోదకొండమ్మతల్లికి కుంకుమార్చన చేస్తున్న శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో విశాఖ శ్రీశారదా పీఠం ఆధ్వర్యంలో ఏజెన్సీలో 600 దేవాలయాల నిర్మాణం చేపట్టినట్లు ఆ పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి తెలిపారు. ఆదివారం ఆయన పాడేరులోని మోదకొండమ్మ తల్లి, హుకుంపేట మండలంలోని ఉక్కుర్స గ్రామంలోని స్వయంభూ భీమలింగేశ్వరస్వామి ఆలయాలను సందర్శించారు. మోదకొండమ్మ తల్లి ఆలయంలో ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యంతో పాటు రామకృష్ణ పరమహంస ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి కుంకుమార్చన చేశారు. భీమలింగేశ్వర స్వామి ఆలయ మొదటి వార్షికోత్సవానికి హాజరైన స్వామికి అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ ఆధ్వర్యంలో గిరిజన ఆచార, సంప్రదాయ ప్రకారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన పూజారులకు దేవాలయాల్లో నిత్య పూజలకు అవకాశం కల్పించామన్నారు. పవిత్రమైన మన్యంలో గిరిజనులే స్వచ్ఛమైన దైవభక్తులని, అయోధ్యలో ఉండే రామచంద్ర ప్రభువు వనవాసంలో గిరిజనులతో కలిసి జీవించడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

అర్చకుడి ఇంట్లో 2 జింక చర్మాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న జింకల చర్మం

చిత్తూరు కార్పొరేషన్/కాణిపాకం(యాదమరి): కాణిపాక వినాయక స్వామి అనుబంధ ఆలయమైన వరదరాజులస్వామి ఆలయ అర్చకుడు కృష్ణమోహన్ నివాసంలో రెండు జింక చర్మాలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎఫ్ఆర్వో బాలకృష్ణారెడ్డి, సిబ్బంది విచారణ చేస్తున్నారు. అర్చకుని కుమారునికి ఉపనయనం చేయడానికి జింక చర్మంపై కూర్చొని పూజలు చేస్తే మంచిదని అర్చకుడు భావించి, షికారీ శివను జింక చర్మాలు కావాలని కోరాడు. మరలా ఇచ్చేస్తామని కోరడంతో షికారీ తిరువణ్ణామలైలోని తన మామకు చెప్పి రెండు జింక చర్మాలను అర్చకుడికి రూ.7 వేలకు ఇచ్చినట్లు చెప్పారు. అటవీశాఖ అధికారులు షికారీ శివపై కేసు నమోదు చేసి అతడి కోసం గాలిస్తున్నారు. అలాగే షికారీ శివ మామను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఏడుగురు వంట సిబ్బంది తొలగింపు

కాణిపాక ఆలయంలో నిత్యాన్నదానంలో వాడే సరుకులను అక్రమంగా తీసుకెళ్లిన ఏడుగురు సిబ్బందిని తొలగించినట్లు ఆలయ ఈవో వెంకటేశు చెప్పారు. వీరి ఇళ్లలో తనిఖీలు చేసి రూ.1.3 లక్షల విలువైన సరుకులు స్వాధీనం చేసుకొని దేవదాయ శాఖకు నివేదికలు పంపగా..వారిని తొలగించి, క్రిమినల్ కేసులను నమోదు చేయాలని ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. వీరికి అధికారులు ఎవరైనా సహకరించారా అనే విషయంపై విచారిస్తున్నారు.

36% 'వంట' చెరకే!

దేశంలో వంటకు గ్యాస్ వాడకం 62 శాతం

- గ్రామీణ ప్రాంతాల్లో 46.7 శాతం కట్టెలు, వరిపొట్టు, పంట అవశేషాలతోనే
- ఛత్తీస్‌గఢ్‌లో అత్యధికంగా గ్రామీణ ప్రాంతాల్లో 84.2 శాతం కట్టెలతోనే వంట
- ఉచితంగా వంట చెరకు లభించడం, గ్యాస్ ధరలు భగ్గుమనడం కారణాలు

కేంద్ర పర్యావరణ గణాంకాలు 2023 నివేదికలో వెల్లడి



(దేశంలో వంటకు వినియోగిస్తున్న ఇంధన వనరులు ఇలా శాతాల్లో)

రాష్ట్రం	కట్టెలు, పంట అవశేషాలు	ఎల్‌పీజీ	పిడకలు	ఇతర	వంట చేయడం లేదు
ఒడిశా	67.3	31.4	--	0.6	0.5
ఛత్తీస్‌గఢ్	67.1	30.6	0.2	1.8	0.2
పశ్చిమ బెంగాల్	58.5	37.8	0.9	2.6	0.2
మధ్యప్రదేశ్	56.0	40.8	2.3	0.2	0.7
జార్ఖండ్	55.1	36.1	1.3	7.3	0
రాజస్థాన్	54.4	44.0	0.4	0.5	0.7
అసోం	52.2	47.0	0.2	0.5	0.1
బిహార్	37.4	53.9	8.3	0.2	0
కేరళ	31.0	67.1	--	0.8	1.1
గుజరాత్	24.5	69.6	0.1	5.3	0.4
ఆంధ్రప్రదేశ్	11.3	86.3	--	0.2	2.2

నోట్: (ఇతర: గోబర్ గ్యాస్, కిరోసిన్, బొగ్గు, ఎలక్ట్రిక్ తదితరాలు)

సాక్షి, అమరావతి: దేశంలో 62 శాతం మంది వంట కోసం ఎల్‌పీజీ (గ్యాస్)ని వినియోగిస్తుండగా 36 శాతం ప్రజలు మాత్రం వంట చెరకునే వాడుతున్నట్లు కేంద్ర పర్యావరణ గణాంకాల నివేదిక వెల్లడించింది. 33.8 శాతం మంది కట్టెలు, పొట్టు, పంట అవశేషాలపై ఆధారపడుతుండగా 2.2 శాతం మంది వంట కోసం పిడకలను వినియోగిస్తున్నారు. 1.3 శాతం మంది కిరోసిన్, గోబర్ గ్యాస్, ఎలక్ట్రికల్, బొగ్గుల పొయ్యిపై వంట చేస్తున్నారు. ఇక ఎల్‌పీజీ వినియోగంలో గ్రామాలకు, పట్టణ ప్రాంతాలకు మధ్య భారీ వ్యత్యాసం ఉంది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో కట్టెలు, పొట్టు, పంట అవశేషాలు ఉచితంగా లభిస్తుండటంతోపాటు బూడిదను పంట పొలాలకు ఎరువుగా వాడుతున్నందున వీటివైపు మొగ్గు చూపుతున్నారు. ఇక భగ్గుమంటున్న గ్యాస్ ధరలు కూడా కారణమే. ఈమేరకు కేంద్ర పర్యావరణ నివేదిక 2023ని గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ విడుదల చేసింది.

- గ్రామీణ ప్రాంతాల్లో 49.4 శాతం మంది ఎల్‌పీజీ వాడుతుండగా 46.7 శాతం మంది కట్టెలు, పొట్టు, పంట అవశేషాలపై ఆధార పడుతున్నారు. మూడు శాతం మంది పిడకలు, 0.7 శాతం మంది గోబర్ గ్యాస్, కిరోసిన్, ఎలక్ట్రికల్, బొగ్గుల పొయ్యిలను వాడుతున్నారు.
- పట్టణ ప్రాంతాల్లో 89 శాతం మంది వంట కోసం ఎల్‌పీజీ వాడుతుండగా 6.5 శాతం మంది కట్టెలు, పొట్టు, పంట అవశేషాలను వినియోగిస్తున్నారు. 0.3 శాతం మంది పిడకలు, 2.5 శాతం గోబర్ గ్యాస్, ఎలక్ట్రికల్, కిరోసిన్, బొగ్గుల పొయ్యిలను వాడుతున్నారు.
- ఛత్తీస్‌గఢ్ గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా 84.2 శాతం మంది వంట కోసం కట్టెలు, పొట్టు, పంట అవశేషాలపైనే ఆధారపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో 16.3 శాతం మంది కట్టెలు, పొట్టు, పంట అవశేషాలపై వంట చేస్తుండగా 81.7 శాతం మంది ఎల్‌పీజీ వినియోగిస్తున్నారు.

తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయడం అభినందనీయం

గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో కేరళ ఐజీ లక్ష్మానాయక్



మాట్లాడుతున్న కేరళ ఐజీ గుగులోత్ లక్ష్మానాయక్

మదనపల్లె: ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడం అభినందనీయమని కేరళ ఐజీ గుగులోత్ లక్ష్మానాయక్ అన్నారు. తండాల అభివృద్ధితోనే గిరిజన ప్రగతి సాధ్యపడుతుందని చెప్పారు. గిరిజన సంక్షేమ సేవా సమితి ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షుడు హరినాయక్ అధ్యక్షతన ఆదివారం అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలో జరిగిన గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులు ఓటు విలువ తెలుసుకుని మంచి వ్యక్తులను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలని సూచించారు. ఎస్టీ రిజర్వ్‌డ్ ఎమ్మెల్యే సీట్లను రాష్ట్ర ప్రాతిపదికన కాకుండా జిల్లా ప్రాతిపదికన ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించకుండా తండాల అభివృద్ధికే వినియోగించాలన్నారు. దేశవ్యాప్తంగా 15 కోట్ల జనాభా కలిగిన ఎస్టీలకు 30 ఏళ్లుగా ఆదాయ పరిమితిని రూ.2.5లక్షలుగా పేర్కొంటున్నారని, దానిని ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి చెందిన వ్యక్తులకు విధించినట్లుగా రూ.8 లక్షల పరిమితికి పెంచాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో గిరిజన మహిళా నాయకురాలు కోమలిబాయి, సుమంత్, ఆర్‌జీఎస్ కోనేటిదివాకర్, అన్నమయ్య, అనంతపురం ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రీనివాసులునాయక్, చరణ్, ఏబీఎస్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగూనాయక్, గోల్డెన్‌వ్యాలీ రమణారెడ్డి తదితరులున్నారు.

పేదల కల నెరవేరుస్తున్న సీఎం జగన్

- టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్



టిడ్కో ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): రాష్ట్రంలో పేదల సొంతింటి కల నెరవేరుస్తున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్ అన్నారు. విశాఖలోని 52వ వార్డు గౌరీనగర్‌లో నిర్మించిన టిడ్కో ఇళ్లను ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. టిడ్కో ఇళ్ల విషయంలో టీడీపీ నాయకుల ఆరోపణలు శుద్ధ అబద్ధమన్నారు. టిడ్కో ఇళ్లు గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసినా అవి పూర్తి కాలేదన్నారు. వాటిని ఒక యజ్ఞంలా పూర్తి చేశామన్నారు.

రూపాయికే ఇల్లు

రాష్ట్రంలో 2.62 లక్షల గృహాలు నిర్మాణం జరుగుతుండగా.. అందులో 1,43,600 గృహాలు కేవలం ఒక్క రూపాయికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందిస్తున్నారని ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం 2018లో విడుదల చేసిన జీవోలో ప్రతి 300 చదరపు గజాల గృహ లబ్ధిదారుడు రూ.2.65 లక్షలు చెల్లించాలని ఉందని గుర్తు చేశారు. ఈ సొమ్ము బ్యాంకుల్లో అప్పు తీసుకుని వాయిదాలు కడితే 20 ఏళ్లకు సుమారు రూ.7.20 లక్షలు కట్టాల్సి వచ్చేదన్నారు. పాదయాత్ర సందర్భంగా కంచరపాలెం మెట్టు వద్ద జరిగిన బహిరంగ సభలో జగన్‌మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో ఇళ్లను ఉచితంగా అందజేస్తానని మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఆ మాట ప్రకారమే పేదలకు ఉచితంగా ఇళ్లు ఇస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో బీ కేటగిరీ ఇళ్లు రూ.50 వేలు ఉండగా.. దాన్ని రూ.25 వేలు చేశారన్నారు. సీ కేటగిరీ ఇళ్లు రూ.లక్ష ఉండగా.. దాన్ని రూ.50 వేలు చేశారని వివరించారు. ఇప్పటికే 22 పట్టణాల్లో 50 వేల గృహాలను లబ్ధిదారులకు అందించామన్నారు. అందులో 25 వేల గృహాలు ఒక్క రూపాయికే అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, సింహాచలం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు శ్రీదేవి వర్మ, వైఎస్సార్ సీపీ నాయకులు జియ్యాని మారుతి పాల్గొన్నారు.

ముగ్గురు ఉసురు తీసిన ఈత సరదా

- మృతుల్లో అక్కా, తమ్ముడు
- ఈస్టర్ పండగ రోజు రెండు కుటుంబాల్లో విషాదం



సాయిసుశాంత్ సాయితేజశ్రీ జానయ్య

వేంపల్లె: వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం వేంపల్లె మండలం అలవలపాడు గ్రామ సమీపంలో ఉన్న జీఎన్ఎస్ఎస్ కాలువలో ఈతకు వెళ్లి ముగ్గురు మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అలవలపాడు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన తుమ్మలూరు సాయి సుశాంత్,(11) సాయితేజశ్రీ(12), వేముల మండలం వేల్పుల గ్రామానికి చెందిన జానయ్య(23), శశికుమార్ మధ్యాహ్న సమయంలో సరదాగా ఈత కొట్టేందుకు జీఎన్ఎస్ఎస్ కాలువలో దిగారు. లోతు ఎక్కువగా ఉండటంతో సుశాంత్, సాయితేజశ్రీ మునిగి పోయారు. వారిని కాపాడేందుకు జానయ్య, శశికుమార్ నీటిలో వెతికారు. ఈ క్రమంలో జానయ్య కూడా నీటిలో మునిగిపోయాడు. శశికుమార్ మాత్రం కొద్ది సేపు వెతికి భయపడి కాలువలో నుంచి పైకి వచ్చి కేకలు వేశాడు. స్థానికులు గమనించి అక్కడికి చేరుకుని కాలువలో మునిగి పోయిన ముగ్గురిని బయటకు తీశారు. అప్పటికే సాయి సుశాంత్, సాయితేజశ్రీ, జానయ్య మృతి చెందారు. బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న జానయ్యకు ఆరు నెలల కిందటే వివాహమైంది. సాయి సుశాంత్, సాయి తేజశ్రీ అక్కా తమ్ముడు. రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈస్టర్ పండుగ సందర్భంగా అలవలపాడు గ్రామంలోని శశికళ ఇంటికి వీరంతా వచ్చారు.

ఫార్మాసిటీలో ట్యాంకర్ నుంచి రసాయనం లీక్

కళ్లు మంటలు, వికారంతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు

- లంకెలపాలెం సమీపంలో ఏలేరు కెనాల్ వద్ద ఘటన
- అప్రమత్తమై ప్రమాదాన్ని నివారించిన అధికారులు


సాక్షి, అనకాపల్లి/పరవాడ (పెందుర్తి): జేఎన్ ఫార్మాసిటీలో మైలాన్ పరిశ్రమకు తరలిస్తున్న ప్రమాదకర ఫినైల్ మెర్కాప్టన్ (థియో ఫినైల్) రసాయనాన్ని ట్యాంకర్ నుంచి దిగుమతి చేస్తుండగా లీక్ కావడంతో సమీప ప్రజలు అస్వస్థతకు గురయ్యారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం లంకెలపాలెం ఏలేరు కాలువ సమీపంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల ఫిర్యాదుతో పరవాడ సీఐ పి.ఈశ్వరరావు, ఎమ్మార్వో పి.ప్రకాశ్‌రావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈఈ పి.శ్రీనివాసరావు రంగంలోకి దిగి ఆ ట్యాంకర్‌ను మైలాన్ కంపెనీకి తరలించి అన్‌లోడ్ చేయించడంతో ముప్పు తప్పింది.

సురక్షితంగా అన్‌లోడింగ్

ప్రమాదకరమైన విషవాయువును తీసుకొచ్చిన పైలాన్ కంపెనీ, ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం, హైదరాబాద్‌లోని సంజయ్ కెమికల్స్‌పై కేసు నమోదు చేశామని పరవాడ సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు. 4 టన్నుల థియో ఫినైల్‌ను తక్షణమే మైలాన్ పరిశ్రమకు తరలించి లీక్ కాకుండా అన్‌లోడ్ చేయించామన్నారు. ఎటువంటి ప్రాణాపాయం లేకుండా అధికారులు అప్రమత్తమై జాగ్రత్తలు తీసుకున్నారని పేర్కొన్నారు.

అసలేం జరిగిందంటే..

ఫార్మాసిటీలో మైలాన్ యూనిట్-9 పరిశ్రమ యాజమాన్యం థియో ఫినైల్‌ను హైదరాబాద్‌లోని సంజయ్ కెమికల్స్ నుంచి దిగుమతి చేసుకుంది. శనివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి బయలుదేరిన ట్యాంకర్ లారీ ఆదివారం ఉదయం 7.30 గంటలకు మైలాన్ యూనిట్-9కు చేరుకోగా.. దానిని అన్‌లోడ్ చేస్తున్న క్రమంలో కార్మికులు లీకేజీని గుర్తించి ట్యాంకర్‌ను వెనక్కి పంపించారు. దానిని ఏలేరు కాలువ సమీపంలో నిలిపివేయడంతో లీకేజీ మరింత ఎక్కువైంది. రసాయన వ్యర్థాలు ఎక్కువ మొత్తంలో లీక్ కావడంతో అటుగా రాకపోకలు సాగించే లంకెలపాలెం పరిసర గ్రామాల ప్రజలు, అక్కడ నుంచి వెళ్లే వాహన చోదకులు భరించలేని కళ్ల మంటలు, వికారంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానికుడు సుందరపు శ్రీనివాసరావు పోలీసులు ఫిర్యాదు చేయడంతో పోలీస్, రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు రసాయనం లీకైన ప్రదేశానికి చేరుకుని లీకేజీని గుర్తించి వాసన రాకుండా చర్యలు చేపట్టారు. పరవాడ తహసీల్దార్ వి.ప్రకాశరావు, సీఐ పి.ఈశ్వరరావు లీకైన డ్రమ్ములను గుర్తించి వాటిలో ఉన్న రసాయనాన్ని వేరే డ్రమ్ముల్లో నింపి సమస్యను చక్కదిద్దారు. సమస్యపై స్పందించిన పీసీబీ ఏఈ శ్రీనివాసరావు, ఇతర అధికారులు మైలాన్ పరిశ్రమ యాజమాన్యం నుంచి వివరాలు రాబట్టారు. పైలాన్ కంపెనీ, ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం, హైదరాబాద్ సంజయ్ కెమికల్స్‌పై పరవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ట్రాన్స్‌పోర్టర్ వీరాంజనేయని అదుపులోకి తీసుకున్నారు.



ఏలేరు కాలువ సమీపంలో లీకైన రసాయనం

ఉత్సాహంగా బడ్డు సంబరం

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): పాత పాడేరులో ఇటుకల పండుగలో భాగంగా బడ్డు సంబరం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా, మైదాన ప్రాంతాల్లోని గిరి మహిళలు భారీగా తరలిరావడంతో పాతపాడేరు జనసంద్రమైంది. బడ్డుతాడు లాగే సంబరంలో ఈ ఏడాది కూడా ఊరిలోని మహిళలే విజయం సాధించారు. వివాహాలు చేసుకుని మెట్టినింటికి వెళ్లిన ఇక్కడి ఆడపిల్లలు మాత్రం ఓటమి చెందారు.



బడ్డు తాడును ఉత్సాహంగా లాగుతున్న ఊరి ఆడపిల్లలు, మెట్టినింటి ఆడపిల్లలు

శ్రీవారికి అగ్గిపెట్టెలో ఇమిడే చీర

- పద్మావతి అమ్మవారికి సమర్పించిన సిరిసిల్ల నేత కళాకారుడు
- అలివేలు మంగమ్మకు బంగారం, వెండిపోగుల చీర



అగ్గిపెట్టెలో పట్టే బంగారు చీరను సీఎస్‌కు చూపెడుతున్న విజయ్ తదితరులు

సిరిసిల్ల/తిరుచానూరు(చంద్రగిరి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన నేత కళాకారుడు నల్ల విజయ్‌కుమార్ మరోసారి అగ్గిపెట్టెలో ఇమిడే చీరను నేసి తిరుపతి శ్రీవారికి ఆదివారం అందించారు. చేనేతలో నిత్యప్రయోగాలు చేసే నల్ల విజయ్‌కుమార్.. బంగారం, వెండి పోగులు పొదిగిన మరో చీరను అలివేలు మంగమ్మకు సమర్పించారు. ఆ రెండు చీరలను తిరుపతి శ్రీపద్మావతి విశ్రాంతి గృహంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి చేతుల మీదుగా అందించారు. పద్మావతి అమ్మవారికి సమర్పించిన చీరను పవర్‌లూమ్‌పై సిల్క్‌పోగులతో అగ్గిపెట్టెలో ఇమిడేలా తయారుచేశారు. మరో చీరను మాత్రం ఐదు గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండిపోగులతో పవర్‌లూమ్‌పై నేశారు. చీరబరువు 250 గ్రాములు ఉండగా.. 5.5 మీటర్ల పొడవు, 48 ఇంచుల వెడల్పుతో కట్టుకోవడానికి వీలుగా ఉండే చీరను నేశారు. దీనికోసం 15 రోజులపాటు శ్రమించారు. దశాబ్దకాలంగా విజయ్‌కుమార్ చేనేత మగ్గంపై పలు ప్రయోగాలు చేస్తూ అరుదైన గుర్తింపు సాధించారు.

కుప్పంలో వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ కుటుంబాలు



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలతో ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం (చిత్తూరు జిల్లా): కుప్పం నియోజకవర్గం, రామకుప్పం మండలంలోని బల్ల పంచాయతీకి చెందిన 15 టీడీపీ కుటుంబాలు ఆదివారం స్థానిక సర్పంచ్ విజయ్ థామస్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త, చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. భరత్ వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం.. టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ గెలుపునకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కుప్పం ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, రెస్కో డైరెక్టర్ థామస్, మైనారిటీ నేతలు అల్లాభక్షు, షేక్ అహ్మద్, మాజీ సర్పంచ్ గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వండి

విజయవాడ ఎన్ఐఏ కోర్టును కోరిన సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి : విశాఖపట్నం విమానాశ్రయంలో తనపై జరిగిన హత్యాయత్నం కేసుకు సంబంధించి విజయవాడ ఎన్ఐఏ కోర్టులో సాక్షిగా హాజరయ్యేందుకు సీఎం వైఎస్ జగన్ మినహాయింపు కోరినట్లు తెలిసింది. ప్రతిపక్ష నేతగా ఉండగా వైఎస్ జగన్‌పై 2018 అక్టోబర్ 25న విశాఖ విమానాశ్రయంలో జానిపల్లి శ్రీనివాసరావు అనే వ్యక్తి హత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఈ కేసు విచారణ విజయవాడలోని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) న్యాయస్థానంలో కొనసాగుతోంది. ఈ కేసులో బాధితుడుగా ఉన్న సీఎం వైఎస్ జగన్ సాక్షిగా సోమవారం హాజరై వాంగ్మూలం ఇవ్వాలని న్యాయస్థానం ఇటీవల ఆదేశించింది. సోమవారం ఆయనతో పాటు మరికొందరిని కూడా సాక్షులుగా విచారిస్తామని తెలిపింది. కాగా, ముఖ్యమంత్రిగా అత్యవసర విధులు నిర్వహించాల్సి ఉండడం, భద్రతాపరమైన కారణాలతో పాటు సామాన్య ప్రజానీకానికి ఇబ్బంది కలగకుండా ఉండడం కోసం తనకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని సీఎం కోరినట్లు తెలిసింది. తన వాంగ్మూలాన్ని అడ్వకేట్ కమిషనర్ ద్వారా నమోదు చేసేందుకు అనుమతించాలని విన్నవించినట్లు సమాచారం.

భర్త శవంతో మూడు రోజులు

మతిస్థిమితం లేక గుర్తించని భార్య

కొణిజర్ల: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందగా.. మతిస్థిమితం లేని ఆయన భార్య మూడు రోజుల పాటు శవంతోనే ఇంట్లో గడిపింది. చివరకు ఆదివారం కుమారుడు ఇంటికి వచ్చాక కానీ విషయం బయటపడలేదు. ఖమ్మం జిల్లా వైరాకు చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి భోగి వీరభద్రం (65) కొణిజర్ల మండలం శాంతినగర్‌లో ఇల్లు నిర్మించుకుని భార్యతో ఉంటున్నాడు. రోజూ తల్లిదండ్రుల యోగక్షేమాలు కనుక్కునే పెద్దకుమారుడు వెంకటకృష్ణ ఈనెల 6వ తేదీ నుంచి ఫోన్ చేస్తున్నా తీయడం లేదు. దీంతో ఆదివారం ఆయన ఇంటికి వచ్చేసరికి తల్లి వరండాలో కనిపించింది. తండ్రి విషయమై ఆరా తీయగా బెడ్‌రూమ్‌లో ఉన్నాడని చెప్పింది. వెంకటకృష్ణ బెడ్‌రూమ్‌లోకి వెళ్లి చూడగా తండ్రి వీరభద్రం మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. ఆయన మృతి చెంది మూడు రోజులు అవుతున్నట్లు గుర్తించారు. అధిక రక్తపోటుతో కింద పడడంతో తలకు తీవ్ర గాయమై మరణించి ఉండొచ్చని భావిస్తున్నారు. తల్లికి మతిస్థిమితం లేక గుర్తించలేకపోయిందని వెంకటకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని కొణిజర్ల ఎస్ఐ శంకరరావు తెలిపారు.

క్లుప్తంగా...

విగ్గు కాదు.. జుట్టే



వాషింగ్టన్: ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు అవియన్ దుగాస్. వయసు 47 ఏళ్లు. అమెరికాలో లూసియానాకు చెందిన ఆమెకున్న జుట్టు చూశారా..? అది జుట్టేంటి విగ్గు అనుకుంటున్నారా..? కాదు అది నిజంగానే జుట్టే. అలా జుట్టు పెంచడానికి ఆమె 24 ఏళ్లు పట్టింది. 9.84 అంగుళాల పొడవు, 10.4 అంగుళాల వెడల్పు, 5.41 అడుగుల చుట్టుకొలత కలిగిన అతి పెద్ద జుట్టు గిన్నిస్ వరల్డ్ బుక్‌లో చోటు సంపాదించింది. 2010లో ఒకసారి 4.4 అడుగుల చుట్టుకొలతతో రికార్డులకెక్కిన ఆమె తనకి సహజంగానే జుట్టు అలా పెరిగిందని చెబుతోంది. తన జుట్టు స్ట్రెయిట్‌గా ఉండడం కోసం ఒకప్పుడు కెమికల్స్ వాడానని, కానీ అవి మంచివి కావని తేలడంతో వాటిని మానేశానని, దీంతో జుట్టు ఇలా తయారైందని దుగాస్ చెప్పుకొచ్చింది.

మెట్రోలో సైకిల్




ముంబై: మహానగరం ముంబైలో ట్రాఫిక్‌లో ప్రయాణమంటే నిత్యం నరకమే. మెట్రోలో ప్రయాణిస్తే స్టేషన్ నుంచి మళ్లీ గమ్యస్థానం చేరుకోవడానికి ఆటోలకి డబ్బులు ధార పోయాలి. ప్రతీ రోజూ ట్యూషన్‌కి వెళ్లే ఒక అబ్బాయి మెట్రోలో తనతో పాటు సైకిల్ కూడా తీసుకువెళ్లడం మొదలు పెట్టాడు. తనతో పాటే సైకిల్ దింపుకొని హ్యాపీగా కోచింగ్ సెంటర్‌కు వెళ్లసాగాడు. మెట్రోలో కూర్చున్నప్పుడు హెల్మెట్ పెట్టుకొని, తన పక్కనే సైకిల్ పెట్టుకోవడం చూసిన కొందరు దానిని ఫొటో తీసి సోషల్ మీడియాలో షేర్ చేశారు. కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి తన ట్విట్టర్ అకౌంట్‌లో ఈ ఫొటోని షేర్ చేయడంతో అది ఒక్కసారిగా వైరల్ అయింది.


ఒకప్పుడు సరదా కోసం పులుల్ని వేటాడేవారు. ఆ తర్వాత కాలంలో అభివృద్ధి కార్యక్రమాలు పులుల్ని బలి తీసుకున్నాయి. ప్రకృతి సమతుల్యతకి పులులెంత విలువైనవో ఆ తర్వాత మనకి తెలిసి వచ్చింది. 50 ఏళ్ల క్రితం మొదలు పెట్టిన టైగర్ ప్రాజెక్టు వల్ల పులుల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతోంది. ప్రపంచంలోనే పులుల సంరక్షణ అంశంలో భారత్ అనుసరిస్తున్న విధానాలు ప్రపంచదేశాలకు మార్గదర్శకంగా మారాయి. నాలుగేళ్లకొకసారి అభయారణ్యాలలో పులుల్ని లెక్కించే ప్రక్రియ ఆసక్తికరంగా మారి గిన్నిస్ వరల్డ్ రికార్డులకెక్కింది.



గాండ్రింపులు పెరిగాయ్!



పులుల సంఖ్య పెరుగుతోంది ఇలా..!



మన దేశంలో పులుల సంరక్షణ కోసం 50 ఏళ్ల క్రితమే టైగర్ ప్రాజెక్టు మొదలైంది. పర్యావరణ పరిరక్షణకు, ప్రకృతి సమతుల్యతకి పులులు ఎంత ముఖ్యమో గ్రహించిన అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం 1973, ఏప్రిల్ 1న ఈ ప్రాజెక్టుకి శ్రీకారం చుట్టింది. అప్పట్లో దేశీయంగా అంతరించడానికి సిద్ధంగా ఉన్న జాబితాలో పులులు చేరిపోయాయి. ఇరవయ్యో శతాబ్దంలో ప్రపంచ దేశాల్లో పులుల సంఖ్య లక్ష ఉంటే, మన దేశంలో 40 వేలు ఉండేవి. అలాంటిది 1970 నాటికి పులుల సంఖ్య దాదాపుగా 1,800కు పడిపోవడంతో కేంద్రం అప్రమత్తమైంది. అభివృద్ధి పేరిట అడవులకి, వన్యప్రాణులకి ఎంత నష్టం జరుగుతోందో గ్రహించి టైగర్ ప్రాజెక్టుని ప్రారంభించింది. తొలిదశలో 18,278 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో తొమ్మిది టైగర్ రిజర్వ్‌లు ఉండేవి. ప్రస్తుతం 75 వేల చదరపు కిలోమీటర్లు (దేశ భౌగోళిక విస్తీర్ణంలో 2.4%) విస్తీర్ణంలో 53కి పైగా టైగర్ రిజర్వులున్నాయి. ప్రపంచంలో మొత్తం పులుల్లో మన దేశంలో 70% ఉన్నాయంటే ఈ టైగర్ ప్రాజెక్టు ఎంతటి విజయాన్ని సాధించిందో తెలుస్తోంది.

పులులను ఎలా లెక్కిస్తారంటే!

1 దేశంలో పులుల సంరక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి వాటి గణన చేపట్టినప్పుడు అదో పెద్ద సవాల్‌గా నిలిచింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడంతో తొలినాళ్లలో అటవీ సిబ్బంది అడవుల్లో నడుచుకుంటూ వెళ్లి వన్యప్రాణులు కనిపిస్తే వాటి గుర్తులతో సహా ఎన్ని కనిపించాయో వివరాలను రాసుకొని లెక్కించేవారు.

2 ఆ తర్వాత పగ్ మార్క్ విధానం అమల్లోకి వచ్చింది. పులుల పాద ముద్రలనే వాటిని లెక్కించడానికి వాడేవారు. మనుషుల వేలిముద్రలన్నీ ఎలా ఒక్కలా ఉండవో పులుల పాద ముద్రలు కూడా ఒకేలా ఉండవు. అలా పాదముద్రల్ని బట్టి ఎన్ని పులులు ఉన్నాయో గుర్తించేవారు. బటర్ పేపర్‌పై స్కెచ్‌పెన్‌తో పాద ముద్ర ఆకారాన్ని గీస్తారు. గాజుపలకపై తెల్లటి కాగితాన్ని ఉంచి ఆకారాన్ని దానిపై పడేలా చేస్తారు. నేలపై ఉన్న ముద్రల మీద చాక్‌పౌడర్ చల్లి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ మిశ్రమాన్ని కలిపేవారు. ఆ మిశ్రమం గడ్డ కట్టి పులి పాదం అచ్చు లభించేది. ఆ పాద ముద్ర ఆధారంగా ఎన్ని పులులు తిరిగాయి, వాటి వయసు వంటివి తెలుసుకునేవారు.

3 ఒక దశలో వన్యప్రాణుల గోళ్లు, మలం సేకరించి దాని ఆధారంగా కూడా గణన జరిగేది.

4 కొన్నేళ్లు గడిచాక మరో కొత్త విధానాన్ని మొదలు పెట్టారు. పులులు చేతికి చిక్కినప్పుడు వాటిపై ప్రత్యేకమైన ముద్ర వేసేవారు. మళ్లీ వాటిని అడవుల్లో వదిలేసి ఆ తర్వాత లెక్కించే సమయంలో ముద్ర ఉందో లేదో చూసేవారు. ముద్ర లేని పులులు కనిపిస్తే కొత్తగా జాబితాలో వచ్చి చేరేవి.

5 గత కొన్నేళ్ల నుంచి అత్యాధునిక కెమెరాలు వినియోగించి పులుల సంఖ్యని గణిస్తున్నారు. ఎక్కువగా పులులు సంచరించే ప్రాంతాలను గుర్తించి అక్కడ కెమెరాలు ఏర్పాటు చేసినట్టుగా జాతీయ పులుల సంరక్షణ అథారిటీ అధికారులు చెప్పారు. అడవుల్లో ఇరువైపులా ఉన్న చెట్లకు కెమెరాలు ఫిక్స్ చేయడం వల్ల పులులతో పాటు ఆయా ప్రాంతాల్లో ఉండే వన్యప్రాణుల గురించి కూడా తెలుస్తుంది. ఇక పులుల ఎత్తు, వాటి నడక, వాటి శరీరంపై ఉండే చారల ఆధారంగా సంఖ్యను తెలుసుకుంటారు.

గిన్నిస్ రికార్డుల్లోకి పులుల గణన

మన దేశంలో పులుల గణన రికార్డులు తిరగరాసింది. కెమెరాల సాయంతో భారీగా వన్యప్రాణుల గణన చేపట్టిన తొలి దేశంగా భారత్ గిన్నిస్ రికార్డులకెక్కింది. 2018–2019 పులుల గణన ప్రపంచంలోనే అత్యంత సమగ్రమైనది. 141 ప్రదేశాల్లో 26,838 చోట్ల మోషన్ సెన్సర్లున్న కెమెరాలు అమర్చారు. ఈ ప్రక్రియలో 44 వేల మంది అధికారులు, జీవ శాస్త్రవేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. 20 రాష్ట్రాల్లో రహస్య కెమెరాలు, ఇతర పద్ధతుల్లో పులులతో పాటు ఇతర వన్యప్రాణుల్ని లెక్కించడం రికార్డు సృష్టించింది.

దేశంలో పెరుగుతున్న పులుల సంఖ్య

ఒకప్పుడు 1,800 లోపే.. ఇప్పుడు దాదాపు రెట్టింపు

ప్రపంచంలోని మొత్తం పులుల్లో 70% భారత్‌లోనే

50 ఏళ్ల 'ప్రాజెక్ట్ టైగర్' ఫలితమే

బందిపూర్‌లో ప్రధాని

ప్రాజెక్టు టైగర్ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్ణాటకలో బందిపూర్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో పర్యటించారు. పశ్చిమ కనుమల్లో ఉన్న ఈ అభయారణ్యంలో ఓపెన్ జీపులో దాదాపుగా 20 కి.మీ. దూరం ప్రయాణించి ప్రకృతి అందాలను తిలకించారు. కాకీప్యాంట్, షర్టు, నెత్తిన టోపి ధరించిన ప్రధాని మోదీ బందిపూర్ ఫొటోలను ట్విట్టర్‌లో షేర్ చేశారు. ''బందిపూర్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉదయం గడిపాను. భారత దేశ ప్రకృతి రమణీయతను, వన్యప్రాణుల్లో వైవిధ్యాన్ని ఆస్వాదించాను'' అని ట్వీట్‌లో పేర్కొన్నారు. బైనాక్యులర్స్ ద్వారా వన్యప్రాణుల్ని చూస్తూ, కెమెరాలో వాటిని బంధిస్తూ గడిపారు.

గజరాజులతో ఆప్యాయంగా

తర్వాత బందీపూర్ రిజర్వ్‌కు 12 కిలోమీటర్ల దూరంలో తమిళనాడులో మదుమలైలోని తెప్పకాడు ఏనుగుల శిబిరాన్ని మోదీ సందర్శించారు. ఏనుగులతో సరదాగా గడిపారు. ఇటీవల ఆస్కార్ అవార్డు పొందిన ఎలిఫెంట్ విస్పరర్స్ సినిమాలో ప్రధాన పాత్రలు పోషించిన మావటి దంపతులు బొమ్మన్, బెళ్లిలను సన్మానించారు. వారితో కలిసి ఏనుగులకు చెరుకులు తినిపించారు. వారిని ఢిల్లీకి ఆహ్వానించారు.

3,167 దేశంలో పులులు

నాలుగేళ్లలో 200 పెరిగాయి

గణాంకాలు విడుదల చేసిన మోదీ

ఎకాలజీ, ఎకానమీ అవిభాజ్యమని వ్యాఖ్యలు



- సాక్షి, నేషనల్ డెస్క్



'50 ఇయర్స్ ఆఫ్ టైగర్ ప్రాజెక్ట్' పుస్తకాన్ని విడుదల చేస్తున్న ప్రధాని



ఆదివారం బందీపూర్ టైగర్ రిజర్వ్‌లో పర్యటిస్తున్న మోదీ

మైసూరు/సాక్షి, చెన్నై: పర్యావరణం, ఆర్థిక వ్యవస్థ కలసికట్టుగా ముందుకు వెళ్లడానికి భారత్ ప్రాధాన్యమిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పులుల సంరక్షణ కోసం ఉద్దేశించిన టైగర్ ప్రాజెక్టుకు 50 ఏళ్లయిన సందర్భంగా ఆదివారం మైసూరులోని కర్ణాటక స్టేట్ ఓపెన్ వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ''ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలియెన్స్'' (ఐబీసీఏ) ప్రాజెక్టును ప్రారంభించారు. వచ్చే 25 ఏళ్లలో పులుల సంరక్షణకు చేపట్టబోయే చర్యలతో ''అమృత్ కాల్ కా టైగర్ విజన్'' బుక్‌లెట్‌ను విడుదల చేశారు. వన్యప్రాణుల సంరక్షణ ప్రపంచదేశాలు చేపట్టాల్సిన అతి ముఖ్యమైన అంశమని చెప్పారు. దేశంలో పులుల తాజా గణాంకాలను ఈ సందర్భంగా మోదీ వెల్లడించారు. 2022 నాటికి దేశంలో పెద్ద పులుల సంఖ్య 3,167కు పెరగడం హర్షణీయమన్నారు. ''పులుల సంరక్షణ ద్వారా భారత్ ప్రకృతి సమతుల్యత సాధించింది. ఇది ప్రపంచానికే గర్వకారణం. ఒకప్పుడు దేశంలో అంతరించిన జాబితాలో చేరిన చీతాలను నమీబియా, దక్షిణాఫ్రికా నుంచి తెచ్చాం. వాటి సంతతిని విజయవంతంగా పెంచుతున్నాం'' అని చెప్పారు. పులులు, సింహాలు, చిరుతపులులు, మంచు చిరుతలు, ప్యూమా, జాగ్వార్, చీతా వంటి వన్యప్రాణుల్ని సంరక్షించడానికే ఐబీసీఏ ప్రాజెక్టుకు తెర తీసినట్టు చెప్పారు.



చర్చిలో ప్రధాని ప్రార్థనలు

న్యూఢిల్లీ: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ఢిల్లీలోని సేక్రెడ్‌హార్ట్ చర్చిని సందర్శించి ప్రార్థనలు నిర్వహించారు. బీజేపీ ఇటీవల క్రైస్తవ ఓట్లను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో ఈ ఘటన రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. గోవా, ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ వరస విజయాలు సాధిస్తున్నందున ఆ వర్గాలను ఆకట్టుకోవడానికే ప్రధాని చర్చికి వెళ్లినట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అంతకు ముందు క్రైస్తవ సోదరులకు మోదీ ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రాంతీయ భాషల్లోనూ సీఆర్‌పీఎఫ్ పరీక్ష

అమిత్‌షాకు స్టాలిన్ లేఖ

చెన్నై: సెంట్రల్ రిజర్వు పోలీస్ ఫోర్స్ రిక్రూట్‌మెంట్‌లో కంప్యూటర్ టెస్ట్‌ను తమిళంలో నిర్వహించకపోవడాన్ని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ వ్యతిరేకించారు. హిందీ, ఇంగ్లిష్‌ల్లోనే నిర్వహించడం సరికాదన్నారు. ఈ మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఆయన లేఖ రాశారు. ''పైగా 100 మార్కుల్లో హిందీ ప్రాథమిక పరిజ్ఞానానికి 25 మార్కులను కేటాయించడం వల్ల హిందీ మాట్లాడే అభ్యర్థులకే లబ్ధి కలిగింది. చర్య అభ్యర్థుల రాజ్యాంగ హక్కుకు భంగం కలిగించడమే. వీటిని నివారించేందుకు హిందీయేతర భాషలు మాట్లాడే వారి కోసం తమిళం సహా ప్రాంతీయ భాషల్లోనూ పరీక్ష చేపట్టేలా చర్యలు తీసుకోండి'' అని కోరారు.

హిమానీ నదాలు... శరవేగంగా కనుమరుగు...!

20 ఏళ్లలో 270 కోట్ల టన్నుల మేరకు క్షీణత ● హిమాలయాల పరిమాణంలో ఇది 6.5 శాతం

హిమాలయాల్లో హిమానీ నదులు శరవేగంగా కరిగిపోతున్నాయి. ఎంతగా అంటే, గత 20 ఏళ్లలో కరిగిపోయిన హిమానీ నదాల పరిమాణం ఏకంగా 57 కోట్ల ఏనుగుల బరువుతో సమానమట! అంటే హీనపక్షం 170 కోట్ల టన్నుల పై చిలుకే...! ఈ ప్రమాదకర పరిణామాన్ని పర్యావరణవేత్తలు, సైంటిస్టులు ఆలస్యంగా గుర్తించారు. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే అతి తొందర్లోనే హిమాలయాల్లో పెను మార్పులు చూడాల్సి వస్తుందని వారు హెచ్చరిస్తున్నారు...

2000 నుంచి 2020 మధ్య కేవలం 20 సంవత్సరాల్లో హిమాలయాల్లో ప్రోగ్లేషియల్ సరస్సులు ఏకంగా 47 శాతం పెరిగాయి. సరస్సుల సంఖ్య పెరిగితే మంచిదే కదా అంటారా? కానే కాదు. ఎందుకంటే హిమానీ నదాలు కరిగిపోయి కనుమరుగయ్యే క్రమంలో ఏర్పడే సరస్సులివి! ఇవి ఎంతగా పెరిగితే హిమానీ నదాలు అంతగా కుంచించుకుపోతున్నట్టు అర్థం! ఈ పరిణామమంతా చాలావరకు భూమి పై పొరకు దిగువన జరుగుతుంది గనుక ఇంతకాలం పర్యావరణవేత్తల దృష్టి దీనిపై పడలేదు. కానీ ఈ సరస్సుల సంఖ్య బాగా పెరిగిపోతుండటంతో ఈ పరిణామం పై వాళ్లు ఇటీవలే దృష్టి సారించారు. హిమాలయాల్లో కరిగిపోతున్న హిమానీ నదాల పరిమాణాన్ని తొలిసారిగా లెక్కగట్టగా ఈ విస్మయకర వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. బ్రిటన్‌లోని సెయింట్ ఆండ్రూస్, చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఆస్ట్రియాలోని గ్రాజ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, కార్నిగీ మెలన్ వర్సిటీలకు చెందిన రీసెర్చర్ల బృందంలో ఇందులో పాల్గొంది. అధ్యయన ఫలితాలను నేచర్ జియోసైన్స్ జర్నల్‌లో ప్రచురించారు. ''హిమాలయాల వద్ద భూ ఫలకాలు అత్యంత చురుగ్గా ఉంటాయి. నిత్యం కదలికలకు లోనవుతూ ఉంటాయి. దాంతో హిమానీ నదాల ప్రవాహ మార్గాలు తరచూ మారిపోతున్నాయి'' అన్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



హిమాలయాల్లో ఎవరెస్టు ప్రాంతంలో దాదాపుగా ఎండిపోయి కన్పిస్తున్న ఓ హిమానీ నదం

హిమాలయాల్లో 6.5 శాతం తగ్గిన మంచు

ఈ తాజా అధ్యయనం పలు ఆందోళనకర అంశాలను వెలుగులోకి తెచ్చింది. వాటిలో ప్రధానమైనవి...

- కనుమరుగవుతున్న హిమానీ నదాల రూపంలో గ్రేటర్ హిమాలయాలు ఇప్పటికే తమ మొత్తం మంచులో 6.5 శాతాన్ని కోల్పోయాయి.
- మధ్య హిమాలయాల్లో హిమానీ నదాల అంతర్ధానం చాలా వేగంగా కొనసాగుతోంది.
- గాలోంగ్ కో హిమానీ నదం ఇప్పటికే ఏకంగా 65 శాతం కనుమరుగైంది.
- హిమాలయాల్లో 2000–2020 మధ్య ప్రోగ్లేషియల్ సరస్సుల సంఖ్యలో 47 శాతం, విస్తీర్ణంలో 33 శాతం, పరిమాణంలో 42 శాతం చొప్పున పెరుగుదల నమోదైంది
- ఇందుకు కారణం హిమాలయాల్లోని హిమానీ నదుల పరిమాణం గత 20 ఏళ్లలో ఏకంగా 1.7 గిగాటన్నుల మేరకు తగ్గిపోవడమే. అంటే 1.7 లక్షల కోట్ల కిలోలన్నమాట! ఇది భూమిపై ఉన్న మొత్తం ఏనుగుల బరువుకు కనీసం 1,000 రెట్లు ఎక్కువ!!
- ఈ ధోరణి 21వ శతాబ్దం పొడవునా కొనసాగుతుందని పరిశోధకులు అంచనా వేశారు.
- ఫలితంగా హిమాలయాల్లోనే గాక ప్రపంచవ్యాప్తంగా అన్నిచోట్లా హిమానీ నదాలు ప్రస్తుతం భావిస్తున్న దానికంటే అతి వేగంగా కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

అదానీ గ్రూప్‌కు చైనాతో లింకులు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌పై కాంగ్రెస్ పార్టీ మరోసారి తీవ్ర ఆరోపణలు గుప్పించింది. అదానీ సంస్థలకు చైనాతో లింకులున్నాయని ఆరోపించింది. దేశంలోని పోర్టుల నిర్వహణను ఇప్పటికీ ఆ ఒక్క గ్రూపే ఎందుకు నిర్వహిస్తోందంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. మీడియా కథనాన్ని ఉటంకిస్తూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. చైనా సంస్థలు, అనుబంధ సంస్థలకు దేశంలోని పోర్టులు, టెర్మినళ్ల నిర్వహణ బాధ్యత అప్పగించరాదనేది ప్రభుత్వం విధానంగా వస్తోంది. అయితే, చైనాకు చెందిన చాంగ్‌చుంగ్-లింగ్‌తో సన్నిహిత సంబంధాలున్న అదానీ గ్రూప్‌కు పోర్టుల నిర్వహణను ఎందుకు అప్పగించారో తెలపాలని ప్రధాని మోదీని ప్రశ్నించారు. అదానీ కొడుకు వినోద్ సారథ్యంలోని పీఎంసీ ప్రాజెక్ట్స్, అదానీ గ్రూప్‌కు రూ.5,500 కోట్ల విద్యుత్ సామగ్రి కుంభకోణంతో సంబంధాలున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ ఆరోపిస్తున్న విషయం ఆయన గుర్తు చేశారు. చైనాకు సన్నిహిత దేశం ఉత్తరకొరియాకు దొంగచాటుగా పెట్రోలియం ఉత్పత్తులను విక్రయించే షాంఘైకు చెందిన కనీసం రెండు షిప్పింగ్ కంపెనీలు అదానీ గ్రూప్‌వేనని తెలిపారు. చైనాతో సంబంధాలున్నట్లు రుజువులున్నా దేశంలోని పోర్టుల నిర్వహణ బాధ్యతల్లో అదానీ గ్రూప్‌ను ఇప్పటికీ ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రభుత్వాన్ని రమేశ్ నిలదీశారు. ఇవన్నీ దేశ భద్రతకు ప్రమాదకరం కావా అని ప్రశ్నించారు. అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ నివేదిక నేపథ్యంలో అవకతవకలపై నిగ్గు తేల్చేందుకు జేపీసీ వేయాలని కాంగ్రెస్ పార్టీ కేంద్రాన్ని గట్టిగా డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే.

అయోధ్యలో శివసైనికుల సందడి

అయోధ్య: మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌లతోపాటు సుమారు 3 వేల మంది శివసైనికుల రాకతో ఆదివారం అయోధ్య సందడిగా మారింది. సీఎం షిండే, డిప్యూటీ సీఎం ఫడ్నవీస్ భవ్య రామాలయాన్ని దర్శించుకున్నారు. రామ్‌లల్లా మందిరంలో పూజలు చేశారు. సాయంత్రం సరయూ నది ఒడ్డున మహా హారతిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయోధ్యలో శివసేన చీలికవర్గం నేత, ముఖ్యమంత్రి షిండే మీడియాతో మాట్లాడారు. సిద్ధాంతపరంగా తమ పార్టీ, బీజేపీ ఒక్కటేనని ఆయన చెప్పారు. 2024 ఎన్నికల్లో మహారాష్ట్ర అంతటా కాషాయ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 'శివసేన, బీజేపీకి రామమందిరం, అయోధ్య అనేవి రాజకీయ అంశాలు కావు. అవి నమ్మిక, విశ్వాసానికి సంబంధించినవి. నేను అయోధ్యకు రావడం హిందుత్వ అంటే గిట్టని కొందరికి ఇబ్బంది కలిగిస్తుంది. ఇటువంటి వారు కావాలనే హిందుత్వను అవమానిస్తూ, హిందుత్వ పట్ల అయోమయాన్ని సృష్టించేందుకు గతంలో ప్రయత్నించారు. ఇప్పుడూ ప్రయత్నిస్తున్నారు. ఎందుకంటే, హిందుత్వ భావన దేశంలోని ప్రతి హృదయానికి, ప్రతి ఇంటికీ చేరిన నాడు వీరు తమ దుకాణం మూసుకోవాల్సి ఉంటుంది. ఆ భయంతోనే వీరు తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు' అంటూ ఎవరి పేరునూ ప్రస్తావించకుండా ఆయన వ్యాఖ్యలు చేశారు. అయోధ్యలో భవ్య రామాలయం కోసం బాల్ ఠాక్రే కన్న కలను ప్రధాని మోదీ సాకారం చేశారన్నారు. కాగా, వచ్చే ఏడాది లోక్‌సభతోపాటే మహారాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి.

సీఎం గహ్లోత్‌పై మరోసారి పైలట్ ఫైట్


జైపూర్: రాజస్తాన్ సీఎం అశోక్ గహ్లోత్‌తో మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ అమీతుమీకి మరోసారి సిద్ధమయ్యారు. రాష్ట్రంలో బీజేపీ హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఆదివారం డిమాండ్ చేశారు. ఇందుకోసం తాను ఒక్కరోజు నిరశన దీక్ష చేస్తానన్నారు. ''వసుంధరా రాజే ప్రభుత్వ హయాంలో జరిగిన రూ.45 వేల కోట్ల గనుల కుంభకోణంపై దర్యాప్తు చేయిస్తామని ప్రతిపక్షంలో ఉండగా గహ్లోత్ హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికీ చర్యలు తీసుకోలేదు. బీజేపీతో ప్రభుత్వం కుమ్మక్కైందనే విమర్శలు వస్తున్నాయి'' అన్నారు. ఈ ఏడాది చివర్లో జరగనున్న ఎన్నికల్లోగా విభేదాలను పరిష్కరించే దిశగా పార్టీ కేంద్ర నాయకత్వంపై ఒత్తిడి పెంచడమే పైలట్ ఉద్దేశంగా భావిస్తున్నారు. 2018లో రాజస్తాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి గహ్లోత్, పైలట్ వర్గాల మధ్య తీవ్ర విభేదాలు కొనసాగుతున్నాయి. పైలట్ తాజా డిమాండ్‌పై కాంగ్రెస్ వర్గాలు భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. కొందరు పైలట్‌ను సమర్థిస్తుండగా, పార్టీకి హాని చేకూరుస్తుందని మరికొందరు పెదవి విరుస్తున్నారు.

మొసలి నుంచి తప్పించుకున్నాడు!

కూక్‌టౌన్(ఆస్ట్రేలియా): మొసలి పలుమార్లు దాడి చేసి, నోట కరుచుకుని నీటి అడుగుకు లాక్కెళ్లిన తర్వాత కూడా ఓ వ్యక్తి చాకచక్యంగా వ్యవహరించి, ప్రాణాలతో బయటపడ్డాడు. ఒళ్లు గగుర్పొడిచే ఈ ఘటన శనివారం ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ రాష్ట్రం కూక్‌టౌన్‌లో చోటుచేసుకుంది. నలభయ్యేళ్ల ఓ వ్యక్తి సముద్రంలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో నాలుగున్నర మీటర్ల పొడవుండే ఓ మొసలి అతడి వైపుగా వచ్చింది. ప్రమాదాన్ని పసిగట్టి తప్పించుకునేందుకు యత్నించాడు. తన వద్ద ఉన్న స్పియర్ గన్‌ను పేల్చేందుకు ప్రయత్నించాడు. మొసలి అతడిపై మూడుసార్లు దాడి చేసి తల, భుజాలు, కాళ్లను గాయపరిచి, నోట కరుచుకుని నీటి అడుగుకు లాక్కెళ్లింది. ధైర్యం కోల్పోని ఆ వ్యక్తి తన చేతి వేళ్లతో మొసలి కళ్లలోకి బలంగా గుచ్చాడు. బాధతో అది పట్టు సడలించడంతో సురక్షితంగా బయటపడ్డాడు. గాయాలపాలైన అతడిని అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు.



ఇది అలాంటిలాంటి చేప కాదు. జపాన్‌కు చెందిన సైంటిస్టుల బృందం దీన్ని సముద్రంలో ఏకంగా 8,336 మీటర్ల లోతులో కెమెరాలో బంధించింది. ఇంత లోతులో ఉండే చేపను ఫొటో తీయడం ఇదే తొలిసారట! ఇందుకోసం ఆ బృందం రెండు నెలల పాటు కష్టపడాల్సి వచ్చిందట.



స్లమ్‌డాగ్ మిలియనీర్స్...!

న్యూయార్క్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వచ్చాక ఒక్కొక్కరు ఒక్కో రకంగా తమలోని సృజనాత్మకను బయటకి తీస్తున్నారు. మిడ్ జర్నీ అనే కృత్రిమ మేధను వినియోగించి గోకుల్ పిళ్లై అనే ఆర్టిస్టు కోటీశ్వరుల్ని నిరుపేదలుగా మార్చేస్తున్నారు. కుబేరుల్ని మురికివాడల్లోకి తెస్తున్నారు. బిల్ గేట్స్, డొనాల్డ్ ట్రంప్, మార్క్ జుకర్‌బర్గ్, ఎలన్ మస్క్ వంటి బిలియనీర్స్ సరైన బట్టలు కూడా లేకుండా మురికి మురికిగా ఆ ఫొటోల్లో దర్శనమిస్తున్నారు. ఈ ఫొటోలను గోకుల్ పిళ్లై ఆన్‌లైన్‌లో షేర్ చేస్తూ 'స్లమ్ డాగ్ మిలియనీర్స్' అని క్యాప్షన్ ఇవ్వడంతో సోషల్ మీడియాలో అవి వైరల్‌గా మారాయి!

గ్రహాంతరవాసుల వాహనమా?

రోమ్: ఎరుపు రంగులో వలయాకృతిలో కన్పిస్తున్న ఈ దృశ్యం ఇటలీలో ఇటీవల కలకలం రేపింది. విస్తుగొలిపే ఈ వింత వలయం సెంట్రల్ ఇటలీలో ఆల్ప్స్ పర్వతాల నుంచి అడ్రియాటిక్ సముద్రం దాకా ఆకాశంలో ఏకంగా 360 కిలోమీటర్ల పొడవున విస్తరించి కనువిందు చేసింది. అచ్చం హాలీవుడ్ సైన్స్ ఫిక్షన్ సినిమా దృశ్యాన్ని తలపించిన ఈ వలయం గ్రహాంతరవాసుల అంతరిక్ష వాహనం అయ్యుండొచ్చని కొందరు భావించారు. సైంటిస్టులు మాత్రం అదేమీ కాదని స్పష్టం చేశారు. కాంతి ఉద్గార క్రమంలో అతి తక్కువ ఫ్రీక్వెన్సీతో కూడిన అడ్డంకులు ఇందుకు కారణమని వారు వివరించారు. ఎల్వ్‌గా పిలిచే ఈ దృగ్విషయం ఒక్కోసారి ఇలాంటి విచిత్రాకారపు వెలుతురు వలయాలకు దారి తీస్తుందని చెప్పుకొచ్చారు. ఈ ఎల్వ్‌లు తుపాను మేఘాలకు పై భాగాల్లో విడుదలయ్యే అత్యంత హెచ్చు విద్యుదయస్కాంత శక్తి వల్ల పుట్టుకొస్తుంటాయట. ఫొటోలోని ఎరుపు వలయం పుట్టుకకు సెంట్రల్ ఇటలీకి దాదాపు 285 కిలోమీటర్లు దక్షిణాన చెలరేగిన తుపాను సందర్భంగా చోటుచేసుకున్న శక్తిమంతమైన మెరుపు కారణమని వారు చెప్పారు. ప్రఖ్యాత ఫొటోగ్రాఫర్ వాల్తెయిర్ బినాటో దీన్ని కెమెరాలో బంధించారు. ఆకాశంలో ఇలాంటి ఆకృతులను ఆయన తొలిసారిగా 2017లో ఫొటో తీశారట. అప్పటి నుంచీ ఇదే పనిలో ఉన్నట్టు చెబుతున్నారాయన.



మోదీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నల్లజెండాల ప్రదర్శన

● కేఎస్ అళగిరి సహా 600 మందిపై కేసు నమోదు

కొరుక్కుపేట: తమ పార్టీ అగ్రనేత రాహుల్‌గాం, దీపై అనర్హత వేటును నిరసిస్తూ చెన్నై జిల్లా కాంగ్రెస్ తరఫున ఆ పార్టీ నాయకులు వళ్లువర్ కొట్టం దగ్గర ధర్నా చేపట్టారు. చెన్నై పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నల్లజెండాల ప్రదర్శన నిర్వహించారు. తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు కేఎస్ అళగిరి ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీకి పోలీసులు ముందస్తు అనుమతి ఇవ్వలేదు. అయితే కాంగ్రెస్ పార్టీ తరఫున పోలీసుల నిషేధాన్ని ధిక్కరించి ప్రదర్శన నిర్వహించారు. ఈ కేసులో నిషేధం ఉల్లంఘించి ప్రదర్శన చేపట్టడంపై నుంగంబాక్కం పోలీసులు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ అళగిరి, సీనియర్ ఇన్‌చార్జ్ శ్రీవల్ల ప్రసాద్ సహా 600 మందిపై సిటీ పోలీస్ యాక్ట్‌లోని రెండు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

న్యూస్‌రీల్

బీజేపీలోకి మైత్రేయన్



● ఢిల్లీలో చేరిక

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే బహిష్కృత నేత , రాజ్యసభ మాజీ సభ్యుడు మైత్రేయన్ బీజేపీ గూటికి చేరారు. ఆదివారం ఆయన ఢిల్లీలో బీజేపీ పెద్దలను కలిసి ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అన్నాడీఎంకే అధినేత్రి , దివంగత సీఎం, అమ్మ జయలలిత జీవించి ఉన్నకాలంలో పార్టీలో మైత్రేయన్ కీలకంగా ఉండే వారు. వైద్యుడైన ఆయన్ని ఆమె రాజ్యసభకు పంపించే వారు. ఆమె మరణంతో 2017లో ఆ పార్టీ నేత పన్నీరు సెల్వం ధర్మయుద్ధానికి మద్దతుగా మైత్రేయన్ నిలిచారు. ఆ తర్వాతి పరిణామాలతో పళనిస్వామి పక్షాన నిలబడ్డారు. ఆయనతో కూడా వైరం పెంచుకోవడంతో పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యా రు. ఆయన్ని పార్టీ నుంచి అన్నాడీఎంకే ప్రధానకార్యదర్శి పళనిస్వామి శిబిరం తొలగించింది. దీంతో గత కొన్ని నెలలుగా రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉన్న ఆయన తాజాగా బీజేపీలో చేరారు. ఆయన్ని తమ పార్టీలోకి రావాలని బీజేపీ నేతలు ఆహ్వానించినట్లు సమాచారం. దీంతో ఆయన ఢిల్లీ వెళ్లి మరీ బీజేపీలో చేరారు. రాజ్యసభ సభ్యుడిగా ఉన్న కాలంలో ఢిల్లీ లోని అన్ని పార్టీల నేతలతో మై త్రేయన్‌కు సన్నిహిత సంబంధాలు ఉండేది. ప్రసు త్తం ఆయన బీజేపీలోకి చేరడంతో ఏదేని పదవి వరించేనా..? అనే ఉత్కంఠ మద్దతుదారుల్లో కనిపిస్తోంది.

దివ్యాంగుడితో మోదీ సెల్ఫీ



సాక్షి, చెన్నై: శనివారం రాత్రి చెన్నై నుంచి మైసూరుకు తిరిగి వెళ్లే సమయంలో విమానాశ్రయం వద్ద తన కోసం వేచి ఉన్న ఓ దివ్యాంగుడి వద్దకు ప్రధాని మోదీ వెళ్లారు. అతనితో సెల్ఫీ దిగి తన ట్విట్టర్‌లో ఆదివారం పీఎం పోస్ట్ చేశారు. ఈరోడ్‌కు చెందిన ప్రత్యేక ప్రతిభావంతుడైన యువకుడు మణికంఠన్ ఉన్న బీజేపీలో తానూ ఉండడం ఆనందంగా ఉందని ట్వీట్‌లో పేర్కొన్నారు. మణికంఠన్ కలలు సాకారం కావాలని మోదీ ఆకాంక్షించారు.

కాశిమేడులో మరింత పెరిగిన చేపల ధరలు



తిరువొత్తియూరు: రాయపురం, కాశిమేడు చేపల మార్కెట్‌లో ఆదివారం చేపల ధరలు విపరీతంగా పెరిగాయి. వివరాలు.. చెన్నై కాశిమేడు చేపల మార్కెట్‌కు పలు ప్రాంతాల నుంచి మత్స్యకారులు పడవల ద్వారా తీసుకువచ్చి చేపలను విక్రయిస్తుంటారు. ఇక్కడ చేపలను కొనడానికి పెద్ద వ్యాపారులు, చిరు వ్యాపారులు, ప్రజలు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. ఈ క్రమంలో ఇక్కడ శని ఆదివారాల్లో ఇక్కడ రద్దీ అత్యధికంగా ఉంటుంది. కాగా ఆదివారం ఎక్కువ మంది వ్యాపారులు ప్రజలు మార్కెట్‌కు తరలి వచ్చారు. ఏటా చేపల ప్రత్యుత్పత్తి కాలంలో జాలర్లు చేపల వేటకు వెళ్లడంపై ప్రభుత్వం నిషేధం విధిస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాది ఈనెల 15వ తేదీ నుంచి జూన్14వ తేదీ వరకు నెల రోజుల పాటు చేపల వేటపై నిషేధం విధించారు. దీంతో ఆదివారం ఉదయం పెద్దసంఖ్యలో చేపల ప్రియులు, వ్యాపారులు రావడంతో మార్కెట్ కిక్కిరిసింది. చేపల ధరలు మామూలు కంటే అధికంగా ఉన్నప్పటికీ పెద్ద మొత్తంలో వ్యాపారం జరిగినట్లు ఇక్కడి వ్యాపారులు తెలిపారు.

గున్న ఏనుగుతో ప్రధాని సరదాగా..



బొమ్మన్, బెల్లి దంపతులతో పీఎం మోదీ



తెప్పకాడు సంరక్షణ కేంద్రంలో ఏనుగులను పరిశీలిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ



గజానందం!

- తెప్పకాడు ఏనుగుల సంరక్షణ కేంద్రాన్ని సందర్శించిన ప్రధాని మోదీ
- ఆహారం అందజేసి గున్న ఏనుగుతో సరదాగా..
- మావటీలతో మాటామంతీ
- బొమ్మన్, బెల్లి దంపతులకు అభినందనలు
- గంటన్నర పాటు ముదుమలై అభయారణ్యంలోనే పీఎం

సాక్షి, చెన్నై: ముదుమలై అభయారణ్యంలోని తెప్పకాడు ఏనుగుల సంరక్షణా కేంద్రాన్ని ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ సందర్శించారు. గంటన్నర పాటు ఈ అభయారణ్యంలో గడిపారు. సంరక్షణ కేంద్రంలో కలియదిరుగుతూ సందడి చేశారు. ఏనుగు తొండాలను నిమురుతూ, చెరుకు గడలు ఆహారంగా అందిస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. ది ఎలిఫెంట్ విస్పరర్స్‌తో ప్రపంచ గుర్తింపు పొందిన బొమ్మన్ , బెల్లి దంపతులను పరామర్శించి, అభినందనలు తెలియజేశారు. అటవీ ఏనుగులను మచ్చిక చేసుకునే అంశాల గురించి మావటీలను అడిగి తెలుసుకున్నారు. వివరాలు.. ది ఎలిఫెంట్ విస్పరర్స్ డాక్యుమెంటరీ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొంది.. ఆస్కార్ అవార్డును సైతం దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ లఘు చిత్రం కోయంబత్తూరు జిల్లా ముదుమలై అభయారణ్యంలోని తెప్పకాడు ఏనుగుల సంరక్షణ కేంద్రంలో చిత్రీకరించినట్లు తెలియడంతో ప్రధాని నరేంద్రమోదీ దాన్ని సందర్శించాలని ఇటీవల నిర్ణయించారు. ఈ చిత్రంలో గున్న ఏనుగును సంరక్షించిన బొమ్మన్, బెల్లి దంపతులను స్వయంగా కలిసి అభినందిస్తానని ప్రకటించారు.

గంటన్నర పాటు..

చెన్నై పర్యటన ముగించుకుని శనివారం రాత్రి మైసూర్‌కు వెళ్లిన ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం అక్కడి బంధిపూర్ పులుల శరణాలయాన్ని సందర్శించారు. ఇక్కడి నుంచి 12 కి.మీ దూరం అటవీ రోడ్డు మార్గంలో ప్రయాణించి ముదుమలై అభయారణ్యం చేరుకున్నారు. ఇక్కడి నుంచి తెప్పకాడు ఏనుగుల సంరక్షణ కేంద్రానికి 10.30 గంటలకు వచ్చారు. ఇక్కడి పెంపుడు ఏనుగులు, కుంకీ ఏనుగులను దగ్గరుండి మరీ పీఎం చూశారు. వాటికి చెరుకు గడలను అందజేశారు. కొన్ని ఏనుగులు తొండాన్ని చేతితో నిమురుతూ ఆప్యాయంగా పీఎం మోదీ పలకరించి ఆనందాన్ని పంచుకున్నారు. ఏనుగుల సంరక్షకులుగా ఉన్న కుమరన్, దేవరాజ్, కుల్లన్, మారన్‌తో పీఎం మాట్లాడారు. అటవీ ఏనుగులను పట్టుకునే సమయంలో ఎదురయ్యే శ్రమ, సమస్యలను తెలుసుకున్నారు. ఆ ఏనుగులను మచ్చిక చేసుకుని, పెంపుడు ఏనుగులుగా మార్చడం గురించి ఆరా తీశారు. అలాగే ఓ పులిని పట్టుకునేందుకు జరిగిన టీ -20 ఆ పరేషన్‌లో పాల్గొన్న తెప్పకాడు గ్రామానికి చెందిన బొమ్మన్, మీన్ కాలాన్, మదన్‌తో మాట్లాడి అభినందించారు. అనంతరం ది ఎలిఫెంట్ విస్పరర్స్ డాక్యుమెంటరీలో నటించిన ఏనుగులు రఘు, బొమ్మిలను చూశారు. వాటికి ఆహారం అందజేశారు. గున్న ఏనుగు బొమ్మి అయితే, పీఎంను తన తొండంతో పలకరించే విధంగా చలాకీగా చక్కర్లు కొట్టడం విశేషం. ఈ సమయంలో ఆ చిత్రంలో నటించిన బొమ్మన్, బెల్లి దంపతులతో ప్రధాని ప్రత్యేకంగా మాట్లాడారు. వారి అనుభవాలను తెలుసుకుని, అభినందించారు. వారితో ఫొటో దిగారు. చివరగా పులుల సంరక్షణ కేంద్రంలో ఉన్న 8 మంది సిబ్బందికి ప్రశంసా పత్రాలను ప్రధాని అందజేశారు.



చెరుకు గడ అందజేస్తూ..

హెలికాప్టర్‌లో తిరుగు ప్రయాణం

తెప్పకాడు, ముదుమలై, మసన కుడి పరిసరాలు ప్రధాని రాకతో సుందరంగా మారాయి. ప్లాస్టిక్ వస్తువులతో నిండి అపరిశుభ్రంగా కనిపించే ప్రాంతాలు, అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు మార్గాలు, ప్రధాని పర్యటన నేపథ్యంలో కొత్త సొబగులతో అలరారడం అక్కడి ప్రజల్ని ఆనందంలో ముంచెత్తాయి. అటవీ గ్రామానికి పీఎం రాకతో రోడ్డు వచ్చిందంటూ కొందరు ఆనందం వ్యక్తం చేశారు. తెప్పకాడును సందర్శించిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ రోడ్డు మార్గంలో మసన కుడి వరకు 6 కి.మీ దూరం ప్రయాణించారు. మసన కుడిలో మూడు ఆర్మీ హెలికాప్టర్లను సిద్ధం చేశారు. ఇందులో ఓ హెలికాప్టర్‌లో ప్రధాని కూర్చున్నారు. మూడు హెలికాప్టర్లు ఒకదాని తర్వాత మరొకటి టేకాఫ్ తీసుకుని మైసూర్ వైపుగా వెళ్లాయి. ప్రధాని రాకతో తెప్పకాడు పరిసరాల్లో నీలగిరి, కోయంబత్తూరు జిల్లాలకు చెందిన రెండు వేల మందికి పైగా పోలీసులు భద్రతను పర్యవేక్షించారు. అలాగే కేంద్ర బలగాలు సైతం అటవీ గ్రామాల్లో డేగ కళ్లతో పహారా కాశాయి. మసన కుడి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కగా అటవీ గ్రామ ప్రజలు, గిరిజనులు, బీజేపీ వర్గాలు తమ సంప్రదాయ వస్త్రాలను ధరించి ప్రధానికి ఆహ్వానం పలికారు. కాన్వాయ్ నుంచి దిగి వారిని పీఎం పలకరించారు. కాగా, ప్రధాని రాక సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున పర్యాటక, అటవీ శాఖ మంత్రులు మది అలగన్, రామచంద్రన్ ఏర్పాట్లను పర్యవేక్షించా రు. తెప్పకాడు పర్యటనలో ప్రధాని నెత్తిన టోపీతో ప్రత్యేక వస్త్రధారణతో సందడి చేశారు.

హాట్ కేకుల్లా అమ్ముడైన ఐపీఎల్ టికెట్లు

కొరుక్కుపేట: చెన్నైలో ఐపీఎల్ క్రికెట్ సందడి కొనసాగుతోంది. మూడేళ్ల విరామం తరువాత జరుగుతున్న ఐపీఎల్ క్రికెట్ లీగ్‌తో నగరంలో క్రికెట్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ క్రమంలో ఇటీవల జరిగిన ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌కు క్రికెట్ అభిమానులతో చేపాక్ క్రికెట్ స్టేడియం కిక్కిరిసిపోయింది. టికెట్లు సైతం హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. ప్రస్తుతం ఈనెల 12న చెన్నై సూపర్‌కింగ్స్ – రాజస్థాన్ రాయల్స్ మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగనుంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం టికెట్ల విక్రయాలు ప్రారంభం అయ్యాయి. దీంతో శనివారం రాత్రి నుంచే చెన్నై చేపాక్కం మైదానంలో టికెట్లు కొనుగోలు చేసేందుకు అభిమానులు గుమిగూడారు. ఓవైపు ఆన్‌లైన్ విక్రయాలు జరుగుతుండగా మరోవైపు కౌంటర్ల వద్ద కూడా ప్రారంభించారు. దీంతో కౌంటర్‌ల వద్ద అభిమానులు బారులుదీరారు. టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముపోయాయి. ఇదిలా ఉండగా చెన్నై నుంచే కాకుండా కోయంబత్తూరు తదితర ప్రాంతాల నుంచి క్రిక్కెట్ అభిమానులు తరలిరావడం విశేషం.

ప్రత్యేక కౌంటర్లు కావాలి..

ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల టికెట్లు కొనుగోలు చేసే చోట ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని మహిళా క్రికెట్ అభిమానులు కోరారు. క్రికెట్ మ్యాచ్ టికెట్లు కొనుగోలు చేసేందుకు వేలాది మంది పురుషులతో పాటు, మహిళలు పెద్ద ఎత్తున క్యూలైన్లలో వేచి ఉన్నారు. చాలా మంది మ్యాచ్‌లను టెలివిజన్‌లో చూడటం కంటే ప్రత్యక్షంగా చూడటానికే ఇష్టపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య మ్యాచ్ టిక్కెట్లు కొనుగోలు కోసం వచ్చామని.. చేసేందుకు వచ్చామని.. కానీ ఇక్కడ ప్రత్యేక క్యూలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. చెన్నై సూపర్ కింగ్స్ టీమ్ మేనేజ్‌మెంట్ భవిష్యత్తులో మహిళల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు.



టికెట్ల కోసం వేచి ఉన్న అభిమానులు

వందే భారత్ హౌస్ ఫుల్

- 16 వరకు రిజర్వేషన్లు పూర్తి
- ప్రజల నుంచి విశేష స్పందన

సాక్షి, చెన్నై: చెన్నై – కోయంబత్తూరు వందే భారత్ రైలుకు విశేష స్పందన లభిస్తోంది. ఈనెల 16వ తేదీ వరకు అన్ని సీట్లు రిజర్వుడ్ అయ్యాయి. చెన్నై – కోయంబత్తూరు మధ్య వందే భారత్ రైలు సేవలకు శనివారం ప్రధాని నరేంద్ర మోదీ జెండా ఊపిన విషయం తెలిసిందే. తొలి రోజు రైలు సేవ సాయంత్రం 4 గంటలకు మొదలైంది. ఈనెల 12వ తేదీ బుధవారం నుంచి పూర్తిస్థాయిలో ఈ రైలు సేవ అందుబాటులోకి రానుంది. దీంతో ముందస్తు రిజర్వేషన్లు మొదలయ్యాయి. ఇందులో 12వ తేదీనుంచి 16 వ తేదీ వరకు రైలులోని అన్ని టికెట్లు రిజర్వుడ్ అయ్యాయి. ఆ తర్వాత మరో వారం రోజులకు ముందుగానే పెద్ద సంఖ్యలో రిజర్వుడ్ చేసుకునే విధంగా అనేక మంది దృష్టి పెట్టి ఉన్నారు. ఈరైలు కోయంబత్తూరులో ఉదయం 6 గంటలకు బయలు దేరుతుంది. 11. 50 చెన్నై ఎంజీఆర్ సెంట్రల్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 2.25కు చెన్నైలో బయలుదేరి రాత్రి 8.15 గంటలకు కోయంబత్తూరుకు చేరుకుంటుంది. మార్గం మధ్యలో సేలం, ఈరోడ్, తిరుప్పూర్ స్టేషన్‌లలో మాత్రమే ఈ రైలు ఆగుతుంది. ఈ రైలులో ప్రయాణించే వారికి రెండు రకాల టికెట్ల ధరను నిర్ణయించారు. ఏసీ చైర్ కార్‌లో రూ. 1.215గా, ఏసీ ఎగ్జిక్యూటివ్ చైర్ కారులో రూ. 2,310గా చార్జీని నిర్ణయించారు.

ఆనందంలో గ్రామీణ ప్రజానీకం

చెన్నై తాంబరం – తెన్‌కాశి జిల్లా సెంగోట్టై మధ్య సూపర్ ఫాస్ట్‌రైలుగా (వారంతాపు ఆది, సోమవారం) సేవలకు శ్రీకారం చుట్టారు. ఈ రైలు తాంబరం నుంచి బయలుదేరి విల్లుపురం, తిరుప్పదిరి పులియూర్, మైలాడుతురై, తిరువారూర్, తిరుత్తురై పూండి, ముత్తుపేట, పట్టుకోట్టై, అరంతాంగి, కారైక్కుడి, అరుప్పుకోట్టై, విరుదునగర్, తిరునల్వేలి, చేర్మాదేవి, అంబాసముద్రం, పావు చత్రం, తెన్‌కాశి మీదుగా సెంగోట్టైకు నడపనున్నారు. ఆదివారం తాంబరంలో రాత్రి 9 గంటలకు బయలుదేరే ఈ రైలు, సోమవారం ఉదయం 10.50 గంటలకు సెంగోట్టైకు చేరుతుంది. సోమవారం 4.15 గంటలకు బయలుదేరే ఈ రైలు మరుసటి రోజు ఉదయం 6.05 గంటలకు తాంబరానికి చేరుకుంటుంది. 16,17 తేదీల నుంచి ఈరైలు సేవలు మొదలు అవుతాయి. ప్రయాణికుల ఆదరణను బట్టి జూన్ నుంచి సేవలను విస్తరించనున్నారు. జూన్ నుంచి తాంబరం లో ఆది, మంగళ, గురువారాలలో, సెంగోట్టైలో సోమ, బుధ, శుక్రవారాల్లో ఈ రైలు బయలు దేరుతుంది. ముందస్తు రిజర్వేషన్లు మొదలయ్యాయి. ఇందులో టూ టైర్ ఏసీ కోచ్‌లో రెండు, ఏసీ 3 టైర్ ఐదు, స్లీపర్ ఐదు, జనరల్ కోచ్‌లు మూడు, రెండు లగేజ్ వ్యాన్ కోచ్‌లు ఉంటాయి. అయితే గ్రామీణ ప్రాంతాలను కలిపే విధంగా ఈరైలు సేవలకు శ్రీకారం చుట్టడంతో కొత్త రైలుకు దారి పొడవున అన్ని స్టేషన్లలో బ్రహ్మరథం పట్టే విధంగా ఆహ్వానాలు లభించాయి. ఇక తిరుత్తురై పూండీ – నాగపట్నం జిల్లా అగస్త్యేయ మలై మధ్య డీఈఎంయూ రైలుకు అక్కడి ప్రజలు ఘన స్వాగతం పలికారు.



మాస్టర్ ప్లాన్‌పై అభిప్రాయ సేకరణ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి శేఖర్ బాబు



క్యూర్ కోడ్‌ను స్కాన్ చేస్తూ..

- ఆన్‌లైన్‌లోనూ తెలియచేయవచ్చు
- మంత్రి శేఖర్ బాబు ప్రకటన
- కరపత్రాల విడుదల
- ప్రారంభమైన సంతకాల సేకరణ

సాక్షి, చెన్నై: చెన్నై మహా నగరం మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై ప్రజల తమ అభిప్రాయాలను నేరుగా తెలియజేయవచ్చు..అని సీఎండీఏ, దేవదాయ శాఖ మంత్రి పీకే శేఖర్ బాబు ఆదివారం తెలిపారు. ఆన్‌లైన్‌ద్వారా లేదా ప్రత్యేక శిబిరాల్లో తమ అభిప్రాయాలు తెలియజేయడమే కాకుండా, కొత్త సలహాలు ఇవ్వాలని కోరారు. వివరాలు.. చెన్నైను ×మహా*నగరంగా తీర్చిదిద్దేందుకు మూడో మాస్టర్ ప్లాన్ అమల్లోకి రానున్న విషయం తెలిసిందే. ఈ మేరకు చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూరు, రాణి పేట జిల్లాలలోని ప్రాంతాలు కొత్తగా నగర పరిధిలో చేర్చారు. ఫలితంగా ప్రస్తుతం 1,189 చదరపు కిలో మీటర్లు ఉన్న చెన్నై విస్తీర్ణం మరో మూడేళ్లలో 5,904 చదరపు కిలోమీటర్లకు విస్తరించనుంది. ఈ మేరకు చెన్నై సరిహద్దును ఓవైపు చెంగల్పట్టు జిల్లా అచ్చరపాక్కం వరకు, రాణిపేట జిల్లా అరక్కోణంగా వరకు నిర్ణయించారు.

ఈ పరిస్థితులలో మూడవ మాస్టర్ ప్లాన్ అమలు కసరత్తుల్లో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణకు సీఎండీఏ నాంది పలికింది.

కర పత్రాల పంపిణీ..

ఆదివారం మెరీనా తీరంలోని శ్రామిక విగ్రహం వద్ద మూడవ మాస్టర్‌ప్లాన్‌పై అవగాహన కల్పించడమే కాకుండా సంతకాల సేకరణ, కరపత్రాలు పంపిణీ చేశారు. ఇందులో మంత్రి శేఖర్‌బాబు ప్రసంగిస్తూ, మూడో మాస్టర్ ప్లాన్ 2026–2046కు గాను ప్రత్యేక విజన్‌తో రూపొందిస్తున్నామని వివరించారు. చెన్నై నగరానికి తొలి మాస్టర్ ప్లాన్ 1976లో, రెండవ మాస్టర్ ప్లాన్ 2008లో అమల్లోకి వచ్చిందని.. దీని ఆధారంగా ప్రస్తుతం చెన్నై నగరం 1,189 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో ఉందని గుర్తు చేశారు. 2026 నుంచి ఇది నాలుగింతలు కానుందని వివరించారు. ఇందులో ప్రజల్ని భాగస్వామ్యం చేయడానికి ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. చెన్నై నగరంలో మండలాల సంఖ్య పెంపు, మూడో మాస్టర్ ప్లాన్ అమలు నిమిత్తం ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, స్థానిక సంస్థల ప్రతినిధులతో పాటు ప్రత్యేక సలహా కమిటీ నియమించామని వివరించారు. ఈ అన్ని వర్గాలు తమ అభిప్రాయలను తెలియజేయాలని, సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. ఆన్‌లైన్ ద్వారా గానీ లేదా, బస్టాండ్‌లు, బీచ్‌లు, రైల్వే స్టేషన్లు, సినిమా థియేటర్లు, మాల్స్, జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో జరిగే శిబిరాల ద్వారా, అక్కడక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోర్డుల్లోని క్యూర్ కోడ్ ఆధారంగా తమ అభిప్రాయాలను ప్రజలు స్వచ్ఛందంగా , స్వేచ్ఛగా తెలియజేయాలని కోరారు.

తమిళంలో పరీక్షకు.. అనుమతి ఇవ్వండి

- అమిత్ షాకు సీఎం స్టాలిన్ లేఖ



సాక్షి, చెన్నై: సీఆర్‌పీఎఫ్ రిక్రూట్‌మెంట్ పరీక్షలను తమిళంలో రాసేందుకు అనుమతి ఇవ్వాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు ముఖ్యమంత్రి స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయనకు లేఖ రాశారు. ఇందులో రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్ పేర్కొన్న అంశాల మేరకు తమిళంతో పాటుగా పలు ప్రాంతీయ భాషలు అధికారిక భాషలుగా గుర్తించినట్టు వివరించారు. అయితే అయితే రిక్రూట్‌మెంట్ కోసం జరిగే కంప్యూటరైజ్డ్ టెస్ట్ ఇంగ్లిష్, హిందీలో మాత్రమే నిర్వహించడం శోచనీయమని పేర్కొన్నారు. ఈ దృష్ట్యా, త మిళనాడులోని యువకులకు అవకాశం దక్కనివ్వకుండా చేస్తుండడం షాక్‌కు గురి చేసిందన్నారు. మొత్తం 9,212 పోస్టుల్లో తమిళనాడులో 579 పోస్టులు ఉన్నట్లు వివరించారు. 12 కేంద్రాలలో పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ఈ పరీక్షలను మాతృ భాషల్లో రాయడానికి అవకాశం కల్పించాలని కోరారు. హిందీ మాట్లాడే వారికి అవకాశం కల్పించే విధంగా, అనుకూల వాతావరణం సృష్టించే రీతిలో పరీక్షల నిర్వహించడం తగదన్నారు. తమిళనాడులోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ నోటిఫికేషన్, దరఖాస్తులు తమ రాష్ట్ర ప్రయోజనాలకు పూర్తి విరుద్ధంగా, ఏకపక్షంగా ఉందని ఆరోపించారు. వివక్ష అనేది చూపించకుండా అందరికీ అవకాశం కల్పించే విధంగా, నోటిఫికేషన్‌లో మార్పులు చేయాలని కోరారు. ఆయా రాష్ట్రాల యువత వారి మాతృ భాషల్లో పరీక్షలు రాసేందుకు వీలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

పీఎంకు వినతిపత్రం అందజేత..

చెన్నై పర్యటనకు శనివారం వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం స్టాలిన్ ఓ వినతి పత్రాన్ని సమర్పించారు. ఇందులో పేర్కొన్న సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం ప్రకటన రూపంలో ఆదివారం తెలియజేసింది. చెన్నై విమానాశ్రయంలో ప్రధాని నరేంద్ర మోదీకి ఈ విజ్ఞప్తిని అందజేసినట్టు అధికారులు ఇందులో గుర్తు చేశారు. చెన్నై మెట్రో రైలు ప్రాజెక్టుకు నిధులు, కోయంబత్తూరు, మదురై, తిరుచ్చి విమానాశ్రయాల విస్తరణ పనులు, పరందూరు కొత్త విమానాశ్రయం పనులపై త్వరితగతిన దృష్టి పెట్టాలని కోరినట్లు వెల్లడించారు. పాదరక్షల తయారీకి కొత్త ఉత్పాదక ప్రోత్సాహకాలు, యువజన సంక్షేమం, క్రీడల శాఖ తరఫున తమిళనాడులో స్పోర్ట్ కమిషన్ ఆఫ్ ఇండియా జోన్ ఏర్పాటు, రామేశ్వరం నుంచి ధనుస్కోటి వరకు కొత్త బ్రాడ్ గేజ్ మార్గం పనులు, కచ్చదీవుల స్వాధీనం, తమిళ జాలర్లపై జరుగుతున్న దాడులకు అడ్డకట్ట వేయడం తదితర అంశాలను ఆ వినతిపత్రంలో వివరంగా తెలియజేశామన్నారు.

క్లుప్తంగా

గోవిందనామస్మరణతో అగ్నిగుండ ప్రవేశం

తిరుత్తణి: తిరుత్తణిలో ఆదివారం అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం వైభవంగా సాగింది. పట్టణంలోని గాంధీనగర్ ద్రౌపదీదేవి ఆలయంలో మార్చి 23న ధ్వజారోహణంతో అగ్నిగుండ వేడుకలు ప్రారంభమయ్యాయి. 18 రోజుల పాటు నిర్వహించిన ఈ ఉత్సవాల్లో రోజూ పగటి సమయాల్లో మహాభారత కథ, రాత్రి వేళల్లో వీధి నాటకాలు ప్రదర్శించారు. వేడుకల్లో చివరిరోజైన ఆదివారం ఉదయం ఆలయ ప్రాంగణంలో దుర్యోధన వధ ఆకట్టుకుంది. సాయంత్రం అగ్నిగుండం ప్రవేశం సందర్భంగా 3 వేల మంది భక్తులు కంకణాలు ధరించి దీక్షలు చేపట్టి సాయంత్రం పసుపు దుస్తులుతో వేపాకు చేతబట్టి ఆలయం వద్దకు చేరుకున్నారు. అశేష భక్తజనం, బాణసంచా వేడుకలు, విద్యుదీపాల అలంకరణ నడుమ అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. గోవందనామస్మరణతో భక్తులు అగ్నిగుండం ప్రవేశం చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. 50 మందికి పైగా పోలీసులు బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు.

విజయవంతంగా డబ్ల్యూ వీ కనెక్ట్ సదస్సు

కొరుక్కుపేట: చెన్నై మహాబలిపురం వేదికగా నిర్వహించిన డబ్ల్యూ వీ కనెక్ట్ సదస్సు విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా సదస్సు నిర్వహణలో విశేష సేవలను అందించిన వారిని ఆదివారం ఘనంగా సత్కరించారు. డబ్ల్యూ వీ కనెక్ట్ నిర్వాహకులు దక్షిణామూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 600లకు పైగా వెడ్డింగ్ ఇండస్ట్రీలు, డిజైనర్లు పాల్గొని సదస్సును విజయవంతం చేశారని తెలిపారు. ఈ సదస్సు ద్వారా దేశంలోనే తొలిసారిగా 101 మంది పేదలు, దివ్యాంగులకు ఉచిత సామూహిక వివాహాలు జరిపినట్లు తెలిపారు.

ఖైదీ అనుమానాస్పద మృతి

అన్నానగర్: పుళల్ జైలులో ఓ ఖైదీ శనివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలు.. చెన్నైలోని నందనం ప్రాంతానికి చెందిన గణేశన్ (56)ను గత ఏడాది నవంబర్‌లో మనీ లాండరింగ్ కేసులో సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆ తరువాత పుళల్ జైలులో రిమాండ్ విధించారు. ఈ స్థితిలో శనివారం రాత్రి గణేశన్ అకస్మాతుగా అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మార్గమధ్యంలో ఊపిరాడక గణేశన్ మృతి చెందినట్లు తెలిపారు. పుళల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోలాహలంగా ఈస్టర్ వేడుకలు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



ఈస్టర్ సందేశాన్ని అందిస్తున్న రెవరెండ్ డాక్టర్ ఎస్. రాజేంద్ర ప్రసాద్



భక్తిగీతాలను ఆలపిస్తున్న మహిళలు

కొరుక్కుపేట: రాష్ట్రంలో ఈస్టర్ పండగను క్రైస్తవులు ఆదివారం కోలాహలంగా జరుపుకున్నారు. ప్రధానంగా నాగపట్నం వేలాంగణి చర్చిలో ఈస్టర్ పండుగ సంబరాలు మిన్నంటాయి. చెన్నై అంతటా ఈస్టర్ పండుగను అత్యంత ఉత్సాహంగా జరుపుకుంటారు. ముఖ్యంగా క్రైస్తవులు ఈస్టర్‌ను యేసు క్రీస్తు పునరుత్థానంగా భావించి జరుపుకుంటారు. వెస్లీ టెంపుల్, కేథడ్రల్ టెంపుల్, శాంతోమ్, బీసెంట్ నగర్ వెలాంగణి చర్చ్, పెరంబూర్ మేరీ మాత ఆలయం సహా పలు చర్చిలలో ఆదివారం వేకువజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు, భక్తి గీతాలాపనలు జరిగాయి.

వెపేరిలో....

తెలుగు క్రైస్తవుల ప్రదానంగా చెన్నై వేప్పేరిలోని మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్టు సంఘంలో సంఘ కాపరి రెవరెండ్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సారథ్యంలో ప్రత్యేక పార్దనలు చేపట్టారు. ఇందులో సంఘ అధ్యక్షులు జి రామయ్య, సెక్రటరీ పి.ప్రభు దాసు, ట్రెజరర్ ఏ బాబు లు ఏర్పాట్లును పర్యవేక్షించారు.

విల్లివాక్కంలో...

అలాగే చెన్నై విల్లివాక్కంలోని యేసు క్రీస్తు కృపా నీరీక్షణ ప్రార్థన ఫౌండేషన్ చర్చిలో ఈస్టర్‌ను ఘనంగా జరుపుకోగా ఫౌండేషన్ అధ్యక్షులు ఊటుకూరి దేవదానం , సెక్రటరీ సామ్యూల్, ట్రెజరర్ ఊటుకూరి మత్తయ్య, ఫాస్టర్ మాణిక్య రావు, అసిస్టెంట్ పాస్టర్ ఎస్ఆర్ మరియదాస్ పాల్గొని ఈస్టర్ సందేశాన్ని వినిపించారు .40 రోజులు పాటు ఉపవాస ప్రార్థనల్లో పాల్గొన్న మహిళలకు నిర్వాహకులు బహుమతులు అందించారు. యేసుక్రీస్తు సందేశం, దీపాలు ఆర్పివేసి ఏసుక్రీస్తు పునరుత్థానాన్ని ప్రజలకు కళ్లకట్టినట్టు చూపించారు. ఈ సందర్భంగా బాణాసంచా పేలుస్తూ కేక్‌లు కట్ చేశారు. అనంతరం అభిషేకం చేసిన పవిత్ర జలాన్ని క్రైస్తవులపై చల్లి ఆశీర్వదించారు.

వేలూరు: వేలూరు, తిరువణ్ణామలై జిల్లాలలో క్రైస్తవ సోదరులు ఈస్టర్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత 40 రోజులుగా ఉపవాసం ఉంటూ ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మార్చి 30న మట్టల పండుగ జరిగింది. గత శుక్రవారం ఏసు ప్రభువును శిలువ వేసిన రోజు కావడంతో గుడ్‌ఫ్రైడేగా జరుపుకొని ప్రతి ఒక్కరూ ఉపవాసం ఉండి మధ్యాహ్నం 3 గంటల వరకు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం రాత్రి 12 గంటల సమయంలో ఏసు ప్రభువు సమాధి నుంచి తిరిగొచ్చిన దినంగా భావించి ప్రతి చర్చిలోనూ వేడుకలు నిర్వహించారు. అదేవిధంగా ఆదివారం ఉదయం ప్రతి చర్చిలోనూ పుష్పాలతో అలంకరించి ఉదయం నుంచి ఈస్టర్ పండు వేడుకలను జరుపుకొని ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకొని



శాంతి సందేశం వినిపిస్తున్న పాస్టర్లు

వేలూరు, తిరువణ్ణామలై జిల్లాలోని ప్రతి చర్చిలోనూ క్రైస్తవ సోదరులతో కిటకిటలాడింది. వేలూరు సెంట్రల్ చర్చిలో సీఎస్ఐ బిషప్ శర్మా నిత్యానందం అధ్యక్షతన ప్రత్యేక ప్రార్దనలు చేశారు.

చోరీ కేసులో ఇద్దరి నిందితుల అరెస్టు

తిరువొత్తియూరు: ఈరోడ్ జిల్లాలో రూ. 2.80 కోట్ల నగదు చోరీ వ్యవహారంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న నగదును పోలీసు భద్రత మధ్య ఉంచారు. వివరాలు.. ఈరోడ్ జిల్లా గోపిశెట్టి పాలయం నార్త్ పార్క్ వీధికి చెందిన రియల్ ఎస్టేట్ యజమాని సుదర్శన్. ఇతను భారతి నగర్‌లోని ఓ ఇంటిని రూ.3 కోట్లకు కొనడానికి ధర మాట్లాడాడు. ఇందుకోసం అడ్వాన్స్ నగదుగా రూ. 15 లక్షలు ఇచ్చాడు. దీని తర్వాత సుదర్శన్ ఆ ఇంటి తాళం తీసుకున్నాడు. ఈ క్రమంలో సుదర్శన్ కొత్తగా ఇంటిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి, కొత్త ఇంటికి ఇవ్వవలసిన అడ్వాన్స్ కోసం నాలుగు బ్యాగుల్లో తెచ్చిన రూ 2.80 కోట్లు నగదును కొత్త ఇంటిలోని ప్రత్యేక గదిలో ఉంచి తాళం వేశాడు. ఈ క్రమంలో ఇంటి ముందు తలుపులు పగలగొట్టబడి రూ. 2.80 కోట్లు నగదు చోరీకు గురైంది. దీనిపై సుదర్శన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ఆ ఇంటిలో ఉన్న సీసీటీవీ కెమెరా దృశ్యాలను పోలీసులు తనిఖీ చేయగా చోరీ జరిగిన రోజు తెల్లవారుజామున 3 గంటల సమయంలో తెలుపు రంగు కారు బయలుదేరి వెళ్లిన దృశ్యాలు రికార్డు అయినట్లు తెలిసింది. అందులో ఉన్న వ్యక్తులు రియల్ ఎస్టేట్ వ్యాపారి సుదర్శన్ భాగస్వామి శ్రీధర్, ప్రవీణ్ అని తెలిసింది. వీరిలో శ్రీధర్ ప్రైవేట్ బ్యాంకులో పని చేస్తూ ఉన్నట్లు తెలిసింది. దీంతో వారి నుంచి పోలీసులు నగదును స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు.

బాలికల విద్యకు కృషి



నిర్వాహకులతో అధ్యక్షుడు అమిష్ దోషీ

కొరుక్కుపేట: బేటీ బచావో బేటీ పడావో స్ఫూర్తితో బాలికల విద్యకు కృషి చేయనున్నట్లు జేఎస్‌జీ ఇంటర్నేషనల్ ఫెడరేషన్ నూతన అధ్యక్షుడు అమిష్ దోషి తెలిపారు. ఈ మేరకు ఆదివారం చెన్నైలో జైన్ సోషల్ గ్రూప్ ఇంటర్నేషనల్ ఫెడరేషన్ అంతర్జాతీయ అధ్యక్షులు ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇందులో చెన్నైకు చెందిన అమిష్‌దోషి ఫెడరేషన్ నూతన అంతర్జాతీయ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు ఆయనకు శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అమిష్ దోషీ మాట్లాడుతూ 60 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ప్రపంచంలోనే అతిపెద్ద జైన్ సంస్థల్లో ఒకటైన జేఎస్‌జీ ఇంటర్నేషనల్ ఫెడరేషన్‌కు అంతర్జాతీయ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. అలాగే తమిళనాడు నుంచి గతంలో తన తండ్రి కిరణ్ దోషి అధ్యక్షుడిగా సేవలందించారని అదే సంస్థకు తాను అధ్యక్షులు కావడం పూర్వజన్మసుకృతం అని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో మాజీ అధ్యక్షులు లలిత్ షా, పంకజ్ సంఘ్వీ షా కలిసి ఎంతో సేవ చేశామన్నారు. రానున్న కాలంలో బేటీ బచావో బేటీ పడావో పేరిట బాలిక విద్యకు, యువ స్టార్టప్‌లకు ప్రోత్సాహం అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు జైన్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వడ్డీ లేని రుణం పేరిట మోసం..

- నొలంబూర్‌లో నగల దుకాణం ముట్టడించిన బాధితులు

తిరువొత్తియూరు: వడ్డీ లేకుండా రుణం ఇస్తామని నమ్మబలికి మోసం చేసిన నగల దుకాణ యజమానులను జనం ఆదివారం ముట్టడించారు. వివరాలు.. చెన్నై నొలంబూరు కేంద్రంగా రెండు నగల దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ నగలు తాకట్టు పెట్టిన వారికి వడ్డీ లేకుండా నగదు అప్పు ఇవ్వడం, నగల కోసం పెట్టుబడి పెట్టిన వారికి ఎక్కువ అధిక వడ్డీ ఇస్తామంటూ యజమానులు ఆసక్తికర ప్రకటనలు ఇచ్చారు. దీన్ని నమ్మి ఆ ప్రాంతానికి చెందిన వారే కాకుండా చుట్టుపక్కల జిల్లాల ప్రజలు ఈ రెండు దుకాణాలకు సంబంధించిన సంస్థల్లో నగదును పెట్టుబడిగా పెట్టారు. కానీ డబ్బు డిపాజిట్ చేసిన వారికి చెప్పిన ప్రకారం నగదు గానీ, వడ్డీ గానీ ఇవ్వలేదు. దీంతో మోసపోయిన ప్రజలు నొలంబూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈక్రమంలో డిపాజిట్‌దారులు 100 మందికి పైగా ఆదివారం ఉదయం నగల దుకాణాన్ని ముట్టడించి ఆందోళన చేపట్టారు. పోలీసులు వారిని సముదాయించి పంపించారు. ఈ ఘటన ఆ ప్రాంతంలో కలకలం రేపింది.

వరల్డ్ స్కాలర్స్ కప్‌కు స్పందన



వరల్డ్ స్కాలర్స్ కప్ పేరిట విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికి తీసే విధంగా రీజినల్ రౌండ్ పోటీలు ది ప్యూపిల్ సవీత ఎకో స్కూల్ ఆవరణలో ఆదివారం జరిగాయి. ఇందులో 25కు పైగా పాఠశాలలకు చెందిన 700 మంది విద్యార్థులు రచనలు, టీమ్ డిబేట్, ఛాలెంజ్ తదితర విభాగాలలో తమ ప్రతిభను చాటుకున్నారు. ఇందులో విజేతలను గ్లోబల్ రౌండ్‌లకు ఎంపిక చేశారు. - సాక్షి, చెన్నై

సినీ ప్రోత్సాహక అవార్డుల ప్రదానం



అవార్డుల ప్రదానోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

తమిళసినిమా: సినిమా, బుల్లితెర తారల ప్రోత్సాహక అవార్డుల వేడుక శనివారం సాయంత్రం స్థానిక వడపళనిలోని శిఖరం హాలులో ఘనంగా జరిగింది. మహా ఆర్ట్స్ అధినేత అనురాద జయరామన్, యునైటెడ్ ఆర్టిస్ట్ ఆఫ్ ఇండియా అధినేత, కలైమామణి నెల్‌లై సుందరరాజన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ వేడుకలో చెన్నై హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎస్.కె.కృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొని నటీనటులకు అవార్డులను ప్రదానం చేశారు. ఆయన్ని ఈ సందర్భంగా అవార్డుల ప్రదానోత్సవం నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ వేదికపై నటి నరేశ్ ఈశ్వర్ శ్వేత, ఐశ్వర్య, అరువి సెల్వం, వ్యాఖ్యాత అనురాధ తదితరులు అవార్డులను అందుకున్నారు. అవార్డు గ్రహీతలను మాజీ హైకోర్టు న్యాయమూర్తి ఎస్.కె.కృష్ణన్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు. అదే విధంగా ఇలాంటి మంచి కార్యక్రమాలను మరిన్ని ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. కాగా అంతకుముందు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.

జగన్మోహిని స్ఫూర్తితో రిప్పబ్బరి



రిప్పబ్బరి చిత్ర ట్రైలర్ ఆవిష్కరణలో యూనిట్ సభ్యులు

తమిళసినిమా: మాస్టర్ మహేంద్రన్ కథానాయకుడిగా నటించిన చిత్రం రిప్పబ్బరి. నటి కావ్య అరివుమణి, ఆర్తి, శ్రీని, నోబెల్ జేమ్స్, మారి తదితరులు పోషించారు. ఏకే ది టేల్స్ మెన్ పతాకంపై ఎన్.అరుణ్ కార్తీక్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ఇది. దళపతి రత్నం ఛాయాగ్రహణం, ద్వారకా త్యాగరాజన్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ నెల 14న తెరపైకి రానుంది. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం చెన్నైలోని పలోజో థియేటర్లో చిత్ర ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకనిర్మాత అరుణ్ కార్తీక్ మాట్లాడుతూ ఇది హర్రర్, కామెడీ నేపథ్యంలో రూపొందించిన చిత్రమని తెలిపారు. జగన్మోహిని స్ఫూర్తితో తెరకెక్కించిన చిత్రం రిప్పబ్బరి అని చెప్పారు. చిత్రాన్ని తొలిసారిగా తానే దర్శకత్వం వహించి నిర్మించడంతో కాస్త భయం వేసిందన్నారు. అయితే సొంతంగా చిత్రం చేయడానికి మంచి కథ అవసరమన్నారు. అలా ఈ కథ తనకు పక్కబలంగా అమరిందన్నారు. మంచి కథ లభించిన నమ్మదగ్గ నటీనటులు, సాంకేతిక వర్గం అవసరమన్నారు. ఆ విధంగా ఈ చిత్రంలో పని చేసిన వారంతా తమిళ సినిమాలో ఉన్నత స్థానానికి చేరుకోదగ్గ ప్రతిభ కలిగిన వారని పేర్కొన్నారు. వారి వల్లే తనకు ఈ చిత్రం సాధ్యమైందని చెప్పారు. దివాకర్ త్యాగరాజన్ సంగీతం, దళపతి రత్నం ఛాయాగ్రహణం, మురుగన్ వేల్, ఎడిటింగ్ ఈ చిత్రాన్ని వేరే లెవెల్‌కు తీసుకెళ్లాయన్నారు. ఇక నటుడు మాస్టర్ మహేంద్రన్ ఈ చిత్రం ద్వారా తనకు ఒక సహోదరుడుగా లభించారన్నారు. తన పనిని సగం ఆయనే చేశారని కొనియాడారు.

కోలీవుడ్ టాక్స్



ఎవరేమంటే నాకేంటి

తమిళసినిమా: నటి నిత్యామీనన్‌ది ప్రత్యేక బాణి. పాత్ర నచ్చితే చాలు అది హీరోయిన్ పాత్ర, గెస్ట్ పాత్ర అని చూడదు. నటించడానికి సై అంటుంది. పాత్ర నచ్చకపోతే ఎంత పెద్ద దర్శకుడి చిత్రమైనా నో చెప్పేస్తుంది. పదేళ్ల ప్రాయంలోనే బాల నటిగా రంగప్రవేశం చేసిన ఈ మలయాళీ బ్యూటీ, అంచలంచెలుగా ఎదిగి కథానాయకి స్థాయిలో రాణిస్తోంది. మొదట్లో మలయాళం, తెలుగు భాషల్లో నటించిన నిత్యామీనన్ తమిళంలో సిద్ధార్థ్‌కు జంటగా 108 చిత్రంలో ఎంట్రీ ఇచ్చింది. బహుబాషా నటిగా గుర్తింపు పొందిన ఈ అమ్మడు మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కిన కాదల్ కణ్మణి మంచి విజయాన్ని అందుకుంది. ఆ తరువాత రాఘవ లారెన్స్‌కు జంటగా కాంచన -2, విజయ్ సరసన మెర్సల్ వంటి చిత్రాలలో చక్కని అభినయాన్ని ప్రదర్శించి గట్టిగా తనేంటో చాటుకుంది. అదే విధంగా తెలుగులో గీత గోవిందం చిత్రంలో కీలక పాత్ర పోషించి తన ప్రత్యేకతను చాటుకుంది. విషయం ఏంటంటే నిత్యామీనన్ విషయంలో పొట్టి, బొద్దు వంటివి ఆటంకం కాలేదు. వాటి గురించి వస్తున్న విమర్శలను ఆమె అసలు పట్టించుకోదు. తనకు నచ్చిన పాత్రలకు ఎలా న్యాయం చేయాలా అన్న విషయంపైనే దృష్టి పెడుతుంది. ఆమె ఇటీవల తమిళంలో ధనుష్‌కు జంటగా తిరుచిట్రంఫలం చిత్రంలో నటించి ఆ చిత్ర విజయానికి కీలకంగా మారింది. అందులో కూడా ఆమె ఆకారాన్ని వెటకారంగా చూపుతూ ఒక పాట కూడా ఉంటుంది. తాయ్ కెళవి (ముసలమ్మ) అంటూ సాగే ఆ పాట ప్రేక్షకుల మధ్య విశేష ఆదరణ పొందింది. నిత్యామీనన్ వయసు 35 ఏళ్లు. ఇప్పటికీ ఆమె అవివాహితే అన్నది గమనార్హం. ఇటీవలే తన పుట్టినరోజు వేడుకలను జరుపుకున్న నిత్యామీనన్‌కు అవకాశాలు మాత్రం తగ్గేదేలే అంటున్నాయి.

మేనిఫెస్టో విడుదల చేసిన ఎన్.రామసామి జట్టు



మేనిఫెస్టో ఆవిష్కరిస్తున్న సభ్యులు

తమిళసినిమా: తమిళ సినీ నిర్మాతల మండలి ప్రస్తుత నిర్వాహకుల గడువు పూర్తయ్యింది. దీంతో ఈ నెల 30వ తేదీన చెన్నై అడయారులోని జానకి రామచంద్రన్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ ఎన్నికలను నిర్వహించనున్నారు. 30వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఈ ఎన్నికల్లో ప్రస్తుత సంఘం అధ్యక్షుడు ఎన్.రామసామి జట్టు తయారిప్పాలరిన్ నలన్ కాక్కుమ్ పేరుతో మళ్లీ పోటీ చేస్తుండగా, నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ మన్నన్ జట్టు పోటీగా బరిలోకి దిగుతోంది. కాగా ఎన్.రామసామి జట్టు తమ అభ్యర్థుల వివరాలను, మేనిఫెస్టోను శనివారం చెన్నైలోని ఓ స్టార్ హోటల్లో జరిగిన కార్యక్రమంలో ప్రకటించారు. ఈ జట్టులో అధ్యక్షుడి పదవికి ఎస్.రామసామి, ఉపాధ్యక్షుడి పదవికి జీఎస్ తమిళ్ కుమరన్, కార్యదర్శి పదవులకు ఆర్.రాధాకృష్ణన్, ఎస్.కదిరేశన్, కోశాధికారి పదవికి చంద్రప్రకాష్, ఉప కార్యదర్శి పదవికి ఎస్.సౌందర్ పాండియన్‌తో పాటు 26 మంది కార్యవర్గ సభ్యులు పోటీ చేస్తున్నారు. కాగా ఈ జట్టు మేనిఫెస్టోను నిర్మాత కలైపులి ఎస్.థాను ఆవిష్కరించగా తొలి ప్రతిని నటుడు ఎస్వీ శేఖర్, కె.రాజన్, వి.సి.గుహనాథన్ అందుకున్నారు.

'టెస్ట్' కోసం రెడీ అవుతున్న నయనతార



తమిళసినిమా: లేడీ సూపర్‌స్టార్ నయనతార తాజాగా బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. అక్కడ బాద్‌షా షారూక్‌ఖాన్‌తో జవాన్ చిత్రంలో నటిస్తున్నారు. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. కాగా ఈమె నటించి నిర్మించిన కనెక్ట్ చిత్రం ఇటీవల తెరపైకి వచ్చింది. ఆశించిన విజయం సాధించకపోయినా ఇదో విభిన్న ప్రయత్నం. అయితే ఇటీవల నయనతారకు అవకాశాలు తగ్గాయని, ఆమె కూడా నటనకు స్వస్తి చెప్పి చిత్ర నిర్మాణ రంగంపై దృష్టి పెట్టబోతున్నార నే ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. అయితే అదంతా ఒక ప్రచారం మాత్రమే. వాస్తవానికి నయనతార చిన్న గ్యాప్ తీసుకున్నారంటే. కవల పిల్లలకు తల్లి అవడం అదే విధంగా తన భర్త దర్శకుడు విఘ్నేష్ శివన్ తాజా చిత్రం మిస్ కావడంతో కొంత గ్యాప్ వచ్చింది. అయితే తాజాగా మళ్లీ నటిగా విజృంభించడానికి సిద్ధమయ్యారు. ఆమె నటిస్తున్న 75వ చిత్ర షూటింగ్ సైలెంట్‌గా శనివారం చెన్నైలో ప్రారంభమైంది. ఇది ఆమె నటిస్తున్న లేడీ ఓరియంటెడ్ కథా చిత్రం కావడం గమనార్హం. తాజాగా మరో భారీ చిత్రానికి కూడా నయనతార గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఇందులో నయనతారతో పాటు నటుడు మాధవన్, సిద్ధార్థ్ ప్రధాన పాత్రలు పోషించనున్నారు. దీనిని నిర్మాత వై నాట్ శశి స్వీయ దర్శకత్వంలో నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇంతకు ముందు పలు విజయవంతమైన చిత్రాలు నిర్మించిన ఈయన ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా కూడా పరిచయం అవుతున్నారన్నమాట. ఇది క్రికెట్ క్రీడ నేపథ్యంలో సాగే కథా చిత్రం అని సమాచారం. దీనిని ది టెస్ట్ అనే పేరును నిర్ణయించినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.

క్లుప్తంగా

కొడైకానల్‌లో పర్యాటకుల సందడి

– 5 కి.మీలు నిలిచిపోయిన వాహనాలు

తిరువొత్తియూరు: పర్యాటకులతో కొడైకానల్‌లో సందడి నెలకొంది. వేసవి నేపథ్యంలో ఆహ్లాదకర వాతావరణం కోసం ఎక్కువ మంది ప్రకృతి ప్రేమికులు కొడైకానల్ వస్తుంటారు. ఈ ఏడాది ఇప్పటికే ఎండలు మండిపోతుండడంతో కొడైకానల్‌కు పర్యాటకులు రద్దీ ఎక్కువైంది. దీంతో సుమారు 5 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. శుక్రవారం నుంచి వరుసగా మూడు రోజులు సెలవులు కావడంతో ఎక్కువ మంది పర్యాటకులు కొడైకానల్‌కు వచ్చారు. జలపాతం నుంచి అప్పసార్ వేట్టరి వరకు సుమారు 5 కిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఉదయం మొదలు సాయంత్రం వరకు వరుసగా వాహనాలకు సుమారు మూడు గంటల సమయం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. తగిన సంఖ్యలో ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో ముఖ్య ప్రాంతాల్లో ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తోందని పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేశారు.

చెట్టును ఢీకొన్న కారు

- తండ్రీకొడుకులు మృతి
- నలుగురికి తీవ్ర గాయాలు

తిరువొత్తియూరు: కన్యాకుమారి జిల్లాలో కారు చెట్టును ఢీకొన్న ప్రమాదంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, ఆయన కుమారుడు మృతి చెందాడు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కన్యాకుమారి జిల్లా కన్నుమామూడు ప్రాంతానికి చెందిన రసలయ్యన్ (66) విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు. ఆయన కుమారుడు అరుణ్ శ్యామ్ (30), కోడలు అక్షయ (27). ఈమె మదురై మండల రైల్వే జోన్‌లో జూనియర్ సహాయ ఉద్యోగినిగా నియమితులయ్యారు. ఇందుకోసం అక్షయ చెన్నైలో శిక్షణ పొందుతున్నారు. ఈ క్రమంలో ఈస్టర్ పండుగను పురస్కరించుకుని భార్యను, అరుణ్ శ్యామ్ చెన్నై నుంచి కారులో తీసుకుని వెళుతున్నాడు. ఆ కారులో రసలయ్యన్, అక్షయ తల్లి సరోజ(55), తమ్ముడు అఖిల్ రాజు(25), అక్షయ కుమారుడు ఆట్రియన్(1) తదితరులు ఉన్నారు. అరుణ్ శ్యామ్ కారు నడుపుతున్నాడు. అర్ధరాత్రి ఇలక్కురి వద్ద కారు వస్తుండగా కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో అరుణ్ శ్యామ్, రసలయ్యన్ సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. కారులో వెనుక సీటులో ఉన్న అక్షయ, సరోజ, అఖిల్‌రాజు, ఆట్రియన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో మునిగి ఇద్దరు విద్యార్థుల మృతి

తిరువొత్తియూరు: ఈరోడ్ జిల్లాలో ప్రత్యేక తరగతులకు వెళ్లి వస్తున్న సమయంలో వ్యవసాయ నీటి కాలువలో మునిగి ఇద్దరు పదో తరగతి విద్యార్థులు మృతిచెందారు. ఈరోడ్ జిల్లా గొందంపాడికి చెందిన పీటర్ కనకరాజు కుమారుడు గాడ్సన్ ప్రిన్సెస్ (15), అతని స్నేహితుడు గొందంపాడి సత్య మంగళం రోడ్డుకు చెందిన తామరై సెల్వన్ కుమారుడు హరికృష్ణన్(15) స్థానిక ప్రభుత్వ మోడల్ మహోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. ప్రస్తుతం 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో వారు శనివారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక తరగతులకు వెళ్లారు. ఇంటికి తిరిగి వస్తున్నారు. ఆ సమయంలో మార్గంలో కీల్ భవాని నది నుంచి వస్తున్న వ్యవసాయ నీటి కాలువలో స్నానం చేయడానికి దిగారు. ఆ సమయంలో గాడ్సెన్ ప్రిన్సెస్, హరికృష్ణ ఇద్దరు నీటిలో లోతైన ప్రాంతానికి వెళ్లడంతో మునిగి మృతి చెందారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

తిరువొత్తియూరు: విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన చెన్నై పులియంతోపు వవుసి నగర్ 6 వీధిలో చోటుచేసుకుంది. ఆ వీధికి చెందిన గోపి (29) ఇంటి ముందు ప్రొవిజన్ దుకాణం నడుపుతున్నాడు. శనివారం షెట్టర్ తెరిచిన సమయంలో గోపి విద్యుత్ షాక్ తగిలి దూరంగా ఎగిరి పడ్డాడు. కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. వారు అక్కడికి వచ్చి చూసి అతను అప్పటికే మృతిచెందినట్టు ధ్రువీకరించారు. పోలీసులు అక్కడికి చేరుకుని గోపి మృతదేహాన్ని స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.విచారణలో గోపి ఇంటి వద్ద ఉన్న ఈబీ బాక్స్‌లో కొందరు విద్యుత్ చౌర్యం చేసినట్లు తెలిసింది. ఆ వైరు గోపి షట్టర్ వైపు ఉండడంతో షట్టర్‌కు తగిలి విద్యుత్ ప్రసారమైనట్టు గుర్తించారు. దీన్ని గమనించక గోపి షెట్టర్ తెరవడంతో విద్యుత్ షాక్ తగిలి ప్రాణాలు కోల్పోయినట్లు తేలింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గోపికి వివాహమై ఆరేళ్లు అవుతుంది. అతని భార్య రాజ్యలక్ష్మి రెండు నెలల గర్భిణిగా ఉన్నట్లు తెలిసింది.

16, 17, 18 తేదీల్లో ఐఎఫ్‌టీయూ మహాసభలు

తిరుపతి కల్చరల్: తిరుపతిలో ఈ నెల 16, 17, 18 తేదీల్లో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) 7వ అఖిల భారత మహాసభలు నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.హరిక్రిష్ణ తెలిపారు. వారు ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో జాతీయ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సభల్లో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ నిర్మాణ కర్తవ్యాలను చేపట్టనున్నట్లు తెలిపారు.

కనులపండువగా రథోత్సవం

- తిరుప్పర కుండ్రానికి వేలాదిగా తరలి వచ్చిన భక్తజనం
- సమయపురంలో చిత్తిరై ఉత్సవాలు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

సాక్షి, చెన్నై: తిరుప్పర కుండ్రం రథోత్సవంలో హరోం..హర నామస్మరణ మిన్నంటింది. ఆరుపడై వీడులలో మొదటిదిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయంలో రథోత్సవం ఆదివారం భక్త జన సంద్రం నడుమ కోలాహలంగా సాగింది. వివరాలు.. తమిళ్ కడవుల్‌గా భక్తులు కొలుస్తున్న సుబ్రహ్మణ్య స్వామికి ఆరుపడై వీడులలో తొలి వీడుగా మదురై జిల్లా తిరుప్పర కుండ్రం పేరు గడించి ఉంది. ఇక్కడ ఏటా పంగుణి, వైకాశి విశాఖం, కందషష్టి ఉత్సవాలు అత్యంత వేడుకగా జరుగుతాయి. ఈ ఏడాదిలో తొలి వేడుకగా పంగుణి ఉత్సవాలు గత నెల 26వ తేదీ నుంచి బ్రహ్మోండంగా నిర్వహిస్తున్నారు. దేవానై సమేతంగా సుబ్రహ్మణ్య స్వామి వారు భక్తులకు దర్శనం ఇస్తూ వస్తున్నారు. ఆలయంలో రోజూ విశిష్ట పూజలు జరుగుతూ వచ్చాయి. ఇందులో ముఖ్య ఘట్టంగా రథోత్సవాన్ని ఇక్కడి భక్తులు భావిస్తుంటారు. ఈ ఉత్సవం నిమిత్తం ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాది పూజలు జరిగాయి. దేవానై సమేతంగా సుబ్రహ్మణ్య స్వామి బ్రహ్మోండ రథంపై ఆశీనులయ్యారు. భక్త జనుల హరోం..హర నామ స్మరణ మిన్నంటగా రథోత్సవం కోలాహలంగా జరిగింది. ఉదయం ఆరు గంటలకు ఆలయం వద్ద బయలుదేరిన రథం 5 కిలోమీటర్ల దూరం గిరి పాదం మార్గం వైపుగా కదిలింది. భక్తులు రథాన్ని లాగుతూ ముందుకు కదిలారు. భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

సమయపురంలో..

శక్తి క్షేత్రాలలో ఒకటిగా తిరుచ్చి సమయపురం మారియమ్మన్ ఆలయం గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. ఇక్కడి చిత్తిరై ఉత్సవాలు అత్యంత వేడుకగా జరుగుతాయి. ఆదివారం ఈ ఉత్సవాలకు ధ్వజారోహణ చేపట్టారు. ముందుగా 28 రోజుల పాటు భక్తులు ఉత్సవాల నిమిత్తం వ్రతం ఆచరించారు. ఇందులో భాగంగా రోజూ ఆలయంలో విశిష్ట పూజలు చేపడుతారు. ఈనెల 18వ తేదీన అత్యంత ముఖ్యమైన రథోత్సవం నిర్వహించనున్నారు.

గూడ్స్ నుంచి పట్టాలపై పడిన సిమెంట్ స్తంభాలు

- అచ్చరప్పక్కం – తొలుప్పేడు మధ్య స్తంభించిన రైళ్ల రాకపోకలు

కొరుక్కుపేట: మేల్ మరువత్తూరు – తొలుప్పేడు రైలు మార్గం మధ్య ట్రాక్‌లపై సిమెంట్ స్తంభాలను మార్చే పనులు 10 రోజులకు పైగా కొనసాగుతున్నాయి. ఇందులో పలువురు ఉద్యోగులు నిమగ్నమయ్యారు. ఆదివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో చెంగల్పట్టు నుంచి రైలులో మేల్ మరువత్తూరుకు సిమెంట్ స్తంభాలను తీసుకెళ్లారు. అచ్చరప్పక్కం – తొలుప్పేడు మధ్య ప్రయాణిస్తుండగా గూడ్స్ రైలు ట్రాలీపై ఉన్న సుమారు 200ల సిమెంట్ స్తంభాలు పడిపోయాయి. డ్రైవర్ వెంటనే గూడ్సును రైలును నిలిపాడు. వెంటనే రైల్వే అధికారులకు సమాచారం అందించారు. దాదాపు 200 మందికి పైగా రైల్వే సిబ్బంది అక్కడికి చేరుకుని సిమెంట్ స్తంభాలను తొలగించేందుకు ప్రయత్నించారు. వారి వల్ల కాకపోవడంతో జేసీబీ యంత్రాలతో తొలగించే పనులు చేపట్టారు. ఈ కారణంగా రైళ్లను ఇతర ట్రాక్‌ల ద్వారా మళ్లించారు. దీంతో ఉదయం చెన్నై నుంచి వచ్చే రైళ్లన్నీ నిలిచిపోయాయి. అదే విధంగా దక్షిణ జిల్లాల నుంచి చెన్నైకి వచ్చే రైళ్లన్నీ దిండివనం దారిలో ఆగిపోయాయి. చెన్నై నుంచి బయలుదేరే చోళన్ ఎక్స్‌ప్రెస్ రైలును మేల్‌మరువత్తూరు రైల్వేస్టేషన్‌లోను, పాండిచ్చేరి – తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు, గురువాయూర్ ఎక్స్‌ప్రెస్ రైలును మేల్ మరువత్తూరు సమీపంలో నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొంతమంది రైలు దిగి బస్సుల్లో వెళ్లిపోయారు. చెన్నైకి వచ్చే ప్రయాణికులు సమయానికి వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 11.30 గంటలకు సిమెంట్ స్తంభాలన్నింటినీ తొలగించి గూడ్స్ రైలును తొలగించారు.

గేదె ఢీకొని డీఎంకే నిర్వాహకుడు మృతి

అన్నానగర్: ధర్మపురి జిల్లా బాపిరెడ్డి పట్టి సర్కిల్ కొత్తపట్టి సమీపంలోని సెలూరు అమ్మపాళయంకు చెందిన మాదైయాన్ (38) డీఎంకే శాఖ కార్యదర్శి. శనివారం రాత్రి తన కుమారుడు దీపక్ (12)తో కలిసి ద్విచక్ర వాహనంపై దుంబాల్ ప్రాంతానికి వెళ్లాడు. సెలూరుఅమ్మపాళయం డివిజన్ రోడ్డులోని అటవీ ప్రాంతంలో వీరు ప్రయాణిస్తుండగా ద్విచక్ర వాహనాన్ని అటవీ గేదె ఢీకొట్టింది. వాహనంపై నుంచి పడిపోవడంతో మద్దైయన్, దీపక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇరుగుపొరుగు వారు అతడిని రక్షించి అంబులెన్స్‌లో ఆరూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మాదైయాన్ మృతి చెందినట్లు తెలిపారు. దీపక్‌కు తరచూ చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై ఆరూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

పాటో: 28: అరెస్టయిన రమేష్‌చంద్రన్

తిరువళ్లూరు: అంబత్తూరు రైల్వేగేటు వద్ద అక్రమంగా నిల్వ వుంచి గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు ఆదివారం అరెస్టుచేశారు. అతని నుంచి పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తిరువళ్లూరు జిల్లా అంబత్తూరు రైల్వేగేటు వద్ద గంజాయి విక్రయిస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ ధనమ్మాల్‌కు సమాచారం అందింది. ఆమె హుటాహుటిన తన సిబ్బందితో వెళ్లి అనుమానస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అతను కేరళ రాష్ట్రం కొట్టాయం ప్రాంతానికి చెందిన రమేష్‌చంద్రన్(25)గా గుర్తించారు. ఇతను కేరళ నుంచి గంజాయిని రైలులో అంబత్తూరుకు తీసుకొచ్చి విక్రయిస్తున్నట్టు తేలింది. అతడిని అరెస్టు చేసి పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

యువకుడిపై ఫోక్సో కేసునమోదు

తిరువొత్తియూరు: తిరువణ్ణామలై జిల్లాలో బాలికను (15) వివాహం చేసుకొని గర్భవతిని చేసిన మేస్త్రీని పోలీసుల పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. తిరువణ్ణామలై జిల్లా పోలూరు సమీపంలో ఉన్న గ్రామానికి చెందిన కూలీ కార్మికుడి కుమార్తెతో పోలూరు సమీపంలోని కిడంబపాలెం మధుర తొప్పనందల్ గ్రామానికి చెందిన అన్బరసన్ (29) ప్రేమించాడు. విద్యార్థినిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఒక ఆలయానికి తీసుకువెళ్లి తాళి కట్టాడు. ఈ విషయం తెలుసుకున్న ఇరు కుటుంబీకులు వీరి వివాహానికి వ్యతిరేకత తెలిపారు. దీంతో అన్బర్సన్ వేరుగా ఇల్లు అద్దెకు తీసుకుని కాపురం పెట్టాడు. ఈ క్రమంలో విద్యార్థిని అనారోగ్యంతో బాధపడడంతో ఆమెను తిరువణ్ణామలై ప్రభుత్వ వైద్య కళాశాలకు తీసుకెళ్లగా విద్యార్థిని గర్భవతి అయినట్లు తెలిసింది. దీని గురించి ఆసుపత్రి నుంచి పోలూరు మహిళా పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సంఘటన చేరుకొని విద్యార్థిని వద్ద విచారణ చేసి అన్బరసన్‌ను పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. అతనిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. విద్యార్థినిని బాలికల సంక్షేమ హాస్టల్‌లో అప్పగించారు.

ముగ్గురు లాటరీ నిర్వాహకుల అరెస్టు



అరెస్టయిన ప్రవీణ్‌కుమార్, ప్రభుకుమార్ , అలెక్స్

తిరువళ్లూరు: ప్రభుత్వం నిషేధించిన లాటరీని నిర్వహిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి వారి నుండి రూ.11 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. తిరువళ్లూరు జిల్లా తిరువేర్కాడు ప్రాంతంలో ప్రభుత్వం నిషేధించిన లాటరీని నిర్వహిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ హుటాహుటిన అక్కడికి వెళ్లి తనిఖీ చేపట్టారు. లాటరీతో పాటు మూడు నంబర్‌లతో కూడిన మరో గేబ్లింగ్‌ను నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. అనంతరం లాటరీ నిర్వహిస్తున్న వడపళనికి చెందిన చంద్రన్ కుమారుడు ప్రవీణ్‌కుమార్(48), తిరువేర్కాడుకు చెందిన సుకుమారన్ కుమారుడు ప్రభుకుమార్(38), మలైపాక్కం ప్రాంతానికి చెందిన సిమియోన్ కుమారుడు అలెక్స్(25)ను అరెస్టు చేశారు. వీరి నుండి బిల్‌బుక్, టేబుల్స్, మొబైల్ ప్రింటర్, రూ.11 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై తిరువేర్కాడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం



కేజీ.కండ్రిగ పాఠశాలలో మూడు దశాబ్దాల తరువాత కలుసుకున్న విద్యార్థులు



కుటుంబాలతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న పూర్వ విద్యార్థులు

తిరుత్తణి: పూర్వ విద్యార్థులు మూడు దశాబ్దాల తరువాత తాము చదువుకున్న పాఠశాలలో కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సమావేశమయ్యారు. తిరుత్తణి యూనియన్ కేజీ.కండ్రిగ ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో 1984లో వంద మందికి పైగా విద్యార్థులు పదో తరగతి చదువుకున్నారు. అనేక మంది ఉన్నత చదువులు చదవి ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో స్థిరపడ్డారు. ఈ క్రమంలో మిత్రులందరూ సమావేశం కావాలని అనుకున్నారు. తమ ఉపాధ్యాయులను ఆహ్వానించి పాఠశాల కేంద్రంగా ఆదివారం సమావేశమయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి కుటుంబాలతో పాఠశాలకు చేరుకున్న పాత మిత్రులు ఉద్వేగంతో హత్తుకుని చిన్నతనంలో చేసిన అల్లరి, తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. పాఠాలు నేర్పి ఉన్నత స్థాయికి ఎదిగేందుకు దోహదపడిన ఉపాధ్యాయుల ఆశీస్సులు పొందారు. రిటైర్డ్ సీఈఓ అవినాసి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ మాజీ సర్పంచులు సుబ్బురామ్, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అందరూ కలసి భోజనం చేశారు.

ప్రతినెలా గ్రామాల్లో సమస్య పరిష్కార సమావేశాలు



దిగువ నెడిగళ్లులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రన్

పళ్లిపట్టు: గ్రామాల్లో ప్రతినెలా సమస్య పరిష్కార సమావేశాలు నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే చంద్రన్ పేర్కొన్నారు. పళ్లిపట్టు యూనియన్ కార్యదర్శి జి.రవీంద్ర అధ్యక్షతన ఆదివారం దిగువ నెడిగళ్లులో సీఎం స్టాలిన్ 70వ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం వీధి ప్రచార సభ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి, తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ పాల్గొని ప్రసంగించారు. డీఎంకే అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు పథకాలు అందించేందుకు అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మే నెల నుంచి ప్రతి గ్రామంలో ప్రజల సమస్యల పరిష్కార సమావేశాలు నిర్వహించి అధికారుల సమక్షంలో సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు, సమావేశంలో పార్టీ వక్తలు ఆరణిమాల, మురసొలిమూర్తి ప్రసంగించారు. యూనియన్ నిర్వాహకులు సుబ్రహ్మణ్యం, గోవిందస్వామి, గోపి, దేవరాజన్, నదియ నాగరాజన్, గురునాథన్ పాల్గొన్నారు.

● ఆటో చార్జీల పెంపునకు పట్టు



ఆటో మీటరు చార్జీలను పెంచాలని డిమాండ్ చేస్తూ చెన్నైలో ఆదివారం ఆటో డ్రైవర్‌లు, నామ్ తమిళర్ కట్చి వర్గాలు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించాయి. వళ్లువర్‌కోట్టంలో జరిగిన ఈ నిరసనకు నామ్‌త మిళర్ కట్చి నేత సీమాన్ నేతృత్వం వహించారు. 2013లో ఆటోలకు మీటర్లు తప్పని సరిచేశారు. ఆ సమయంలో నిర్ణయించిన నిర్ణీత చార్జీలు అమలు చేస్తున్నామని, దీనిని పెంచాలని నిరసన కారులు పట్టుబట్టారు. అలాగే, ర్యాపిడో ఐక్స్‌ను , మొబైల్ యాప్ వాహన సేవలను రద్దు చేయాలని కోరారు. - సాక్షి, చెన్నై

ఆలయ ఉత్సవంలో యువకులపై రాళ్ల దాడి

- కత్తి పోటుతో బ్యాంకు అధికారి మృతి
- ఇద్దరికి తీవ్ర గాయాలు

తిరువొత్తియూరు: పుదుకోట్టై జిల్లాలో ఆలయ ఉత్సవంలో నృత్యం చేస్తున్న యువకులపై రాళ్ల దాడి జరిగింది. ఈ కారణంగా జరిగిన గొడవలో ప్రైవేటు బ్యాంకు అధికారి కత్తిపోట్లకు గురై మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు ఆసుపత్రికి చేరుకుని అద్దాలను ధ్వంసం చేశారు. పుదుకోట్టై జిల్లా మెట్టుపట్టిలో ఉన్న పిడారి అమ్మన్ ఆలయంలో ఉత్సవాల సందర్భంగా శుక్రవారం రాత్రి మ్యూజికల్ డ్యాన్స్ నిర్వహించారు. ఇది పూర్తయిన తర్వాత ఆ ప్రాంతానికి చెందిన కొందరు యువకులు వేదికపై డ్యాన్స్ చేస్తుండగా వారిపై కొందరు రాళ్లు విసిరారు. ఇందులో ఒడుకంపట్టికి చెందిన నూర్ మహమ్మద్ కుమారుడు మహమ్మద్ యాసిమ్ (21) నుదుటిపై రాయిపడి రక్తం కారింది. స్థానికులు అతన్ని బైకుపై కీరనూర్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వారి వెంట మరో బైక్‌లో ఒడుగంపట్టికి చెందిన తిరుచ్చి శ్రీరంగంలో ఉన్న ప్రైవేటు బ్యాంకులో సహాయ మేనేజర్‌గా పనిచేస్తున్న విఘ్నేశ్వరన్ (29), వీరమణి మరొక మోటార్ సైకిల్‌పై వెళుతున్నారు. కుతాడిపారై అనే చోట వస్తుండగా అక్కడికి మోటార్ సైకిల్‌పై వచ్చిన ఓ ముఠా ఇనుప కమ్మీలు, కత్తులతో దాడి చేశారు. ఇందులో విఘ్నేశ్వరన్ మెడ, కడుపు భాగంలో కత్తిపోట్లు పడ్డాయి. వీరమణి చేతులకు గాయాలయ్యాయి. ఇది చూసిన స్థానికులు వారిని కూడా చికిత్స కోసం కీరనూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే విఘ్నేశ్వరన్ మృతి చెందినట్లు తెలిపారు. మొదట మోటార్ సైకిల్‌లో వెళ్లిన వారు మహమ్మద్ యాసిమ్‌ను ఆసుపత్రికి తీసుకువెళ్లారు. దీని గురించి సమాచారం అందుకున్న గ్రామ ప్రజలు ఆసుపత్రి ముందుకు చేరుకున్నారు. ఇందులో కొందరు ఆసుపత్రిపై రాళ్లు రువ్వడంతో కిటికీల అద్దాలు పగిలాయి. ఈ హత్య సంఘటనకు సంబంధించి కీరనూరు పోలీసులు కేసు నమోదు చేసి పల్లత్తుపట్టికి చెందిన రామలింగంను అరెస్టు చేశారు. మరి కొందరి కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో ఒడుక్కంపట్టి, పళ్లత్తుపట్టికి చెందిన గ్రామ ప్రజలకు పాతకక్షలు ఉన్నాయి. కీరనూరు పోలీస్ స్టేషన్‌కు ముందు గుమికూడిన ప్రజలు నిందితులను అరెస్టు చేయాలని, అప్పటి వరకు విఘ్నేశ్వర్ మృతదేహాన్ని తీసుకోమని హెచ్చరించారు.

ఏడుగురు నకిలీ డాక్టర్ల అరెస్టు



ముత్తుస్వామి , దేవరాజ్ , మహేష్ , పాన్‌రాజ్ , జ్ఞానసుందరి



మోహన్, వడివేలు

తిరువళ్లూరు/పళ్లిపట్టు: జిల్లా వ్యాప్తంగా ప్రయివేటు క్లినిక్‌లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన పోలీసులు ఐదుగురు నకిలీ డాక్టర్లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా నకిలీ డాక్టర్లు ఉన్నట్టు తిరువళ్లూరు ఎస్పీ ఫకెర్లా సెఫాస్ కల్యాణ్‌కు ఫిర్యాదు అందింది. దీంతో జిల్లా వ్యాప్తంగా అనుమానం వున్న ప్రయివేటు క్లినిక్‌లపై తనిఖీలు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. ఇందులో భాగంగానే పోలీసులు ప్రత్యేక బృందాలుగా తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో కడంబత్తూరుకు చెందిన ముత్తుస్వామి ప్రయివేటు క్లినిక్ నడుపుతూ వైద్యం చేస్తున్నట్టు గుర్తించారు. పేరంబాక్కం ప్రాంతానికి చెందిన దేవరాజ్ డిప్లొమో ఇన్ ఎలక్ట్రో హోమియోపతి కోర్సును పూర్తి చేసి ఇంగ్లీషు వైద్యం చేస్తున్నట్టు నిర్ధారించారు. గుమ్మిడిపూండి సిప్‌కాట్ ప్రాంతానికి చెందిన మహేష్ సెల్ థెరఫీని పూర్తి చేసి ఇంగ్లీష్ వైద్యం చేస్తున్నట్టు గుర్తించారు. కవరపేటకు చెందిన జ్ఞానసుందరి సిద్ధ వైద్యం కోర్సును పూర్తి చేసి ఇంగ్లీష్ మెడిసిన్ అందిస్తూ ప్రజలను మోసం చేస్తున్నట్టు పోలీసుల గుర్తించారు. దీంతో పాటు ఊత్తుకోటకు చెందిన పాన్‌రాజ్ క్లినిక్ నిర్వహిస్తున్నట్టు గుర్తించిన పోలీసులు ఐదుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అలాగే పళ్లిపట్టులో ఆరోగ్యశాఖ అధికారులతో పాటు పోలీసులు చేపట్టిన తనిఖీలు బజారులో ఇంట్లో క్లినిక్ నిర్వహించిన మోహన్(45)ను అదుపులోకి తీసకుని రికార్డులు పరిశీలించగా ప్లస్ టూ వరకు మాత్రమే చదువుకుని పేదలకు వైద్యం చేసినట్లు గుర్తించడంతో పోలీసులు అరెస్ట్ చేశారు. అలాగే పెరమానల్లూరుకు చెందిన వడివేలు(54) అనే వ్యక్తి టెన్త్ వరకు చదువుకుని క్లీనిక్ జరిపించి పేదలకు వైద్యం చేసినట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. పళ్లిపట్టు ఇద్దరు నకిలీ డాక్టర్లు అరెస్ట్ ఘటన కలకలం రేపింది.

ఎయిర్‌లైన్స్ ఉద్యోగి మృతదేహం వెలికితీత

అన్నానగర్: కోవలం బీచ్ సమీపంలో ముక్కలు ముక్కలుగా నరికి పాతిపెట్టిన చెన్నై ఎయిర్‌లైన్స్ ఉద్యోగి మృతదేహాన్ని మడిపాక్కం – కేళంబాక్కం పోలీసులు ఆదివారం వెలికితీశారు. చెన్నై విమానాశ్రయంలో ప్రైవేటు ఎయిర్‌లైన్స్ ఉద్యోగి జయంతన్ 929)పై అతని సోదరి జయకిరుబ కొద్ది రోజుల క్రితం పలవన్‌తాంగల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పుదుకోట్టై జిల్లా పొన్నమరావతి సమీపంలోని సెమ్మలంపట్టి గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి అనే మహిళను జయంతన్ వివాహం చేసుకున్నట్టు విచారణలో తేలింది. తరువాత మనస్పర్థలు రావడంతో ఇద్దరూ విడిపోయారని, గత నెలలో జయంతన్ ఆమె ఇంటికి వెళ్లాడని తెలిసింది. భాగ్యలక్ష్మి తన స్నేహితుడు శంకర్‌తో కలిసి జయంతన్‌ను హత్య చేసి మృతదేహాన్ని ముక్కలు చేసి చెన్నై సమీపంలోని కోవలం బీచ్‌లో పాతిపెట్టినట్లు పోలీసుల విచారణలో తేలింది. అలాగే జయంతన్ శరీర భాగాలను పూడ్చడంలో సహకరించిన కోవలం భూమినాథ స్వామి ఆలయ పూజారి వేల్‌మురుగన్‌ను అరెస్టు చేసి విచారించారు.

ఈ స్థితిలో కోవలం భూమినాథస్వామి దేవాలయం సమీపంలో ఖననం చేసిన ఎయిర్‌లైన్స్ ఉద్యోగి జయంతన్ మృతదేహాన్ని వెలికి తీసే పనిని ఆదివారం ఉదయం 11 గంటలకు మడిపాక్కం పోలీసు ఇన్‌స్పెక్టర్ శివకుమార్, కేళంబాక్కం ఇన్‌స్పెక్టర్ గోవిందరాజ్ నేతృత్వంలో భాగ్యలక్ష్మి సమక్షంలో ప్రారంభమైంది. జయంతన్ శరీర భాగాలతో కూడిన గోనె సంచిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం శవపరీక్షకు పంపినట్లు తెలిపారు.

25 వేల మంది సభ్యులను చేర్చాలి



అన్నాడీఎంకే శ్రేణులకు సభ్యత్వ నమోదు పత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ హరి

తిరుత్తణి: ఆర్కేపేట యూనియన్‌లో 25 వేల మంది నూతన సభ్యులను చేర్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని అన్నాడీఎంకే ఆర్గనైజింగ్ కార్యదర్శి హరి కోరారు. ఆర్కేపేట యూనియన్ అన్నాడీఎంకే ఆధ్వర్యంలో పార్టీ నూతన సభ్యత్వ నమోదు పత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఆ పార్టీ మండల కార్యదర్శి కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో ఆ పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి, మాజీ ఎంపీ హరి పాల్గొని ప్రసంగించారు. ఎడపాడి పళనిస్వామి ఆదేశాల మేరకు రాష్ట్రంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేలా యువతీ, యువకులను అధిక సంఖ్యలో పార్టీలో చేర్పించాలని సూచించారు. ఆర్కేపేట యూనియన్‌లో కొత్తగా 25 వేల మంది సభ్యత్వం స్వీకరించేందుకు కృషి చేయాలని కోరారు. ఆ పార్టీ జిల్లా విద్యార్థి విభాగం ఉప కార్యదర్శి జయశేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

సింహాద్రిలో విద్యుదుత్పత్తికి అంతరాయం

పరవాడ (పెందుర్తి): అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీ రెండో యూనిట్‌లో ఆదివారం తలెత్తిన సాంకేతిక లోపంతో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. ఫలితంగా 500 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగింది. తెల్లవారు జామున 2.30 గంటల సమయంలో ఐదు వందల మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్ బ్రాయిలర్‌లో అమర్చిన ట్యూబ్‌కు రంధ్రం ఏర్పడడంతో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలిగింది. దీంతో సాంకేతిక నిపుణులు మరమ్మతులకు ఉపక్రమించారు. మంగళవారం యూనిట్ నుంచి విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం సంస్థలో 1, 3, 4 యూనిట్ల నుంచి 1,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందన్నారు.

• తెలంగాణ

ఏపీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సాక్షి, హైదరాబాద్: ఏపీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని అసోసియేషన్ ఆఫ్ ఏపీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సంఘ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి.లక్ష్మీకాంతం, ఖజానా శాఖ అదనపు డైరెక్టర్ తిరుపతిరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో పనిచేసి హైదరాబాద్‌లో స్థిరపడిన రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అదనపు డైరెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సంఘం కొత్త కార్యవర్గం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా నళినీ మోహన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బుచ్చిరాజు తదితరులను ఎన్నుకున్నారు.

అన్ని ఆర్బీకేల్లో యంత్ర సేవా కేంద్రాలు!

ఇప్పటికే 6,525 ఆర్బీకేల పరిధిలో అందుబాటులో
- మిగిలిన 4,225 ఆర్బీకేలలో ఏర్పాటుకు సన్నాహాలు
- ప్రతి జిల్లాకు కనీసం ఐదు క్లస్టర్ స్థాయి సీహెచ్‌సీలు
- మెజార్టీ ఆర్బీకేల్లో ట్రాక్టర్ల కోసం రైతుల నుంచి డిమాండ్



సాక్షి, అమరావతి: వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విత్తనం నుంచి కోత వరకు రైతులెదుర్కొంటున్న కూలీల వెతలకు చెక్ పెట్టింది. వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద ప్రతి ఆర్బీకే పరిధిలో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లలో (సీహెచ్‌సీ) అత్యాధునిక పరికరాలను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టింది. నూరు శాతం ఆర్బీకేల్లో సీహెచ్‌సీల ఏర్పాటు లక్ష్యంతో అడుగులు వేస్తోంది. ఇప్పటికే 6,525 ఆర్బీకేల పరిధిలో అందుబాటులోకి రాగా మిగిలిన 4,225 ఆర్బీకేల్లో మే మొదటి వారంలో సీహెచ్‌సీలను గ్రౌండింగ్ చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది.

ఖర్చులు తగ్గించి రాబడి పెరిగేలా..

రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గించడం, మెరుగైన ఆదాయం పొందడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవా పథకానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను తక్కువ అద్దెకే సన్న, చిన్న కారు రైతులకు అందుబాటులోకి తెచ్చింది. రూ.2,106 కోట్ల వ్యయంతో ఆర్బీకేల స్థాయిలో ఒక్కొక్కటి రూ.15 లక్షల విలువ గల 10,750 వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. వరి ఎక్కువగా పండించే 20 జిల్లాల్లో ఒక్కొక్కటి రూ.25 లక్షల విలువైన కంబైన్డ్ హార్వెస్టర్లతో కూడిన 1,615 క్లస్టర్ స్థాయి యంత్ర సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే 6,525 ఆర్బీకేల స్థాయిలో 391 క్లస్టర్ స్థాయి సీహెచ్‌సీలను నెలకొల్పగా రైతుల వినతి మేరకు రూ.175 కోట్ల వ్యయంతో 3,800 ట్రాక్టర్లను రైతు కమిటీలకు అందించింది. సీహెచ్‌సీల కోసం 40 శాతం సబ్సిడీ రూపంలో రూ.240.67 కోట్లను ఖర్చు చేసింది. పంటల సరళి, స్థానిక డిమాండ్ బట్టి యంత్ర పరికరాల ఎంపిక, నిర్వహణ బాధ్యతలను రైతు గ్రూపులకే అప్పగించింది. పరికరాలు, అద్దె, వివరాలను ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నారు. మిగిలిన ఆర్బీకేల్లో కూడా సత్వరమే యంత్రసేవా కేంద్రాలను అందుబాటులోకి తేవాలని ఇటీవల సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించడంతో ఆ మేరకు చర్యలు చేపట్టారు.

జూలైలో కనీసం 500 ఆర్బీకేల్లో డ్రోన్లు

ఆర్బీకేల స్థాయిలో 2 వేల కిసాన్ డ్రోన్లను అందుబాటులోకి తేవడంలో భాగంగా జూలైలో కనీసం 500 ఆర్బీకేల్లో డ్రోన్లతో పాటు వ్యక్తిగతంగా 7 లక్షల మంది రైతులకు టార్పాలిన్లు, స్ప్రేయర్ల పంపిణీకి శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. మిగిలిన 4,225 ఆర్బీకేల్లో సీహెచ్‌సీలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటికే 3,594 ఆర్బీకేల్లో గ్రూపుల ఏర్పాటు ప్రక్రియ పూర్తైంది. ఇప్పటి వరకు 1,532 గ్రూపులు ట్రాక్టర్లు కావాలని ప్రతిపాదించడంతో కోరుకున్న కంపెనీలకు చెందినవి సమకూర్చేలా సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెలాఖరులోగా గ్రూపుల ఎంపిక, రుణాల మంజూరు ప్రక్రియ పూర్తి చేసి మే మొదటి వారంలో నూరు శాతం యూనిట్లు గ్రౌండింగ్ లక్ష్యంగా కృషి చేస్తున్నారు. ఇప్పటికే 391 క్లస్టర్ స్థాయి సీహెచ్‌సీలు ఏర్పాటు చేయగా మిగిలిన జిల్లాల పరిధిలో జిల్లాకు కనీసం ఐదు కంబైన్డ్ హార్వెస్టర్స్‌తో కూడిన సీహెచ్‌సీల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు.

కూలీల వెతలు తీరాయి..

మా గ్రామం మండల కేంద్రానికి 13 కి.మీ. దూరంలో ఉంది. విత్తనాలు, ఎరువులు, కూలీల కోసం ఎంతో ఇబ్బంది పడ్డాం. యంత్రాల కోసం సీజన్‌లో ముందే బయానా ఇచ్చి రోజుల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. అడిగినంతా ఇస్తే కానీ వచ్చేవారు కాదు. ఇప్పుడు ఆర్బీకే ద్వారా రైతుగ్రూపుగా ఏర్పడి రూ.2.17 లక్షల విలువైన యంత్రాలను తీసుకున్నాం. మా వ్యవసాయ అవసరాలకు వాడుకోవడంతోపాటు మిగిలిన రైతులకు అద్దెకిస్తున్నాం. చాలా ఆనందంగా ఉంది.

– జి.రాఘవకుమారి, కన్వీనర్, శ్రీలక్ష్మీనరసింహ సీహెచ్‌సీ గ్రూపు, దేవవరం, అనకాపల్లి జిల్లా

మిగిలిన చోట్ల వచ్చే నెలే గ్రౌండింగ్

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో అన్ని ఆర్బీకేల్లో వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలు ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టాం. ఇప్పటికే 6,525 ఆర్బీకేల్లో సీహెచ్‌సీలు ఏర్పాటయ్యాయి. మిగిలిన 4,225 ఆర్బీకేల్లో మే మొదటి వారంలో సీహెచ్‌సీలను సీఎం జగన్ చేతుల మీదుగా గ్రౌండింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

–చేవూరు హరికిరణ్, స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

• తెలంగాణ

డేటా లీకుపై పోలీసుల దూకుడు

ప్రధాన నిందితుల కోసం నాలుగు రాష్ట్రాల్లో గాలింపు

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన డేటా చౌర్యం కేసులో సైబరాబాద్ పోలీసులు దూకుడు పెంచారు. గత నెల రోజుల వ్యవధిలో సైబరాబాద్ పోలీసులు నాలుగు డేటా చౌర్యం, విక్రయం, నకిలీ కాల్ సెంటర్ నిర్వహణ కేసులను ఛేదించారు. వీటిల్లో 30 మంది నిందితులను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆయా కేసులలో నిందితులు విక్రయానికి పెట్టిన వ్యక్తిగత సమాచారం థర్డ్ పార్టీ ఏజెన్సీలు, ఈ–కామర్స్ సంస్థల నుంచి లీకైనట్లు గుర్తించిన సిట్ ఆయా కంపెనీలను విచారించాలని నిర్ణయించింది. ఇప్పటికే పలు కంపెనీలకు నోటీసులు జారీ చేసింది. తాజాగా మరో పది కంపెనీలకూ తాఖీదులు ఇచ్చింది. ఇప్పటికే సిట్ ముందు హాజరైన కంపెనీలు సమగ్ర సమాచారాన్ని సమర్పించాయి.

నాలుగు రాష్ట్రాల్లో గాలింపు..

ప్రధానంగా ఫరీదాబాద్‌కు చెందిన వినయ్ భరద్వాజ్ 70 కోట్ల మంది వ్యక్తిగత సమాచారాన్ని తస్కరించి, విక్రయానికి పెట్టడం సంచలనం సృష్టించింది. అతడు ఈ డేటాను గుజరాత్‌కు చెందిన అమీర్ సోహైల్, మదన్ గోపాల్ అనే వ్యక్తుల నుంచి కొనుగోలు చేసినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. దీంతో సిట్ బృందాలు ఢిల్లీ, రాజస్తాన్, హరియాణా, పశ్చిమ బెంగాల్‌లో నిందితుల కోసం గాలిస్తున్నాయి.

కమ్యూనిస్టుల ఐక్యతే దేశానికి దిక్సూచి

- సీపీఎం, సీపీఐ అగ్రనేతలు ఏచూరి, రాజా ఉద్ఘాటన
- మోదీని గద్దె దించకపోతే అంధకారమే
- ఎర్రజెండాలన్నీ ఒక్క జెండాగా ముందు రావాలన్న నేతలు



హైదరాబాద్‌లో ఉభయ కమ్యూనిస్టు పార్టీల సభలో నేతలు

సాక్షి, హైదరాబాద్: దేశంలో బీజేపీ ఓటమి లక్ష్యంగా ఐక్యతను ప్రదర్శించాలని సీపీఎం, సీపీఐ అగ్రనేతలు పిలుపునిచ్చారు. కమ్యూనిస్టుల ఐక్యతే దేశానికి దిక్సూచి అని ఉద్ఘాటించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాల్సిన చారిత్రక అవసరం ఉందని చెప్పారు. బీజేపీ దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తోందని, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తోందని, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందని, దేశాన్ని కార్పొరేట్లకు అమ్మేస్తోందని ధ్వజమెత్తారు. మోదీని గద్దె దించకపోతే దేశం అంధకారమై పోతుందని అన్నారు. కమ్యూనిస్టుల ఐక్యత తక్షణావసరమన్నారు. కమ్యూనిస్టుల ఐక్య సదస్సులు దేశంలోనూ జరగాలని ఆకాంక్షించారు. దేశంలోనే మొదటిసారిగా ఉభయ కమ్యూనిస్టు పార్టీల నేతలు ఒక్కటయ్యారు. ఈ మేరకు తెలంగాణ ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల సంయుక్త సభ ఆదివారం హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగింది. సీపీఎం, సీపీఐ ప్రధాన కార్యదర్శులు సీతారాం ఏచూరి, డి.రాజా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నారాయణ, బీవీ రాఘవులు, కూనంనేని సాంబశివరావు, తమ్మినేని వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల తర్వాత జాతీయ స్థాయిలో ఫ్రంట్

మోదీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్లకు అప్పగించి లూటీ చేస్తోందని ఏచూరి ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్న మోదీ సర్కారును గద్దె దించకపోతే దేశం నాశనమై పోతుందన్నారు. బీజేపీని గద్దె దించేందుకు ఇక్కడి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలు లౌకిక శక్తులతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల తర్వాత జాతీయ స్థాయిలో ఫ్రంట్ ఏర్పడుతుందని ఆయన చెప్పారు. కమ్యూనిస్టుల పునరేకీకరణ, ఐక్యత తక్షణావసరమని డి.రాజా అభిప్రాయపడ్డారు. దేశంలోని ఎర్రజెండాలన్నీ వైరుధ్యాలను పక్కన పెట్టి ఒకే గొడుగు కిందకు రావాలని, ఒక్క జెండాగా ముందుకు కదలాలని ఆకాంక్షించారు. తెలంగాణలో బీజేపీని పాతాళంలోకి నెట్టాల్సిన అవసరముందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు పిలుపునిచ్చారు. తమిళనాడు, కేరళ, ఏపీలో బీజేపీకి చోటు లేదని, ఆ లోటును తెలంగాణలో పెంచుకొని పూడ్చుకోవాలని చూస్తోందన్నారు.

• తెలంగాణ

16 నుంచి భద్రాద్రిలో నూతన ఆర్జిత సేవలు

- రూ. 500 టికెట్‌తో వేదాశీర్వచనం, రూ.1,000 టికెట్‌తో తులసీమాల అలంకరణ సేవ
- రూ.5 వేల టికెట్‌తో స్వామివారి నిత్య సర్వ కైంకర్యం..



భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 16 నుంచి నూతన ఆర్జిత సేవలు ప్రారంభించనున్నట్లు ఈఓ రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సేవల వివరాలు ఇవీ..

వేదాశీర్వచనం: స్వామివారి దర్శనానంతరం బేడా మండపంలో (ఒక్కొక్కరికి లేదా దంపతులు) రూ.500 టికెట్‌తో ఉదయం 9.30, 10, 10.30, 11 గంటల స్లాట్స్‌లలో ఆశీర్వాదాలు అందజేస్తారు. ఇందులో పాల్గొన్న భక్తులకు కండువా, జాకెట్‌పీసు, 100 గ్రాముల లడ్డూ అందజేస్తారు. స్వామివారికి తులసీమాల అలంకరణ (ప్రతి శనివారం) రూ.1,000 టికెట్‌తో దంపతులు లేదా ఒకరికి ఉదయం 7 గంటలకు ఉభయదాత శిరస్సుపై తులసీమాల ఉంచి ఆలయ ప్రదక్షిణ చేయిస్తారు. ఆ తర్వాత అంతరాలయంలో భక్తుల సమక్షంలో ధ్రువమూర్తులకు అలంకరణ చేస్తారు. ఇందులో పాల్గొన్న వారికి కండువా, జాకెట్ పీసు, 100 గ్రాముల లడ్డూలు రెండు, అంతరాలయ అర్చనతో రామకోటి పుస్తకాన్ని బహూకరిస్తారు.

స్వామివారి నిత్య సర్వ కైంకర్య సేవ

రూ.5 వేల టికెట్‌తో రోజూ జరిగే అన్ని సేవలలో దంపతులు పాల్గొనొచ్చు. ఇందులో పాల్గొనే భక్తులకు సుప్రభాతం, అభిషేకం, అంతరాలయ అర్చన, శ్రీలక్ష్మీ అమ్మవారి అర్చన, శ్రీ ఆంజనేయ స్వామివారి అర్చన, నిత్యకల్యాణం, వేదాశీర్వచన, సచిత్ర రామాయణ పుస్తకం, ముత్యాల తలంబ్రాల ప్యాకెట్, అదనంగా ఐదుగురికి అన్నప్రసాదం, దర్బారు సేవ, పవళింపు(ఏకాంత) సేవలో పాల్గొనే అవకాశం ఉంటుంది.

శ్రీరామనవమి ముత్యాల సమర్పణ

రూ.10 వేల టికెట్‌తో శ్రీరామనవమి కల్యాణ టికెట్ సెక్టార్ – 2లో రెండు సంవత్సరాలకు టికెట్లు (ఉభయం), కల్యాణ వస్త్రాలు, ప్రసాదాలు, 108 ముత్యాలతో కూడిన తలంబ్రాలు అందజేస్తారు.

నిత్య పూల అలంకరణ సేవ

రూ. 5 వేల టికెట్‌తో సోమవారం నుంచి శనివారం వరకు జరిగే పూజల్లో స్వామి వారికి, ఉపాలయాల్లో అవసరమైన పూల దండల సమర్పణ. ఇందులో పాల్గొనే వారికి కండువా, జాకెట్ పీసు, రెండు చిన్న లడ్డూలు, నలుగురికి అన్నప్రసాదం అందజేస్తారు.

తులాభారం

రూ.100 టికెట్ ధరతో ప్రతి రోజూ తులాభారం (భక్తులు మొక్కుకున్న చిల్లర నాణేలు, లేదా బియ్యం.. తదితర వస్తువులు) ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 గంటల వరకు అందించవచ్చు.

బండి ఫోన్ ఎక్కడ..?

పోయిందంటూ పోలీసులకు సంజయ్ ఫిర్యాదు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/సాక్షి, హైదరాబాద్: బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఫోన్ ఎక్కడుంది? అనేది చర్చనీయాంశమయ్యింది. కలకలం రేపిన పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ కుట్రలో సూత్రధారిగా అనుమానిస్తూ పోలీసులు సంజయ్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అయితే అరెస్టు అయినప్పటి నుంచి ఆయన ఫోన్ కన్పించకుండా పోయింది. అయితే బెయిల్‌పై విడుదలైన సంజయ్..ఆదివారం దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అరెస్టు సమయం నుంచి తన వ్యక్తిగత ఫోన్ కన్పించడం లేదని పేర్కొంటూ పట్టణ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దానిని ఎలాగైనా వెదికి పెట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వాస్తవానికి ఆ ఫోన్ తన సోదరి పేరు మీద ఉందని, భద్రతాపరమైన కారణాల నేపథ్యంలో తాను ఆమె పేరు మీద ఉన్న సిమ్‌కార్డు వాడుతున్నానని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలుకు రెడీ..!

ప్రతి గింజా సేకరణకు ప్రణాళికలు
- సిద్ధం చేస్తున్న అధికార యంత్రాంగం
- ముందస్తుగా ప్రారంభమైన వరి కోతలు
- 5.25 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా



వరి కోతలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

సాక్షి, రాజమహేంద్రవరం: రబీ ముందస్తు వరి కోతలు ప్రారంభమయ్యాయి. అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, చాగల్లు, తాళ్లపూడి మండలాల్లో ఊపందుకుంటున్నాయి. మరో పది రోజుల వ్యవధిలో మరికొన్ని ప్రాంతాల్లో వేగం పుంజుకునే ఆవస్యకత ఉంది. రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేసి దన్నుగా నిలవాలన్నది ప్రభుత్వ ఆకాంక్ష. అందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. దిగుబడి అందే నాటి కంటే ముందుగానే ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి తీసువచ్చేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోంది. సేకరణకు అవసరమైన ఏర్పాట్లలో తలమునకలైంది. కొనుగోలుకు అవసరమైన గన్నీ బ్యాగులు, యంత్రాలు సిద్ధం చేస్తున్నారు. ఈనెల 15వ తేదీ తర్వాత ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

4.55 లక్షల మెట్రిక్ టన్నులే లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా రబీ సాధారణ సాగు 83,880 హెక్టార్లు. అత్యధికంగా వరి సాగవుతోంది. వరి సాధారణ సాగు విస్తీర్ణం 56,433 హెక్టార్లు కాగా.. 55,095 హెక్టార్లు సాగై 95 శాతానికి పైగా లక్ష్యాన్ని అధిగమించింది. ఈ ఏడాది 5.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా. ఇందులో రైతులు, స్థానిక అవసరాలకు మినహాయించగా 4,55,845 మెట్రిక్ టన్నులు కొనుగోలుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. రైతులకు అనుకూలమైన మద్దతు ధర నిర్ణయించింది. సాధారణ రకం బస్తాకు (75 కిలోల బస్తా) రూ.1530, గ్రేడ్–ఏ రకానికి రూ.1545గా నిర్ణయించింది.

233 ఆర్బీకేల్లో..

జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో 315 ఆర్బీకేలుండగా 233 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వాటిని 147 మిల్లులకు అనుసంధానం చేశారు. ఆయా కేంద్రాలకు నియమించిన సాంకేతిక సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. సేకరణకు జిల్లా వ్యాప్తంగా 70 లక్షల గన్నీ బ్యాగుల అవసరం ఉందని, ఏ మండలానికి ఎన్ని కావాలో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. ఆర్బీకేల వద్ద సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఈ–క్రాప్, తేమ శాతం నిబంధనల ప్రకారం ధాన్యం సేకరిస్తారు. అనంతరం మొబైల్ యాప్‌లో రైతులకు కూపన్లు ఇస్తారు. కొనుగోళ్లకు మండల వ్యవసాయ అధికారులు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరించనున్నారు. గ్రామ వలంటీర్లను సైతం భాగస్వాముల్ని చేస్తున్నారు. ధాన్యం రవాణా చేసే వాహనాలపై నిఘా పెడుతున్నారు. రవాణా చార్జీలు ఎవరికి చెల్లించాలనే విషయమై జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఎకరానికి 53 బస్తాల దిగుబడి

రబీ ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉంటున్నాయి. ఎకరానికి 52 నుంచి 53 బస్తాల దిగుబడి అందుతోంది. జిల్లాలో అత్యధికంగా ఎంటీయూ–1121 రకం ధాన్యం సేకరించనున్నారు. 3.39 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అందే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. 76,000 మెట్రిక్ టన్నులు బోండాలు, 30 వేల మెట్రిక్ టన్నుల సన్న రకాలు ఉత్పత్తి అయ్యే సూచనలున్నట్లు వెల్లడించారు. ఈ పరిణామం రైతుల్లో ఆనందాన్ని నింపుతోంది. పెట్టుబడులకు పోను లాభాలు గడించవచ్చన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మూడేళ్లుగా దిగుబడులు టాప్..

జిల్లాలో 2021 ఖరీఫ్‌లో 82,695 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. ఎకరానికి (75 కిలోల బస్తా) 28 బస్తాల ధాన్యం దిగుబడి వస్తే.. 2022 ఖరీఫ్‌లో 73,606 హెక్టార్లలో వరి సాగయ్యింది. ఎకరానికి 33 బస్తాల దిగుబడి వచ్చింది. ఏడాది వ్యవధిలో ఎకరం పొలానికి 5 బస్తాలు వృద్ధి చెందింది. 2021 ఖరీఫ్‌లో మొత్తం 4,29,990 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అందితే.. 2022లో 4,52,368 మెట్రిక్ టన్నులు.. అంటే 22,378 మెట్రిక్ టన్నులు అదనంగా దిగుబడి వచ్చింది. గత ఐదేళ్లుగా ఇలాంటి దిగుబడులు ఎప్పుడూ నమోదు కాలేదని వ్యవసాయ శాఖ చెబుతోంది. ఇప్పటికే 2321 హెక్టార్లలో కోతలు పూర్తయినట్లు సమాచారం.

ప్రతి గింజా కొంటాం:-

రబీలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం చేశాం. ఇప్పటికే సమావేశం ఏర్పాటు చేసి సేకరణపై అధికారులు, సిబ్బందికి సలహాలు సూచనలు చేశాం. ముందస్తు కోతలు వచ్చే ప్రాంతాల్లో కేంద్రాలు ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నాం. 4.55 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. 233 ఆర్బీకేలు సిద్ధం చేస్తున్నాం. వారం రోజుల తర్వాత కొనుగోళ్లు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

-ఎస్.తేజ్ భరత్, జాయింట్ కలెక్టర్

ఇప్పటివరకూ వరి కోతల వివరాలు (హెక్టార్లలో..)

మండలం	సాగు	కోతలు
రాజమండ్రి రూరల్	1,135	652
కడియం	2,324	1
రాజానగరం	3,285	1149
అనపర్తి	3,755	12
బిక్కవోలు	5,718	25
కోరుకొండ	2,229	120
గోకవరం	1,706	40
సీతానగరం	2,719	100
రంగంపేట	812	120
చాగల్లు	3,264	5
దేవరపల్లి	2,786	41
కొవ్వూరు	4,210	29
తాళ్లపూడి	3,147	12
నల్లజెర్ల	2,182	15

పరివర్తన బాటతో పదుగురికీ సేవ

పులిమేరులో యోగాశ్రమం ఏర్పాటు
- మరోపక్క ఆయుర్వేద వైద్యసేవలు
- తాజాగా పోషక అల్పాహారం విక్రయం
- జైలు నుంచి గురువుగా మారిన వైనం




వృద్ధులకు అల్పాహారాన్ని అందిస్తున్న యోగా గురువు

పెద్దాపురం: జైలులో అలవర్చుకున్న ఆరోగ్య స్పృహను పదిమందికీ తెలియజేస్తున్నాడు మసిముక్కల రామకృష్ణ. అక్కడ నేర్చుకున్న యోగాను బయటకొచ్చి నేర్పుతూ గురువుగా ఎదిగాడు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ఉదయం పోషకవిలువతో కూడిన అల్పాహారాన్ని అందిస్తున్నాడు. కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెంకు చెందిన రామకృష్ణకు సుమారు 15 ఏళ్ల కిందట రాజకీయ ఘర్షణల నేపథ్యంలో ఓ హత్య కేసులో యావజ్జీవ జైలుశిక్ష పడింది. అతను జైలుకు వెళ్లడంతో భార్య సుబ్బలక్ష్మి తన కుమారుడు, కుమార్తెను వెంటబెట్టుకుని పెద్దాపురం మండలం దివిలిలోని పుట్టింటికి చేరుకుంది. కుట్టు మిషన్ సాయంతో పిల్లలను పోషించింది. 2016 జనవరి 26న సత్ప్రవర్తన కేటరిగిలో రామకృష్ణ జైలునుంచి విడుదలయ్యాడు. స్వగ్రామం వెళ్లలేక అత్తావారింటికి కాపురం వచ్చేశాడు.

ఇటు..యోగా అటు వైద్య సేవలు

జైలు నుంచి వచ్చాక రామకృష్ణ తన చుట్టూ ఉన్న వారికి ఏదైనా మంచి చేయాలని స్పందించాడు. జైలులో నేర్చుకున్న యోగాపై చుట్టుపక్కల ఉన్నవారికి అవగాహన కల్పించడం ప్రారంభించాడు. దీనిపై పులిమేరు పరిసర గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. ఇప్పటికీ కొనసాగిస్తున్నాడు. పదిహేను రోజులకోసారి దివిలి, తిరుపతి, చదలాడ, పులిమేరు, పిఠాపురం మండలం విరవ గ్రామాల్లో యోగాసనాలపై శిక్షణ ఇస్తున్నాడు. పులిమేరులో యోగాశ్రమాన్ని నెలకొల్పాడు. 12 ఏళ్ల కుర్రాడి నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకూ సుమారు వంద మంది యోగా నేర్చుకుంటున్నారు. తనకు తెలిసిన ఆయుర్వేద వైద్యంతో రామకృష్ణ చిన్నపాటి రోగాలకు చికిత్స చేస్తున్నాడు. ఇటీవల పోషక విలువల ఆహారాన్ని తయారుచేసి విక్రయించడం ప్రారంభించాడు. సేంద్రీయ సాగు ఉత్పత్తులతో ఆహార పదార్థాలను తయారుచేస్తున్నాడు. బ్లాక్ రైస్ ఇడ్లీ, నానబెట్టిన మొలకలు, కొర్రలు ఉప్మా, ఆయిల్‌లెస్ దోసె, రాగి అంబలిని కలిపి అల్పాహారంగా అమ్ముతున్నాడు. సాధారణ ధరకే విక్రయిస్తూ ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నాడు.



రూ.30లకే అందిస్తున్న ప్లేటు పౌష్టికాహార అల్పాహారం.

పోషకాల టిఫిన్

రోజూ ఉదయం గతంలో ఇక్కడి హోటల్స్‌లో చాలామంది ఆయిల్‌తో చేసిన టిఫిన్లు తినేవారు. జనంలో ఇప్పుడు ఆరోగ్యంపై అవగాహన పెరిగింది. ఉదయాన్నే ఇలాంటివి తినడం వల్ల అనారోగ్యాన్ని కొని తెచ్చుకోవడమేనని గ్రహిస్తున్నారు. అలాంటి వారంతా పోషకాహారంపై మొగ్గు చూపిస్తున్నారు. సేంద్రీయ పంటలతో చేసిన వంటకాలపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ తరహా ఆహారాన్ని ఇష్టపడేవారు తన లాంటి వారి వద్ద కొనుగోలు చేస్తున్నారని రామకృష్ణ చెప్పారు.

ఆరోగ్యం గురించి తెలియజెప్పాలని..



జైలు నుంచి వచ్చాక పెట్రోల్ బంకులో పనిచేశాను. టైలరింగ్ వృత్తి చేశాను. బతుకు గడవడం మాటెలా ఉన్నా జైలులో నేర్చుకున్న ఆరోగ్య అంశాలను పదిమందికీ తెలియజేస్తే బాగుంటుందనే ఆలోచన వచ్చింది. జైలు జీవితం తెచ్చిన పరివర్తనను కూడా తెలియజెప్పాల్సిన అవసరం ఉందని అనిపించింది. ఇక్కడ నేర్చుకున్న యోగా గురించి చుట్టూ ఉన్నవారికి చెప్పాలని భావించాను. నెమ్మది నెమ్మదిగా ముందడుగు వేయగలిగాను. చాలామంది ప్రోత్సహించారు. ఏం చేసినా ప్రజల ఆరోగ్యం పెంచేదిగా ఉండాలని భావించి ఇప్పుడు పోషకాహారాన్ని కూడా విక్రయిస్తున్నాను. వ్యాపార దృక్పథంతో కాదు. ఆరోగ్య స్పృహ కలిగించాలనేదే నా ప్రయత్నం.

– మసిముక్కల రామకృష్ణ, పులిమేరు

సాక్షి
ఫ్యామిలీ
చెన్నై
సోమవారం ॥ 10-4-2023

మంచి మాట

ఆలోచించవలసిన అలవాట్లు

అలవాట్లు అనేవి ప్రతివ్యక్తికీ ఉంటాయి. అలవాట్లులేని వ్యక్తులు ఉండరు. పుట్టిన తరువాత పాలు తాగడం నుంచి మనిషికి అలవాట్లు మొదలు అవుతాయి. మనిషి మరణించేదాకా అలవాట్లు ఉంటూనే ఉంటాయి. వ్యక్తులనుంచి అలవాట్లు, అలవాట్లనుంచి వ్యక్తులు వేరై ఉండడం ఉండదు.

అలవాట్లలో మంచివి, చెడ్డవి ఉన్నాయి, ఉంటాయి. చెడ్డ అలవాట్లవల్ల మనుషుల బతుకులకు బతుకులే చెడిపోయాయి. కుటుంబాలకు కుటుంబాలే కూలిపోయాయి. అలవాట్ల కోసం ఆస్తుల్ని అమ్ముకున్నవాళ్లు, అలవాట్ల కారణంగా బంధువుల్ని కోల్పోయినవాళ్లు ఎందరో ఉన్నారు. అలవాట్లవల్ల అనారోగ్యాలపాలై మరణించినవాళ్లూ ఉన్నారు. బతుకులే అల్లకల్లోలం అయిపోయినా కూడా చెడ్డ అలవాట్లను మానుకోలేక పరితపిస్తున్నవాళ్లూ ఉన్నారు.

మంచి అలవాట్లవల్ల కష్టాలనుంచి బయటపడినవాళ్లు ఉన్నారు. మంచి అలవాట్లవల్ల అనారోగ్యం నుంచి విముక్తమై ఆరోగ్యాన్ని అందుకున్నవాళ్లు ఉన్నారు. మంచి అలవాట్లవల్ల మామూలు స్థితి నుంచి ఉన్నతమైన స్థితికి వెళ్లినవాళ్లు ఉన్నారు. మంచి అలవాట్లవల్ల మంచివాళ్లుగా, గొప్పవాళ్లుగా మన్ననల్ని పొందినవాళ్లూ ఉన్నారు.

అలవాట్లకు లొంగిపోయి బతుకును కోల్పోకూడదు. పనికిరాని అలవాట్లవల్లా, పాడుచేసే అలవాట్లవల్లా మనిషి పాడుపడకూడదు.

మనిషికి అలవాట్లు ఉండడం సహజం. మనిషి అలవాట్ల కోసమే బతకడం అసహజం. మనిషి అలవాట్లకు లొంగిపోవడం అవాంఛనీయం. అది అనర్థదాయకం మాత్రమే కాదు అపాయకరం కూడా. ఒక మనిషి అలవాట్లు అతడికి ఎంతమాత్రమూ అపాయకరం కాకూడదు. ఏ మనిషీ అలవాట్లకు బానిస అయిపోకూడదు. అలవాట్లకు బానిస అయిపోయిన వ్యక్తి ఆపదల్లో ఉన్న వ్యక్తి అయిపోతాడు.

ప్రతివ్యక్తీ తన అలవాట్లను తాను సమీక్షించుకుంటూ ఉండాలి. ప్రతివ్యక్తికీ



అలవాట్లలో మంచివి, చెడ్డవి మాత్రమే కాదు పనికివచ్చేవి, పనికిరానివి, అవసరమైనవి, అనవసరమైనవి కూడా ఉంటాయి. ఏయే అలవాట్లు పనికిరానివో, ఏయే అలవాట్లు పనికి వచ్చేవో ఎవరికివారు తెలుసుకోవాల్సి ఉంటుంది. అవసరమైన అలవాట్లతో, పనికివచ్చే అలవాట్లతో ప్రతి ఒక్కరూ ప్రయోజనాల్ని పొందాలి.

అలవాట్లకోసం బతికేవాళ్లూ, అలవాటుగా బతికేవాళ్లూ ఉంటారు. చాలామంది అలవాట్ల ఏట్లో కొట్టుకుపోతూ ఉంటారు. అలవాట్ల ఏట్లో కొట్టుకుపోవడం బతుకుతూ ఉండడం అవుతుందా? కానేకాదు. బతుకుతున్నాం కాబట్టి అలవాట్లు అనేవి ఉంటాయి. అలవాటుగా బతకడమో, అలవాట్ల కోసం బతకడమో సరికాదు. అలవాట్ల ఏట్లో కొట్టుకుపోతూ ఉంటే మనం మనకు దక్కం. మన అలవాట్లతో మనల్ని మనం నిలుపుకోవాలి.

> అలవాట్లకోసం బతికే వాళ్లూ, అలవాటుగా బతికే వాళ్లూ ఉంటారు. చాలామంది అలవాట్ల ఏట్లో కొట్టుకు పోతూ ఉంటారు. అలవాట్ల ఏట్లో కొట్టుకు పోవడం బతుకుతూ ఉండడం అవుతుందా?

మన అలవాట్లు మనకు మేలు చెయ్యాలి. మన అలవాట్లు మన అభివద్ధికి దోహదం చెయ్యాలి. మనకు నష్టాల్నీ, కీడును కలగజేసే అలవాట్లను మనం వెనువెంటనే వదులుకోవాలి. అలవాట్లవల్ల ఏ వ్యక్తీ అగచాట్లపాలవకూడదు. ఏ వ్యక్తీ తన తన అలవాట్లపై తనకే ఒక ఆలోచన ఉండాలి. తన అలవాట్లు మంచివా? చెడ్డవా? తన అలవాట్లు తనకు మేలు చేస్తున్నాయా? కీడు చేస్తున్నాయా? అన్న ఆలోచన మనిషికి ఉంటూ ఉండాలి. 'అలవాట్లపై ఆలోచన' అన్నది మనిషికి ఎంతో అవసరం. తన అలవాట్లపై ఆలోచన చేస్తూ ఉండడం మనిషికి తప్పకుండా ఎప్పటికీ ఉండాల్సిన అలవాటు!

ఎంతటి మనిషినైనా నీచమైన అలవాట్లు పతనం చేసేస్తాయి. ఏ మనిషికైనా ఉత్తమైన అలవాట్లు ప్రగతిని ఇవ్వగలవు, ఇస్తాయి. అలవాట్లు మనిషికి పతనాన్ని కాదు ప్రగతిని ఇవ్వగలగాలి, ఇవ్వాలి.

మనిషి జీవనం నాట్యం. అలవాట్లు అన్నవి ఆ నాట్యంలో భంగిమలు. భంగిమలు సరిగ్గాలేకపోతే నాట్యం భ్రష్టుపడుతుంది. అలవాట్లు సరైనవి కాకపోతే మనిషి జీవితం భ్రష్టుపడుతుంది.

నాణ్యమైన అలవాట్లతో నాణ్యమైన జీవనం చేస్తూ నాణ్యమైన మనుషులం అవుదాం.

– రోచిష్మాన్



బాబాసాహెబ్ అంబేద్కర్

జనం కోసం...

అంబేద్కర్‌గారి గురించి ప్రత్యేకమైన పరిచయం అక్కరలేదు. దేశంలో పీడితవర్గాలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం పరిశ్రమించినవాడు. స్వతంత్ర భారతదేశంలో రాజ్యాంగాన్ని అనుష్ఠించి, అనుసరించి, పరిపాలన చేసుకోగలుగుతున్నాం అంటే దానికి ఆయన ప్రధాన కారకులు. రాజ్యాంగ నిర్మాతలలో ఆయన కూడా ఒకరు. ఆయన చెప్పిన ఒక మంచి మాట – 'నీకోసం జీవిస్తే నీలోనే జీవిస్తావు, జనం కోసం జీవిస్తే చరిత్రలో నిలుస్తావు' అని!

సర్వసాధారణంగా ఏ వ్యక్తి అయినా మొట్టమొదట తన గురించే ఆలోచిస్తాడు. 'నాకోసం నేను బతకాలి. నేను బాగుండాలి, నా భార్యాబిడ్డలు బాగుండాలి, నా కుటుంబం బాగుండాలి' అని ఆశిస్తాడు. కేవలం నాకోసం నేను జీవించాలనుకోవడం తప్పు కాకపోవచ్చు. పరిధి పెరిగి తనకన్నా సమాజం గొప్పదనీ, తన ఇంటికన్నా దేశం గొప్పదనీ ఆలోచించాలి. అందరికోసం జీవించినవారు ధర్మాత్ములు. అటువంటి వారు కొన్ని కోట్లమందికి స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని పొంది ఉంటారు. అటువంటి మహాపురుషులు ఈ దేశంలో ఎందరో ప్రభవించారు. స్వాతంత్ర్య సమర సమయంలో తమ ప్రాణాలను గడ్డిపోచకింద భావించి జీవితాంతం జైలుజీవితం అనుభవించినవారున్నారు.ఏకాంతవాసం చేసినవారు, ప్రవాస జీవితం గడిపిన వారు, ద్వీపాంతర జీవితం గడిపినవారు, లాఠీదెబ్బలు తిన్నవారు, తుపాకీ గుళ్ళకు ఒరిగిపోయినవారు, అంగవైకల్యం పొందినవారు, కుటుంబాలు పోగొట్టుకున్నవారు, ఆర్థికంగా చితికినవారు, .. ఇటువంటి మహాత్ములు ఎందరో... ఎవరికోసం అదంతా... ఈ దేశంకోసం.. ఈ దేశ ప్రజల కోసం.. ఈ ఉదాత్త భావన ఆనాడు దేశ ప్రజలందరిలో ఎంతగా పొంగిపొర్లుతూ ఉండేదంటే... వినోబా భావే భూదానోద్యమం ప్రచారానికి దేశమంతటా తిరుగుతూ తమ తమ ప్రాంతాలకు వస్తే... చిన్నకమతాల దగ్గరనుండీ వందల, వేల ఎకరాల భూమిని నీళ్ళలా దానం చేసేసారు.. దాదాపు 42 లక్షల ఎకరాల భూమి పంచిపెట్టడానికిగాను ప్రజలు ఆయనకు ఇచ్చారు. ఉత్తర ప్రదేశ్‌లోని ఒక గ్రామానికి గ్రామం ఆయనకు దానమిచ్చేసారు. సంపద ఉంటే సంపద దానం లేకుంటే దేశంకోసం శ్రమ దానం చేసారు.

ఇదీ నలుగురికోసం బతకడం అంటే...
అంబేద్కర్ చెప్పినది ఇదే...

ఇలాంటి త్యాగబుద్ధి ప్రతి ఒక్కరిలో ఉండాలి. దేశమంటే నేను, నా కుటుంబం అనే కాదు, దేశమున్నది నాకోసం, నా కుటుంబం కోసం మాత్రమే కాదు...పరిధి దాటాలి, కుటుంబం పరిధి, ఊరు పరిధి... ఈ దేశం మనది అన్న భావన, మన దేశం బాగుపడడం కోసం మనం ఏ చేద్దామనే భావన ప్రతి ఒక్కరిలో రగులుతూ ఉండాలి. ఒకరిని చూసి మరొకరు స్ఫూర్తి పొందాలి... అప్పుడు మనం మహాత్మాగాంధీలను, అంబేద్కర్‌లను... రోజూ చూస్తూనే ఉండవచ్చు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

గురువాణి

బౌద్ధవాణి

కడదాకా కలసి నడిచేవారు

కోర్కెల్ని జయించి, జీవితాన్ని సఫలం చేసుకోవాలని వచ్చిన భిక్షువుల్లో కొందరు అతి తొందరలోనే దారి తప్పేవారు. కొందరు నెమ్మదిగా వెనకడుగు వేసేవారు. మరికొందరు ఒక మంచి స్థాయి వచ్చాక, తిరోగమించేవారు. ఒకరోజున అలాంటి భిక్షువుల గురించి సంభాషణ వచ్చింది! ఆ సందర్భంగా బుద్ధుడు ఇలా చెప్పాడు.

అది ఒక సుందరవనం. అందులో అందమైన జింకలు. చాలా తెలివి గలవి. ఆరగారగా పడిన వర్షాలకు పచ్చిక ఒత్తుగా లేచింది. లేత పచ్చికను తింటూ జింకలు బలంగా తయారయ్యాయి. ఒక వేటగాడు ఆ జింకల్ని పట్టుకోవాలనుకున్నాడు. కాని అవి అలికిడి తగిలీ తగలక ముందే లేచి వేగంగా ఎగిరి దూకేవి. అందేవి కావు. వాడు ఆలోచించాడు. ఎరగా మత్తుమందు తెచ్చి పచ్చిక మీద చల్లాడు. జాగ్రత్తగా పరిశీలిస్తే ఆ మందు చారలు కనిపిస్తాయి. కానీ, కొన్ని జింకలు ఏమరపాటుతో ఆ పచ్చిక పరకలు కొరికి తిన్నాయి. మత్తుకు లోనయ్యాయి. వేటగాడికి చిక్కాయి. మరలా కొన్ని రోజులకి వేటగాడు అదేపని చేశాడు.

అక్కడికి రెండవ జింకల గుంపు వచ్చింది. '' ఈ వేటగాడు మనకి మత్తు రావడానికి ఎరగా చల్లిన ఆహారాన్ని తినడం వల్ల మొదటి గుంపు జింకలు వాడికి ఆహారం అయ్యాయి. కాబట్టి మనం ఇక్కడ ఉండడం ప్రమాదం'' అనుకున్నాయి. సమస్యకు దూరంగా పోవాలనుకున్నాయి. అక్కడి నుండి పలాయనం చిత్తగించాయి. ఆ ప్రాంతాన్ని వదిలి కొండల మీదకు



చేరాయి. కొన్నాళ్ళకు వేసవికాలం వచ్చింది. ఎండలు ముదిరాయి. నీటి కయ్యలు ఎండాయి. పచ్చిక ఎండిపోయింది. ఆహారం లేక చిక్కి శల్యమయ్యాయి. చేసేది లేక అవి చివరికి కొండ దిగి పాత చోటికే వచ్చి చేరాయి. వేటగాడి 'ఎర'కి గురయ్యాయి.

ఆ తర్వాత మూడవ జింకల గుంపు అక్కడికి వచ్చింది. వాటికి మొదటి రెండు జింకల గుంపు విషయం తెలిసింది.

''అయితే మనం ఇక్కడ కొచ్చి ఆహారం తీసుకుందాం. తీసుకునే ముందు నిశితంగా పరిశీలించి, జాగ్రత్తగా వాసన చూసి తీసుకుందాం. తిన్నాక వేరే చోటుకు వెళ్లిపోదాం'' అనుకున్నాయి. అలా కొన్నాళ్ళు జాగ్రత్తపడ్డాయి. అవి ఎటునుండి వస్తున్నాయో, ఎటునుండి పోతున్నాయో కనుక్కోవాలి అనుకున్నాడు వేటగాడు. ఆ పచ్చిక మైదానం చుట్టూ కర్రలు పాతాడు. కర్రలు పడిపోయిన వైపును గుర్తించాడు. వాటి నివాసాన్ని కనిపెట్టాడు. వాటిని వలలు పెట్టి పట్టాడు.

ఇక, నాలుగో గుంపు వచ్చింది. అది కూడా మూడవ గుంపులా ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకుంది. పచ్చిక మైదానం చుట్టూ పాతిన కర్రల్ని విగరతొక్కకుండా , మందగా పోకుండా వాటి మధ్య నుండి ఒక్కొక్కటి వెళ్ళాయి. దానితో వేటగాడికి అవి చిక్కలేదు. జాడ కూడా తెలియలేదు. అవి చిరకాలం ఆనందంతో ఆరోగ్యంతో వర్ధిల్లాయి''

బుద్ధుడు ఈ కథ చెప్పి– మొదటి జింకల గుంపు తృష్ణ (కోరికలు)కు లోనైంది. రెండో గుంపు ప్రమాదాన్ని గుర్తించి , పలాయనం చిత్తగించింది. సరైన నిర్ణయం తీసుకోకపోవడం వల్ల తిరిగి వచ్చి 'ఎర'లో పడింది. మూడో గుంపు తెలివిగా నడుచుకుంది. కానీ, తగిన అప్రమత్తతో లేకపోవడం వల్ల అదీ అంతరించింది. ప్రజ్ఞతో, ఓర్పుతో, నేర్పుతో, అప్రమత్తతో ఉండడం వల్ల నాలుగవ గుంపు నిర్భీతిగా బతికింది. అలాంటి నేర్పరులే నా ధర్మంలో, నాతో కడదాకా నడచి రాగలరు'' అన్నాడు.

భిక్షువులు మౌనంగా ఉన్నారు. తమ తప్పులు సరిదిద్దుకున్నారు..! చిత్త సంస్కారంతో చివరికంటా నడిచారు..!

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

పోలీస్ ఆఫీసర్‌గా...



● రజనీకాంత్

హీరో రజనీకాంత్ మే మొదటి వారంలో పోలీస్ ఆఫీసర్‌గా ఛార్జ్ తీసుకోనున్నారట. 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ ఓ సినిమాను నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఈ మూవీ షూటింగ్ మే మొదటి వారంలో ప్రారంభం కానుందని, ఇందుకు తగ్గట్లుగా జ్ఞానవేల్ ప్రీ ప్రొడక్షన్ పనుల్ని వేగవంతం చేశారని కోలీవుడ్ టాక్. కొన్ని వాస్తవ సంఘటనలతో రూపొందనున్న ఈ సినిమాలో ఓ ముస్లిం పోలీస్ అధికారి పాత్రలో రజనీకాంత్ నటించనున్నారని సమాచారం. ప్రస్తుతం నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో 'జైలర్' సినిమాలో నటిస్తున్నారు రజనీకాంత్. అలాగే 'లాల్‌సలామ్' చిత్రంలో ఆయన ఓ అతిథి పాత్ర చేస్తున్నారు.

డ్యూయల్ రోల్?



● ఎన్టీఆర్

'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కల్యాణ్ రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, కె.హరికృష్ణ నిర్మిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో మొదలైన ఈ సినిమా తొలి షెడ్యూల్ చిత్రీకరణ ముగిసింది. మలి షెడ్యూల్ షూటింగ్ గోవాలో ప్రారంభం కానుందని తెలిసింది. దేశంలో పట్టించుకోకుండా ఉన్న తీరప్రాంత ప్రజల నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో ఎన్టీఆర్ డ్యూయల్ రోల్(తండ్రీకొడుకుల పాత్రల్లో) కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

యువత మన జాతిసంపద

– ఆర్. నారాయణమూర్తి



''డిగ్రీ పట్టాలు ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీలుగా కాలేజీలు ఉండకూడదు. విద్యార్థులకు జ్ఞానసందను పంచాలి.. విలువలను కాపాడాలి. రాజ్యాంగం కల్పించిన విద్యా హక్కు, పని హక్కు నిర్వీర్యం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందంటూ చెప్పే చిత్రమే 'యూనివర్సిటీ'' అన్నారు దర్శక – నిర్మాత, నటుడు ఆర్.నారాయణ మూర్తి. స్నేహ చిత్ర పిక్చర్స్ పతాకంపై ఆయన నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన తాజా చిత్రం 'యూనివర్సిటీ'. ప్రస్తుతం ఈ సినిమా సెన్సార్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఆర్. నారాయణ మూర్తి మాట్లాడుతూ– ''యువత జాతి సంపద. వారిని మనం కాపాడుకోవాలి. వారి మేధస్సు దేశ భవిష్యత్తుకు ఉపయోగపడాలి. కానీ పేపర్ లీకేజీ వల్ల యువత తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు. పేపర్ లీకేజీ అనే అంశం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. గుజరాత్, మధ్యప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో కూడా గమనిస్తూనే ఉన్నాం. పేపర్ లీకేజీల వల్ల విద్యావ్యవస్థ నిర్వీర్యం అవుతుంది. విద్యార్థులు, ప్రభుత్వ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న నిరుద్యోగుల భవిష్యత్తు ఏమైపోతుంది? అనే అంశాల ఇతివృత్తంగా 'యూనివర్సిటీ' సినిమా తీశాం. విద్య, వైద్య, విమాన యానం, బ్యాంకింగ్, రైల్వేస్ వంటి రంగాల్లో ప్రైవేటీకరణ జరుగుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. వీటి వల్ల మైనార్టీలు, బడుగు, బలహీన వర్గాల వారు రిజర్వేషన్లు కోల్పోయి, ఉపాధి దక్కని పరిస్థితులు ఉండొచ్చు. ఆ అంశాలను కూడా ఈ సినిమాలో చూపించే ప్రయత్నం చేశాం'' అని పేర్కొన్నారు.

ఆయన రాజమౌళి కాదు.. రాజముని

– ఏపీ మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ



● తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, వేణుగోపాలకృష్ణ, చంద్రబోస్, కీరవాణి, రాజమౌళి

''ఆస్కార్ అవార్డు సాధించి ఎంతో మంది తెలుగు ప్రజల ఆకాంక్షలు నెరవేర్చారు డైరెక్టర్ రాజమౌళి. ఆయన రాజమౌళి కాదు.. రాజముని. ఆయన చేసిన గొప్ప ప్రయోగం (ఆర్ఆర్ఆర్) తెలుగు వారి కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా చాటింది'' అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. 95వ ఆస్కార్ వేడుకల్లో 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని 'నాటు నాటు..' పాట బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్ సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆధ్వర్యంలో ఆస్కార్ అవార్డు గ్రహీతలు కీరవాణి, చంద్రబోస్‌లను హైదరాబాద్‌లో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన **శ్రీనివాస వేణుగోపాల కృష్ణ మాట్లాడుతూ–** ''ఆస్కార్ అంటే ఆకాశంలో తారలాంటిది. ఆ తారని నేలకు తెచ్చిన రాజమౌళి, కీరవాణి, చంద్రబోస్‌లకు అభినందనలు. తెలుగువారు గర్వపడేలా తెలుగు ఇండస్ట్రీని ఉన్నత స్థానంలో నిలిపిన వారికి ఏపీ ప్రభుత్వం, మా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి తరఫున అభినందనలు'' అన్నారు. **తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ–** ''నాటు నాటు..' పాటకి 'ఆస్కార్' రావాలని లక్షల మంది ఎదురు చూశారు.. ఆ అవార్డు రానే వచ్చింది. ఈ విజయాన్ని సాధించిన రాజమౌళి, కీరవాణి, చంద్రబోస్‌గార్లకు అభినందనలు''అన్నారు. **తెలంగాణ రాష్ట్ర క్రీడలశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ–**''ఒక సినిమాకి నంది అవార్డు వచ్చిందంటే చాలా గొప్పగా అనుకుంటున్నాం. అలాంటిది తొలిసారి ఒక తెలుగు పాటకి ప్రపంచంలో అత్యున్నతమైన 'ఆస్కార్' అవార్డు రావడం తెలుగు ఇండస్ట్రీ గర్వపడే సమయం. 'ఆర్ఆర్ఆర్' యూనిట్‌కి అభినందనలు'' అన్నారు. **ఎంఎం కీరవాణి మాట్లాడుతూ** – ''నాటు నాటు..' పాటకి 'ఆస్కార్' అవార్డు రావడం వెనుక రాజమౌళి, ప్రేమ్ రక్షిత్ మాస్టర్, అద్భుతంగా డ్యాన్స్ చేసిన రామ్‌చరణ్, ఎన్టీఆర్, ఉక్రెయిన్ డ్యాన్సర్స్ కృషి ఉంది. 'ఆర్ఆర్ఆర్' సినిమా నచ్చింది కాబట్టే 'నాటు నాటు..' పాట నచ్చింది, అవార్డు వచ్చింది. ఇది 'ఆర్ఆర్ఆర్' యూనిట్ సమిష్టి కృషికి లభించిన విజయం'' అన్నారు. **పాటల రచయిత చంద్రబోస్ మాట్లాడుతూ–**''తమ్ముడూ.. నువ్వు పాడటంపై దృష్టి పెట్టొద్దు.. రాయడంపై దృష్టి పెట్టు' అని చెప్పిన గుర్రా శ్రీనాథ్ అన్న, 'పెళ్లిసందడి' సమయంలో 'బోస్‌ని మనతోపాటు చెన్నై తీసుకెళదాం' అంటూ రాఘవేంద్రరావుగారితో చెప్పిన కీరవాణిగార్ల మాటలు నా జీవిత గమనాన్ని మార్చి ఈ స్థాయిలో నిలబెట్టాయి. ఆస్కార్‌ని చేతిలో పట్టుకున్నప్పుడు భారత సాహిత్య పతాకాన్ని పట్టుకున్నంత ఆనందం కలిగింది'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాతలు, దర్శకులు, హీరోలు, చిత్ర పరిశ్రమలోని 24 విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పదమూడేళ్ల తర్వాత....



● ఏఆర్ రెహమాన్

రామ్‌చరణ్ హీరోగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సన దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రం నిర్మించనున్నారు. ఈ సినిమా చిత్రీకరణను సెప్టెంబరులో ప్రారంభించాలని యూనిట్ సన్నాహాలు చేస్తోంది. హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్, జాన్వీకపూర్‌ల పేర్లు తెరపైకి వచ్చాయి. అలాగే ఈ చిత్రానికి సంగీత దర్శకునిగా ఆస్కార్ అవార్డు విజేత ఏఆర్ రెహమాన్ పేరు తాజాగా వినిపిస్తోంది. గతంలో తెలుగులో 'సూపర్ పోలీస్','నాని', 'కొమురం పులి' (2010) సినిమాలకు సంగీతం అందించారాయన. పదమూడేళ్ల తర్వాత ఏఆర్ రెహమాన్ మరోసారి తెలుగు సినిమాకు సంగీతం అందించనున్నారని టాక్. ఈ విషయంపై స్పష్టత రావాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాలి.

రారా పెనిమిటి హిట్ కావాలి

– మణిశర్మ



● సత్య వెంకట, నందిత, ప్రమీల, మణిశర్మ

''రారా పెనిమిటి' సినిమా చాలా మంచి కథ. ఇందులో మంచి పాటలు చేసే అవకాశం కల్పించిన డైరెక్టర్ సత్యగారికి థ్యాంక్స్. ఈ సినిమా మంచి హిట్ కావాలి'' అని సంగీత దర్శకుడు మణిశర్మ అన్నారు. నందిత శ్వేత లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'రారా పెనిమిటి'. సత్య వెంకట గెద్దాడ దర్శకత్వంలో ప్రమీల గెద్దాడ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకలో నందిత శ్వేత మాట్లాడుతూ– ''ఈ సినిమాలో ఒకే ఒక పాత్ర అనగానే నేను చేయగలనా? అని మొదట భయపడ్డాను.. కానీ, ధైర్యం చేసి చేశాను'' అన్నారు. ''కొత్తగా పెళ్లి అయిన అమ్మాయి తన భర్త రాక కోసం ఎదురు చూస్తూ పడే విరహ వేదనే ఈ చిత్రం'' అన్నారు సత్య వెంకట గెద్దాడ. ఈ వేడుకలో సీనియర్ జర్నలిస్ట్ ప్రభు, నటుడు రాంకీ, పాటల రచయిత డి.నీలకంఠరావు, సింగర్ హారిణి ఇవటూరి తదితరులు మాట్లాడారు.

అల్బెలా అల్బెలా...



● 'ఉగ్రం' పోస్టర్

హీరో 'అల్లరి' నరేశ్, దర్శకుడు విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'నాంది' సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ హిట్ కాంబోలో రెండోసారి రూపొందిన మూవీ 'ఉగ్రం'. ఇందులో మీర్నా మీనన్ హీరోయిన్‌గా నటించారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించిన ఈ చిత్రం మే 5న రిలీజ్ కానుంది. శ్రీచరణ్ పాకాల సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'అల్బెలా అల్బెలా..' అనే పాట వీడియో సాంగ్‌ను హీరో నాని రిలీజ్ చేశారు. 'అల్బెలా అల్బెలా బిలా హల్‌చల్ చేద్దాం క్రేజీగా... టెన్షన్‌కు బ్రేక్ ఇద్దాం పదా..' అంటూ సాగుతుందీ పాట. ఈ పాటకు భాస్కర్ భట్ల సాహిత్యం అందించగా, రేవంత్, శ్రావణ భార్గవి పాడారు. ఈ సినిమాకు కెమెరా: సిద్.



ఓర్లియాన్ మాస్టర్స్ టోర్నీ విజేత ప్రియాన్షు

భారత బ్యాడ్మింటన్ యువతార, ప్రపంచ 58వ ర్యాంకర్ ప్రియాన్షు రజావత్ తన కెరీర్‌లోనే గొప్ప విజయం సాధించాడు. ఆదివారం ఫ్రాన్స్‌లో ముగిసిన ఓర్లియాన్ మాస్టర్స్ టోర్నీలో పురుషుల సింగిల్స్ విభాగంలో విజేతగా నిలిచాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన 21 ఏళ్ల ప్రియాన్షు 68 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో 21-15, 19-21, 21-16తో ప్రపంచ 49వ ర్యాంకర్ మాగ్నస్ జొహాన్సన్ (డెన్మార్క్)పై గెలిచాడు. ప్రియాన్షుకు 18,000 డాలర్ల (రూ. 14 లక్షల 73 వేలు) ప్రైజ్‌మనీ, 7000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

రజతం నెగ్గిన భారత రెజ్లర్ రూపిన్



కజకిస్తాన్‌లో జరుగుతున్న ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజు భారత్‌కు మూడు పతకాలు లభించాయి. పురుషుల గ్రీకో రోమన్ విభాగంలో రూపిన్ (55 కేజీలు) రజతం... నీరజ్ (63 కేజీలు), సునీల్ (87 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు. ఫైనల్లో రూపిన్ 1-3తో సొలత్ (ఇరాన్) చేతిలో ఓడిపోగా... నీరజ్ 5-2తో జిన్‌సియుబ్ సాంగ్ (దక్షిణ కొరియా)పై, సునీల్ 4-1తో మసాటో సుమి (జపాన్)పై గెలిచారు.

రింకూ 6,6,6,6,6

ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు కాదు.. ఏకంగా ఐదు వరుస బంతుల్లో ఐదు సిక్స్‌లు... ఆదివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌పై కోల్‌కతా నైట్‌రైడర్స్ బ్యాటర్ రింకూ సింగ్ ఆఖరి ఓవర్లో సృష్టించిన విధ్వంసమిది. రింకూ అత్యద్భుత ఆటతీరుతో ఓటమి తథ్యమనుకున్న చోట కోల్‌కతా విజయకేతనం ఎగురవేసింది. గెలుపు ఖాయమనుకున్న గుజరాత్ టైటాన్స్‌కు రింకూ ఆటతో దిమ్మదిరిగిపోయింది. ఐపీఎల్ టోర్నీ చరిత్రలో అభిమానులు ఎన్నో ఉత్కంఠభరిత మ్యాచ్‌లు చూశారు. ఆఖరి బంతికి ఫలితాలు తారుమారైన మ్యాచ్‌లు కూడా ఎన్నో ఉన్నాయి. కానీ రింకూ సింగ్ ఆడిన ఇన్నింగ్స్ మాత్రం అభిమానుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతుందంటే అతిశయోక్తి కాదు.

- వరుస ఐదు బంతుల్లో ఐదు సిక్స్‌లతో కోల్‌కతాను గెలిపించిన రింకూ సింగ్
- వెంకటేశ్ అయ్యర్ మెరుపులు
- గుజరాత్ టైటాన్స్‌కు షాక్
- రషీద్ ఖాన్ 'హ్యాట్రిక్' వృథా



రింకూ సింగ్

అహ్మదాబాద్: ఐపీఎల్ టోర్నీలో ఆదివారం అద్భుతం చోటు చేసుకుంది. డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ మూడు వికెట్లతో అసాధారణ విజయం సాధించింది. 205 పరుగుల విజయలక్ష్యాన్ని కోల్‌కతా సరిగ్గా 20 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓటమి ముంగిట ఉన్న కోల్‌కతాను 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రింకూ సింగ్ (21 బంతుల్లో 48 నాటౌట్; 1 ఫోర్, 6 సిక్స్‌లు) విజయతీరానికి చేర్చాడు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతా 18 ఓవర్లు ముగిసేసరికి 162/7తో ఉంది. గెలవాలంటే కోల్‌కతా 12 బంతుల్లో 43 పరుగులు చేయాలి. 19వ ఓవర్లో కోల్‌కతా14 పరుగులు సాధించింది. దాంతో ఆ జట్టు విజయ సమీకరణం 6 బంతుల్లో 29 పరుగులుగా మారింది. గుజరాత్ బౌలర్ యశ్ దయాళ్ వేసిన చివరి ఓవర్ తొలి బంతికి ఉమేశ్ సింగిల్ తీసి రింకూ సింగ్‌కు స్ట్రయిక్ ఇచ్చాడు. కోల్‌కతా నెగ్గాలంటే 5 బంతుల్లో 28 పరుగులు చేయాలి. అప్పటికి రింకూ 16 బంతుల్లో 18 పరుగులు చేసి క్రీజులో ఉన్నాడు. అద్భుతం జరిగితే తప్ప గుజరాత్ జట్టే గెలవడం ఖాయమనుకున్నారు. కానీ రింకూ తన ఆటతో అద్భుతమే చేసి చూపించాడు. ఈ ఓవర్ రెండో బంతిని లాంగ్ ఆఫ్ మీదుగా... మూడో బంతిని డీప్ బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ దిశగా... నాలుగో బంతిని లెగ్ సైడ్ దిశగా... ఐదో బంతిని లాంగ్‌ఆఫ్ మీదుగా సిక్స్‌లుగా మలిచాడు. దాంతో కోల్‌కతా విజయసమీకరణం 1 బంతికి 4 పరుగులుగా మారిపోయింది. కోల్‌కతా గెలుస్తుందా? గుజరాత్ గట్టెక్కుతుందా? మ్యాచ్ 'టై'గా ముగిసి 'సూపర్ ఓవర్' జరుగుతుందా? అని ఉత్కంఠ ... కానీ రింకూ రఫ్ఫాడించడం ఆపలేదు. చివరి బంతిని లాంగ్‌ఆన్ మీదుగా సిక్స్ కొట్టేశాడు. అంతే కోల్‌కతా శిబిరంలో ఆనందోత్సాహాలు వెల్లివెరియగా... జరిగిందా కలయా, నిజమా అని గుజరాత్ జట్టు సభ్యులు దిగ్భ్రమలో ఉండిపోయారు. అంతకుముందు కోల్‌కతా 4 ఓవర్లు ముగిసేసరికి 2 వికెట్లు కోల్పోయి 28 పరుగులతో ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో 'ఇంపాక్ట్ ప్లేయర్' వెంకటేశ్ అయ్యర్ (40 బంతుల్లో 83; 8 ఫోర్లు, 5 సిక్స్‌లు), కెప్టెన్ నితీశ్ రాణా (29 బంతుల్లో 45; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడి కోల్‌కతాను నిలబెట్టారు. వీరిద్దరు మూడో వికెట్‌కు 100 పరుగులు జోడించారు. నితీశ్ అవుటయ్యాక రింకూతో కలిసి వెంకటేశ్ కోల్‌కతా స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. 16వ ఓవర్ ఐదో బంతికి జోసెఫ్ బౌలింగ్‌లో గిల్‌కు క్యాచ్ ఇచ్చి వెంకటేశ్ పెవిలియన్ చేరాడు.



వెంకటేశ్ అయ్యర్



రషీద్

రషీద్ ఖాన్ 'హ్యాట్రిక్'...

కోల్‌కతా ఇన్నింగ్స్ 17వ ఓవర్లో మ్యాచ్ గుజరాత్ వైపు పూర్తిగా మొగ్గిపోయింది. ఈ ఓవర్లోని తొలి మూడు బంతుల్లో వరుసగా రసెల్ (1), సునీల్ నరైన్ (0), శార్దుల్ ఠాకూర్ (0)లను గుజరాత్ తాత్కాలిక కెప్టెన్ రషీద్ ఖాన్ అవుట్ చేసి 'హ్యాట్రిక్' సాధించాడు. దాంతో కోల్‌కతా స్కోరు 154/4 నుంచి 155/7గా మారిపోయింది. గుజరాత్ విజయం ఖాయమనిపించింది. కానీ చివరి మూడు ఓవర్లలో ఉమేశ్ యాదవ్ (6 బంతుల్లో 5 నాటౌట్) జతగా రింకూ సింగ్ అసాధారణ ఇన్నింగ్స్‌తో కోల్‌కతాకు చిరస్మరణీయ విజయం అందించాడు.

విజయ్ శంకర్ ధనాధన్...

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుజరాత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 204 పరుగులు సాధించింది. రెగ్యులర్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా అస్వస్థత కారణంగా ఈ మ్యాచ్‌కు దూరంకాగా, రషీద్ ఖాన్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. శుబ్‌మన్ గిల్ (31 బంతుల్లో 39; 5 ఫోర్లు), సాయి సుదర్శన్ (38 బంతుల్లో 53; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. ఆఖర్లో విజయ్ శంకర్ (24 బంతుల్లో 63 నాటౌట్; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) కళ్లు చెదిరే ఇన్నింగ్స్‌తో గుజరాత్ చివరి 15 బంతుల్లో 51 పరుగులు పిండుకుంది. దాంతో ఆ జట్టు స్కోరు 200 పరుగులు దాటింది.

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) జగదీశన్ (బి) నరైన్ 17; శుబ్‌మన్ గిల్ (సి) ఉమేశ్ యాదవ్ (బి) నరైన్ 39; సాయి సుదర్శన్ (సి) అనుకూల్ రాయ్ (సబ్) (బి) నరైన్ 53; అభినవ్ మనోహర్ (బి) సుయశ్ శర్మ 14; విజయ్ శంకర్ (నాటౌట్) 63; డేవిడ్ మిల్లర్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 204. వికెట్ల పతనం:** 1-33, 2-100, 3-118, 4-153. **బౌలింగ్:** ఉమేశ్ యాదవ్ 3-0-24-0, శార్దుల్ ఠాకూర్ 3-0-40-0, ఫెర్గూసన్ 4-0-40-0, సునీల్ నరైన్ 4-0-33-3, వరుణ్ చక్రవర్తి 2-0-27-0, సుయశ్ శర్మ 4-0-35-1. కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) యశ్ దయాళ్ (బి) షమీ 15; జగదీశన్ (సి) మనోహర్ (బి) లిటిల్ 6; వెంకటేశ్ అయ్యర్ (సి) గిల్ (బి) జోసెఫ్ 83; నితీశ్ రాణా (సి) షమీ (బి) జోసెఫ్ 45; రింకూ సింగ్ (నాటౌట్) 48; రసెల్ (సి) కేఎస్ భరత్ (సబ్) (బి) రషీద్ ఖాన్ 1; నరైన్ (సి) జయంత్ యాదవ్ (సబ్) (బి) రషీద్ ఖాన్ 0; శార్దుల్ ఠాకూర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) రషీద్ ఖాన్ 0; ఉమేశ్ యాదవ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 207. వికెట్ల పతనం:** 1-20, 2-28, 3-128, 4-154, 5-155, 6-155, 7-155. **బౌలింగ్:** షమీ 4-0-28-1, జోష్ లిటిల్ 4-0-45-1, అల్జారి జోసెఫ్ 4-0-27-2, యశ్ దయాళ్ 4-0-69-0, రషీద్ ఖాన్ 4-0-37-3.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	3	2	1	4	2.067
కోల్‌కతా	3	2	1	4	1.375
లక్నో	3	2	1	4	1.358
గుజరాత్	3	2	1	4	0.431
చెన్నై	3	2	1	4	0.356
పంజాబ్	3	2	1	4	-0.281
బెంగళూరు	2	1	1	2	-1.256
హైదరాబాద్	3	1	2	2	-1.502
ముంబై	2	0	2	0	-1.394
ఢిల్లీ	3	0	3	0	-2.092

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు × లక్నో (రా. గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

'విన్'రైజర్స్...

- హైదరాబాద్ బోణీ
- 8 వికెట్లతో పంజాబ్ కింగ్స్‌పై విజయం
- రాణించిన రాహుల్ త్రిపాఠి, మర్కండే



రాహుల్ త్రిపాఠి

సాక్షి, హైదరాబాద్: ఐపీఎల్ సీజన్‌లో రెండు వరుస ఓటముల తర్వాత సన్‌రైజర్స్ చెలరేగింది. హైదరాబాద్ జట్టు సంపూర్ణ ఆధిపత్యంతో కీలక విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 8 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శిఖర్ ధావన్ (66 బంతుల్లో 99 నాటౌట్; 12 ఫోర్లు, 5 సిక్స్‌లు) త్రుటిలో సెంచరీకి దూరమయ్యాడు. మయాంక్ మర్కండే (4/15) కింగ్స్ పతనంలో కీలకపాత్ర పోషించాడు. అనంతరం సన్‌రైజర్స్ 17.1 ఓవర్లలో 2 వికెట్లకు 145 పరుగులు చేసి గెలిచింది. రాహుల్ త్రిపాఠి (48 బంతుల్లో 74 నాటౌట్; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ మార్‌క్రమ్ (21 బంతుల్లో 37 నాటౌట్; 6 ఫోర్లు) కలిసి జట్టును గెలిపించారు. వీరిద్దరు మూడో వికెట్‌కు 52 బంతుల్లోనే 100 పరుగులు జోడించారు.

శిఖర్ మినహా...



ధావన్

ఒక ఎండ్‌లో ధావన్ పట్టుదలగా చివరి వరకు నిలబడగా, మరో ఎండ్ నుంచి కనీసం సహకారం లేకపోవడంతో పంజాబ్ భారీ స్కోరు సాధించలేకపోయింది. ఇన్నింగ్స్ తొలి బంతికి ప్రభ్‌సిమ్రన్ (0)ను అవుట్ చేసి భువనేశ్వర్ మొదటి దెబ్బ కొట్టాడు. ఆ తర్వాత జాన్సెన్ తన వరుస ఓవర్లలో మాథ్యూ షార్ట్ (1), జితేశ్ శర్మ (4)లను అవుట్ చేయడంతో జట్టు 22 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. స్యామ్ కరన్ (15 బంతుల్లో 22; 3 ఫోర్లు, 1 సిక్స్) కొద్దిసేపు ధావన్‌కు అండగా నిలిచాడు. అయితే ఆ తర్వాత పంజాబ్ టపటపా వికెట్లు కోల్పోయింది. 35 పరుగుల వ్యవధిలో ఆ జట్టు 6 వికెట్లు చేజార్చుకుంది. దాంతో స్కోరు 88/9 వద్ద నిలిచింది. పంజాబ్ 100 పరుగులు చేయడం కూడా సందేహంగానే అనిపించింది. అయితే ఈ దశలో ధావన్ తను అనుభవాన్నంతా రంగరించి బాధ్యతను తీసుకున్నాడు. ఈ సమయంలో ధావన్ 47 పరుగుల వద్ద (38 బంతుల్లో) ఉన్నాడు. ఆపై చెలరేగిపోయిన అతను తర్వాతి 28 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో మరో 52 పరుగులు సాధించడం విశేషం. చివరి వికెట్‌కు ధావన్, మోహిత్ రాఠీ 55 పరుగులు జోడించగా, అందులో 52 ధావనే చేశాడు.

భారీ భాగస్వామ్యం...

ఛేదనలో రైజర్స్‌కు పెద్దగా ఇబ్బంది ఎదురుకాలేదు. ఓపెనర్లు బ్రూక్ (13), మయాంక్ అగర్వాల్ (21) ఫర్వాలేదనిపించడంతో పవర్‌ప్లేలో స్కోరు 34 పరుగులకు చేరింది. వీరిద్దరు తక్కువ వ్యవధిలో వెనుదిరిగినా... త్రిపాఠి, మార్‌క్రమ్ కలిసి సునాయాసంగా జట్టును విజయం దిశగా నడిపించారు. పంజాబ్ బౌలర్లు ఎంతగా శ్రమించినా ఈ జోడీని ఇబ్బంది పెట్టలేకపోయారు. వరుస ఫోర్లతో దూకుడు ప్రదర్శించిన త్రిపాఠి 35 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఎలిస్ ఓవర్లో మార్‌క్రమ్ నాలుగు ఫోర్లు కొట్టడంతో హైదరాబాద్ గెలుపు ఖాయమైంది.

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ (ఎల్బీ) (బి) భువనేశ్వర్ 0; ధావన్ (నాటౌట్) 99; షార్ట్ (ఎల్బీ) (బి) జాన్సెన్ 1; జితేశ్ (సి) మార్‌క్రమ్ (బి) జాన్సెన్ 4; కరన్ (సి) భువనేశ్వర్ (బి) మర్కండే 22; రజా (సి) మయాంక్ (బి) ఉమ్రాన్ 5; షారుఖ్ (ఎల్బీ) (బి) మర్కండే 4; హర్‌ప్రీత్ (బి) ఉమ్రాన్ 1; చహర్ (ఎల్బీ) (బి) మర్కండే 0; ఎలిస్ (బి) మర్కండే 0; రాఠీ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు 143). వికెట్ల పతనం:** 1-0, 2-10, 3-22, 4-63, 5-69, 6-74, 7-77, 8-78, 9-88. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-33-1, జాన్సెన్ 3-1-16-2, నటరాజన్ 4-0-40-0, సుందర్ 1-0-6-0, మర్కండే 4-0-15-4, ఉమ్రాన్ 4-0-32-2. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: బ్రూక్ (బి) అర్‌‌‌‌్షదీప్ 13; మయాంక్ (సి) కరన్ (బి) చహర్ 21; త్రిపాఠి (నాటౌట్) 74; మార్‌క్రమ్ (నాటౌట్) 37; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం (17.1 ఓవర్లలో 2 వికెట్లకు) 145. వికెట్ల పతనం:** 1-27, 2-45. **బౌలింగ్:** స్యామ్ కరన్ 3-0-14-0, అర్‌్షదీప్ 3-0-20-1, హర్‌ప్రీత్ 3.1-0-26-0, ఎలిస్ 3-0-28-0, రాహుల్ చహర్ 3-0-28-1, రాఠీ 2-0-29-0.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీఆర్‌జేసీ సెట్-2023

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 10 గురుకుల జూనియర్ కళాశాలల్లో.. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్(ఆంగ్ల మాధ్యమం) మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు గుంటూరులోని ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ దరఖాస్తులు కోరుతోంది. ఇందుకు సంబంధించి ఏపీ ఆర్‌జేసీ సెట్-2023 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అర్హులైన విద్యార్థులు ఏప్రిల్ 24 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

» **గ్రూప్స్:** ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, ఈఈటీ, సీజీటీ.
» **మొత్తం సీట్ల సంఖ్య:** 1149
» **అర్హత:** 2023 ఏప్రిల్‌లో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కులు, రిజర్వేషన్, స్పెషల్ కేటగిరీ, స్థానికత ఆధారంగా సీట్లను కేటాయిస్తారు.
» **పరీక్ష విధానం:** ప్రశ్నపత్రం ఆబ్జెక్టివ్ విధానంలో మొత్తం 150 మార్కులకు నిర్వహిస్తారు. విద్యార్థులు ఎంపిక చేసుకునే గ్రూప్ ఆధారంగా సంబంధిత సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం 2.30 గంటలు. ప్రశ్నాపత్రం తెలుగు/ఇంగ్లిష్, ఉర్దూ/ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఉంటుంది. పదో తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.04.2023.
» **హాల్‌టికెట్ జారీ తేది:** 12.05.2023.
» **ప్రవేశ పరీక్ష తేది:** 20.05.2023.
» **వెబ్‌సైట్:** www.aprs.apcfss.in

ఏపీఆర్‌డీసీసెట్-2023

గుంటూరులోని ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ.. ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2023కు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా నాగార్జున సాగర్‌లోని రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ(ఆంగ్ల మాధ్యమం) మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులైన విద్యార్థులు ఏప్రిల్ 24 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారికి మే 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 152
» **గ్రూపు, సీట్లు:** బీఏ (హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్)-40 సీట్లు, బీకాం-40 సీట్లు, బీఎస్సీ (మ్యాథ్స్,ఫిజిక్స్,కెమిస్ట్రీ)-36 సీట్లు,బీఎస్సీ (మ్యాథ్స్, స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్)-36 సీట్లు.
» **అర్హత:** 2022-23 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హత పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** కామన్ ఎంట్రన్స్ టెస్ట్, రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.04.2023.
» **హాల్ టికెట్ల జారీ తేది:** 12.05.2023.
» **ప్రవేశ పరీక్షతేది:** 20.05.2023.
» **వెబ్‌సైట్:** www.aprs.apcfss.in

బైపీసీతో... క్రేజీ కోర్సులివే!

» బైపీసీ ఉత్తీర్ణుల తొలి ప్రాధాన్యంగా ఎంబీబీఎస్, బీడీఎస్
» ఆయుష్ కోర్సులతోనూ వైద్య వృత్తిలో స్థిరపడే అవకాశం
» ప్రత్యామ్నాయ కోర్సులుగా నర్సింగ్, వెటర్నరీ, అగ్రికల్చర్
» ఏ కోర్సులో చేరినా.. నైపుణ్యాలుంటే ఉజ్వల భవిత ఖాయం

ఆఫ్టర్ ఇంటర్



ఇంటర్మీడియెట్ బైపీసీ. ఈ గ్రూప్‌లో చేరిన విద్యార్థుల్లో అధికశాతం మంది లక్ష్యం.. ఎంబీబీఎస్ లేదా బీడీఎస్! ఇందుకోసం ఇంటర్‌లో చేరిన తొలి రోజు నుంచే 'నీట్-యూజీ'లో ర్యాంకు కోసం అహర్నిశలూ కృషి చేస్తుంటారు. కానీ.. సీట్ల సంఖ్య పరిమితం. పోటీ తీవ్రం. దీంతో ఆశించిన వారందరికీ మెడిసిన్‌లో ప్రవేశం లభించే అవకాశం ఉండటంలేదు. అయితే బైపీసీ విద్యార్థుల కోసం ఎంబీబీఎస్‌కు దీటైన కోర్సులెన్నో ఉన్నాయి. వాటి వివరాలు..

'బైపీసీ అంటే.. కేవలం ఎంబీబీఎస్, బీడీఎస్ కోసమే అనే ఆలోచన వీడాలి. ఈ అర్హతతో ఇప్పుడు మరెన్నో కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. వీటితోనూ ఉజ్వల భవిష్యత్తుకు మార్గం వేసుకునే అవకాశం ఉంది. విద్యార్థులు ఇలాంటి కోర్సులపైనా దృష్టి సారించాలి'-బైపీసీ విద్యార్థులకున్న ఉన్నత విద్య అవకాశాలపై నిపుణుల అభిప్రాయం. వాస్తవానికి ప్రస్తుతం బైపీసీ విద్యార్థులకు ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్‌తోపాటు బ్యాచిలర్స్, పీజీ స్థాయిలో వినూత్న కోర్సులు ఎన్నో అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మాటిక్స్, బయో మెడిసిన్ వంటి మరెన్నో కొత్త కోర్సులు పుట్టుకొస్తున్నాయి.

మెడిసిన్‌లో చేరేలా

బైపీసీ విద్యార్థులు ఎంబీబీఎస్(బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్, బ్యాచిలర్ ఆఫ్ సర్జరీ)లో ప్రవేశానికి.. జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్-యూజీలో ర్యాంకు సాధించాలి. ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందితే.. వైద్య వృత్తికి తొలి అడుగు పడినట్లే. దీని తర్వాత పీజీ, సూపర్ స్పెషాలిటీ, పీహెచ్‌డీ ఉంటాయి. పీజీ స్థాయిలో ఎండీ లేదా ఎంఎస్ పేరుతో దాదాపు 30 స్పెషలైజేషన్లు ఉన్నాయి. పీజీ కోర్సుల్లో చేరాలనుకునే అభ్యర్థులు నీట్-పీజీ; డీఎం, ఎంసీహెచ్, డీఎన్‌బీ వంటి కోర్సుల్లో అడ్మిషన్ కోసం నీట్-ఎస్ఎస్ ఎంట్రన్స్ టెస్ట్‌లో విజయం సాధించాల్సి ఉంటుంది.

బీడీఎస్

ఎంబీబీఎస్ తర్వాత అధిక శాతం మంది ప్రాధాన్యం.. బీడీఎస్(బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జరీ). ఇందులో చేరేందుకు కూడా నీట్-యూజీలో ర్యాంకు సాధించాలి. ఉన్నత విద్యలో ప్రధానంగా అందుబాటులో ఉన్న కోర్సు ఎండీఎస్ (మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జరీ). మూడేళ్ల ఈ కోర్సులో పలు స్పెషలైజేషన్లు ఎంచుకోవచ్చు. ఎండీఎస్‌లో చేరాలంటే.. నీట్-పీజీ ఎంట్రన్స్‌లో ర్యాంకు సొంతం చేసుకోవాలి. ఎండీఎస్‌తోపాటు డెంటల్ మెడికల్ కేర్ విభాగంలో పీజీ డిప్లొమా కోర్సు కూడా అందుబాటులో ఉంది.

ఆయుష్‌తో.. వైద్య రంగంలో!

వైద్య రంగంలో కెరీర్ కోరుకునే బైపీసీ విద్యార్థులు ఆయుష్ కోర్సులను ఎంచుకోవచ్చు. ఎంబీబీఎస్, బీడీఎస్‌లకు ప్రత్యామ్నాయంగా నిలుస్తున్న ఆయుర్వేదం, యోగా అండ్ నేచురోపతి, యునాని, సిద్ధ యోగ, హోమియోపతిలనే సంక్షిప్తంగా ఆయుష్ కోర్సులుగా పిలుస్తారు. సంప్రదాయ వైద్య రీతులుగా భావించే ఈ ఆయుష్ విభాగాలకు కూడా ఆదరణ పెరుగుతోంది. కాబట్టి ఈ కోర్సులు పూర్తి చేసుకున్నా.. వైద్య రంగంలో కెరీర్ సొంతమవుతుంది.

ఆయుష్ కోర్సులకు కూడా నీట్ ర్యాంకు ఆధారంగానే కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తారు. ఎంబీబీఎస్, బీడీఎస్ కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయ్యాక.. నీట్-యూజీ స్కోర్ ఆధారంగా ఆయుష్ కోర్సులకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. వచ్చిన దరఖాస్తులు, అందుబాటులోని సీట్లు, అభ్యర్థుల ప్రాథమ్యాలను పరిగణనలోకి తీసుకొని సీట్ల కేటాయింపు చేస్తారు.

బీహెచ్ఎంఎస్

బ్యాచిలర్ ఆఫ్ హోమియోపతిక్ మెడిసిన్ అండ్ సర్జరీ సంక్షిప్తంగా..బీహెచ్ఎంఎస్. ఎంబీబీఎస్, బీడీఎస్ తర్వాత ఆదరణ పొందుతున్న కోర్సు. ఇందులోనూ ఎంబీబీఎస్ కరిక్యులంలో ఉండే విభాగాలు ఉంటాయి. ఉన్నత విద్యలో.. పీజీ స్థాయిలో మెటీరియా మెడికా, హోమియోపతిక్ ఫిలాసఫీ వంటి స్పెషలైజేషన్లకు డిమాండ్ నెలకొంది. వీటిని కూడా పూర్తి చేస్తే భవిష్యత్తులో కెరీర్ అవకాశాలు మరింత విస్తృతం అవుతాయి.

బీఏఎంఎస్

బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ.. బీఏఎంఎస్. ఎంబీబీఎస్‌లో మాదిరిగానే ఇందులోనూ అనాటమీ, ఫిజియాలజీ, పెడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్ తదితర సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. వీటిలో నైపుణ్యం ద్వారా సహజ సిద్ధ ప్రక్రియలతో రోగులకు వైద్యం చేయగలిగే పట్టు లభిస్తుంది. ఉన్నత విద్యలో.. ఎండీ స్థాయిలో ఆయుర్వేద, ఎంఎస్-ఆయుర్వేద కోర్సులు చదవొచ్చు. ఎంబీబీఎస్‌లోని జనరల్ మెడిసిన్‌కు సరితూగే విధంగా ఉండే కాయ చికిత్స, జనరల్ సర్జరీకి సరితూగే శల్యతంత్ర కోర్సులు కూడా పీజీ స్పెషలైజేషన్లుగా ఉన్నాయి.

బీయూఎంఎస్

పూర్తిగా ప్రకృతి వైద్యంగా భావించే కోర్సు.. బీయూఎంఎస్(బ్యాచిలర్ ఆఫ్ యునానీ మెడికల్ సైన్స్). దీన్ని పూర్తి చేసిన విద్యార్థులకు పీజీ స్థాయిలో గైనకాలజీ, సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్, జనరల్ మెడిసిన్, ఫార్మకాలజీలకు సరితూగే విధంగా ఎండీ, ఎంఎస్ కోర్సులు చదివే అవకాశం ఉంది.

బీఎన్‌వైఎస్

వైద్య రంగంలో మరో ప్రత్యామ్నాయ కోర్సు.. బీఎన్‌వైఎస్(బ్యాచిలర్ ఆఫ్ నేచురోపతిక్ మెడికల్ సైన్సెస్). ఈ కోర్సును పూర్తి చేసిన వారికి యోగా, సిద్ధ యోగా వంటి విధానాల ద్వారా రోగులకు చికిత్స చేయగలిగే నైపుణ్యాలు లభిస్తాయి.

బీవీఎస్సీ అండ్ ఏహెచ్

బైపీసీ విద్యార్థులకు డాక్టర్ హోదా కల్పించే మరో కోర్సు.. బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండరీ(బీవీఎస్సీ అండ్ ఏహెచ్). జంతువులకు వచ్చే వ్యాధులు, నివారణ చర్యలు, పశువుల గర్భధారణ పద్ధతులు వంటి వాటిపై అవగాహన కల్పించే కోర్సు ఇది. ఫౌల్ట్రీ ఫారాలు, ప్రభుత్వ, ప్రైవేటు పశు వైద్య ఆసుపత్రులు, పశు సంవర్థక శాలలు, వన్యమృగ సంరక్షణ కేంద్రాలు, జంతు ప్రదర్శనశాలలు, డెయిరీ ఫామ్స్, గొర్రెల పెంపకం కేంద్రాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. తెలుగు రాష్ట్రాల్లో ఈ కోర్సు.. ఏపీలో శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ, తెలంగాణలో పి.వి.నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలో అందుబాటులో ఉంది. పీజీ స్థాయిలోనూ పలు స్పెషలైజేషన్లు అభ్యసించే అవకాశం ఉంది.

బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ

బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ..సంక్షిప్తంగా బీపీటీ. వైద్య రంగంలో స్థిరపడాలనుకునే వారికి ఉపయుక్తమైన కోర్సు ఇది. ఈ కోర్సు పూర్తి చేస్తే ఫిజియోథెరపిస్ట్‌లుగా ఉద్యోగాలతోపాటు స్వయం ఉపాధి అవకాశాలు అందుకోవచ్చు.

బీఎస్సీ నర్సింగ్

వైద్య రంగంలోనే స్థిరపడే అవకాశం కల్పిస్తున్న మరో కోర్సు.. బీఎస్సీ నర్సింగ్. తెలంగాణలో ఈ ఏడాది నుంచి ఎంసెట్ ర్యాంకు ఆధారంగా బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలు చేపట్టనున్నారు. ఈ కోర్సు పూర్తి చేసుకున్న వారికి నేరుగా నర్సులుగా కెరీర్ ప్రారంభించే అవకాశం లభిస్తుంది. వీరికి ఆస్పత్రుల్లో, ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో సూపర్‌వైజర్ స్థాయి ఉద్యోగాలు లభిస్తాయి. పీజీ స్థాయిలో ఎమ్మెస్సీ నర్సింగ్ కోర్సు అందుబాటులో ఉంది. ప్రస్తుతం నర్సింగ్ కోర్సులను రాష్ట్రాల స్థాయిలో హెల్త్ యూనివర్సిటీల పరిధిలోని కళాశాలలతోపాటు జాతీయ స్థాయిలోనూ పలు ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు అందిస్తున్నాయి.

పారా మెడికల్ కోర్సులు

బైపీసీ విద్యార్థులకు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను అందిస్తున్నాయి.. పారా మెడికల్ కోర్సులు. ప్రధానంగా న్యూరో ఫిజియాలజీ టెక్నాలజీ, ఆప్టోమెట్రిక్ టెక్నాలజీ, రెనాల్ డయాలసిస్ టెక్నాలజీ, పెర్ఫ్యూజన్ టెక్నాలజీ, కార్డియాక్ కేర్ టెక్నాలజీ అండ్ కార్డియో వ్యాస్కులర్ టెక్నాలజీ, అనెస్తీషియాలజీ టెక్నాలజీ అండ్ ఆపరేషన్ థియటర్ డిగ్రీ, ఇమేజింగ్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిని పూర్తి చేయడం ద్వారా హాస్పిటల్స్‌లో ఆయా విభాగాల్లో టెక్నీషియన్స్‌గా స్థిరపడొచ్చు. పారా మెడికల్ కోర్సులను కూడా హెల్త్ యూనివర్సిటీలే పర్యవేక్షిస్తాయి.

అగ్రికల్చర్ బీఎస్సీ

బైపీసీ విద్యార్థులకు కెరీర్ అవకాశాలు కల్పించే మరో చక్కటి కోర్సు.. అగ్రికల్చరల్ బీఎస్సీ. వ్యవసాయ సాగు విధానాల్లో ఆధునిక పద్ధతులు, నూతన పరికరాల వినియోగం వంటి నైపుణ్యాలను అందించే కోర్సు ఇది. తెలుగు రాష్ట్రాల్లో ఆచార్య ఎన్‌జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ(ఏపీ), ఆచార్య జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ(తెలంగాణ) పరిధిలో పలు కళాశాలల్లో అగ్రికల్చర్ బీఎస్సీ అందుబాటులో ఉంది. ప్రభుత్వ విభాగంలో వ్యవసాయ శాఖలో అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి.

బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్

బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ సంక్షిప్తంగా.. బీఎఫ్ఎస్సీ. మత్స్య సంరక్షణ,సేకరణ వంటి విషయాల్లో ప్రత్యేక పద్ధతులు, శాస్త్రీయ విధానాలపై అవగాహన కల్పించే కోర్సు ఇది. దీన్ని పూర్తి చేసిన వారికి ఆక్వాకల్చర్ సంస్థలు, ఆక్వా రీసెర్చ్ సంస్థలు ప్రధాన ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి. తెలంగాణలో పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ, ఏపీలో శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీల పరిధిలో ఈ కోర్సు అందుబాటులో ఉంది.

బీటెక్-ఫుడ్ టెక్నాలజీ

ప్రస్తుత ఆధునిక పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న మరో కోర్సు.. బీటెక్-ఫుడ్ టెక్నాలజీ. ఆహార ఉత్పత్తుల తయారీ, నాణ్యత, ప్రాసెసింగ్ సంబంధిత నైపుణ్యాలు అందించే కోర్సు ఇది. దీన్ని పూర్తి చేసుకుంటే.. ఫుడ్ ప్రొడక్షన్ యూనిట్స్, ప్యాకేజ్డ్ ఫుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థల్లో కొలువుదీరొచ్చు.

బీఎస్సీ(సీఏబీఎం)

బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ కమర్షియల్ అగ్రికల్చర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్.. సంక్షిప్తంగా సీఏబీఎం. బైపీసీ విద్యార్థులకు కార్పొరేట్ కొలువులకు మార్గం వేసే మరో కోర్సు ఇది. వ్యవసాయ విధానంలో ఆధునిక పద్ధతులను అన్వయించడం, వాటి ద్వారా లాభదాయకత పెంచే విధానాలను బోధిస్తారు.

బీఎస్సీ(బీజెడ్‌సీ)

బైపీసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న సాంప్రదాయ కోర్సు.. బీఎస్సీ(బీజెడ్‌సీ). ప్రస్తుతం యూనివర్సిటీలు అనుసరిస్తున్న నూతన విధానాల మేరకు.. బీజెడ్‌సీలోనూ మైక్రోబయాలజీ, జెనెటిక్స్, హ్యూమన్ జెనెటిక్స్, బయో టెక్నాలజీ, బయో ఇన్ఫర్మాటిక్స్ వంటి వినూత్న కాంబినేషన్లు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ సబ్జెక్ట్‌లతో బీఎస్సీ పూర్తి చేసిన తర్వాత సంబంధిత స్పెషలైజేషన్లతో పీజీతో లైఫ్ సైన్సెస్ విభాగాల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు. బీఎస్సీ తర్వాత ఇంటిగ్రేటెడ్ పీజీ+పీహెచ్‌డీ కోర్సుల్లో చేరే అవకాశం కూడా ఉంది.

స్టాక్ మార్కెట్లు (గురువారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	144	59,833
నిఫ్టీ ▲	42	17,599

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు		
నాస్‌డాక్	12,088 ▲	91
డోజోన్స్	33,485 ▲	3
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,742 ▲	79
డాక్స్	15,598 ▲	78
షాంఘై (7-4-2023)	3,328 ▲	15
నికాయ్ (7-4-2023)	27,518 ▲	46


• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఈ మార్పులపై ఓ లుక్కేయండి!

ఆదాయపన్ను పరంగా కీలక పరిణామాలు • కొత్త విధానం ఆకర్షణీయం రూ.7.5 లక్షల వరకు పన్ను లేదు • డెట్ ఫండ్స్ లాభాలపై పన్ను భారం గేమింగ్ లాభాలపై టీడీఎస్ • అధిక ప్రీమియం పాలసీలపై పన్ను

ఆదాయపన్ను పరంగా ఏప్రిల్ 1 నుంచి కొన్ని కీలక మార్పులు అమల్లోకి వచ్చాయి. కొన్ని పన్ను మిహాయింపులు తొలగిపోగా.. కొన్ని సాధనాలకు సంబంధించి పెట్టుబడి పరిమితుల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. గతంతో పోలిస్తే ఆదాయపన్ను కొత్త విధానం మరింత ఆకర్షణీయంగా మారింది. ప్రధానంగా పన్నుల వ్యవస్థను మరింత సరళీకృతం చేయడం, పారదర్శకతను పెంచే లక్ష్యాలతో కేంద్ర సర్కారు ఎప్పటికప్పుడు కొత్త ప్రతిపాదనలు, సవరణలు తీసుకొస్తోంది. కనుక ఆదాయపన్ను పరిధిలోని ప్రతి ఒక్కరూ తప్పక తెలుసుకోవాల్సిన మార్పులను వివరించే కథనమిది...





నూతన పన్ను విధానం...

నూతన పన్ను విధానం ఎంపిక చేసుకునే వారికి వార్షిక ఆదాయం రూ.7 లక్షల వరకు ఉంటే రూపాయి పన్ను చెల్లించే పని లేకుండా పన్ను రాయితీని ప్రభుత్వం కల్పించింది. సెక్షన్ 87ఏ కింద గరిష్ఠంగా రూ.25,000 రాయితీని ప్రకటించింది. అంటే నికరంగా రూ.7 లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి పన్ను భారం ఉండదు. తక్కువ ఆదాయం కలిగిన వారికి ఉపశమనం కల్పించడమే ఈ రాయితీ ఉద్దేశ్యమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం నుంచే ఈ రాయితీ అమల్లోకి వచ్చింది. ఈ రాయితీ వల్ల ఎక్కువ మందికి ప్రయోజనం లభించనుంది. ఒకవేళ ఆదాయం రూ.7లక్షలకు పైన స్వల్పంగా ఉన్నప్పుడు భారీగా పన్ను చెల్లించాల్సి వస్తోంది. దీన్ని అర్థం చేసుకున్న కేంద్ర సర్కారు ఆర్థిక బిల్లు 2023లో కొన్ని సవరణలు చేసింది. ఉదాహరణకు రూ.7 లక్షలకు పైన మరో రూ.5 వేల ఆదాయం ఉంటే అప్పుడు నిబంధనల కింద రూ.26,500 పన్ను (సెస్సులతో) చెల్లించాల్సి ఉంది. దీని స్థానంలో.. రూ.7లక్షలకు పైన అదనంగా ఉన్న రూ.5వేలపైనే పన్ను చెల్లిస్తే సరిపోతుంది. అలాగే, నూతన పన్ను విధానంలోనూ రూ.50,000 స్టాండర్డ్ డిడక్షన్ ప్రయోజనం కల్పించారు. దీంతో నికరంగా రూ.7.50 లక్షల వరకు పన్ను భారం పడదు. నూతన పన్ను విధానం కింద పన్ను రేట్ల లోనూ మార్పులు చేశారు. 60 ఏళ్లలోపు వారికి రూ.3 లక్షల వరకు ఆదాయంపై ఎలాంటి పన్ను ఉండదు. రూ.3-6 లక్షల ఆదాయంపై 5 శాతం పన్ను, రూ.6-9 లక్షల ఆదాయంపై 10 శాతం పన్ను పడుతుంది. రూ.9-12 లక్షల ఆదాయంపై 15 శాతం, రూ.12-15 లక్షల ఆదాయంపై 20 శాతం, రూ.15 లక్షల ఆదాయంపై 30 శాతం పన్ను రేటు వర్తిస్తుంది.

బీమాపైనా పన్ను

జీవిత బీమా పాలసీలకు చెల్లించే ప్రీమియంపైనే కాదు, గడువు తీరిన తర్వాత అందుకునే మొత్తంపైనా పన్ను ఉండదనేది అందరికీ తెలిసిన విషయం. కానీ, 2023 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చిన మార్పుల ప్రకారం.. జీవిత బీమా పాలసీలకు చెల్లించే వార్షిక ప్రీమియం రూ.5 లక్షలకు మించి ఉంటే.. పాలసీదారు జీవించి ఉన్న సందర్భాల్లో గడువు తీరిన తర్వాత అందుకునే మొత్తం పన్ను పరిధిలోకి వస్తుంది. అంటే అధిక ప్రీమియం పాలసీల మెచ్యూరిటీపై ఇప్పటి వరకు ఉన్న సున్నా పన్ను ప్రయోజనాన్ని సర్కారు తొలగించింది. వార్షిక ప్రీమియం రూ.5 లక్షల వరకు ఉండే పాలసీల మెచ్యూరిటీపై ఇక ముందూ పన్ను మినహాయింపు ప్రయోజనం కొనసాగుతుంది. అలాగే, 2023 మార్చి 31వరకు కొనుగోలు చేసిన జీవిత బీమా పాలసీలకు సంబంధించి వార్షిక ప్రీమియం రూ.5 లక్షలకు మించి ఉన్నా, చివర్లో అందుకునే మొత్తంపై పన్ను ఉండదు. అలాగే, పాలసీదారు మరణించిన సందర్భంలో చెల్లించే పరిహారంపైనా పన్ను ఉండదు. యులిప్ ప్లాన్ల ప్రీమియం ఎంత ఉన్నా కానీ, పన్ను పరిధిలోకి రావు.

డెట్ ఫండ్స్‌పై కూడా...



డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను మూడేళ్లపాటు కొనసాగించినప్పుడు వచ్చిన లాభం దీర్ఘకాల మూలధన లాభం కిందకు వస్తుంది. వచ్చిన లాభం నుంచి పెట్టుబడి పెట్టిన కాలంలో సగటు ద్రవ్యోల్బణ ప్రభావాన్ని మినహాయించి, మిగిలిన లాభంపైనే 20 శాతం పన్ను చెల్లిస్తే సరిపోయేది. ఇది గతంలో ఉన్న విధానం. కానీ, ఈ ప్రయోజనాన్ని తొలగించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడుల కాల వ్యవధి ఎంతైనా కానీయండి, వచ్చే లాభం మొత్తం వార్షిక ఆదాయానికి కలుస్తుంది. ఏ శ్లాబు రేటు పరిధిలో ఉంటే, ఆ మేరకు పన్ను చెల్లించాల్సి వస్తుంది. అంటే ప్రస్తుతం డెట్ ఫండ్స్‌లో అమల్లో ఉన్న స్వల్పకాల మూలధన లాభాల పన్ను విధానమే ఇక మీదట అన్ని రకాల డెట్ ఫండ్స్ లాభాలకు అమలవుతుంది. మొత్తానికి డెట్ ఫండ్స్‌లో పెట్టుబడులకు దీర్ఘకాల మూలధన లాభాల పన్ను ప్రయోజనాన్ని తొలగించారు. తద్వారా డెట్ ఫండ్స్‌లో దీర్ఘకాల పెట్టుబడులను నిరుత్సాహపరిచినట్టయింది. దీంతో దీర్ఘకాల పెట్టుబడులు జీవిత బీమా, ఈక్విటీ సాధనాల వైపు వెళతాయన్నది నిపుణుల అంచనాగా ఉంది. 2023 ఏప్రిల్ 1 నుంచి చేసే తాజా డెట్ పెట్టుబడులకు నూతన పన్ను విధానం అమలవుతుంది. 2023 మార్చి 31 వరకు చేసిన పెట్టుబడులకు కొత్త నిబంధన వర్తించదు.

రిటర్నుల దాఖలు

ఆదాయపన్ను రిటర్నులను దాఖలు చేసే వారు తప్పకుండా గమనించాల్సిన మార్పు ఒకటి ఉంది. పాత, కొత్త పన్ను విధానాలు ఉన్నప్పటికీ, నూతన పన్ను విధానమే డిఫాల్ట్‌గా కనిపిస్తుంది. పాత పన్ను విధానంలోనే కొనసాగాలని అనుకునేవారు రిటర్నులు దాఖలు చేసే ముందే దానిని ప్రత్యేకంగా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. నూతన పన్ను విధానంలో పన్ను రేట్లు తక్కువ. కానీ, చాలా వరకు పన్ను మినహాయింపులు, పన్ను తగ్గింపు ప్రయోజనాల్లేవు. అన్ని రకాల మినహాయింపు ప్రయోజనాలను ఉపయోగించుకునే వారికి పాత విధానం అనుకూలం. కనుక ఎవరికి వారు తమ వార్షిక ఆదాయం, పెట్టుబడుల ఆధారంగా ఏ పన్ను విధానం అనుకూలం అనేది ఎంపిక చేసుకోవాలి. ఈ విషయంలో స్పష్టత రాకపోతే పన్ను నిపుణుల సాయం తీసుకోవాలి.

ఎస్‌సీఎస్ఎస్

పదవీ విరమణ పొందిన వారికి క్రమం తప్పకుండా ఆదాయం తెచ్చిపెట్టే పెట్టుబడి పథకాల్లో సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్) ఒకటి. ఈ పథకంలో పెట్టుబడిపై ప్రతి మూడు నెలలకు ఒకసారి వడ్డీ ఆదాయం చెల్లిస్తారు. 60 ఏళ్లు నిండిన వ్యక్తులు ఎవరైనా ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు అయితే 55-60 ఏళ్ల మధ్యలో ఉన్నా పెట్టుబడికి అర్హులు. ఈ పథకంలో ఒక్కరు గరిష్ఠంగా రూ.15 లక్షల వరకే ఇన్వెస్ట్ చేసుకునేందుకు అనుమతి ఉండగా, ఏప్రిల్ 1 నుంచి దీన్ని రూ.30 లక్షలకు పెంచారు.

నగదు ఉపసంహరణలపై టీడీఎస్



బ్యాంకు ఖాతా నుంచి భారీగా నగదు ఉపసంహరణలను నిరుత్సాహ పరిచేందుకు గాను కేంద్ర సర్కారు మూలం వద్ద పన్ను మినహాయింపు (టీడీఎస్‌ను) ప్రవేశపెట్టింది. ఒక ఆర్థిక సంవత్సరంలో ఒక బ్యాంక్ ఖాతా నుంచి నగదు ఉపసంహరణలు రూ.కోటి మించితే టీడీఎస్ కింద బ్యాంకులు 2 శాతాన్ని మినహాయిస్తాయి. వ్యక్తులు, వ్యాపార సంస్థలకూ ఇది అమలవుతుంది.

ఎల్‌టీఏ

ప్రభుత్వ ఉద్యోగులు కాని వారు సెలవులను నగదుగా మార్చుకునే మొత్తంపై పన్ను ప్రయోజనానికి పరిమితి ఉంది. 2002 నుంచి ఈ పరిమితి రూ.3 లక్షలుగా ఉంటే, దాన్ని రూ.25 లక్షలకు పెంచారు. అంటే సెలవులను నగదుగా మార్చుకునే మొత్తం రూ.25 లక్షలు ఉన్నా కానీ పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు.

పోస్టాఫీసు నెలవారీ ఆదాయ పథకం

పోస్టాఫీసు మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ (పీవో ఎంఐఎస్) కూడా నెలవారీ ఆదాయం కోరుకునే వారికి ఉద్దేశించిన పథకం. ఈ పథకంలోనూ ఒక్కరు గరిష్ఠంగా రూ.4.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టుకునేందుకు అనుమతి ఉంటే, దీన్ని రూ.9 లక్షలకు పెంచారు. జాయింట్ అకౌంట్ కింద రూ.9 లక్షల పరిమితిని రూ.15 లక్షలు చేశారు.

హెచ్‌ఎన్‌ఐలపై పన్ను భారం

బడ్జెట్‌లో అధిక సంపద కలిగిన వ్యక్తులకు సర్‌చార్జీ భారాన్ని తగ్గించారు. వార్షికాదాయం రూ.5 కోట్లకు పైన ఉన్న వారికి సర్‌చార్జీ 37 శాతం నుంచి 25 శాతానికి దిగొచ్చింది. కాకపోతే నూతన పన్ను విధానాన్ని ఎంపిక చేసుకునే వారికే దీన్ని పరిమితం చేశారు.

ఎన్‌పీఎస్ నుంచి వైదొలగాలంటే..

ఏప్రిల్ 1 నుంచి ఎన్‌పీఎస్ పథకం నుంచి వైదొలిగే లేదా యాన్యుటీ ఎంపిక చేసుకునే వారికి కేవైసీ డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయడం తప్పనిసరి చేశారు. పథకం నుంచి వైదొలిగిన సభ్యులకు వేగంగా యాన్యుటీ చెల్లింపుల చేసేందుకే ఈ ఆదేశాలు అమల్లోకి తెచ్చారు. ఎన్‌పీఎస్ ఎగ్జిట్ లేదా విత్ డ్రాయల్ ఫారమ్, గుర్తింపు, చిరునామా ధ్రువీకరణ, బ్యాంక్ అకౌంట్ రుజువు, ప్రాన్ (పెన్షన్ అకౌంట్) కార్డ్ కాపీని సెంట్రల్ రికార్డ్ కీపింగ్ ఏజెన్సీ సిస్టమ్‌లోకి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అనారోగ్యం, వైకల్యం తదితర సందర్భాల్లో ఎన్‌పీఎస్ నుంచి 25 శాతం ఉపసంహరణకు అనుమతి ఉంది. ఆ సందర్భాల్లోనూ వీటిని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.



ఈ-గోల్డ్

భౌతిక బంగారాన్ని ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీప్ట్ (ఈజీఆర్) రూపంలోకి మార్చుకుంటే ఎలాంటి మూలధన లాభాల పన్ను పడదు.

ఆన్‌లైన్ గేమింగ్

ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా గెలుచుకునే మొత్తంపై 30 శాతం టీడీఎస్ అమలు కానుంది.

ఈపీఎఫ్ ఉపసంహరణపై టీడీఎస్

ఈపీఎఫ్ ఖాతాకు పాన్ లింక్ చేయకపోతే.. సభ్యులు ఉపసంహరించుకునే మొత్తంపై 20 శాతం టీడీఎస్ అమలు చేస్తారు.

ఇంటి మూలధన లాభంలో మార్పులు

ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 54, 54 ఎఫ్ కింద ఒక ఇంటిని విక్రయించగా వచ్చే మొత్తాన్ని తిరిగి ఇన్వెస్ట్ చేయడం ద్వారా పన్ను లేకుండా చూసుకోవచ్చు. ఈ సెక్షన్ల కింద తిరిగి పెట్టుబడి పెట్టే మూలధన లాభాలను రూ.10 కోట్లకు పరిమితం చేశారు. అంటే ఇంతకు మించి మూలధన లాభం ఉంటే దానిపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

మహిళా సమ్మాన్ సేవింగ్స్ స్కీమ్

మహిళలకు 2023 బడ్జెట్‌లో కొత్తగా ప్రకటించిన పథకం ఇది. 2025 మార్చి వరకు ఈ పథకం ఉంటుంది. ఒక్కరు రూ.2 లక్షల వరకు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. పెట్టుబడిపై 7.5% వడ్డీ రేటు చెల్లిస్తారు. గరిష్ఠంగా రెండేళ్లు డిపాజిట్ చేసుకోవచ్చు.

బంగారం విక్రయం ఇలా..

హాల్ మార్క్ ఆభరణాలు, బంగారం వస్తువులను ఏప్రిల్ 1 నుంచి 6 నంబర్ల ఆల్ఫాన్యూమరిక్ హాల్ మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ (హెచ్‌యూఐడీ)తోనే విక్రయించాల్సి ఉంటుంది. హాల్ మార్క్ జ్యుయలరీ పట్ల వినియోగదారుల్లో విశ్వాసాన్ని ఇది పెంచనుంది. హెచ్‌యూఐడీ లేకుండా విక్రయించడాన్ని బీఐఎస్ నిషేధించింది.

పసిడి దిగుమతుల భారీ పతనం

- 2022-23 ఏప్రిల్-ఫిబ్రవరి మధ్య 30 శాతం డౌన్
- 31.8 బిలియన్ డాలర్లుగా నమోదు



న్యూఢిల్లీ: భారత్ బంగారం దిగుమతులు గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23) ఏప్రిల్-ఫిబ్రవరి మధ్య 30 శాతం పడిపోయాయి. దిగుమతులు మొత్తం విలువ 31.8 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. యల్లో మెటల్ దిగుమతుల విలువ 2021-22 ఇదే కాలంలో 45.2 బిలియన్ డాలర్లుగా ఉంది. 2022 ఆగస్టు నుంచి దిగుమతుల్లో పెరుగుదల లేకపోగా, క్షీణత నమోదుకావడం దీనికి నేపథ్యం. బంగారంపై అధిక దిగుమతి సుంకం, ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు విలువైన లోహం దిగుమతులు తగ్గడానికి కారణమని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.గత ఏడాది కేంద్రం పసిడిపై దిగుమతి సుంకాన్ని 10.75 శాతం నుంచి 15 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. పసిడి దిగుమతులను నిరుత్సాహ పరచడం, తద్వారా ఈ బిల్లును తగ్గించడం, కరెంట్ అకౌంట్ లోటు (క్యాడ్) పెరక్కుండా కట్టడి చేయడం ఈ నిర్ణయం లక్ష్యం.

వెండి వెలుగులు..

కాగా, వెండి దిగుమతులు మాత్రం 2022-23 ఏప్రిల్- ఫిబ్రవరి మధ్య 66 శాతం పెరిగి 5.3 బిలియన్ డాలర్లుగా నమోదుకావడం గమనార్హం.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-4-2023	
విశాఖ	420-00
చిత్తూరు	428-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	395-00
విజయవాడ	395-00
రిటైల్ ధర (డజను)	66.00
9-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	370-00
వరంగల్	372-00
రిటైల్ ధర	4.30

స్టాక్స్ వ్యూ


ఫినొలెక్స్ ఇండస్ట్రీస్ | ప్రభుదాస్ లీలాధర్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 170 టార్గెట్: రూ. 224

ఎందుకంటే: అమ్మకాల పరిమాణం, అధిక మార్జిన్లు సాధించే వీలుండటంతో ఫినొలెక్స్ ఇండస్ట్రీస్ కౌంటర్‌పట్ల బుల్లిష్‌గా ఉన్నాం. స్వల్పకాలానికి పీవీసీ, ఈడీసీ ధరల మధ్య అంతరం(స్ప్రెడ్) లాభదాయకత మెరుగుకు సహకరించనుంది. వ్యవసాయం, పైపుల మార్కెట్లలో నాయకత్వ స్థానాన్ని నిలుపుకునేందుకు ప్రత్యేక దృష్టిని కొనసాగించనున్నట్లు యాజమాన్యం ఇటీవలే స్పష్టం చేసింది. నిజానికి అక్టోబర్-డిసెంబర్(క్యూ4), ఏప్రిల్-జూన్(క్యూ1) కాలాలు కంపెనీ అమ్మకాలకు కీలకంగా నిలుస్తుంటాయి. వ్యవసాయ పైపుల మార్కెట్లో సీజనల్‌గా క్యూ1, క్యూ4 కంపెనీ అత్యుత్తమ అమ్మకాల సాధనకు దోహదం చేస్తుంటాయి. గతేడాది(2022-23) పీవీసీ రెజిన్ ధరలు కంపెనీ అమ్మకాలను ప్రభావితం చేశాయి. 2022 నవంబర్ తదుపరి భారీ దిద్దుబాటు నుంచి పీవీసీ రెజిన్ ధరలు స్థిరత్వాన్ని సంతరించుకున్నాయి. కేజీకి రూ. 66కు చేరుకున్నాయి. అయితే 2023 ఫిబ్రవరి నుంచి తిరిగి బలపడుతున్నాయి. కేజీ ధర రూ. 91ను తాకింది. చైనా మార్కెట్ నూతన సంవత్సర సెలవుల తదుపరి ఓపెన్ కావడంతో కేజీ రూ. 81 వద్ద నిలకడను చూపుతోంది. 2022-23 క్యూ4లో అగ్రి-పైపుల అమ్మకాలు ఊపందుకున్నాయి. మరోవైపు పీవీసీ-ఈడీసీ ధరల అంతరం నేపథ్యంలో 16-17% ఇబిటా మార్జిన్లు కొనసాగగలవని అంచనా.

నజారా టెక్నాలజీస్ | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 550 టార్గెట్: రూ. 700

ఎందుకంటే: ఈస్పోర్ట్స్ విభాగంలో కనిపిస్తున్న వృద్ధి అవకాశాలు, గేమిఫైడ్ ఎర్లీ లెర్నింగ్(జీఈఎల్)లో క్రమంగా మెరుగుపడుతున్న లాభదాయకత నేపథ్యంలో నజారా టెక్నాలజీస్ కౌంటర్ ఆకర్షణీయంగా కనిపిస్తోంది. షేరు లైఫ్‌టైమ్ గరిష్ఠం నుంచి భారీగా దిగివచ్చింది. 52 వారాల కనిష్టానికి చేరువై ఇటీవల కొంతమేర బలపడింది. వచ్చే ఏడాది కాలంలో రూ. 700 టార్గెట్‌ను చేరగలదని అంచనా. 2024-25 అంచనా ఈపీఎస్‌కు ఇది 41 రెట్లు అధికంకాగా.. గత రెండేళ్ల సగటు చరిత్రాత్మక పీఈతో చూస్తే తక్కువే. వచ్చే ఏడాదిలో ఆదాయం వార్షిక ప్రాతిపదికన 37 శాతం పురోగమించే వీలుంది. ఇందుకు ఈస్పోర్ట్స్ విభాగం 45 శాతం, జీఈఎల్ బిజినెస్ 25 శాతం చొప్పున వార్షిక వృద్ధి సాధించడం ద్వారా దోహదపడనున్నాయి. వెరసి నిర్వహణా లాభం(ఇబిటా) 86 శాతం జంప్‌చేయగలదని అంచనా. కంపెనీ చేతిలో రూ. 660 కోట్ల నగదు నిల్వలున్నాయి. నియంత్రణ సంస్థల నుంచి నిబంధనల్లో స్పష్టత లభించాక రియల్‌మనీ గేమింగ్ విభాగంలో మరింత పట్టుసాధించేందుకు వీలుగా కంపెనీ నగదు నిల్వలను వినియోగించుకునే అవకాశముంది. తద్వారా కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు దారి ఏర్పడనుంది. పటిష్ట లిక్విడిటీ పరిస్థితుల నేపథ్యంలో కంపెనీ చౌకగా బిజినెస్‌లను చేజిక్కించుకునేందుకు సైతం వీలు చిక్కుతుంది. ఈ సానుకూల అంశాలు కంపెనీ షేరుకి ఆకర్షణను కల్పిస్తున్నాయి.

ప్రీమియం ప్లాన్లకు నో డిమాండ్



న్యూఢిల్లీ: అధిక ప్రీమియం కలిగిన జీవిత బీమా ఉత్పత్తులకు ఏమంత డిమాండ్ కనిపించలేదు. ఏప్రిల్ 1 నుంచి తీసుకునే జీవిత బీమా పాలసీల వార్షిక ప్రీమియం రూ.5,00,000కు మించి ఉంటే పన్ను చెల్లించాలంటూ నిబంధనలను బడ్జెట్‌లో ప్రకటించడం తెలిసిందే. కాకపోతే మార్చి 31 వరకు కొనుగోలు చేసే పాలసీలకు ఈ నిబంధన వర్తించదు. దీంతో అధిక ప్రీమియం ప్లాన్లను మార్చి ఆఖరులోపు కంపెనీలు పెద్ద ఎత్తున విక్రయిస్తాయని నిపుణులు భావించారు. కానీ, క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. అనుకున్న విధంగా వీటి విక్రయాలు ఏమీ పెరగలేదని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. రూ.5,00,000కు పైగా ప్రీమియం చెల్లించే ప్లాన్లకు సంబంధించి గడువు తీరిన తర్వాత అందే మొత్తం కూడా పన్ను పరిధిలోకి వస్తుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో భాగంగా ప్రకటించారు. అధిక పన్ను పరిధిలోని వారు ఈ ప్లాన్లను తీసుకోవడం ద్వారా ఆ మేరకు పన్ను ప్రయోజనం పొందే అవకాశం సెక్షన్ 10(10డి) కింద ఉంది. బడ్జెట్‌లో ప్రకటన తర్వాత చాలా బ్రోకరేజీ సంస్థలు అధిక ప్రీమియంతో కూడిన నాన్ పార్టిసిపేటరీ గ్యారంటీడ్ ఉత్పత్తులకు ఫిబ్రవరి, మార్చిలో అనూహ్య డిమాండ్ ఉంటుందనే అంచనాను వ్యక్తం చేశాయి. ఏప్రిల్ 1 నుంచి ఈ అవకాశం లేనందున చాలా మంది ముందుకు వస్తారని భావించాయి.

సాధారణ అమ్మకాలే..

ఫిబ్రవరి నెలలో అధిక ప్రీమియం బీమా ఉత్పత్తుల అమ్మకాలు పెద్దగా పెరగలేదని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మార్చిలో పెద్ద ఎత్తున అమ్ముడుపోవచ్చని బీమా కంపెనీలు సైతం భావించాయి. అయితే అలాంటి పరిస్థితి కనిపించలేదు. ''అధిక విలువ కలిగిన నాన్ యులిప్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్ల అమ్మకాల్లో అసాధారణ వృద్ధి నమోదు కాలేదు. దీనికి కారణం వాటిపై పన్ను వేయాలని ప్రభుత్వం నిర్ణయించడం వల్లేనని అనుకుంటున్నాం.'' అని ఏజెస్ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో విఘ్నేష్ సహానే తెలిపారు.

రాబడులు చూసి వైదొలగొచ్చా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను పెట్టుబడులు పెట్టిన మ్యూచువల్ ఫండ్ వరుసగా రెండేళ్లపాటు చెత్త పనితీరు చూపించినట్టయితే, నా పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం సరైనదేనా?
– ఖలీద్ మునావర్

ఏదైనా ఒక మ్యూచువల్ ఫండ్ పథకం నుంచి వైదొలగేందుకు, ఆ పథకం తక్కువ పనితీరు చూపించడం అన్నది ముఖ్యమైన అంశం అవుతుంది. తక్కువ పనితీరు అంటే ఇతర పథకాలతో పోలిస్తే తక్కువ రాబడులు ఇవ్వడం. వైదొలిగే నిర్ణయానికి ముందు.. మీరు పెట్టుబడులు పెట్టిన మ్యూచువల్ ఫండ్ పథకం విభాగంలోని ఇతర పథకాల పనితీరు కూడా విశ్లేషించాలి. వాటి పనితీరు కూడా తగ్గిందా..? లేక మీరు ఇన్వెస్ట్ చేసిన పథకం పనితీరు మాత్రమే తగ్గిందా? చూడాలి. మీరు ఇన్వెస్ట్ చేసిన ఫండ్ ఎన్ఏవీ క్షీణించడానికి ఎన్నో కారణాలు ఉండొచ్చు. స్టాక్ మార్కెట్ పడిపోయినా రాబడులు తగ్గుతాయి. అన్ని పథకాలు కొన్ని ప్రతికూల సమయాలను ఎదుర్కొంటూ ఉంటాయి. అది చూసి ఒక పథకం నుంచి మరో పథకంలోకి మారిపోవడం సరైన నిర్ణయం కాబోదు. ఈ ప్రతికూల, తక్కువ పనితీరు అనేది ఒక పథకంలో కనీసం నిరంతరాయంగా రెండేళ్లపాటు కొనసాగాలి. అప్పుడు ఆ పథకం పనితీరు గురించి మీరు ఆలోచన చేయవచ్చు. మీరు ఇన్వెస్ట్ చేసిన పథకం తక్కువ పనితీరు చూపించడం వెనుక కారణాన్ని గుర్తించాలి. ఫండ్ మేనేజర్‌లో మార్పు జరిగిందా? అందుకే పనితీరు మందగించిందా? అని చూడాలి. అదే నిజమైతే ఆ పథకం నుంచి మీ పెట్టుబడులను తీసుకుని బయటకు రావచ్చు. ఒకవేళ ఫండ్ మేనేజర్‌లో మార్పు లేకపోతే.. రాబడులు మందగించడానికి గల కారణాన్ని సాధారణంగా వారు మీడియాకు వెల్లడించే ప్రయత్నం చేస్తుంటారు. లేదంటే ఆయా ఫండ్ సంస్థ నెలవారీ న్యూస్‌లెటర్‌లోనూ సమాచారాన్ని వెల్లడిస్తుంటారు. పథకం పెట్టుబడుల విధానం వల్ల కూడా తాత్కాలికంగా రాబడులు మెరుగ్గా ఉండకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో పథకం పనితీరును తప్పుబట్టడం సరైనది కాకపోవచ్చు. ఉదాహరణకు గ్రోత్ ఆధారిత విధానంతో పోలిస్తే వ్యాల్యూ ఆధారిత పెట్టుబడుల విధానం కాస్త ఆలస్యంగా ఫలితాలను ఇస్తుంది. అటువంటప్పుడు మీరు పెట్టుబడులను కొనసాగించొచ్చు. ప్రతి ఒక్క ఇన్వెస్టర్ తాను ఎంపిక చేసుకున్న పథకం అన్ని కాలాల్లోనూ అద్భుత పనితీరు చూపించాలని ఆశిస్తుంటారు. కానీ, ఆచరణలో ఇది సాధ్యం కాదు. అన్ని పథకాలు సానుకూల, ప్రతికూల సందర్భాలను ఎదుర్కొంటూ వెళుతుంటాయి. కనుక పెట్టుబడులను వెనక్కి తీసుకునే ముందు ఈ అంశాలన్నింటినీ చూడాలి.

నా వయసు 32 సంవత్సరాలు. నేను ఐదేళ్ల నుంచి మ్యూచువల్ ఫండ్ పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. ఇలా పెట్టుబడులు పెట్టే కాలంలో అస్సెట్ అలోకేషన్‌ను ఎలా నిర్వహించాలి?
– వినయ్ శేఖర్

చిన్న వయసు నుంచే క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేయడం మంచి నిర్ణయం. దీనివల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. పెట్టుబడుల విషయంలో అస్సెట్ అలోకేషన్ ఎంతో కీలకమైనది. మీ పెట్టుబడులను ఈక్విటీ, ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాలకు (డెట్) కేటాయించడం, అలాగే, మీ పెట్టుబడుల కాల వ్యవధి, రిస్క్ తీసుకునే సామర్థ్యం, పెట్టుబడుల లక్ష్యాల ఆధారంగా కేటాయింపులు చేసుకోవడమే అస్సెట్ అలోకేషన్. ఈక్విటీలు ఇతర సాధనాలతో పోలిస్తే దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణాన్ని మించి మంచి రాబడులను ఇవ్వగలవు. మీ పెట్టుబడుల కాల వ్యవధి ముగింపునకు వస్తున్నప్పుడు, పెట్టుబడులతో అవసరం ఏర్పడడానికి కొంత ముందు నుంచే క్రమంగా ఈక్విటీ పెట్టుబడులను డెట్‌లోకి మళ్లించుకోవాలి. మీ ఆర్థిక లక్ష్యాలు మూడేళ్ల లోపు ఉంటే డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవడం సూచనీయం. మూడేళ్లకు మించి ఉన్నప్పుడు మొత్తం పెట్టుబడుల్లో కొంత భాగాన్ని ఈక్విటీలకు కేటాయించుకోవాలి. మూడు నుంచి ఐదేళ్ల కోసం అయితే 25-30 శాతాన్ని ఈక్విటీలకు కేటాయించుకోవచ్చు. ఐదు, ఏడేళ్ల కోసం అయితే ఈక్విటీ కేటాయింపులు 50 శాతం వరకు, లేదా మీ రిస్క్ తీసుకునే సామర్థ్యం ఆధారంగా ఇంకా ఎక్కువే ఉండొచ్చు. ఏడేళ్లకు మించిన లక్ష్యాల కోసం ఈక్విటీలకు 70-80 శాతం వరకు కేటాయింపులు చేసుకోవచ్చు. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ ద్వారా ఇన్వెస్ట్ చేయడంతోపాటు, సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ ద్వారా పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం ముఖ్యమైనది. దీనివల్ల అస్థిరతలను అధిగమించొచ్చు.

నెల్లూరు తీరంలో తమిళనాడు బోట్ల కలకలం


తీరం చివరి వరకు వచ్చిన కడలూరు బోట్లు

ఉలవపాడు: తమిళనాడులోని కడలూరు ప్రాంత జాలర్లు తమ పరిధి దాటి వచ్చి నెల్లూరు సముద్ర తీరంలో వేటాడుతున్నారు. దీంతో స్థానిక మత్స్యకారులకు, తమిళ జాలర్ల మధ్య ఘర్షణ స్థితి నెలకొంది. ఆదివారం నెల్లూరు జిల్లా ఉలవపాడు మండల తీర ప్రాంతమైన చాకిచర్ల, పెదపట్టపుపాలెం గ్రామాల పరిధిలోని సముద్రంలో కడలూరు ప్రాంత బోట్లు వేటకు వచ్చాయి. వాటిని చూసిన స్థానిక మత్స్యకారులు ఆ బోట్లు తమ పరిధిలోకి వచ్చాయని, వాటిని పంపించాలని మోటార్ బోట్లలో వెళ్లారు. అయితే అప్పటికే అవి అక్కడినుంచి వెళ్లిపోయాయి. ఇలాంటి వివాదం గతంలో ఓసారి తలెత్తగా అప్పట్లో ఇరువురూ చర్చలు జరిపారు. అయినా మళ్లీ పెద్ద బోట్లతో పరిధి దాటి తమ తీరం వరకు తమిళ జాలర్లు వస్తున్నారని ఏపీ జాలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 15 నుంచి వేట నిషేధం, చేపలు గుడ్లు పెట్టే పరిస్థితులు ఉన్న నేపథ్యంలో తమిళ బోట్లను నిలుపుదల చేయాలని పెదపట్టపుపాలెం మత్స్యకార సంఘం కన్వీనర్ సోమయ్య కోరారు.

‘వైజాగ్ స్టీల్’పై తెలంగాణ ఆసక్తి

- ప్రైవేటీకరణను అడ్డుకోవడమే లక్ష్యంగా కీలక నిర్ణయం
- ‘సింగరేణి’ ద్వారా ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ప్రక్రియలో పాల్గొనే యోచన
- త్వరలో వైజాగ్‌కు అధికారుల బృందం



సాక్షి, హైదరాబాద్: వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్లాంట్ నిర్వహణకు మూల ధనం కోసం ఇచ్చిన ‘ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఆసక్తి వ్యక్తీకరణ) ప్రక్రియలో పాల్గొనేందుకు సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది. సంస్థకు మూల ధన పెట్టుబడితో పాటు, ముడి సరుకుల కోసం నిధులు ఇచ్చి.. తమ ఉత్పత్తులను తీసుకునేందుకు ఆసక్తి కలిగిన వారికి ఆహ్వానం పలుకుతూ వైజాగ్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం మార్చి 27వ తేదీన ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్‌ని ప్రకటించింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వ మెజారిటీ వాటా ఉన్న సింగరేణి సంస్థ ద్వారా ఆ ప్రక్రియలో పాల్గొనాలని సీఎం కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిసింది. నిధులు అందిస్తే తిరిగి ఇచ్చే ఉత్పత్తులు, లేదా తిరిగి చెల్లించే విధానాలు, ఇతరత్రా నిబంధనలపై అధ్యయనం చేసేందుకు త్వరలో విశాఖకు ఒక బృందాన్ని పంపనున్నారని సమాచారం.

లాభాల్లో ‘షిప్‌యార్డు’


కష్టాల దశ నుంచి.. రికార్డు స్థాయి లాభాల్లోకి..

- తొలిసారిగా రూ.1000 కోట్ల ఆదాయం
- 2022–23లో రూ.64 కోట్ల నికరలాభం
- హిందుస్థాన్ షిప్‌యార్డు విజయ ప్రస్థానం
- ముప్పై ఏళ్లపాటు నష్టాలు.. మూసివేతకు సిద్ధం
- పరిరక్షణకు నడుం కట్టిన వైఎస్సార్
- వైఎస్సార్ ఒత్తిడితో నౌకాదళంలో విలీనం
- అప్పటి నుంచి పెరిగిన వర్క్ ఆర్డర్లు
- నష్టాల నుంచి గట్టెక్కి లాభాల్లోకి



విశాఖను షిప్ రిపేర్ హబ్‌గా రూపొందిస్తున్న హెచ్‌ఎస్‌ఎల్

ఏడాదో.. రెండేళ్లో కాదు.. ముప్పై ఏళ్లు నష్టాల్లో మునిగిన సంస్థ.. ఇప్పుడు లాభాల్లో రికార్డు సృష్టిస్తోంది. వైఎస్సార్ చలవతో కష్టాల నుంచి గట్టెక్కింది. తొలిసారిగా రూ.1000 కోట్ల ప్రాఫిట్ మార్కుని అందుకుంది. అంతర్జాతీయ షిప్‌లని సైతం మరమ్మతులు చేస్తూ.. విశాఖని షిప్ రిపేర్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో దూసుకుపోతోంది. అదే హిందుస్థాన్ షిప్‌యార్డ్ (హెచ్‌ఎస్‌ఎల్).


నౌకల మరమ్మతులు నిర్వహిస్తున్న హెచ్‌ఎస్‌ఎల్

సాక్షి, విశాఖపట్నం: విశాఖ తీరంలో నౌకల నిర్మాణం, మరమ్మతుల కోసం ప్రైవేటు రంగంలో 1941లో సింధియా షిప్‌యార్డు ఏర్పాటైంది. 1961లో దానిని కేంద్ర ప్రభుత్వం జాతీయం చేయడంతో హిందుస్థాన్ షిప్‌యార్డుగా రూపాంతరం చెందింది. ఆ తర్వాత కొద్ది సంవత్సరాలకే నష్టాల బాట పట్టింది. ఒకానొక దశలో మూత పడే స్థితికి చేరుకుంది. దీంతో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి స్పందించి.. షిప్‌యార్డుని రక్షణ శాఖలో విలీనం చేస్తే లాభాల బాట పడుతుందంటూ కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఆయన ఒత్తిడితో కేంద్ర ప్రభుత్వం దిగొచ్చింది. సాధ్యాసాధ్యాలను పరిశీలించి, షిప్‌యార్డుని 2009లో రక్షణ శాఖలో విలీనం చేసింది. అప్పటి నుంచి భారత నౌకాదళం నౌకల మరమ్మతుల ఆర్డర్లు తీసుకుంటూ.. నష్టాల్ని క్రమంగా తగ్గించుకుంటూ వచ్చింది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.755.24 కోట్ల ఆదాయాన్ని పొందింది. 2022–23లో కచ్చితంగా రూ.1,000 కోట్ల బెంచ్ మార్క్ దాటాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు కావల్సిన వర్క్ ఆర్డర్లు దక్కించుకోవడంతో దేశంలోని ఇతర పోర్టులతో పోటీ పడుతూ.. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకొని షిప్‌యార్డు చరిత్రలోనే తొలిసారిగా రూ. వెయ్యి కోట్ల మార్క్‌ని దాటింది. 38 శాతం వృద్ధితో రూ.1010 కోట్ల ఆదాయాన్ని పొందింది. సంస్థ 25 శాతం వృద్ధితో రూ.64 కోట్ల నికర లాభాల్ని ఆర్జించింది. రెండేళ్లలో ఏకంగా 250 శాతం వృద్ధి నమోదు చేసుకోవడం విశేషం.

అంతర్జాతీయ నౌకలు సైతం

నౌకా నిర్మాణం, మరమ్మతుల్లో షిప్‌యార్డుకి అంతర్జాతీయంగా పేరుంది. నాణ్యతలో రాజీ పడకుండా తక్కువ సమయంలో నౌకల నిర్మాణం, మరమ్మతులు చేయడం ఈ సంస్థ విశిష్టత. ఎలాంటి నౌకలు, జలాంతర్గాముల మరమ్మతులైనా రికార్డు సమయంలో పూర్తి చేస్తుంది. దేశంలోనే అతి పెద్ద ప్రధాన నౌకా నిర్మాణ కేంద్రంగా దూసుకుపోతోంది. ఇప్పటివరకు 200 నౌకల్ని ప్రముఖ సంస్థలకు తయారు చేసి ఇచ్చింది. 2,000 నౌకలకు మరమ్మతులు చేసింది. ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా పూర్తి స్థాయి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకల తయారీకి సన్నద్ధమవుతోంది. సాంకేతిక సంస్కరణలు చేసుకుంటూ.. నౌకా నిర్మాణం, మరమ్మతుల విషయంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటోంది. అందుకే.. దేశ విదేశీ సంస్థలు షిప్‌యార్డుకు పనులు అప్పగించేందుకు ముందుకు వస్తున్నాయి. ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డ్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌సీఐ), డ్రెడ్జింగ్ కార్పొరేషన్ (డీసీఐ), ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ), సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ నాటికల్ అండ్ ఇంజినీరింగ్ అండ్ ట్రెయినింగ్(సిఫ్‌నెట్)తో పాటు అమెరికాకు చెందిన మేక్ డెర్మాట్, సింగపూర్‌కు చెందిన అబాన్ ఆఫ్‌షోర్, అదానీ పోర్టులు, సెజ్‌లు.. ఇలా ప్రతి సంస్థా హెచ్‌ఎస్‌ఎల్‌కు పనులు అప్పగిస్తున్నాయి. దీంతో హెచ్ఎస్ఎల్ ఆర్థిక పరిపుష్టిని సాధిస్తోంది.

షిప్‌యార్డు ఆదాయం, లాభాలు ఇలా (రూ.కోట్లలో)

సంవత్సరం	ఆదాయం	నికర లాభం
2020-21	477.94	14
2021-22	755.24	50.78
2022-23	1,010	64

25 ఎకరాల్లో విస్తరణ పనులు



దేశంలోని 14 షిప్‌యార్డులతో పోలిస్తే హెచ్‌ఎస్‌ఎల్ నాలుగో స్థానంలో ఉంది. రానున్న రెండేళ్లలో కోల్‌కతా షిప్‌యార్డ్‌ని అధిగమించి మూడో స్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. రాబోయే నాలుగేళ్లలో నంబర్ వన్‌గా నిలిచేందుకు అవసరమైన ప్రణాళికలు అమలు చేస్తున్నాం. హైవాల్యూస్‌తో చేపట్టనున్న నేవీ నౌకల నిర్మాణాలతో హెచ్‌ఎస్‌ఎల్ వార్షిక టర్నోవర్ కూడా గణనీయంగా పెరిగింది. షిప్‌యార్డుకి సమీపంలో ఉన్న 25 ఎకరాల్లో విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేశాం. దీనికి పరిశ్రమల శాఖ నుంచి అనుమతుల కోసం దరఖాస్తు చేశాం. క్షేత్రస్థాయి పనుల్ని ఇప్పటికే మొదలు పెట్టాం. ఫ్లీట్ సపోర్ట్ షిప్స్ తయారీకి అవసరమయ్యేలా 300 మీటర్ల పొడవు, 30 మీటర్ల వెడల్పుతో స్లిప్‌వే నిర్మాణం 2024లో ప్రారంభిస్తాం. ఒకేసారి 3, 4 నౌకలు తయారు చేసేలా మరో స్లిప్‌వే నిర్మాణం కూడా చేపడతాం. స్వదేశీ పరిజ్ఞానంలో విశాఖని షిప్ రిపేర్ హబ్‌గా మార్చేలా ప్రణాళికలు రూపొందించాం.

– కమొడర్ హేమంత్ ఖత్రి, హెచ్‌ఎస్‌ఎల్ సీఎండీ

చిన్నారులపై లైంగిక దాడులు జరగడానికి, పెరగడానికి దారితీస్తున్న చైల్డ్ పోర్నోగ్రఫీ జోలికి వెళ్తే జైలుకు వెళ్లడం ఖాయం. చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించి వీడియోలు, ఫొటోలను పోస్టు చేసినా, షేర్ చేసినా, చివరికి వీక్షించినా కూడా నేరమే. ఐదేళ్ల పాటు ఊచలు లెక్కబెట్టాల్సిందే. ఇంటర్‌నెట్‌తో పాటు సోషల్ మీడియాలో చైల్డ్ పోర్నోగ్రఫీపై కన్నేసి ఉంచడానికి ‘నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్ (ఎన్‌సీఎంఈసీ)’ పనిచేస్తోంది. పిల్లలపై లైంగిక నేరాలకు సంబంధించి వీడియోలు, ఫొటోల (చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్- సీఎస్ఏఎం)ను, వాటి గురించి సెర్చ్ చేస్తున్నవారు, వీక్షిస్తున్నవారిని కనిపెట్టడానికి అత్యాధునిక సాఫ్ట్‌వేర్స్ వినియోగిస్తోంది. వారు గుర్తించిన వివరాల ఆధారంగానే గత వారం హైదరాబాద్‌లో ఐదుగురిపై కేసులు నమోదయ్యాయి. - సాక్షి, హైదరాబాద్



వాటి జోలికెళ్తే.. ఐదేళ్లు జైలుకే!

చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలు, ఫొటోల పోస్టింగ్, షేరింగ్‌తోపాటు చూడటమూ నేరమే

ఎన్‌సీఎంఈసీ ఆధ్వర్యంలో..

అమెరికాకు చెందిన యునైటెడ్ స్టేట్స్ కాంగ్రెస్ 1984 జూన్ 13న ఎన్‌సీఎంఈసీ ఏర్పాటు చేసింది. వర్జీనియాలోని అలెగ్జాండ్రియాలో ప్రధాన కార్యాలయం ఉన్న ఈ స్వచ్ఛంద సంస్థ.. ప్రపంచవ్యాప్తంగా తమ కార్యకలాపాలను విస్తరించింది. చైల్డ్ పోర్నోగ్రఫీని ప్రపంచవ్యాప్తంగా నిషేధించిన తర్వాత ఎన్‌సీఎంఈసీ చర్యలు ముమ్మరమయ్యాయి. ఆన్‌లైన్‌లో చైల్డ్ పోర్నోగ్రఫీ వేగంగా పెరుగుతోందని ఎన్‌సీఎంఈసీ గుర్తించింది. ఒక్క భారత్‌లోనే ప్రతి 40 సెకన్లకు ఒక వీడియో క్యాప్చర్ అవుతోందని అంచనా వేసింది. జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాల ప్రకారం.. 2021లో భారత్ నుంచే 25 వేలకుపైగా చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించిన వీడియోలు, చిత్రాలు ఇంటర్‌నెట్‌లో అప్‌లోడ్ అయ్యాయి.

ఆధునిక టెక్నాలజీతో పటిష్ట నిఘా..

చైల్డ్ పోర్నోగ్రఫీ కంటెంట్‌ను గుర్తించడానికి ఎన్‌సీఎంఈసీ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లు వాడుతూ ఆయా సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ కంటెంట్‌ను, సెర్చింగ్‌ను గుర్తించడానికి కొన్ని కీవర్డ్స్‌ను రూపొందించింది. ఫలితంగా ప్రపంచంలో ఎవరైనా ఇంటర్‌నెట్‌లో, సోషల్ మీడియాలో చైల్డ్ పోర్నోగ్రఫీ కంటెంట్ గురించి సెర్చ్ చేసినా, వీక్షించినా, డౌన్‌లోడ్ చేసినా, అప్‌లోడ్ చేసినా.. వారు వినియోగించిన కంప్యూటర్/ల్యాప్‌టాప్/ఫోన్‌ల ఐపీ అడ్రస్‌లను సాఫ్ట్‌వేర్ గుర్తిస్తుంది. ఈ వివరాలను ఎన్‌సీఎంఈసీ క్రోడీకరించి ఆయా దేశాలకు చెందిన నోడల్ ఏజెన్సీలకు అందిస్తుంది. మనదేశంలో జాతీయస్థాయిలో హోంశాఖ ఆధీనంలోని ఎన్‌సీఆర్‌బీ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. దీనికి అందిన వివరాలను రాష్ట్ర స్థాయి దర్యాప్తు సంస్థలకు పంపిస్తుంది. రాష్ట్రాల్లోని ఉన్నతాధికారులు ఈ వివరాలను సంబంధిత బాధ్యులు నివసించే ప్రాంత సైబర్ క్రైమ్ పోలీసులకు పంపిస్తారు. వారు కేసులు నమోదు చేసి, ఐపీ అడ్రస్‌ల ఆధారంగా నిందితులను గుర్తించి.. అరెస్టు చేయడం/ నోటీసులివ్వడం వంటి చర్యలు చేపడతారు.

స్మార్ట్‌ఫోన్లతో పెరిగి.. కొవిడ్‌తో విజృంభించి..

విస్తృతమైన ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి పోర్న్‌సైట్లను చూసే అవకాశం పెరగడంతో చాలా మంది బానిసగా మారుతున్నారు. కోవిడ్ లాక్‌డౌన్, ఆ తర్వాతి సమయంలో ఈ ధోరణి మరింత పెరిగిందని నిపుణులు చెప్తున్నారు. చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించి దేశంలో 2018లో 44 కేసులు, 2019లో 103 కేసులు నమోదుకాగా.. 2020 నాటికి ఈ సంఖ్య 738కి, 2021లో 969కి పెరగడం గమనార్హం. జరుగుతున్న ఉదంతాల్లో కనీసం ఒక శాతం కూడా పోలీసు రికార్డుల్లోకి ఎక్కి కేసులుగా మారట్లేదని నిపుణులు పేర్కొంటున్నారు.

బాగా చదువుకున్నవారూ నిందితుల్లో: చైల్డ్ పోర్నోగ్రఫీ ఆరోపణలపై గత ఏడాది హైదరాబాద్‌లో 23 మందిపై కేసులు నమోదయ్యాయి. వీరిలో విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నవారు కూడా ఉన్నారు. పోలీసులు నిందితులతోపాటు కుటుంబ సభ్యులకూ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవల నోటీసులు అందుకున్న వారిలో వ్యాపారులు, చిరుద్యోగులు కూడా ఉన్నారు.

అన్నిరకాలా నష్టం

పోర్నోగ్రఫీకి బానిస అవుతున్నవారు అన్నిరకాలా నష్టపోతున్నారని సైబర్ క్రైమ్ పోలీసులు చెప్తున్నారు. ఇంటర్‌నెట్‌లో ఉండే పోర్న్‌తో పాటే వైరస్‌లు ఉంటాయని.. ఆ వైరస్‌లను పంపే ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను హ్యాక్ చేసి తమ ఆధీనంలోకి తీసుకుంటారని వివరిస్తున్నారు. ఇలా వ్యక్తిగత సమాచారం, నెట్ బ్యాంకింగ్, క్రెడిట్‌కార్డులు, ఇతర వివరాలూ హ్యాకర్లకు చేరి నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

విదేశాల్లో సర్వర్ల కారణంగా..

అసభ్య, అశ్లీల వెబ్‌సైట్లపై ఫిర్యాదులు వచ్చినప్పుడు కేంద్ర ప్రభుత్వం వాటిని నిషేధించి బ్లాక్ చేయిస్తోంది. కానీ వాటి నిర్వాహకులు వెబ్‌సైట్ పేరులో స్వల్ప మార్పులు చేసి మరో వెబ్‌సైట్‌గా అందుబాటులోకి తెస్తున్నారు. వాటిపై ఫిర్యాదులు వచ్చి చర్యలు తీసుకునేవరకు ఇంటర్‌నెట్‌లో ఉంటున్నాయి. ఈ తరహా వెబ్‌సైట్లను హోస్ట్ చేస్తున్న సర్వర్లన్నీ విదేశాల్లో ఉన్నవే. వాటిపై ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉండటం లేదు.

నిరూపితమైతే ఐదేళ్ల జైలు

చైల్డ్ పోర్నోగ్రఫీ అత్యంత హేయమైన నేరం. దీన్ని ప్రపంచవ్యాప్తంగా నిషేధించారు. దీనికోసం ఎవరు సెర్చ్ చేసినా, వీడియోలు, ఫొటోలను చూసినా నేరమే. దీన్ని బ్రౌజ్ చేసిన వారి సమాచారం ఎప్పటికప్పుడు మాకు అందుతుంది. వారిపై ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్‌లోని 67–బీ సెక్షన్ కింద కేసు నమోదు చేస్తాం. ఆధారాలతో కోర్టులో చార్జిషీట్ వేస్తాం. కోర్టులో నేరం నిరూపితమైతే మొదటిసారి నేరం చేసిన వారికి గరిష్ఠంగా ఐదేళ్లు, రెండోసారి అయితే ఏడేళ్ల వరకు శిక్ష పడుతుంది. ఒకవేళ బాధితులు నేరుగా వచ్చి ఫిర్యాదు చేస్తే.. పోక్సో యాక్ట్ కింద కూడా కేసులు నమోదవుతాయి. దోషిగా తేలితే జీవిత ఖైదు పడే ఆస్కారం ఉంది.

– గజరావ్ భూపాల్, సంయుక్త పోలీసు కమిషనర్, సీసీఎస్, హైదరాబాద్

వయ్యారి భామ..

నీ హంస నడక

సందడిగా తెలుగమ్మాయి ఆడిషన్స్



సంప్రదాయ వస్త్రాలు ధరించిన అందమైన తెలుగమ్మాయిలు మెరుపు తీగల్లా హంస నడకతో ఆకట్టుకున్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం తెలుగు అమ్మాయి పోటీల ఆడిషన్లు జరిగాయి. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా కట్టూ బొట్టుతో బాపు బొమ్మలా తయారై.. క్యాట్ వాక్‌తో అదరహో అనిపించారు. తెలుగు మహిళ, తెలుగు అమ్మాయి రెండు విభాగాల్లో నిర్వహించిన ఆడిషన్లలో తదుపరి పోటీలకు కొంత మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహకుడు వీరుమామ తెలిపారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా శ్రీమతి ఆంధ్రప్రదేశ్ విజేత శాంతి, నారి శోభ, శోభ కేత, ఆరిఫా వ్యవహరించారు.

– విశాఖపట్నం

● వివాదాల పుట్ట

జీఎం వస్తే.. ఆటలు సాగవని..!

- నియామకాన్నే అడ్డుకున్న కీలక అధికారి
- డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌లో అడ్డగోలు వ్యవహారం
- 13 ఏళ్లుగా జనరల్ మేనేజర్ లేకుండానే డీసీఐ
- కోర్టులో కేసు వేసి పోస్ట్ భర్తీ కాకుండా నిలిపేసిన వైనం
- ఎండీ నియామకం విషయంలోనే అదే కుయుక్తి
- బెడిసికొట్టిన వ్యూహంతో ఎండీకి ఉద్వాసన



సాక్షి, విశాఖపట్నం: వివాదాల పుట్టగా మారిన డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌లో తవ్వుతున్న కొద్దీ అక్రమార్కుల చిట్టా బయటపడుతూనే ఉంది. సంస్థ జీతాలతో బతుకుతూ.. ఆ సంస్థనే నిర్వీర్యం చేసేందుకు పన్నిన కుట్రలు వెలుగులోకి వస్తున్నాయి. అక్రమాలకు కేంద్రంగా మారిన మాజీ ఎండీ నియామకంలో కీలక పాత్ర పోషించిన ఓ ఉన్నతాధికారి.. తన అనధికార అధికారాలకు అడ్డుగా వస్తారేమోనన్న భయంతో దశాబ్దానికిపైగా జనరల్ మేనేజర్ పోస్టు భర్తీ కాకుండా కుయుక్తులు అమలు చేయడం గమనార్హం. డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా ప్రస్థానం ప్రారంభించి అర్హత లేకపోయినా అడ్డదారుల్లో ఏజీఎం హోదాకు ఎదిగిన ఓ అధికారి తన వ్యవహారాలకు అడ్డుగా ఎవరూ ఉండకూడదని భావించారు. 13 ఏళ్ల క్రితం డీసీఐలో జనరల్ మేనేజర్ (సీఎస్) పోస్టు నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. రిజర్వేషన్ ప్రకారం ఈ పోస్టును ఎస్‌సీ కేటగిరీలో భర్తీ చేయాల్సి ఉంది. ఓబీసీ అయితే పెద్దల్ని ప్రసన్నం చేసుకొని ఈ హోదాకు సదరు అధికారి చేరుకునేవారు. కానీ రిజర్వేషన్ ప్రకారం తాను అనర్హుడవ్వడంతో కొత్త పన్నాగం పన్నారు. హోదా ఏజీఎం అయినా జీఎం చేయాల్సిన ప్రతి పనీ.. ఈ ఉన్నతాధికారే చక్కబెట్టేవారు. అందుకే ఆ పోస్టు భర్తీ అయితే తన ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందన్న భయంతో తనకు తెలిసిన బెంగళూరుకు చెందిన ఓ రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగితో ఆ పోస్టు కోసం దరఖాస్తు చేయించారు. అయితే సదరు బ్యాంకు ఉద్యోగి ఆ పోస్టుకు అనర్హుడని డీసీఐ దరఖాస్తును తిరస్కరించింది. దీనిపై డీసీఐ ఉన్నతాధికారి కోర్టులో బ్యాంకు ఉద్యోగి తరఫున కేసు వేయించారు. తెలిసిన లాయర్ ద్వారా జీఎం పోస్టు భర్తీ కాకుండా కోర్టులో స్టే విధించేలా చేశారు. దీంతో ఆ పోస్టు భర్తీ మరుగున పడిపోయింది. ఇంకా కోర్టు కేసు తేలకపోవడంతో 13 ఏళ్లుగా ఆ జీఎం కుర్చీ హోదానంతటినీ సదరు ఏజీఎం స్థాయి ఉన్నతాధికారే అనుభవిస్తున్నారు. ఏ ఫైల్ వచ్చినా జీఎం స్థానంలో తానే చక్రం తిప్పుతూ అక్రమ వ్యవహారాల్ని నడిపించారు. డీసీఐలో కొద్ది నెలల క్రితం వరకూ జనరల్ మేనేజర్ హోదాలో సదరు మేనేజ్‌మెంట్ ట్రైనీ అధికారే పెత్తనం చెలాయించినా ఎవరూ అడ్డుకోకపోవడం విశేషం.

పాచిక పారలేదు...!

ఎండీని తొలగిస్తే తమ నాటకం బయటపడే అవకాశం ఉందని భావించిన సదరు అడ్డగోలు అధికారి జీఎం పోస్టు కోసం పన్నిన కుట్రను ఇక్కడ అమలు చేయాలని భావించారు. తనని అకారణంగా తొలగించేందుకు కుట్రపన్నుతున్నారంటూ ఎండీ పేరుతో కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) దాఖలు చేశారు. ఇందుకోసం మళ్లీ తమిళనాడు నుంచి లాయర్‌ని తీసుకొచ్చి కోర్టును కూడా మోసం చేసేందుకు కుయుక్తులు పన్నారు. ఈ వ్యాజ్యం విచారణ కొనసాగుతుందనీ.. కోర్టు తీర్పు వచ్చేలోపు.. సదరు ఎండీ కాల పరిమితి ముగుస్తుందని భావించారు. ఇదే జరిగి ఉంటే మొత్తం డీసీఐని చక్కబెట్టేందుకు కుట్రపన్నారు. కానీ కోర్టు త్వరితగతిన ఈ వ్యవహారంపై స్పందించి ఐదారు వాయిదాల తర్వాత ఎండీ నియామకం అడ్డగోలుగా జరిగిందన్న విషయాన్ని రూఢీ చేసుకున్న హైకోర్టు ఆ పిల్‌ని కొట్టివేసింది. దీంతో ఈ అక్రమాధికారి పాచిక పారకుండాపోయింది. ఆ తర్వాత ఎండీకి ఉద్వాసన.. ఈ మేనేజ్‌మెంట్ ట్రైనీ అధికారి, తమిళ అధికారి సస్పెన్షన్ జరగడం.. చకచకా జరిగిపోయాయి. పిల్ కొట్టివేయడంతో.. సదరు అధికారుల పాచిక పారలేదు. అయినప్పటికీ.. తనకున్న పలుకుబడిని ఉపయోగించి.. సస్పెన్షన్‌ని ఎత్తివేసేలా చేసి.. కోల్‌కతాలో పోస్టింగ్ సంపాదించుకున్నారా మేనేజ్‌మెంట్ ట్రైనీ.. ఇప్పుడు మళ్లీ.. పాత పోస్టింగ్‌లోకి తిరిగి వచ్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

ఎండీ నియామకంలోనూ కుయుక్తి

సదరు ఉన్నతాధికారి డీసీఐ సంస్థను దుబాయ్ కంపెనీకి విక్రయించేందుకు ప్లాన్ వేశారు. ఇందులో భాగంగా తన మాట చెల్లుబాటయ్యేలా.. ఓ ఎండీని నియమించుకోవాలని నిర్ణయించారు. ఇందుకోసం సంస్థలో ఉన్న ఓ తమిళ అధికారి సాయం తీసుకున్నారు. ఇద్దరూ కలిసి విక్టర్ అనే వ్యక్తి డీసీఐ ఎండీ పోస్టుకు అనర్హుడని తెలిసినా.. ఆయన్నే నియమించేలా ఉత్తర్వులు సిద్ధం చేసి అమలు చేశారు. ఇక ఈ ముగ్గురు ఉన్నతాధికారులు కలిసి డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను అథఃపాతాళానికి పడేసేందుకు నష్టాల బాటలోకి నెట్టేశారు. దీంతో ప్రైవేటీకరణ లేదా విక్రయమే శరణ్యమన్న స్థాయికి డీసీఐ దిగజారింది. దీనిపై సంస్థలో కొందరు ఉద్యోగులు పోరాటం మొదలుపెట్టి.. డీసీఐని నిలబెట్టేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్న క్రమంలో.. ఎండీ నియామకం అక్రమమనే విషయం వెల్లడైంది. ఎండీని తొలగించాలనే డిమాండ్ మొదలైంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943